భారతి

జనవరి 1971

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒకరూపాయి

భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

జనవరి 1971

సంపుటము : 48   సంచిక : [illegible]

విడిప్రతి వెల ౭౫ పైసలు

విషయానుక్రమణిక

జనవరి 1971

స్వవిషయము

"భారతి"కి 48 వ సంవత్సరము ఆరంభమైనది. నాలుగు దశాబ్దములు పైగా నిరాఘాటముగా సాహిత్యసేవ చేయగలిగినందుకు "భారతి" గర్విస్తున్నది. ఆనందిస్తున్నది. ఇకముందుకూడా ఇతోధికముగా సాహిత్యసేవ చేయగలనను దృఢనిశ్చయముతోను. దృఢసంకల్పముతోను వున్నది. ఆ సంకల్ప సాధనకు రచయితల సహకారము పూర్తిగా లభించగలదని ఆశిస్తున్నది. సహకరించిన వారందరికీ కృతజ్ఞత తెలుపుతున్నది.

ఆగామియుగ నైమిశారణ్యం

డా॥ సి. నారాయణరెడ్డి.

ఇది శూన్యం; ఇది అనన్య శూన్యం.
కాకాసురులు చొరలేని కీకారణ్యం.
ఏకాంతం ఎలికించిన మౌన పర్జన్యం.
నిశ్శబ్దాన్ని చీలుస్తున్నది చుక్కల మూగరవళి.
నిశాగర్భాన్ని కోస్తున్నది నిస్త్రింశ యుగళి.
ఆ కత్తులేమిటి? విచ్చుకున్న కనురెప్పలు.
ఆ చుక్కలేమిటి? వెలుగుతున్న కనుపాపలు.
తారకలూ బృందారకులూ ఎక్కణ్నో లేరు.
తరగెత్తే చైతన్యసీమలో మేల్కొన్నారు.

అధరానికి లేని ఆలోచన హృదయానికి ఉందని
మధువుకు లేని ఆలాపన మధుపానికి ఉందని
అనుశీలించిన మూర్తి ఆత్మానందవర్తి.
అనుభవించిన జీవసంపుటి అధునాతన పంచవటి.

అప్పుడౌతుంది ఈ శూన్యం
అమృతాన్ని ధ్వనించే పర్జన్యం.
అప్పుడౌతుంది ఈ కీకారణ్యం
ఆగామి యుగ నైమిశారణ్యం.

వ్యక్తి వివేకము

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

తన కళాకౌశలముచే వాఙ్మాధుర్యముచే మాతృదేశమునకేకాక, దూరతీరములకుగూడ సన్నిహితుడును, ప్రియమిత్రుడును, అయిన మహాకవి కాళిదాసు వ్యక్తిగతవిశేషములను, జీవనకథలను ఆతని కళాసృష్టికి వెనుకనున్న ప్రోద్బలములను తెలిసికొనవలెనని ఆతని పాఠకులు ఉత్సుకులగుట సహజము. కాని—ఆ కుతూహలమును తీర్చుటకు మన చరిత్ర చేయు సాహాయ్యము మిక్కిలి తక్కువ.

ఆంధ్రసాహిత్యమున పోతన, శ్రీనాథుల, అష్టదిగ్గజముల చరిత్రచుట్టును అల్లుకొన్న సాలెగూడుల వంటి దంతకథలే కాళిదాసు చరిత్రచుట్టును అల్లుకొని, సత్యవృత్తమును గహనము చేసినవి. ఒక దంతకథ కాళిదాసునామము నంటిపెట్టుకొని చిరకాలము నుండి సాగివచ్చుచున్నది. దీనికి భోజప్రబంధ మొక యనుబంధము. ఈ రెండిటికిని ప్రాణముపోసి నాటకము లల్లినారు; చిత్రములు తీసినారు; బొమ్మలు గీసినారు.

వాని సూక్ష్మరూప మిది.

(1) ఒక బ్రాహ్మణబాలుడు అనాథుడై ఒక పసులకాపరియండ జేరినాడు. ఆతడు విద్యాగంధశూన్యుడై పసుల దోలుకొనుచు బ్రతుకుచుండెను. కాని మంచిరూపసి, ఋజువర్తనుడు. ఇట్లుండ కాశీరాజు తన కుమార్తెకు పెండ్లిచేయదలచి వరుల నన్వేషించుపనికి తన మంత్రిని నియోగించెను. కారణాంతరములచే రాజకుమారిపై పగబట్టిన అమాత్యశేఖరుడు రమ్యాకృతిగల ఈ యపండితుని వసనభూషణాలంకృతుని జేసితెచ్చి, ఆతడు పల్కిన అవివేకవాక్కులకు, అర్థాంతరములు కల్పించి, రాజుకన్ను గప్పి రాకుమారికి పెండ్లిజేసెను. ఈ రహస్యము ఆ దంపతుల ప్రథమ సమావేశమున వెల్లడియయ్యెను. రాజకుమారి మంత్రివంచనమును గ్రహించి, ధైర్యము వహించి తన పతి నివురుగప్పిన నిప్పుఅని తలచి, ఆ నివురును ఊదివేయు నుపాయ మాలోచించెను. అది కాళీమాతృపదసేవ.

రాజపుత్రి యుపదేశించినవిధమున ఆతడు దేవిని సేవించి, తత్కృపాపాత్రుడై తిరిగివచ్చెను. విద్యాతేజము వెదజల్లుచువచ్చిన భర్తను జూచి రాజపుత్రి ప్రౌఢముగా 'అస్తి కశ్చి ద్వాగ్విశేషః?' (ఏమైనను విద్యావిశేష మంటినదా?)అని యడుగగా నాతడు అస్తియను ప్రారంభముగల కుమారకావ్య ప్రథమ శ్లోకమును, కశ్చిత్ అనుమాటతో నుపక్రమించు మేఘదూతపు తొలిశ్లోకమును, వాక్ అను మాటతో ప్రారంభించు రఘుకావ్య ప్రథమ పద్యమును ఆశువుగాజెప్పి ఆమెను ముగ్ధురాలిని జేసెనట. కాని దుర్దైవవశమున ఆ పతి రసజ్ఞతా సహవాసము ఆమెకు దక్కక వారి దాంపత్యము విషాదాంతమయ్యెను. నాటినుండి యాతడు కాళిదాస మహాకవియై దేశములుపట్టి తిరుగజొచ్చెను.

(2) కాలక్రమమున ఆతడు ధారానగరమును పాలించు భోజరాజు నాస్థాన కవియై కీర్తి గడించెను. భోజాస్థానమున కవిగా నున్నప్పుడు దండి, భవభూతి, మాఘుడు మున్నగు సుప్రసిద్ధ కవులు ఈతనితోడి యాస్థాన కవులట. వారి పరస్పర వాక్చమత్కారములతో సరససల్లాపములతో నిండిన శ్లోకములు భోజప్రబంధము ధర్మమా యని పండిత

లోకమున దండిగానున్నవి. తుదకు కాళిదాసు విలాసినీ ప్రియుడై విలాసవతియను వేశ్యయింట ఆమె మోసమున కగ్గమై మరణించెను.

పై కథనమునకు చరిత్రాధారములు వెదకు వ్యర్థప్రయత్నముకన్న ఆ కథలలోని అసంభావ్యములను గుర్తించి వానిని జనశ్రుతులుగా గణించి తొలగిపోవుటయే మేలయిన పని.

క్షత్రియ కన్యకు బ్రాహ్మణ కుమారుడెట్లు వరుడయ్యెను. బ్రాహ్మణ వరుని దెచ్చుటకు మంత్రి చూపిన ప్రబల కారణమేమి?

రాజు ఎంత సచివాయత్తుడైనను ఈ వరుని యసంబద్ధ ప్రలాపములకు మంత్రిచేయు సమర్థనములను ఎట్లు విశ్వసించెను?

నిజముగ కాళీవరప్రసాదముచేతనే ఈతనికి సకల విద్యలు పట్టుబడినచో ఆ విషయ మితడు కృతజ్ఞతా పూర్వకముగ ఏ కావ్యమునందైన సూచించెనా?

కాళిదాసున కంటగట్టిన శ్యామలాదండక కర్తృత్వము ఆతని కవితా శయ్యను స్ఫురింప చేయుచున్నదా?

ఆతని పరిపక్వమైన దార్శనిక దృష్టిని ఉదాత్త భావములను చూచినమీదట ఆతడు స్త్రీలోలుడై వేశ్యయింట క్రమ్మగ్గి పోయెనని యూహింపనగునా?

చరిత్ర వడబోసిన సత్యములనుబట్టి భోజ కాళిదాసులుగాని, దండిమాఘభవభూతులుగాని యేక కాలీనులని నిరూపింప శక్యమగునా?

పై ప్రశ్నములకు సదుత్తరములు లభింప కుండుటచే లోకమున ప్రచలితములయిన కాళిదాస కథలకు, చారిత్రకపు విలువ నీయజాలము.

బాల్యము–విద్యాభ్యాసము :

చరిత్ర కందని ఈతని బాల్యవిద్యాభ్యాసముల గూర్చి మనము విన్న దంతకథలు విశ్వసనీయములు గావని తోచినను వాని నీడలతో, ఈతని రచనములు గాఢముగా జదివి, కొన్ని యంశములు ఊహింపవచ్చును. అవి ఊహములు మాత్రమే వానికి ప్రమాణము అంతఃకరణప్రవృత్తియేగాని అన్యము గాదు.

ఈతడు తన దృశ్యశ్రవ్యకావ్యములలో నెచ్చటను తన తల్లిదండ్రులనుగూర్చిగాని, విద్యాగురువునుగూర్చిగాని యెట్టి సూచనమును చేసియుండలేదు. తొలికావ్యమగు రఘువంశమునందు మాతాపితృ శబ్దములతో పార్వతీపరమేశ్వరులకే నమస్కరించెను. 'వాగర్థ ప్రతిపత్తి'కై వారినే ప్రార్థించెను. దీనివలన ఈతడు తన బాల్యమున జననీజనకులకు దూరుడై అన్యుల పోషణములో పెరిగి వేర్వేరు గురువుల నాశ్రయించి, నాటి వైదుష్యమునకు గావలసిన విద్యల నన్నింటిని నేర్చియుండునని తోచును. పిమ్మట ప్రతిభాశాలియై స్వశక్తిచే రచనావ్యాసంగమునందు రాణించి, ఆనాటి రసికప్రభువులను మెప్పించియుండును. తన విద్యాప్రాప్తికిగాని, రచనాకృషికిగాని యేయొక్కరును ముఖ్యకారకులు గాకుండుటచే గాబోలు, ఎవ్వరిని స్మరింపక వాగర్థములవంటి ఆదిదంపతులనే తలిదండ్రులుగా, ప్రజ్ఞాప్రదాతలుగా పేర్కొనియుండును.

ఆపైని ఈతడు చేసిన రాజుల చరిత్ర చిత్రణము చూడగా ఈత డెవ్వరికిని భృత్యుడుగా, నాశ్రితుడుగాగాక వారికి హితుడుగా. సన్నిహితుడుగా ప్రవర్తించినట్లు కన్పట్టును.

ఈతని ఏ కావ్యప్రారంభమునందును ప్రత్యేకముగా కాళీస్తుతి చేసినట్లు గాన్పింపదు. రఘువంశస్తుతి తరువాత నాటకప్రస్తావములందు కాన్పించు ప్రారంభ పద్యములలో పరమేశ్వరప్రస్తుతిమాత్రమే కనబడును. ఇందువలన ఈతడు కేవలము కాళీభక్తుడై విద్యాసముపార్జనము చేసినాడని చెప్పుటకు వీలులేదు. కాళీప్రసాద సముపలబ్ధ విద్యావైభవుడేయైనచో ఆతని కావ్యములందు వ్యాఖ్యాతలు పాణినీయ ప్రయోగములు చూపుటయు, కొన్నిచోట్ల 'ఇతి చింత్యమ్, ఇతి మృగ్యమ్' అని పెదవి విరచుటయు నెట్లు పొసగును?

దేవీ ప్రసాదమువలన సర్వమును నిర్దుష్టముగ నుండవలయునుగదా! కనుక ఈతడు అందఱికివలెనే గురుకుల క్లిష్టముగ చదివి ఆయా విద్యలను ఆర్జించిన వాడేగాని, హఠాత్తుగా ఒకనాడు పండితుడును, కవియును అయినవాడు కాడు.

ఋతుసంహార రచనము కవితలో ఈతని ప్రాథమిక స్థితిని తరువాతి కావ్యములు వ్యుత్పత్త్యభ్యాసములచే గడితేరిన ఈతని ప్రౌఢస్థితిని తెలుపును. దేవీ వరప్రసాదియే యైనచో ఈ సోపాన క్రమము ఉండవలసిన పనియేమి? అందువలన ఈతని బాల్యవిద్యాభ్యాసములు సర్వసాధారణక్రమములోనివే కాని లోకాతీతములుకావని గ్రహింపనగును.

కాళిదాసను నామమునకు కాళీవరప్రసాదమే కారణమని చెప్పుటకు తగిన ప్రమాణము లేనందున కాళీ భక్తులైన ఆతని ఆప్తులెవరో బాల్యమున ఆతనికాపేరు పెట్టియుందురనుకొనుటయే సమంజసమగును. ఈ కాళిదాస నామమహిమ యెట్టిదోగాని కాలక్రమమున ఉత్తమ కవికి ఇదియొక బిరుద నామముగా పరిణమించినది. అర్వాచీన సంస్కృత సాహిత్యమున, నవ, అభినవ, అపర, ఆధునిక ఇత్యాది ఉపనామములతో తొమ్మండ్రు కాళిదాసులు కాన్పించుచున్నారు.

దేశ — కాలములు :

మహాకవి పవిత్ర పాదస్పర్శచే ఏ భారత భూభాగము ధన్యమైనది? అతని మధురభాషితములచే ఏ ప్రాంతము పులకితమైనది? అని కుతూహలముచే మన మాలోచించుట సహజము. భవభూతి వలె ఈతడెచ్చటను తన నివాసమునుగూర్చిగాని ఆభిజాత్యమునుగూర్చిగాని పలుకలేదు. ఇదియును తన కృయంశములవలె ఊహింపవలసినదే. మేఘదూతమునందలి రెండు వర్ణనములనుబట్టి విమర్శకులు ఈ క్రింద నుదాహరించిన తీరుగ ఊహింప దొడగిరి.

1. దశార్ణ దేశమునందలి విదిశా పట్టణమును చూచిన మీదట అచ్చటినుండి సూటిగ ఉత్తర దిక్కునకు పోవలసియుండగా—కొంచెము వంకరత్రోవయైనను ఉజ్జయినికిపోయి దాని సొగసులు చూచి మరి, ప్రయాణము సాగింపుమని మేఘదూతమున యక్షుడు మేఘముతో నననును. నిజమునకు యక్షునకు ఉజ్జయినిపై ఇంతయభిమానముండవలసిన పనిలేదు. ఈ అభిమానము కాళిదాసునిది. కనుకనే చుట్టుత్రోవయైనను మేఘుని ఉజ్జయినికి రప్పించి, దానిని తనివితీర వర్ణించి మఱీ వదలెను. ఈ ఉజ్జయినీ పక్షపాతముచే కాళిదాసు ఉజ్జయినీ నివాసియని కొందఱి యభిప్రాయము.

2. [1]కాళిదాసు లగ్నిమిత్రుని ఆస్థానకవి. ఆ రాజు రాజధాని విదిశాపట్టణము. అగ్నిమిత్రుడు కొన్నినాళ్లు ఉజ్జయినిలోనుండి తరువాత విదిశకు వచ్చెను. ఆ రాజు నాస్థానకవి యగుటచే ఈతనికి విదిశయందు ప్రత్యేకాభిమానము. కనుకనే చరిత్రలో పెద్దప్రశస్తిలేని విదిశను 'దిక్షుప్రథిత విదిశాలక్షణాం రాజధానీమ్' అని ప్రశంసించెను. కాబట్టి ఈ కవి విదిశాపట్టణ నివాసి యనుటయే యెక్కువ సత్యము, అని వేఱొకరి యభిప్రాయము.

పై రెండు వాదములలో చెప్పదగినంత పెద్ద వ్యత్యాసములేదు. విదిశ పూర్వమాళవములోనిది. ఉజ్జయిని దానికి దక్షిణపశ్చిమముగానున్న పొరుగు దేశపు పట్టణము. కాళిదాసు రెండిటిని ఆత్మీయతతోనే వర్ణించెను. ఆతడు రెండిటికిని సుపరిచితుడే కావచ్చును. కాని— కాళిదాసు అగ్నిమిత్రుని ఆస్థానకవి యనుట నిర్వివాదముకాదు. ముందీతనికాలమును గూర్చి చేయు పరిశీలనమునందు ఈ విషయము స్పష్టమగును. కావున విదిశావాదముకంటె కాళిదాసు ఉజ్జయినీ నగరమునకు చెందినవాడని చెప్పుటలోనే ఎక్కువ సామంజస్యము కాన్పించును.

ఈ కవి ఉజ్జయినీరాజు విక్రమార్కుని ఆస్థానకవియైనను, తనకు అవ్యవహితపూర్వుడును, తన గౌరవమునకు పాత్రుడును అగు అగ్నిమిత్రుని

1. డా. సి. కున్హన్‌రాజా 'కాళిదాసు'.

కథను నాటకముచేయుటయు ఆతని విదిశను మేఘ కావ్యమున ప్రశంసించుటయును అసంభావ్యములు కావు.

ఇక—కాళిదాసు ఏకాలమున తన రచనములచే ఈ దేశము నలంకరించెనో అనునది యొక పెద్ద ప్రశ్న—

ప్రాక్పాశ్చాత్య విమర్శకులు పలువురికి ఈ కాళిదాస కాలచర్చ కొట్టిన పిండి. చర్విత చర్వణముగా దానినే మరల మర్దించుట వ్యర్థము. నేటి వరకు వచ్చిన వాదసారముల సూచించి సుమారుగ అమోదయోగ్యమైన ఒక కాలమును గమనించి, ముందుకుపోవుట యుక్తము. ప్రాచీన విద్వాంసులకు ఒక కవి రచనానుశీలనముతోనేగాని ఆతని కాలనిర్ణయముతో పనిలేకపోయినది. పాశ్చాత్య సాహిత్య సంపర్కమువలన ఈ గుణము మనకు ఇటీవల సంక్రమించినది. సాహిత్య విమర్శనమున దీని ఉపయోగము లేదనజాలముగాని, ముఖ్యమైన రచనాసౌందర్య వివేచనము మాని దీనినే పట్టుకొని, కొట్టి కోలాహలము చేయుట జపము విడిచిన లొట్టలు.

కాళిదాస జీవితకాలమునుగూర్చి ముఖ్యముగ మూడువాదము లున్నవి. అందొకటి గుప్తకాల వాదము.

1. సముద్రగుప్తుని కుమారుడు రెండవ చంద్రగుప్తునకు విక్రమాదిత్య బిరుదముండుట చేతను కాళిదాసు విక్రమాస్థానకవియను ప్రతీతి సుస్థిరమగుట చేతను ఈతని కాలము గుప్తరాజుల కాలమగు క్రీ. శ. 4 వ శతాబ్దియగును. ఈ వాదము కొందఱు భారతీయ పరిశోధకులచేతను, పాశ్చాత్య విమర్శకులచేతను బహుళ ప్రచారము నందినది.

2. రెండవది క్రీ. పూ. ప్రథమ శతాబ్ది వాదము.

దీనిని బలపరుచువారు చెప్పు కారణము లివి.

వరాహమిహిరాచార్యుడు ఉజ్జయినీ ఖగోళశాల కధ్యక్షుడు. జ్యౌతిషమున సూత్నమార్గ మవలంబించినవాడు. అశ్విని, జీరో (0) డిగ్రీలో అయనరేఖ ఉన్నప్పుడు అంతకుముందున్న బార్హస్పత్య మానమును రద్దుపరచి చాంద్రమానము ఏర్పరచెను. ఆ మార్పును స్థిరపరుచుచు తన ప్రభువు పేర విక్రమశకమును ప్రారంభించెను. ఈ విషయము బృహత్సంహిత 3 అ. 1 శ్లో. వలన తెలియుచున్నది. ఈ అయనరేఖ నాధారముగా లెక్కించిన విక్రమశక మారంభించినది క్రీ. పూ. 58 అని తేలుచున్నది. కాళిదాసు విక్రమాస్థాన కవియను నిర్ణయమునుబట్టి ఈతని కాలము క్రీ. పూ. మొదటి శతాబ్దియని చెప్పనొప్పును.[2] కారణములు మరికొన్ని పేర్కొనినను పలువురు భారతీయ విద్వాంసులీ వాదమునే సమర్థింపజూచిరి.

3. మూడవది క్రీ. పూ. ద్వితీయ శతాబ్ది వాదము

ఈ వాదమునకు క్రొత్తపరిశోధనములో దొరకిన సముద్రగుప్తుని కృష్ణచరితము మూలము.

గుజరాత్ దేశీయులు శ్రీ జీవరామ కాళిదాస శాస్త్రిగారు తమ లిఖిత పుస్తక భాండాగారములో దొరకిన సముద్రగుప్తుని సంస్కృత కావ్యము కృష్ణచరితముయొక్క మూడు తాళపత్రములనుబట్టి కొన్ని విశేషాంశములను వెల్లడించినట్లును, అందు కాళిదాస కాలమునుగూర్చి కుతూహల కరములగు విషయములు తెలియుచున్నట్లును 1967 ఫిబ్రవరి భారతిలో ఒక వ్యాసము ప్రకటితమైనది. దాని సారాంశమిది.

కృష్ణచరితమున పూర్వకవీంద్రస్తుతి విపులముగ నున్నది. అందు తత్గ్రంధకర్త రాజకవుల ప్రస్తావమున శూద్రకమహారాజును పేర్కొనుచు, అతడే శకులను జయించి విక్రమార్క బిరుదము నందిన శకకర్తయనియు, సాహిత్యప్రియుడును, కవీంద్రుడును అనియును, మృచ్ఛకటికమును 9 అంక

2. అభ్యుదయ కాళిదాస ప్రత్యేక సంచిక 1956 ప్రచురణ.

ముల నాటకమును రచించిన దాతడే యనియును ఉగ్గడించెను. తరువాతి ప్రస్తావములో శాకుంతల నాటకమును వ్రాసి ప్రఖ్యాతి వహించిన కాళిదాస కవీంద్రు డాతని ఆస్థానకవి యనియును వక్కాణించెను. ఈ అంశములకు ఈ క్రింది కృష్ణచరిత శ్లోకములు ఉపష్టంభకములు—

పురందరబలో విప్రః శూద్రక
శ్శస్త్రశాస్త్రవిత్ ।
ధనుర్వేదం చౌరశాస్త్రం
రూపకే ద్వే తథాఽకరోత్ ॥
సతాం మత స్సోఽశ్వ మేధం
కృతవా నురువిక్రమ
వత్సరం స్వం శకాన్ జిత్వా
ప్రావర్తయత వైక్రమమ్ ॥
భాయ స్స మృచ్ఛకటికమ్
నవాంకం నాటకమ్ వ్యధాత్
వ్యధా త్తస్మిన్ స్వచరితం
విద్యానయబలోర్జితమ్ ॥

తస్యాభవ న్నరపతేః కవి రాప్తవర్ణః
శ్రీ కాళిదాస ఇతియోఽప్రతిమ ప్రభావః
దుష్యంతభూపతికథాం ప్రణయప్రతిష్ఠామ్
రమ్యాభినేయచరితాం సరసాం చకార ॥

శాకున్తలేన స కవిః
నాటకే నాప్తవాన్ యశః ॥

ఈ ప్రమాణములవలన కాళిదాసు సముద్ర గుప్తుని కుమారుడు రెండవ చంద్రగుప్తుని ఆస్థానమున ఉన్నాడను మాట నిరాధారమని తేలినది. సముద్ర గుప్తుడే కాళిదాసును పూర్వకవులలో చేర్చి ప్రస్తుతించినపుడు వేరుమాటకు తావెక్కడ? అంతియే కాక సముద్రగుప్తుడు కంఠోక్తిగా కాళిదాసు శూద్రక రాజు నాస్థానకవియనియును, శాకుంతలము వ్రాసి ప్రఖ్యాతి వహించెననియు స్పష్టము చేసినాడు. మఱియు శూద్రకుడే శకులను జయించిన శకకర్త విక్రముడనియు పరంపరానుగతమైన ఐతిహాసికాంశము లను గ్రంథస్థము చేసెను.

శకుల దాడి క్రీ. పూ. 2. శ. నుండి ప్రారంభమైనదనియు, వారిని జయించిన నాటి నుండియు విక్రమార్కశకము ప్రారంభమైనదనియు, అది క్రీ. పూ. 57 ప్రాంతమనియు, ఆ కాలము నకు పూర్వమే శూద్రకు డున్నందున ఆతని కాలము క్రీ. పూ. రెండవ శతాబ్దము చివరిభాగము కావచ్చు ననియు, కాగా కాళిదాస కాలమును అదియే అగు ననియుకొందరు అభిప్రాయపడుచున్నారు.[3] కాని—ఈ వాదమును సహితము నిశ్శంకముగ అంగీకరించుటకు కొన్ని ప్రశ్నము లడ్డువచుచున్నవి.

శ్రీ జె. కె. శాస్త్రిగారి పై పరిశోధనమును అనువదించుచు విపుల వ్యాసమును వ్రాసిన వ్యాస కర్తయే శూద్రక విక్రమార్కుల ఏకత్వము నిట్లు సందేహించెను. 'శకకర్త విక్రమార్కుని ఆస్థానమున ఉండినట్లు ప్రసిద్ధి వడసిన ధన్వంతరి క్షపణ కాదుల ప్రసక్తి ఇందు రాలేదు. విక్రముడు సుక్ష త్రియుడని ప్రతీతి. ఈ శూద్రకుడు బ్రాహ్మణుడని ప్రసిద్ధి. ఆతనికి సాహసాంకుడను నామమున్నది. శూద్రకునకట్టి నామమున్నట్లు కనపడదు...ఇంకను శకకర్త విక్రమార్కునకును శూద్రకునకును ఏక త్వమునుగూర్చిన చర్చ మిగిలియున్నదనియే నా యభి ప్రాయము.'

అంతియేకాక ఈ పట్టున తలలెత్తు ఈ క్రింది ప్రశ్నములకు సరియైన సమాధానములు రావలసియున్నది.

1. మృచ్ఛకటికపు ప్రస్తావనములో తత్కర్త యగు శూద్రకరాజు సుగుణములు వర్ణించుపట్టున కాళిదాసువంటి కవి తదాస్థానమున నున్నయెడల సగర్వ ముగ చెప్పుకొనవచ్చునుగదా! ఏల చెప్పలేదు.

2. కాళిదాసు తన కావ్య నాటకములలో తన యేలిక మృచ్ఛకటికమువంటి నాటకకర్తయైనచో ప్రశంసించియుండడా? 3. శూద్రక రాజాస్థానకవి

3. చూ. 1968 ఏప్రిల్ భారతి.

కాళిదాసు అని వ్రాసి శాకుంతలమునే పేర్కొన్నచో తక్కిన కావ్యనాటకములు ఎవరు వ్రాసినట్లు?

4. శూద్రకుని ఆస్థానిలో రామిల సోమిలు లను ఇరువురు కవులుగూడ ఉన్నారనియు వారు శూద్రక కథన్ వ్రాసి చాల మన్ననకు పాత్రులైవారనియు కృష్ణచరితపు శ్లోకములలోనే ఉన్నది. కాళిదాసు తన మాళవిక నాటకమున భాస, సౌమిల్ల కవి పుత్రులు, తనకంటె ప్రసిద్ధులైన (పూర్వ) కవులని చెప్పెను. ఈ సౌమిల్ల కవిపుత్రులే రామిల సోమిలులను ఇద్దఱు సోదరకవులనియు, శూద్రక కథ, మణిప్రభ అను రెండు గ్రంథములను రచించిరనియు విమర్శకులు తలంచుచున్నారు.[4] కాగా కాళిదాసు తమ సమకాలికులగు కవులను భాసునితో చేర్చి ప్రశంసించుట విస్మయకరము కాదా?

5. జె. కె. శాస్త్రిగారు హరిషేణుడను కవి సముద్రగుప్తుని యాస్థానమున నుండెననియు ఆతనికిగూడ కాళిదాస బిరుదమున్నదనియు ఆతడే రఘువంశమును వ్రాసెననియు నిర్ణయించిరట. ఐనచో తక్కిన కుమార మేఘ కావ్యములను ఎవరు వ్రాసిరి. రఘువంశాదులను వేఱొక కాళిదాసు వ్రాసినచో ఆ కావ్యములకును శాకుంతలాదులకును ప్రబలముగానున్న పోలికలను భావైక్యమును సమన్వయించు మార్గమేమి?

ఈ విప్రతిపత్తులకు సరియైన సమాధానము వచ్చునంతవరకును శ్రీ జె. కె. శాస్త్రిగారి పరిశోధ నాంశములనుబట్టి కాళిదాసు కాలమును నిర్ధరింప జాలము.

ఈ క్రీస్తు పూర్వపు ద్వితీయ శతాబ్ద వాదమును సంస్కృతకవి చరిత్రకారులు వేఱువిధముగ సమర్థించిరి. 'మార్షలు పండితుడు అల్హాబాదునకు దగ్గఱగానున్న భీతగ్రామమున కొన్ని లోహపు రేకులు సంపాదించెను. అందు దుష్యంతుడు లేడిని తరుముట, మున్నగు శాకుంతల ప్రథమాంక కథ చెక్కబడినది. ఆ రేకులు క్రీ. పూ. 185—73 నడుమ పాలకులుగానున్న సంగరాజుల కాలమునకు చెందినవని పరిశోధకుల అభిప్రాయముగా రమేష్ మోహన్‌బోస్ గారు శాకుంతల పీఠికలో ఉటంకించినారు. కనుక కాళిదాస కాలము క్రీ. పూ. రెండవ శతాబ్దము కావచ్చునని వారి యుద్దేశ్యము.

ఈ రెండవ శతాబ్ద వాదమును ఇంకొకరు వేఱొక విధముగా బలపరిచిరి.

'మాళవిక భరత వాక్యములో అగ్నిమిత్రుని నామమున్నది. నాటక నాయకుని నామము భరత వాక్యములోనుండుట ఒక వింత సంగతి.[5] దీనివలన కవికి అగ్నిమిత్రునియందు ప్రత్యేకాభిమానముండుట స్పష్టము. అగ్నిమిత్రుడు మౌర్యసామ్రాజ్య పతన కారకుడైన పుష్యమిత్రుని కుమారుడు గనుక ఆతని కాలము క్రీ. పూ. రెండవ శతాబ్దము. ఆతడే కొన్నాళ్ళు ఉజ్జయినిలోనుండి పిదప విదిశాపట్టణమున రాజ్యమేలెను. కనుకనే పెద్ద ప్రసిద్ధిలేని విదిశను కాళిదాసు ప్రత్యేకాదరముతో వర్ణించెను.[6]

అగ్నిమిత్రునకు శూద్రకుడను పేరున్నదని కమరవ్యాఖ్యాత క్షీరస్వామి చక్రవర్తి పర్యాయపదములలో చెప్పెను. ఈతడు జ్వలనమిత్రుడను పేరిట కవిగాకూడ ప్రసిద్ధుడని వేఱొకచో నున్నది. కనుక కాళిదాసు అగ్నిమిత్రుని ఆస్థానకవియని చెప్పనగును. కాగా, కాళిదాసు క్రీ. పూ. రెండవ శతాబ్దికి చెందిన వాడని తేలుచున్నది.

ఈ వాదము విన్నప్పుడును కొన్ని ప్రశ్నలు పుట్టుచున్నవి.

1. అగ్నిమిత్రుడే శూద్రకుడైనచో ఆ సూచనము మాళవికలో ఎచటనైన ఉన్నదా?

---

4. Two plays of Bhasa—A. S. P. Ayyar—Intro. P. 5.

5. ఆశాస్య భీతి విగమ ప్రభృతి ప్రజానాం
సంపత్స్యతే నఖలు గోప్తరి నాగ్నిమిత్రే'
మాళ. 5—20.

6. 'తేషాందికు' మున్నగు శ్లోకములు.
చూ. మేఘ. 1 స.

2. మృచ్ఛకటిక నాటకకవియైన శూద్రకుడే తన ప్రభువైనచో ఆ ఘనతను కవియైన కాళిదాసు భంగ్యంతరముగానైన తన నాటకమున స్మరింపక యుండునా?

3. కాళిదాసునకు అగ్నిమిత్రుడే ప్రభువైనచో పురూరవోనాయకమైన తన నాటకమునకు విక్రమోర్వశీయమను పేరుపెట్టుటలో, అందు అన్యవ్యపదేశమున పలుసారులు విక్రమశబ్దమును రానిచ్చుటలో గల స్వారస్యమేమి?

పైవాదముల నన్నిటిని శ్రద్ధగా పరిశీలించిన మీదట దేనికి తగిన సాధకబాధకములు దానికి ఉండుటచే నిదమిత్థమని నిర్ణయించి చెప్పుటకు వీలు లేకున్నను, ఉన్నవాదముల బలాబలములనుబట్టి ఇప్పటికి క్రీ. పూ. ప్రథమ శతాబ్దియే కాళిదాస కాలమని స్థూలముగ నంగీకరించి తృప్తిపడుటయే కర్తవ్యము. ఈ నిర్ణయమునకు కాళిదాసుని పురాణ సరళ సంస్కృతశైలియును, క్వాచిత్కములైన అపాణినీయ ప్రయోగములును, ఆతడు తనకు పూర్వులనుగా పేర్కొన్న కవుల కథలును బలకరములై ఈ కవీంద్రుడు క్రీ. పూ. ననేగాని పరమున లేడని చెప్పజాలియున్నవి.

పరిచయ స్నేహములు :

లోకసంగ్రహమునకు, లాంఛనప్రాయముగా— ఈతడీదేశమునకు చెందినవాడు; ఈతడీకాలమువాడు అని చెప్పుకొనుటకాని, నిజమునకు మహాపురుషులు ఒక దేశమునకుగాని, ఒక కాలమునకుగాని అంకితమైపోయి యుండెడివారుకారు. వారు సర్వలోక బాంధవులు. ప్రపంచ సభ్యులు. వారి అద్భుతకళాసృష్టి వారి లోకోత్తర పాత్రలు యావత్ప్రపంచమునకును ఆత్మీయములే. కనుకనే జర్మన్‌కవి గెథీ నృత్యము చేసినను,ఆంగ్ల విమర్శకులు ఓహోయని ప్రశంసించినను మన కాశ్చర్యము గొలుపదు. ఆతడు విక్రమునికాలము లోనే బ్రతికి తక్కిన కాలములలో అదృశ్యుడు కాలేదు. నాటికిని నేటికిని సాహిత్యప్రియుల అంతరంగముల స్పృశించుచు నిత్య సన్నిహితముగ ప్రజా సందోహమున సంచరించుచునే యున్నాడు. ఆతడెక్కడనో లేడు. ఎవ్వరోకాదు. ఆతడు మన అనుభూతి; మనవేదన; మన ఆనందము; మన అశ్రువులు అన్నిటను ఆతడు కరగియున్నాడు. ఆతడు భారతీయ గురుకులములలో సంస్కృతపాఠము ప్రారంభించిన విద్యార్థికి 'సరాజ్యం గురుణాదత్తమ్' అనిచేయి అందించి రఘురాజుతోపాటు (సారస్వత) దిగ్విజయము చేయించుచున్నాడు. సాహిత్య రసికుల ప్రసంగములలో నిలిచి, తన కావ్య నాటకముల మాధుర్య విస్ఫూర్తితో మైమరపించుచున్నాడు. విరహ కృశాంగులకు చల్లని మేఘములను చూపుచున్నాడు. రసజీవులకు సౌందర్య శృంగారముల విశ్వరూపము చూపి నిలువున పులకింప చేయుచున్నాడు. దుఃఖితుల నోదార్చి బాష్పముల తుడిచి అమృత సానుభూతి నందించుచున్నాడు.

ఆతని నుడికారము భారతీయ సాహిత్య శ్రీకారమైనది. ఆతని యుపమానములు, చెణుకులు, చమత్కృతులు పండితుల నాల్కల నిల్లు కట్టుకొన్నవి.

'జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః'

సంస్కృత సాహిత్యమున శ్లేషయమక చక్రవర్తులున్నారు. పదవాక్య ప్రమాణ పారీణులున్నారు. అఖండ పాండితీప్రచండులున్నారు. కాని అందున్న కాళిదాసుమాత్ర మొక్కడే. ఆతడు ప్రియవాది. చిఱునవ్వుతో అందఱి భుజములపై చేయివేసి పలుకరించును. ఆతనితో పరిచయము మన జన్మ జన్మల భాగ్యమనిపించును. ఆతని స్నేహము మనకు పర ప్రసాదమనిపించును.

'నక్షత్ర తారాగ్రహ సంకులాపి
జ్యోతిష్మతీ చంద్రమసైవ రాత్రిః'

నక్షత్రములు, తారలు, గ్రహములు వేలకొలది ఉండనిండు. రాత్రిని వెలిగించువాడు ఒక్కచంద్రుడే అన్నట్లు సంస్కృత సారస్వతరంగమున దీపించు పలువురు మహాకవులలో ఏకైక జాతీయకవి కాళిదాసే.

హైందవ నాగరికతకు, సంస్కృతికి, రసజ్ఞతకు ఏకైకప్రతినిధి ఆతడు. హిమశిఖరౌన్నత్యము, కశ్మీర సౌందర్యము, జాహ్నవీమాధుర్యము, ఋషివాటికా పావిత్ర్యము ప్రవహించి ప్రవహించి రూపుగట్టిన ఒకే ఒక మూర్తిని చూడదలతురా? అదుగో ఆ కాళిదాసును చూడుడు. భారతదేశములోని అంగుళాంగుళమును అతనికి సుపరిచితము. మాతృదేశ పవిత్ర ధూళిని పుష్పరజమువోలె ఆతడు తలపై ధరించును. ఆసేతుశీతనగమాతృమూర్తిని కన్నులతో సేవించి, హృదయముతో పూజించును. కాగా, భారతదేవి తాను చెప్పదలచిన ప్రవచనములను అతని కంఠముద్వారా ముక్తకంఠముగ పల్కినది.

ఆదర్శము — అభిరుచులు

కాళిదాసు కావ్యము లెందులకు వ్రాసెను? ఆయన కావ్యపరమార్థమేమి? అని ప్రశ్నింపగా పలువురు స్థూలముగా తక్కిన కవులెందులకు వ్రాసినారో ఆతడును అందులకే వ్రాసినాడని చెప్పుదురు. కాని—ఆతని కావ్య నాటకములను ఈ దృష్టితో శ్రద్ధగా చదివినపుడు నలుగురు కవులవలె ఆతడును కీర్తికొఱకో, ప్రభుకటాక్షముకొఱకో ప్రజ్ఞాప్రదర్శనముకొఱకో వ్రాసినట్లు కనపడదు. అట్లు వ్రాసిన కావ్యములలో కవియొక్క స్వచ్ఛమైన హృదయ స్పందనముగాని, ఆతని అంతరాంతరముల నుండి దూకివచ్చు ఆత్మీయతగాని గోచరింపదు. అట్టిరచనల ముఖములు ఎంత తళతళ లాడుచున్నను ఎన్ని అలంకారములు దిగవేసికొన్నను, అందేదో జీవకళ కొఱవడినట్లు వెలవెలబోవుచు కాన్పించును.

కాళిదాస కావ్యములలో ఒక ఉద్యమము, ఒక ప్రబోధము, ఒక ఉజ్జ్వలదీక్ష, ఒక ఉదాత్త లక్ష్యము ఖంగున మ్రోగుచుండును. ఆతడు శృంగారియని పెద్ద జనశ్రుతి. కాని ఆతని మహాకావ్యము రఘువంశము శృంగార ప్రధానము కాదు. అది ధర్మవీర ప్రధానము. శృంగారస్ఫూర్తి తుది సర్గలో ఉన్నను, అది ఆతని ప్రబలధర్మచిత్రణలో మునిగి పోయినది. ఆతడు తన రచనముతో వీరులను సృష్టింపదలచెనుగాని, కాముజనుల శృంగార తృష్ణ తీర్చుటకు తన కావ్యములను పాత్రము చేయలేదు. ముక్తకంఠముగ భారత వైభవమును సంస్కృతిని కొనియాడుటకు ఉద్యమించెనుగాని ఒక కొందఱి రాజుల, రాణుల గుణసంకీర్తనములో నిమగ్నుడు కాలేదు. దీనినిబట్టి నిశితముగ చూడగ కాళిదాస కాలమునాటి భారత స్వరూపము స్పష్టాస్పష్టముగ ఇట్లు రూపుకట్టును.

యవను లనుడు, హూణు లనుడు, శకు లనుడు ఎవరో ఒక పరదేశీయులు మాతృదేశముపై దండెత్తి జాతి సుస్థితిని, సంస్కృతిని చిందరవందరజేసి ధర్మగ్లానిని కల్గించుచున్నారు. భారత ప్రభువు మహాశౌర్యముతో శత్రువులను మార్కొని వారి దురాక్రమణమును అణగింప నిమగ్నుడైనాడు. అట్టి సంకట సమయమున కవి తన ఘంటమును ప్రభుఖడ్గమునకు తాకించి జాతినాడులలోనికి వీరరసమును, హృదయములోనికి ధర్మబలమును ఎక్కింప దలచుట సంభావ్యము. సరిగ—తననాటి అదియే విధ్యుక్త ధర్మమును కాళిదాసమహాకవి నిస్స్వార్థముగ నెరవేర్చినాడని తోచును. అంతియేకాక, అంతవరకు ప్రవర్తిల్లిన బౌద్ధజైనములు తత్త్వచింతనము పేరిట సన్యాసమును, అహింసపేరిట అపౌరుషమును బోధించి జాతిని నిర్వీర్యము చేసినవి. 'సర్వం శూన్యమ్; సర్వం దుఃఖమ్' అని జీవిత నైరాశ్యమును తల కెక్కించి ప్రవృత్తిని చంపి నివృత్తికి దారిచూపినవి. దానితో మానవునకు కావలసిన కర్తవ్య పరాయణత్వము సౌందర్యప్రీతి గృహస్థధర్మము మృతప్రాయములైనవి. ఈ నైరాశ్యమునుండి దుస్థితినుండి జాతిని ఉద్ధరింప కంకణము కట్టుకొని హైందవ ధర్మములోని దివ్యతేజమును సహస్రముఖముల వెదజల్లుటకై మానవునకు కర్తవ్యమును జీవన సౌందర్యమును ఆశామాధుర్యమును చూపుటకై మహాకవి తన లేఖనిని చేతపట్టెను. ధర్మార్థకామమోక్షములను పురుషార్థములను కావ్యముఖమున మనోహరముగ

చిత్రించి చూపెను. అందు ధర్మ ప్రాముఖ్యము నుగ్గడించి దానియందే మొగ్గుచూపెను.

అర్థకామములు నింద్యములు కావు. వానిని యథోచితముగ సేవించుచునే మానవుడు ధర్మపరుడు కావచ్చును. అట్టివానినే గౌతముడు ధర్మోత్తరుడనెను. ఈ సూత్రమును

'శైశవేఒభ్యస్త విద్యానాం
యౌవనే విషయైషిణామ్
వార్ధకే మునివృత్తీనాం
యోగే నాంతే తనుత్యజామ్॥'

అను శ్లోకమున చక్కగ నిరూపించినాడు. ఈ శ్లోకము రఘురాజులనుగూర్చి చెప్పబడినను ఇందు ఆదర్శ భారతీయుడు చిత్రితుడైనాడు.

గార్హస్థ్యము సర్వోపకారక్షమము. దాని పరమోద్దేశము ప్రజాతంతుపరిరక్షణముకాని ఇంద్రియక్షోభాశాంతికాదు. కనుకనే 'ప్రజాయై గృహమేధినామ్' అని ఈతడు నొక్కి చెప్పెను. ఈ పరమార్థముచే 'వాగర్థా వివ' అని రఘువంశ ప్రథమ శ్లోకముచే సూచించెను. అందు ధ్వనించునది శృంగారముకాక భక్తిభావమే యని పండితరాజు నిర్ణయించెను. ఈ దాంపత్య సత్ఫలమునే రఘు కుమార కావ్యములందును విక్రమ శాకుంతలము లందును సుష్ఠుగ చిత్రించెను. ఆతడు తన రచనములందు దిగ్విజయముతో పరరాజులను 'జితోస్మి' యనిపించిన రఘువీరులను సృష్టింపదలచెనుగాని ఇంద్రియములకు దాసులైన అగ్నివర్ణులను ఆదర్శముగ నిలుపదలపలేదు. ధర్మబద్ధమైన స్త్రీపుంసయోగమున స్కందులను పుట్టించి దుష్టసంహారము చేయింపదలచినాడుగాని కాముని ఆటోపమునకు విజయప్రదానము చేయదలపలేదు.

పరమార్థము, విషయ విముఖులగు మానవులకు జగత్తు మిథ్యయని జీవితము క్షణికమని బోధించినను, వాని నట్లుంచి లోకయాత్రాప్రవృత్తిలో ఈ లనంత ప్రకృతిలీలను చూచి ఆనందింపుము. జీవన నాట్యములోని రసమాధురిని చవిచూడుము. ఇది ప్రవృత్తి మార్గములోని మానవుని జన్మహక్కు అని ఈతడు బోధించెను.

ఒక జాతియొక్క విజ్ఞానవికాసము వివేకపాకము కళాభిజ్ఞత ఆ జాతిమహాకవి రచనములందు ప్రతిఫలించుట సహజము. ఆ రచనములను స్వదేశీయులుగాని విదేశీయులుగాని చదివినపుడు ఆ జాతి సమగ్రపటము వారికి సాక్షాత్కరింపవలెను. కాళిదాసు తన కావ్య నాటకములను అట్టి భారత సర్వస్వములుగా సృష్టించెను.

భారతీయ దర్శనములు శాస్త్రములు కళలు ఆతనికి కరతలామలకములు. సాంఖ్యయోగములు, పూర్వోత్తరమీమాంసలు, తర్కవ్యాకరణములు, శ్రౌతస్మార్తములు, రాజనీతి, సంగీతము, చిత్రరచన, నాట్యము మున్నగు వానియందలి ఆతని పరిజ్ఞానము. రచనము లన్నింటియందును తొంగి చూచుచుండును.

మత–దర్శనములు:

రఘువంశ ప్రారంభపద్యమును బట్టియు, కుమార సంభవ కథా ప్రీతినిబట్టియు, నాటకములందలి నాంది పద్యములనుబట్టియు ఈతడు శైవుడుగా గాన్పించును. కాని విష్ణుభక్తి యెఱుగని వీరశైవుడుకాడు. రఘువంశ విష్ణ్వవతారకథను చూచినను అందుదేవతలు చేసిన విష్ణుస్తోత్రమును గమనించినను ఇతడు శివకేశవభేదములేని శుద్ధ అద్వైతిగా కాన్పించును. అయినను 'తథాపి భక్తిః తరుణేందు శేఖరే' అన్నట్లు శివభావనలో ఈతని భక్తిభావము పొంగి పొరలుచుండును.

రఘు. దశమసర్గమునందలి విష్ణుస్తోత్రమున దేవతలిట్లు పల్కిరి.

'నమో విశ్వసృజే పూర్వం।
విశ్వం తదను బిభ్రతే।
అథ విశ్వస్య సంహర్త్రే
తుభ్యం త్రేధా స్థితాత్మనే॥

రఘు. 10.16.

'రసాన్తరా ణ్యేకరసం
యథా దివ్యం పయోశ్నుతే।
దేశే దేశే గుణేష్వేవం
అవస్థా స్త్వ మవిక్రియః॥

'నీవు పూర్వము విశ్వమును సృష్టింతువు. పిమ్మట దానిని భరింతువు. తుదకు సంహరింతువు. ఇట్లు మూడు పనులను మూడు రూపములతో చేయుచున్నను అన్నిటికిని మూలరూపుడవైయున్న నీకు నమస్కారము'.

'ఆకాశపు నీరు ఒక్కటేయైనను ఆయా ప్రదేశములనుబట్టి రుచిభేదము నందుచున్నట్లు నీవు నిర్వికారుడవైనను సత్త్వాది గుణసంపర్కమున అవస్థాభేదముల నందుచున్నావు.'

దీనివలన కేవలమైన పరమాత్మ ఒక్కటే సత్వరజస్తమోగుణసంబంధముచే విష్ణు బ్రహ్మ రుద్రాది రూపముల కాన్పించుచుండును. మాయా ప్రతిబింబితులైన బ్రహ్మాదులు ఎట్లు పరమాత్మకన్న భిన్నులుకారో అట్లే అవిద్యావృతుడైన జీవుడును తద్భిన్నుడుకాడు—అను అద్వైత సిద్ధాంత మిందు ప్రతిపాదితమైనదికదా!

వేదవచనములలో మునిమతములలో అభిప్రాయ భేదములున్నను పురుషార్థసిద్ధియందు ఆ మార్గము లన్నియు గంగాప్రవాహములు సముద్రమువే చేరు చున్నట్లు నిన్నే చేరుచున్నవని సర్వదర్శన ప్రతి పాద్యుడు ఒక్కడేయని ఇట్లు రాజమార్గమును ప్రదర్శించెను.

బహుధా ప్యాగమై ర్భిన్నాః
పంథాన స్సిద్ధిహేతవః।
త్వయ్యేవ నిపతల త్యోఘా
జాహ్నవీయా ఇ వార్ణవే॥ రఘు.

ఈ పరమార్థమే రూపాంతరమున కుమార ద్వితీయ సర్గములో బ్రహ్మస్తోత్రమున కాన్పించును.

'నమ స్త్రిమూర్తయే తుభ్యం
ప్రాక్సృష్టేః కేవలాత్మనే।
గుణత్రయ విభాగాయ
పశ్చాద్భేద ముపేయుషే॥ కు.

సృష్టికి పూర్వము కేవలాత్మ స్వరూపుడవు. పిమ్మట గుణత్రయవిభాగమువలన భిన్నభిన్న రూపుడ వగుచున్నావు. అట్టి నీకు నమస్కారము.

'త్వమేవ హవ్యం హోతా చ
భోజ్యం భోక్తా చ శాశ్వతః।
వేద్యంచ వేదితా చాసి
ధ్యాతా ధ్యేయం చ యత్పరమ్॥

'హోమద్రవ్యమును, హోమము చేయువాడవును నీవే. భోజన ద్రవ్యమును భోక్తవును నీవే. తెలిసికొనవలసినదియు తెలిసికొనువాడవును నీవే. నీవే ధ్యేయము. నీవే ధ్యాతవు.'

'ధ్యానింపదగినదియు ధ్యానించువాడును ఒకడే అన్నప్పుడు అద్వైత ఘంటానాదము తప్ప ఇకనేమి వినపడుచున్నది. ఈ తత్త్వమునే కుమారకావ్య సప్తమసర్గమున శివపార్వతీకళ్యాణ ఘట్టమున ఇట్లు చమత్కరించెను.

ఏకైవ మూర్తి ర్బిభిదే త్రిధా సా
సామాన్య మేషాం ప్రథమావరత్వం
విష్ణోర్హర స్తస్య హరిః కదాచిత్
వేధా స్తయో స్తావపి ధాతు రాద్యౌ॥

పెండ్లి కుమారుడైన శివుని బ్రహ్మ విష్ణువు లభినందింపవచ్చిరి. అయినచో శివుడు గొప్పవాడా అని ప్రశ్న వచ్చుచున్నదని చిర్నగవుతో నిట్లు జవాబు చెప్పెను.

ఒకే మూర్తికి మూడు ప్రతిబింబములు. వారిలో ఎక్కువ తక్కువ లెన్నుట అజ్ఞానము. విష్ణువుకంటె శివుడు పూర్వుడు. అతనికంటె విష్ణు వాద్యుడు. వారిద్దఱికంటె బ్రహ్మదేవుడు ప్రాచీనుడు. అతనికంటె వారిద్దఱును సనాతనులు! అనగా ఏమి తేలినది?

ఇట్టి ప్రశ్నములు మౌర్ఖ్య మూలకములని చెప్పినట్లయినది గదా!

పై బ్రహ్మ విష్ణు స్తవములందు ఉపనిష త్ప్రతిపాదితమైన ఈశ్వర తత్త్వము ప్రసక్త, మైనదిగాని అవతారాది పురాణకథల ప్రసక్తి రాలేదు. దీనినిబట్టి ఆతని నిశిత తత్త్వజ్ఞానము విశదమగును. ఉత్తర మీమాంసయనెడు వేదాంత దర్శనసార మిందు ఉగ్గడింపబడినది, అట్లే ఈ స్తుతులందు తక్కిన దర్శన పరిచయమునూ, సూచితమగుచుండును.

'త్వా మామనంతి ప్రకృతిం
పురుషార్థ ప్రవర్తినీమ్।
తద్దర్శిన ముదాసీనం
త్వామేవ పురుషం విదుః'

'పురుషార్థములందు ప్రవర్తించు ప్రకృతివి నీవే ఆ ప్రకృతిని సాక్షిభూతముగా చూచు పురుషుడవును నీవే.'

ఇందు సాంఖ్య సిద్ధాంతమున్నది. త్రిగుణాత్మికమై చతుర్వింశతి తత్త్వములతోగూడి జడము. పరిణామి అగు ప్రకృతియొక్కయు, నిర్వికారుడును, నిష్క్రియుడును అగు పురుషునియొక్కయు పరస్పర సంయోగమువలన ఈ సృష్టి ఉత్పన్నమగుచున్నది. చతుర్వింశతి తత్త్వ యదార్థజ్ఞానమువలన ప్రకృతి తిరోహితయై పురుషుడు ముక్తినందును. దీనికంటె అతీతుడైన ఈశ్వరుడు లేడు. అను కాపిల సిద్ధాంత సారమును స్పృశించి ఆ ప్రకృతియును, పురుషుడును నీ రూపభేదములేయని గీతాప్రోక్తమైన వేదాంత దర్శనముతో సమన్వయించెను. [7]గీతలో సాంఖ్యయోగ శబ్దములున్నను అవి దర్శనపరముగకాక జ్ఞానకర్మలను నర్థమున వాడబడినవి.

కాళిదాసు రఘురాజుల గుణములు వర్ణించుచు 'యోగే నాంతే తను త్యజామ్' అని చెప్పెను. ఈ సూత్రప్రకారమే రఘురాజు రాజ్యము పుత్రున కప్పగించి తాను యోగియై పరమాత్మ దర్శనముచేసి తనువు చాలించెను. కవీంద్రుని యోగ పరిచయము రఘు సందర్భమునందును శివతపోభూమికయందును స్పష్టముగ కాన్పించును.

యోగమునకు, యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధు లను అష్టాంగములున్నవి. వీని సాధనమున పురుషుడు పరమాత్మ దర్శనముచేసి కృతార్థుడగునని సిద్ధాంతము. ఈ యోగ ప్రసక్తి గీత 6. అ. 11—15 శ్లోకము లందున్నది. ఈ యోగసాధనమున రఘు వెట్లు ఆత్మసాక్షాత్కారము నందినదియును కవీంద్రుడు రఘు అష్టమసర్గమున చక్కగా నిరూపించెను. అందలి 18 శ్లోకముచే ఆసన ధారణములను, 19 చే ప్రాణాయామమును, 21 చే ప్రత్యాహారమును, 22 చే సమాధినిచెప్పి, 24 చే ఆతని సిద్ధినిట్లు వర్ణించెను.

అథ కశ్చి దజ వ్యపేక్షయా
గమయిత్వా సమదర్శనః సమాః।
తమసః పర మాప దవ్యయమ్
పురుషం యోగ సమాధినా రఘుః

రఘు. 8.24.

కుమార. తృతీయ సర్గమున యోగీశ్వరేశ్వరుడైన పరమశివుని యోగమూర్తిని బొమ్మ గీచినట్లు చూపినాడు.

'పర్యంకబంధ'అను పద్యమున ఆతని ఆసనమును,

'కించి త్ప్రకాశ' అనుదానియందు ప్రత్యాహారమును,

'అవృష్టి సంరంభ' 'మనో నవద్వార' అను పద్యద్వయమున ప్రాణాయామ ధ్యానధారణములను చిత్రించెను.

కాళిదాసు సాంఖ్య (జ్ఞాన) యోగ (కర్మ) ములలో యోగమునే ఉత్తమ ముక్తిసాధనముగా భావించినట్లు కవబడును. ఈ అర్థమునకు ఇట్లు గీతావచన బలమును కననగును.

---

7. భగవద్గీత: 13 అ. 20, 21, 22, 23 శ్లో॥.

7 అ. 4, 5, 6, 7.

'తస్మా దసక్త స్సతతం
కార్యం కర్మ సమాచర।
అసక్తో హ్యాచరన్ కర్మ
పర మాప్నోతి పూరుషః

గీః తృ. 19.

రఘు. దశమ సర్గయందలి 25, 28 శ్లోక ములు కాళిదాస హృదయమును తెల్పును.

ఈయన వేదైకశరణ్యా మగు పూర్వ మీమాంసా మతమును చెప్పి ఆవేదమునకును నీవే మూలమని ఇట్లు వివరించెను.

ఉద్ఘాతః ప్రణవో యాసాం
న్యాయై స్త్రిభి రుదీరణమ్।
కర్మ యజ్ఞః ఫలం స్వర్గః
తాసాం త్వం ప్రభవో గిరామ్॥

కు. 8—12.

'ఏ వాక్కులకు ఓంకారము ప్రారంభమో, వేని ఉచ్చారణము ఉదాత్తాది స్వరత్రయముచే జరుగునో, వేని కర్తవ్యము యజ్ఞమో, వేని ఫలము స్వర్గమో అట్టి వేదములకు నీవే జన్మ స్థానమవు.'

వేదములు అపౌరుషేయములనిచెప్పు మీమాంసకుల మతమున పుట్టిన చోటనియు, దాని నంగీక రింపని తార్కికుల మతమున నీవే వేదములకు కర్త వనియు, ఉభయ సాధారణముగా నిచట ప్రయుక్త మైన 'ప్రభవః' అనుమాట గమనింపదగియున్నది.

సంప్రదాయము :

ఈ క్రింది సందర్భములు ఈతని శ్రౌత స్మార్త సంప్రదాయ పరిజ్ఞానమును తెల్పును.

'వనాంతరా దుపావృత్తైః
సమి త్కుశ ఫలాహరైః'
పూర్యమాణ మదృశ్యాగ్ని
ప్రత్యుద్యాతైః స్తపస్విభిః॥

దిలీపుడు చూచిన వసిష్ఠాశ్రమ మిట్లున్నది.

'తపోజనులు వేరువనములకు పోయి, కట్టెలను, దర్భలను, పండ్లను తెచ్చుకుని సాయంకాలమునకు స్వాశ్రమము చేరుచున్నారు. అట్టిమునుల కదృశ్య ములైన వైతాని కాగ్నులు ఎదురేగుచున్నవి! ఈ అగ్నులు మునులకు ఎదురేగుట యన్నది శ్రుతి ప్రసిద్ధము.

'ప్రోష్య గచ్ఛతా మాహితాగ్నీనాం అగ్ని ప్రత్యుదానం శ్రుతి ప్రసిద్ధమేవ.'8

'అధర్వవేత్తయగు వసిష్ఠునితో దిలీపుడు పలికెను.' అను వాక్యమున అధర్వవేత్తృత్వ విశేషణము వసిష్ఠునకు సాభిప్రాయముగా వినియుక్తమైనది. 'నిత్యమును రాజులకు శాంతిక పౌష్టిక' కృత్యములను పురోహితుడు అధర్వవేద విహితముగ నిర్వహింప వలెను'. అను కామందక వచనము ఆవిశేషణ సార్థ క్యము మగ్గడించుచున్నది.9

'కుశపుత్రుడగు అతిథిని పురోహితులు జయ శీలములగు అధర్వవేద మంత్రములతో అభిషేకించిరి' అని రఘు. 17 వ సర్గమునగూడ చెప్పెను. రాజ పురోహితునికి కావలసిన ఈ అధర్వ పరిజ్ఞానమును ఈత డింత శ్రద్ధగా దృష్టిలో నుంచుకొనెను.

ఇందుమతి అజకుమారుని వరింపగా తక్కిన స్వయంవ రాగత రాజపుత్రులు మత్సరగ్రస్తులైనను ఎట్టి కీడును చేయలేకపోయిరట. కారణమేమి? స్వయం వర స్థలమున శచీదేవి సాన్నిధ్యముండును. ఆమె మహిమవలన ఎట్టి యనర్థములును జరుగుటకు వీలులేదు. ఇచట కాళిదాసుని సంప్రదాయజ్ఞత మనకు విశదమగును.

'శచీ సన్నిధౌ యే విఘ్న ముపజనయంతి తే త్వచిరాత్ ప్రలీయంతే' అను లోకోక్తియుండగా శచీపూజ వివాహాంగముగ నారదీయసంహితలో చెప్ప బడినదట—ఆ పూజా విధాన మిది యని ప్రయోగ రత్నాకర మిట్లు చెప్పును. 'తతో దాతా పాత్రస్థిత

---

8. రఘు. 1. స. 49 శ్లో॥పై మల్లి నాథ వ్యాఖ్య.

9. 1: స. 59. వ్యాఖ్య.

సితతండుల పుంజే శచీ మావాహ్య షోడశోపచారైః పూజయేత్, తతః చ కన్యా ఏవం ప్రార్ధయేత్' దేవేంద్రాణి నమస్తుభ్యమ్ దేవేంద్ర ప్రియభామిని| వివాహభాగ్య మారోగ్యం పుత్రలాభం చ దేహి మే||'


కుమార సంభవపు సప్తమ సర్గములో పార్వతీ పాణిగ్రహణానంతరము శంకరుఁడు నవవధువుతో శయ్యా గృహమును ప్రవేశించి నేలపై పవ్వళించెను.

'అధ విబుధ గణాం స్తా నిందుమౌళి ర్విసృజ్య క్షితిధరపతి కన్యా మాదదానః కరేణ, కనకకలశ యుక్తం భక్తశోభా సనాధం, క్షితి విరచిత శయ్యం కౌతుకాగార మాగాత్'

ఇచ్చట 'క్షితివిరచితశయ్యం' అను మాటలో ఒక సంప్రదాయరహస్య మున్నది. నూతన వధూ వరులు మూఁడు రాత్రులవరకును క్షారలవణములను వర్జించి బ్రహ్మచర్యదీక్షతో స్థండిలశయనము చేయవలెను; అను ఈ గృహ్య సూత్రమును ఇచ్చట స్మరింపవలసియున్నది.

'ఆశ్వలాయన:[10]—అతఊర్ధ్వ మక్షార లవణా శినా వధశ్శాయినౌ బ్రహ్మచారిణౌ స్యాతా మితి.' ఈ అర్థమునే కామశాస్త్రముకూడ 'త్రిదిన మిహ నభిందా్య ద్బ్రహ్మచర్యం న చాస్యా, హృదయ మనను రుధ్య స్వేచ్ఛయా నర్మ కుర్యాత్' ఇట్లు చెప్పినది.

10. కుమా. 7. స. 94 శ్లో|| పై మల్లినాథ వ్యాఖ్య.



చెట్టు నా ఆదర్శం

శ్రీ భూషి కృష్ణదాసు

చెట్టులా నిటారుగా నిలబడ్డ వాణ్ణి
చెట్టులా ఆశలు చావని వాణ్ణి!
నిత్యం కొత్త చివుళ్ళతో
వళ్ళుకప్పుకొంటున్న చెట్టులా
నిత్యం కొత్త ఆశల్ని పెంచుకొంటూ
బ్రతుకుతున్న వాణ్ణి!

చండ గ్రీష్మం నిప్పులు చెరిగినా
శిశిరంలో తలలు బోడులైనా
హేమంతం ముంచుకొచ్చినా
వసంతంకోసం ఆశతో ఎదురుచూసే
చెట్టు నా ఆదర్శం.

ఎండకూ వానకూ గాలికీ
సకలవాయు శీతాతపాలకు
నిలవగలిగే చెట్టులా
బ్రతుకులోని సుఖదుఃఖాల్లో సైతం
నిగ్రహాన్ని కనబరుస్తాను

చెట్టులో పిల్లుబికే నిత్యచైతన్యం
ఫల పుష్పకిసలయాదులుగా వెలుగొందినట్టు
ఆశతో మనిషి బ్రతకాలి.

బ్రతుకులోని పరిపూర్ణతను సాధించాలి.
ఏ పరిస్థితుల్లోనూ
మనిషి చావకూడదు.
చేవజచ్చిన చెట్టు కాకూడదు.

చెట్టులోని పచ్చదనము
చైతన్యానికి సంకేతమైనట్టు
మనిషిలోని చావని ఆశోకటే
మునుముందుకు నడిపించేది
మనుగడ నిచ్చేది!



మరియొక తిమ్మన - మరియొక పారిజాతాపహరణ ప్రబంధము"

శ్రీ కపిలవాయి లింగమూర్తి

పారిజాతమును స్వర్గమునుండి మొదట ప్రబంధ భూమికి గొనివచ్చినవాడు నందితిమ్మనార్యుడు. పిమ్మట దానిని నారాయణతీర్థ విజయ రాఘవ నాయకులు యక్షగాన ప్రపంచమందును, రఘునాథనాయకుడు కావ్యక్షేత్రమందును, కృష్ణాధ్వరి శ్లేష ప్రపంచమందును, మాతృభూతకవి నాటక రంగమందును దానియంట్లు వేరువేరుగా నాటి ప్రోదిజేసిరి. అట్టివారిలో తిమ్మరాజొకడు. గద్యమున తననుగురించి యిట్లుల జెప్పుకొనినాడు.

'ఇది శ్రీ వేంకటేశ్వర కారుణ్యకటాక్షలబ్ధ, వేంకటాచల కవీంద్ర సంబోధిత, లక్షణవిలక్షణకవితా విఖ్యాత, కాశ్యపగోత్ర పవిత్ర, మల్లెలవంశ సంజాత, గోపాలామాత్య వేంకటకృష్ణమాత్యాత్మజాత శ్రీమదుమారి కందాళ సింగరాచార్య గురుసార్వభౌమ చరణారవింద, మకరందమత్తభృంగాయమాన, మానసోపేత విద్వజ్జన విధేయ, తిమ్మరాజ నామధేయ ప్రణీతంబైన పారిజాతాపహరణ యక్షగాన ప్రబంధంబు సంపూర్ణము.'

ఇది స్తంభగిరి నృసింహునిపై జెప్పబడిన యొక యక్షగాన ప్రబంధము. పేచుకాగితములపై వ్రాయబడిన ఈ ప్రతి నాకు మా తాతగారి గ్రంథసంచయమున లభించినది.

ఈ గ్రంథకర్త మల్లెలవంశీయుడు; కాశ్యపగోత్రుడు; వేంకటకృష్ణామాత్యుని పుత్రుడు, కందాళ సింగరాచార్యుల శిష్యుడు. లక్షణ విలక్షణ కవితా విఖ్యాతుడు. వేంకటాచల కవీంద్ర సంబోధితుడై యీ యక్షగానమును రచించెను.

గ్రంథమున ప్రతి పద్యమునందును, ప్రతి దరువునందును, "స్తంభగిరి" పేరుండి మూడు నాలుగు చోట్ల మాత్రము 'ఇందుర్తి' పేరుండుటచే కవి యిందుర్తి నివాసియై స్తంభగిరి నృసింహుని భక్తుడై యుండెనని యూహింప నవకాశమున్నది. గద్యయందు తండ్రిపేరుకడ మాత్ర మక్షరములు స్పష్టత లోపించియుండుటచే యిపట్ల క్రీగీటు నుంచితిని. ఇది గ్రంథమునుబట్టి మనకు దెలిసెడు విషయము.

ఇందలి కథ శ్రీకృష్ణుడు రుక్మిణి యింట నున్నప్పటినుండి మొదలుకొని సత్య యింటికి వచ్చుటతో ముగియుచున్నది.

ఈ కథకు మూలమగు హరివంశ భాగవతాదులందుగల ఇతివృత్తము మిక్కిలి చిన్నది. ఒకనాడు నారదుడు శ్రీ కృష్ణుని కడకేతెంచి అతనికొక పారిజాతమును కానుకగ నిచ్చెను. కృష్ణుడా పుష్పము రుక్మిణి కిచ్చెను. ఆ విషయము సత్య దూతీముఖమున విని యలుకవహింప, శ్రీకృష్ణుడది యెఱిగి యామె సదనమునకు వచ్చి కేవల పుష్పమాత్రమునకే నీకింత వంతయేందులకు; పారిజాతమునే నీ పెరటిచెట్టుగా జేయుదునని ప్రియురాలి నోదార్చి స్వర్గమునకువెళ్లి పారిజాత వృక్షమును గొనివచ్చెను.

తిమ్మనార్యు డింతమాత్రమైన మూలకథను గ్రహించి యందు ప్రబంధోచితవర్ణనలతో నారదుని

కలహప్రియత్వముపై, సత్యభామయొక్క స్త్రీ సహజమగు గర్వముపై, శ్రీకృష్ణుని దక్షిణనాయకత్వముపై తన ప్రతిభామూలమున చేసిన చికిలీపని సభాతో వభవిష్యతి.

సత్యభామపైగల దృష్టి, యిరువురు తిమ్మ వార్యుల దొకటేయైనా యక్షగాన కర్తయగు నీ తిమ్మరాజు కథ జెప్పుటయందు కావ్యకర్తతో భేదించినాడు. అతడు జెప్పినకథ యిటులున్నది.

'శ్రీకృష్ణుడు రుక్మిణీదేవి యింటనుండ నొకనా డతని యెడబాటోర్వజాలక సత్యభామ యొక దూతికను బిలిచి శ్రీకృష్ణుని తోడుకొని రమ్మనెను. అందులకాచేటి పనదనముగా నేడువారముల నగలడుగ సత్యభామయుం దొక్కొక్కవారపు నగ లేకారణమున యమ్ముల కీయరాదో దెల్పి యితరములగు వస్త్రాభరణము లిచ్చెదనని యొప్పించి, శ్రీకృష్ణునకు, రుక్మిణికి వేరువేరుగా జెప్పవలసిన విన్నపములు జెప్పి పంపెను.

ఆ దాసి రుక్మిణీ మందిరముజేరి శ్రీకృష్ణుని గని సత్యభామ విన్నపము వినిపింప, నతడు 'ఓసీ! తే నష్టమహిషులయెడ సమానముగా ప్రవర్తింపవలసిన వాడనుగదా! కనుక నెప్పుడు సత్యయింటనే యుండ తక్కినవారు న వ్యన్యధా భావింతురు. అంతియేగాక సత్య తన తండ్రిదగ్గరినుండి శమంతకము నేనే హరింపజేసితినని నన్ను నిందించుచున్నది. కనుక నీవు వెళ్లి నే నిపుడు రానని చెప్పుమ'ని పలికెను. అంత నా దాసి రుక్మిణి కడకరిగి శ్రీకృష్ణుని వైఖరి, సత్యభామ విన్నపము వినిపించెను. అదివిని రుక్మిణి 'ఇయ్యెడ నేను సమయముజూచి శ్రీకృష్ణునకు నచ్చజెప్పి పంపింతును, అంతవరకు నీ విచటనే యుండు'మని దాసిని నిలువరించెను.

అట సత్యభామ దాసిరాకవార్చుచు వలకాకను గ్రాగుచు లతాంతశయ్యపై మేనువాల్చి నారదుడు శ్రీకృష్ణునికడకువచ్చి పారిజాత మిచ్చినటుల, దానిని శ్రీకృష్ణుడు రుక్మిణి కిచ్చినటుల్, ఆ సందర్భమున నారదుడు తననుగురించి కటువుగా మాటాడినటుల కలగని, యులికి లేచి, మరియొక దాసిని బిలిచి స్వప్న వృత్తాంతముచెప్పి శ్రీకృష్ణునికడ కంపెను. ఆ దాసి రుక్మిణిమేడ కరిగి యటనున్న మొదటిచేటినిగని, 'ఓసి! నీవు వచ్చి యజమానురాలి కార్యము మరచి యిచటనే నిలచి రుక్మిణిదాసవైపోతివి. ద్రోహురాలా!' అని నిందించెను. అపుడా దాసి వడివడిగా సత్య గృహమున కేతెంచెను.

అటులవచ్చిన దాసినిగని సత్యయామె మొగము వాడియున్నందులకు, కురులు చెదరి యున్నందులకు శంకించి నాయకీమణుల చెంతనుండి నాయకులను బిలువనేగు దూతికలు గావించు సపత్న్యకృత్యములన్ని యెంచుచు దానిని దూషించెను. అందులకాచేటి తన యలంకారములు జెడుటకు వేరువేరు కారణములు జెప్పుకొని, పిమ్మట శ్రీకృష్ణుని కడకు నారదుడు వచ్చుట మొదలుకొని, ఉన్నవికొన్ని లేనివి కొన్ని కల్పించి చెప్పెను.

ఆ మాటలు వినిన సత్య ఉస్సురని పొగిలి అచటికి నారదుడువచ్చి, పారిజాతమిచ్చిన నిచ్చెగాక దానిని శ్రీకృష్ణుడు రుక్మిణికిచ్చిన నిచ్చెగాక, కాని ఆ ముని యట నా ముచ్చట యేల దేవలయునని, అతనిపై, ఆ మాటలు వినిన శ్రీకృష్ణునిపై మండిపడెను. ఆపైని విరహమగ్నయై మన్మధుని, అతని పరివారమగు శుకశారికాయిలలను, చంద్ర మలయానిలములను దూషించి తాపోపశాంతికై ప్రమదవనమున కరిగి విరహావశమున మూర్ఛిల్లెను. అంత మంజు ,నాటియను ఆమె అంతరంగికయగుచెలి, తోడివారిని సత్యను మందిరమునకు గొనివెళ్లి శిశిరోపచారములు జేయ నియమించి, తాను సత్య కంకణ మొకటి యానవాలుగాగొని శ్రీకృష్ణుని కడకు బయలుదేరెను.

అట రుక్మిణి యింటనున్న శ్రీకృష్ణుడు నాడు వెన్నెల బయట హంసతూలికాతల్పముపై, చెలులతోగూడి రుక్మిణీదేవి సేవించుచుండగా శయనించి యుండి, చంద్రబింబమునుగని సత్యభామ తలపునకు

రాగా విరహాతురులయ్యెను. చెలు లతని వైఖరి గని శశిరోపచారము లారంభించిరి.

శ్రీకృష్ణుడు లోలోన సత్యభామ యింటికేగ నందులకు పశ్చాత్తాపపడుచున్నంతలో కంకణముగొని మంజువాణి యేతెంచి సత్యభామ స్థితిని వినిపించెను. అంత శ్రీకృష్ణుడా కంకణమున గని చెలినిగన్నట్టు, లడిలి లేచి, మరల తొందరగవత్తునని రుక్మిణితో జెప్పి శలవుగొని, సత్యమందిరమునుజేరి, చిన్నపోయిన శాలలను, ప్రమదవనమును పరిశీలించుచు నామె శయనాగారమును జేరెను. అప్పటికి సత్యభామ మూర్ఛ దెలిసి, కోపవు పెల్లున తలుపు బిగించుకొని శ్రీకృష్ణుడెంత వేడినను తలుపుదీయక యెట్టకేల కెటులో దీసెను. అంత శ్రీకృష్ణుడామె ప్రక్కజేరి పెక్కు విధముల నోదార్చి శాంతింపజేయు మార్గముగానక నామె పాదములపై బడెను. అయినను సత్య శాంతింపక, అతని శిరమును తన పాదమున తొలగద్రోసి, నీకు పదారువేల కన్నెలు, అష్టభార్యలు, అందరికి మించి ఆ రుక్మిణియుండగా, నాతోనేమిపని పొమ్మని కఠినముగా దూషించెను. అతడు జేయునదిలేక మరల రుక్మిణీ గృహమునకు వెళ్లెను.

శ్రీకృష్ణుడు వెడలిన కొంతసేపటికి సత్యభామ శాంతించి, తన తప్పు తెలిసికొని, నరకాసుర 'సంహారమునాడు శ్రీకృష్ణుడు తన నెటుల వెంటగొని వెళ్లినది, ఎటుల చనవిచ్చినది దలచుకొని పశ్చాత్తాపపడి, స్వయముగా శ్రీకృష్ణుని క్షమాభిక్ష గోరదలచి రుక్మిణీ కృష్ణులకు వేరు వేరు కానుకలు బట్టించుకొని రుక్మిణీ సదనమునకువెళ్లి, శ్రీకృష్ణుని గని మ్రొక్కెను. అతడు దీవించలేక దీవించెను.

పిమ్మట సత్యభామ శ్రీకృష్ణుని తన గృహమునకు రమ్మని పరిపరి విధముల ప్రార్థించెనుగాని అతడామె వేడికోలంగీకరించలేదు. అంత సత్యయట నున్న సవతులను జూచి, 'వీరేదో మాయజేసి నా భర్తను నాకు గాకుండజేసిర'ని నిందించెను. అదివిని అంత వరకూరక జూచుచున్న రుక్మిణి సత్యతో, 'అతడు రావనుచుండగా నీ వేల యాతనికి నెదురుబడి వాదింతువు. ఇది పాడి యెట్లగునుగాద'ని పలికెను. అందులకు సత్య 'నీవు నాకు నీతులు జెప్పుటా'యని మండిపడెను. ఆపై సవతులిద్దరు కొంతసేపు పరివాదులాడుకొనిరి. అంతమున రుక్మిణియే వాదుచాలించి శ్రీకృష్ణునితో, 'మీకు ప్రియురాండ్రమైన మేమిద్దరము సమానమే గనుక, మీ రిపుడు సత్యభామ కోరిక మన్నించి యామె గృహమున కేగు'డని కోరెను.

అంత శ్రీకృష్ణుడు రుక్మిణి కోరికపై సత్య సదనమున కేతెంచి, నారదుని రావించుకొని 'నీవు పారిజాతమెటులదెచ్చితివని'యడుగ నాముని 'నేనింద్రుని గన స్వర్గమునకు వెడలగా, అపుడతడు నందనమున నుండి, అందు వికసించిన నీ పుష్పము నాకిడి 'కృష్ణార్పణము'ని పలికెను. అందువలన నేను దానిని దెచ్చి మీ కిచ్చితినని' చెప్పెను.

నారదుని మాటలు వినిన పిమ్మట శ్రీకృష్ణుడు గరుడుని రావించుకొని యెక్కి, స్వర్గమునకుబోయి పారిజాతమునుదెచ్చి, సత్యభామ వనమున నాటి, నాటి నుండి అష్టభార్యలతో సుఖముగా నుండెను.

నందితిమ్మనార్యుని వలె నీ కవికిని కథజెప్పుటయందు నేర్పున్నది. శైలి ప్రౌఢముగా నున్నది. శబ్దాలంకార ప్రియత్వమున్నది. ఇది యక్షగానమైనను ఇందు దరువులకన్న పద్యములే మిక్కిలిగా నున్నవి. యెడనెడ ద్విపదలుగూడ నున్నవి.

ఇందు విరహోత్కంఠితయైన సత్యభామ నోట మదనోపాలంభాదికార్యమంతయు ప్రబంధము వలె పద్యములచేతనే నడచినది. శ్రీకృష్ణుడు సత్యభామ శయనాగారము జేరినపుడు కవి వారి సంవాదమున రుద్రకవి ననుకరించి యుష్మకములను, శ్రీకృష్ణుడు సత్యభామను దీవించునపుడు 'శ్రీరస్తు భవదంఘ్రి చికురంబులకు' అను రీతిని శ్రీనాథు ననుకరించి సీసములను ప్రవేశపెట్టి క్రొత్తదనము ప్రదర్శించినాడు.

సత్య కలహమంతయును చెప్పలేదుగాని యున్న

గింతల సందర్భమున నామె పెంపుడు ప్రాణులందు శిలాతురంగమొకటి జేర్చినాడు.

ఇందు ప్రధానవిషయము పారిజాతాపహరణ మైనను, శ్రీకృష్ణుడు రుక్మిణియింటినుండి, సత్యభామ సౌధమున కరుదెంచువరకే కథను సాగించి, తదుపరి విషయమంతయు నొక్కద్విపదలో దేల్చివేయుట జూడ నీ కవిదృష్ట్యయం దీ కథలో పారిజాతాపహరణమునకన్న సత్యా గర్వభంగమే ప్రధానమేమోయని తోచును.

ఈ కథను మొదట రచించినవాడు నంది తిమ్మనార్యుడు కనుక తరువాతివారిపై ప్రత్యక్షముగనో పరోక్షముగనో అతని ప్రభావము పడకతప్పదు. కనుక జూడుడు.

శ్రీకృష్ణుడు సత్యభామ ననునయించు సందర్భము —

క॥ అనినెచ్చెలి విపటిల్కిన
ఘనకోపము నొంది సత్యకాంతామణి తా
మనమున బెనగొను కినుకను
పనిగొని యువ్మాని దూరి పలుకగసాగెన్.

చ॥ అతుల మహాచరిత్రయని,
అచ్యుతు పెద్దగ నెంచి దేవతా
ప్రసవ మమూల్యమౌనయది,
పట్టుగ నిచ్చిన నిచ్చెగాక, పా
ల్పొసగ నతండు కూర్మిగల
యింతికిగూర్చిన గూర్చెగాక, వ
ద్దిన కలహప్రియుండకట,
తెల్లముగా నమదల్ప నేటికిన్.

ఉ॥ ఏమి ! రణాశనుండనట,
నిట్టని బల్కెనా ! అట్లు బల్కెగా,
హా మునిమాటలే వినవా !
ఆ హరి యేమి వచించె ! రుక్మిణీ
భామిని తాను తేమనచు
పల్కె నొకటికి నీవు తావెదే !
నీ మొగమాటముల్ వదలి,
నిక్కముదెల్పవె నీరజేక్షణా !

ఈ పద్యములుగని ఈ తిమ్మరాజంతట నంది తిమ్మనార్యునే యనుకరించెనని భావించ నవసర ముండదు. చూడుడు.

సీ॥ మనుడాలు గనుడాలు, మొనతీరుదనరారు
పనజాలు ననవాలు గొనగనేమి !
గనిమించు దనియించు, గదజూచి యదిజూచి,
పడిదూసి పడ దాసినైనేమి !
ఈవేళ నీవేల నిగురాకు తగుబాకు
పదనుంచు నదవంచు, బరువనేమి !
దులకెంపు బలుకెంపుతో దాపుదాపున
ననుదూరగమ దూర ననునేమి !

గీ॥ యెన్నికొలదుల వెలదుల నెన్నిజాడ
వగలు తగులంగ పొగులంగ, నెగలనీక,
మాట తెగనాడ పగవాడ, నొటనీకు,
పితిగాడుగ మైదూగ, మైతిమదన !

చ॥ భళిర ! సమస్తలోకపరి
పాలకు డాహరి యంతవానికిన్
పోలతులనేమ దుర్మతివి,
బుట్టితి వారయ సబ్ధిలో హాలా
హాల ముదయించినట్లు దగ,
వంతయు దానిని మ్రింగియున్న ని
వ్వులుక దహించె శూలధరు,
డట్లను దౌష్ట్యము మానవంగజా !

సీ॥ కందర్ప నీ యూపు గాలి వీర్యైపోను,
నీ శరంబులుబోయి నీటగలియు,
వలగి నీ బలమెల్ల చెట్లపాలైపోను
వెలుగంద నీవిల్లు విరిగిపోను
పోలయు నీ టెక్కెంబు బురదలోబడిపోను
విరహాంద నీవారి యొగసిపోను,

తొలగక నీతేరు దుమ్ముపాలై పోవు
కొలుచు నీ గుర్రంబు గూటబడను.

గీ॥ ఇంత రాపేల చేసేవు పంతగించి
వంతనొందింప నీకింత సంతసంబె
అంతకుని రీతి వింతెంత పొంతజేసి
చింత నొందింప నీకును జెల్లునటర!

ఇట్టి స్వతంత్రపద్యము లిందు పెక్కుగలవు. నేను జూచినంతవరకు కవుల చరిత్రయం దీ కవిని గురించి లేదు. యక్షగానచరిత్రమాత్రము నాకు జిక్కలేదు. అందువలన నీ వ్యాసము వ్రాసితిని.

నాకు లభించిన నీ యక్షగానప్రతిలో మొదటి రెండు పుటలుమాత్రము భ్రష్టమైనవి. కనుక పరిశోధకు లెవరేని దీని సమగ్రప్రతి సంపాదించి ప్రకటించిన యక్షగాన సరస్వతికి మరియొక యమూల్య భూషణము చేకూరగలదనుటలో సందేహము లేదు.



మనిషి

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

ఘట్కేసర్లో సెలవుపుచ్చుకుని కలకత్తా మెయిల్లో కాలుపెట్టిన దగ్గరనించీ, బాజీ నెప్పుడు చూస్తునా, ఎప్పుడు చూస్తునా అని చక్రవర్తి హృదయం తటతటలాడిపోతోంది. ఎక్కడ కలకత్తా, ఎక్కడ కోనసీమ! ఎంతదూరముందో అతనికే తెలియదు. బండి మెయిలయినా కొంచెం తాపీగా నడుస్తున్నట్టనిపించింది. అక్కడికి చేరుకునేసరికి తెల్లవారక మానదు. టైముచూస్తే రాత్రి తొమ్మిదిన్నర కాలేదింకా. ఆ కొండలూ, ఆ కాలవలూ, చెట్లూ, చేమలూ అన్నిటినీ విమ్ముకుంటూ వెళ్ళిపోతోంది ట్రెయిను. అతని కళ్ళముందు ప్రకృతి తన సౌందర్యాన్నంతా ఒలకబోసుకుంటూన్నట్టనిపించింది: మరొకప్పుడైతే, ఏ ఇంజను చెడిపోయి రైలు ఆకస్మికంగా మధ్యలో ఆగిపోతే బాగుండు ననుకునేవాడు; కాని, ఇప్పుడు బాజీని చూడాలి.

బాజీ కిప్పుడు కొంచెం హెచ్చుతగ్గుగా మూడేళ్ళు నిండవచ్చు. చిన్న పెదిమలూ, ముద్దులూరించే పాల బుగ్గలూ—అంతా తల్లి పోలికే. తన నిప్పుడు ఆనవాలు పట్టగలడో లేదో.

చక్రవర్తి జమీందారు బిడ్డ. పోతుగడ్డ జమీందారు. కాలం చెయ్యగానే, జమీవారసత్వం నిష్కారణంగా దావాలోపడింది. చక్రవర్తి రాణీ రుక్మిణీదేవికి కలిగిన బిడ్డ కాదనీ...ఆమె నీళ్ళుపోసుకున్నట్టు నటించిందనీ...నెలలు నిండినట్టు లెఖ్ఖకు రాగానే ఒక దాసీపుత్రుణ్ణి సేకరించి పురిటిమంచం మీదికి తెచ్చుకున్నదనీ...ప్రత్యర్థులు అభియోగం తెచ్చారు.

అన్నాళ్ళూ జమీందారు ఉప్పుతిని కండలు పెంచుకున్న ఉద్యోగస్థులే అటునేవునించి రకరకాల గడ్డితిని...కూటసాక్ష్యాలిచ్చి...ఆ అసత్యాన్ని సత్యమని రుజువుచేశారు. ఆ కూటంలో తనచేత మహోపకారాలు పొందివున్న విశ్వాసఘాతకుల్నీ...దివాణంలో తనకి అతి సన్నిహితంగా మసులుతూ వెనకాల గోతులుతీసిన గుంటనక్కల్నీ...ఎంతోమందిని గుర్తించాడు చక్రవర్తి.

జమీ పోయినందుకు చక్రవర్తి అంతగా చలించలేదు. అతనికి ఉదాత్తమయిన కళాహృదయముంది. చక్రవర్తి ఆంధ్రదేశంలో సుప్రసిద్ధ చిత్రకారుడు. చిత్రలేఖనంలో అతనిది మెలితిరిగినచెయ్యి. ఆ మధ్య అలహాబాదులో జరిగిన అఖిలభారత చిత్రకళా ప్రదర్శనంలో అతని 'కారుమబ్బులు' అన్న చిత్రం చూచినవాళ్ళు హాలులో కించిత్తు చలి కూడా వేసిందని అతిశయోక్తిగా చెప్పుకున్నారు.

కాని, జమీపోయిన సంఘటన అతని మనస్తత్వాన్నే వక్రంగా మెలిత్రిప్పింది. మనిషిమీద నమ్మకం పోయిందతనికి. వాస్తవానికి చక్రవర్తికి ప్రసక్తమయిన మానవప్రపంచం బహుసంకుచితమయినది. ఆ చిన్నఆవరణలో అతనికి తారసిల్లిన వ్యక్తులందరూ కుత్సితులూ, దుర్జనులూ అయినారు. వాళ్ళని కొలబద్దగా చేసుకుని అసలు మానవతనే శంకించే దుర్గతికి వచ్చాడు చక్రవర్తి. దానాదీనా, మనిషిఅన్నవాణ్ణి అనుమానించకుండా వుండలేక పోయాడు చక్రవర్తి. వాళ్ళ చూపులలో, మాటలలో కటుత్వమూ, కశ్మలమూ ఊహించుకుని వైదొలగి పోతూవచ్చాడు.

అసలు నిష్కార్స్యయిన ప్రజల్ని...రక్త మాంసాలతోవున్న ప్రజల్ని...అమాయికత్వంలో మూర్తిపడే

పోయివున్న ప్రజల్ని...చెమటోడ్చి, నెత్తురోడ్చి, దివాణంలో నడిచే కుట్రలకీ కుహకాలకీ దూరంగా... తన దివాణానికి అంగరంగవైభవాలు సమకూర్చుతున్న ప్రజల్ని...చక్రవర్తి ఎన్నడూ చూడనేలేదు. ప్రపంచంలో దరిద్ర మెంతవున్నదో, ఎంతమంది బ్రతుకే ఒక శాపంగా......ఒక శిక్షగా అనుభవిస్తున్నారో, అతని వూహకందని వృత్తాంతం!

రావాలో నెగ్గినా ప్రత్యర్థు లతన్ని వదలలేదు. శత్రుశేషం ఉండగూడదన్న రాజనీతి ననుసరించి... ఆ దుర్మార్గులు...యువరాణీ ఉమాదేవి చుట్టూ చేరి... చక్రవర్తిని వదిలిపెట్టి పొమ్మని హితబోధ చేశారు. అతని ఆభిజాత్యం నీచమయిందిలని వర్ణించారు. 'నీవు ఉత్తమకులసంజాతవు'అని అగ్గించారు. ఆ దుర్బోధ లేసీ ఆమె చెవికెక్కలేదు. 'కడజాతివాడుకానీ, చక్రవర్తి నా భర్త—నా ఆరాధ్య దైవం'అని నిశ్చలంగా సమాధానమిచ్చి వాళ్ల నోళ్ళు కట్టించింది యువరాణి. ఆ తరవాతనయినా ప్రత్యర్థులు తమ పన్నాగాలు విరమించుకోలేదు. ఉమాదేవిని ఒక కళంకినిగా...ఒక పతితగా...చిత్రించి లేనిపోని అబాండాలు ఆమె నెత్తిన వేసి, చక్రవర్తి మనస్సు విరుస్తామని శతధా ప్రయత్నించారు.

ఉమాదేవి దుఃఖానికి మేరలేకపోయింది. ఎప్పుడు చూచినా శోకదేవతలా అగుపిస్తూ వచ్చిందామె. 'నేసి లోకులకే ... పలుగాకులకే...జడవను... నిన్ను గూర్చి చెలరేగుతున్న విషప్రచారాన్ని నేను నమ్మను. నీ హృదయం నాకు తెలుసు' అని భరోసా ఇస్తూనే వున్నాడు చక్రవర్తి.

కాని ఉమాదేవికి విరక్తి కల్గింది. ప్రత్యర్థుల కళ్ళు చల్లగా...ఒకానొక శుభోదయాన ... ఆమె ఆత్మహత్య చేసుకున్నది. ఇంత కసి చక్రవర్తిమీద పెరిగిపోవటానికి కారణం ... చిత్రమనిపించవచ్చును. అది యిదీ...అతని మంచితనం, అతని నిర్లిప్తత... అశక్తత...ఎప్పుడూ బొమ్మలుగీరికే వ్యాసంగంలో మునిగివుండడంలో పైకి కనిపించే అతని అలసత్వం... ఒకళ్ళ దురాగతాలన్నీ సహించి వూరుకునే క్షమాగుణం...తనకి నిర్హేతుకంగా అపకారం తలపెట్టిన దుర్మార్గుల్ని రాచిరంపాన పెట్టాలన్న ప్రతీకారవాంఛ యత్కించిత్తూ...లేకపోవడం...ఒక్కమాటలో తనని తాను సంరక్షించుకోలేని దౌర్బల్యం.

ఒక్కొక్కసారి చేతగానితనం ఘనీభవించిన చోట...ఆ అలుసు చూచుకొని దుర్మార్గులు పెచ్చరిల్లిపోతారు. వాళ్ల దుర్మార్గానికి......ఆ మధ్య స్తబ్దుగా...అచంచలంగా పడివున్న నిరసనపదార్థమే కారణమూ అనిపిస్తుందికూడా. అందుచేత క్షమాగుణం సర్వేసర్వత్రా సుగుణమేఅని చెప్పుకుందుకులేదు. ఒక సందర్భంలో అది దుర్జనత్వానికి ప్రేరణగా పరిణమిస్తుంది. అప్పుడు దానిని దుర్గుణాల జాబితాలో చేర్చవలసివస్తుంది.

చక్రవర్తి ప్రతిజ్ఞ చేసుకున్నాడా అనిపిస్తుంది.. నా చిత్రాలలోనుండి మనిషి వురుగు కనిపించగూడదు అనుకున్నాడు. అతని మనస్తత్వాని కనుగుణంగానే అతని చిత్రాలలో... కొండా, కోనా, ...చెట్టూ చేమా... అరణ్యమూ...ఆకాశమూ... ఇవే సాక్షాత్కరిస్తాయి. అన్నీ ప్రకృతి చిత్రాలే. ప్రకృతిలోని ప్రశాంతతా... గాంభీర్యమూ...సౌందర్యమూ సౌకుమార్యమూ అన్నీ కోణాలలోనించి అతని కుంచె అందిపుచ్చుకున్నది. ఆ చిత్రాలలో మానవుడన్నవాడుమాత్రం కనిపించడు.

రెండో పెళ్లి అతనికి కిట్టదు. అతని మనావికే వ్యతిరేకం.

తల్లి పోయినప్పుడు బాజీ రెండునెలల పసిగుడ్డు. అప్పటినించీ రాజోలుదగ్గర ఒక చిన్న పల్లెటూరిలో అమ్మమ్మగారి ఇంటివద్ద పెరుగుతున్నాడు, వాళ్ళూ కలవాళ్లేను.

చక్రవర్తి ఘటర్జీ ప్రాణమిత్రులు. భార్య పోగానే చక్రవర్తి మనస్సు వికలమయిందని ఘటర్జీ గమనించాడు. తక్షణం కలకత్తాకి రమ్మనమన్నీ అక్కణ్ణించి యూరప్ ప్రయాణం కట్టాడు. విదేశీ చిత్రకళ కొంత స్టడీచేసివద్దామని వంకపెట్టి అతణ్ణి మరిపించడానికని జపాన్, ఫ్రాన్స్ మొదలైన దేశాలు

కొన్నాటినిమాత్రం పర్యటన చేయించి స్వదేశానికి మళ్ళించాడు.

ఎక్కడ చూచినా చిత్రకళలో మానవుడికీ, మానవతకీ పట్టంకట్టడం జరుగుతోంది. వీళ్లందరికీ ఈ మనిషి పురుగులో పేరుకున్న కుళ్ళు గ్రాహ్యం కాలేదా? పశుపక్ష్యాదులలోనూ, మనం 'జడజగత్తు' అని ఈసడించుకునే ఈ స్థావరజగత్తులోనూ, మచ్చుకైనా దొరకనిదీ...కేవలం మృగ్యమైవున్నదీ అయిన ఒకానొక పదార్థం పనిగట్టుకొని సృష్టించుకున్నాడు మానవుడు. అదే పాపం! ఈ జడప్రకృతి మానవతకన్న వేయిరెట్లు ఆరాధ్యమయినదికాదా? అట్లా సాగింది అతని ఆలోచనాస్రవంతి. దేశం తిరిగినా, దేశాంతరాలు పర్యటించినా, అతని చిత్రాలలో మానవాంశ చోటు చేసుకోలేకపోయింది.

రాజోలులో పడవదిగి, పొలాల గట్లమ్మట సూట్‌కేస్ పుచ్చుకుని బయల్దేరాడు చక్రవర్తి. పల్లెపిల్లగాలికి పైరంతా కెరటాలు కెరటాలుగా బంగారుతూగుటుయ్యాల లూగుతోంది. కంకులు గలగలమని వొరిగిపోతూ అల్లరిపిల్లకాయల గుంపులా విడిసిపడిపోతున్నాయి. ఆ వైపున గుబురుగావున్న తోటల్లోంచి కొబ్బరిచెట్లు సంధ్యారాగంలో తడిసిన చేతులెత్తి రారమ్మని పిలుస్తున్నాయి. దూరాన్ని పనసచెట్ల నీడలలోనించి పెంకుటిల్లొకటి తొంగిచూస్తోంది. లోపలికివెళ్లాడు చక్రవర్తి. ఇంటి ముందు సపోటామొక్కకి కట్టేవుంచారొక దూడ పెయ్యని. దాన్ని చల్‌చల్‌మంటూ ఒక కొబ్బరాకుతో అదలిస్తున్నాడు తప్పటడుగులువేస్తున్న పసిపిల్లవాడు. ఆ లేతబుగ్గలూ, నొక్కులవెంట్రుకలూ— గుర్తుపట్టటానికి ఒక్కగడియపట్టలేదు చక్రవర్తికి. తక్షణంవెళ్లి చేతుల్లోకి తీసుకుని గట్టిగా అదుముకున్నాడు. కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. ఈ ప్రపంచంలో తనకి మిగిలివున్న సుఖశాంతులన్నీ వొక్కపారిగా వొల్చుకుని గుప్పిట్లోకి తీసుకున్నట్టనిపించింది చక్రవర్తికి.

విశాఖపట్నంలో సముద్రపు వొడ్డున సొంత మేడలో మకాం పెట్టాడు చక్రవర్తి. రాగానే బజారుకి తీసికెళ్లి బాజీకి కీచుకీచు పిట్టలూ, కీయిచ్చి వదిలేస్తే పడిచే మోటారు బళ్ళూ, గౌన్లువేసిన సెల్లులాయిడ్ బొమ్మలూ, వో రెండు డజన్లుకొని ఇంటికి చేర్చాడు. బాజీ కిదంతా బంగారుగా వుంది. ఆ రంగు రంగుల పటాలూ, ఎలక్ట్రిక్ దీపాలూ, పువ్వుల గుడ్డతెరలూ మధ్యలో జింకపిల్లలాగ అలాగే నిలబడి తేరిచూశాడు గంటల తరబడి. ఈ గలభాలో, జీడిమామిడి పళ్ల వాసనా, తువ్వాయి చిందులూ, అమ్మమ్మ లాలనా అన్నీ మర్చిపోయాడు. ఆటబొమ్మలలో పగలగొట్టటానికి వీలుగావుండే వేమయినా వున్నాయేమోనని ఒకసారి అన్నిటినీ గచ్చుమీదకొట్టి చూచాడు. కొన్ని పగిలినై. తరవాత అందినంతవరకూ, గోడలకున్న పటాలు వేళ్లతో పట్టుకుని లాగిచూచాడు. కొన్ని చినిగినై. ఏమీ తోచక, కుర్చీ, స్తంభాలూ, అన్నీ వొకసారి వొదులుగా వున్నాయో లేదో అని వూపి చూచాడు. ఆఖరికి ఎత్తుకునే పిల్లని మెల్లిగా మరిపించి రెండు మూడు అద్దాలూ, ఒక లాంతరు చిమ్నీ పగలగొట్టి బొమ్మల పుస్తకమొకటి కసిదీరా అయిదారు పేజీలు చింపిన తరువాత కొంచెం శాంతించాడు.

చక్రవర్తి యధాప్రకారం చిత్రలేఖనం సాగించాడు. మనిషి వాసనంటే కిట్టదు. సాధారణంగా ఎవ్వరితోనూ ఏ ప్రమేయమూ పెట్టుకోడు. చిత్రాలలో ఎప్పటిలా 'నీరెండనీ' 'వాన వెలిసిన మబ్బులనీ', 'కాలవ వంపునీ' రమణీయంగా కేన్వాసుమీద చిత్రిస్తున్నాడు. సాయంత్రం అందరూ బీచికి వెడుతుంటే, అతను టవునుకి నాలుగైదు మైళ్లదూరం నడిచి పంటకాలవ మలుపులోనూ, కొండల ప్రక్కని, చెరుకు మళ్ళ జేబులోనూ నడుస్తూ వచ్చాడు........

మారుతున్న ఈ ప్రపంచంలో మారని చక్రవర్తికి ముఖ్యంగా రాజకీయాలంటే తలనెప్పి. అప్పుడు గాంధీ మహాత్ముని హరిజనోద్యమం మాంచి తీవ్రంగావున్నరోజులు. గాంధీటోపీ పెట్టుకుని

టకాయన వొచ్చిచెప్పేడు. హరిజనోద్ధరణకి పూను కుంటేనేగాని హిందూజాతికి స్వరాజ్యసిద్ధి—లేదనీ, ఇన్నాళ్ళూ వాళ్ళని అధోగతిపాలు చేసినందుకు మనం ప్రాయశ్చిత్తం చేసుకోవాలనీ, ఏమేమో ఏకరువు పెట్టాడు. ఏమిటో అగమ్యగోచరంగా వున్నది చక్రవర్తికి. అర్థంచేసుకునేందుకు ప్రయత్నించలేదు కూడా. ఏతావాతా ఆయన చెప్పొచ్చిందేమిటంటే, 'ప్రతిగృహస్థూ వొక హరిజనబాలుడికి ఆశ్రయ మిచ్చి వాణ్ణి అభివృద్ధికి తీసుకురావాలి' అన్నాడు. ఇది మహాత్ముని ఆదేశమని తేల్చాడు. మనం నలుగు రమూ నడుం కడితేనేగాని సంఘం బాగుపడదన్నాడు. చక్రవర్తి తల వూపాడు. ఇప్పటికే, వంటకొక మనిషీ, బాజీ నెత్తుకునేందుకొకపిల్లా, స్టూడియోలో కొక కుర్రాడూ, వర్ధంటున్నా ఒక చిన్నిసంసారం వలపన్నిం దతనివాటప్పా. కాని, వొచ్చినాయన పేరున్న పెద్దమనిషి. మొహమాటానికి సరేనని వొప్పు కున్నాడు.

ప్రొద్దుపొడవగానే వొచ్చిపడుతున్నా డో హ కుర్రాడు.

'నీ పేరేమిట్రా?'

'గోవిందు, బాబయ్యా'

చూశాడు...చిరిగిన పెడ్డీ, అతుకుల చొక్కా, వింపిరిజాట్టూ —

'అసహ్యంగా వున్నావు ఛో' అన్నాడు.

గోవిందు తల్లి కొక్కడే కొడుకు. రెక్కాడి తేనేగాని డొక్కాడని సంసారం. కళ్ళైనా కనపడని వృద్ధాప్యంతో కోతలకనీ, ఊడుపులకనీ వెళ్ళలేక పోతుంది. ఇప్పుడే కొంచెం చేతికందొచ్చాడు గోవిందు. వాడేమైనా నాలుగురాళ్ళు తెస్తేకద్దు, లేకపోతే పస్తు. ఈ గర్భదరిద్రంలో శుభ్రమైన బట్టలూ, నాజూకయిన మొహమూ ఎక్కణ్ణించి వస్తాయి వాడికి? కొళాయిదగ్గర బట్టలు పులుము కుని, కొంచెం తెలుపుజేసుకుని, సాయంత్రం మళ్ళీ వొచ్చావచ్చాడు గోవిందు. పొద్దుట్నా మర్నాప్పొద్దూ హరిజనపాఠశాలకి వెళ్ళివస్తున్నాడు. మూడు పూటలా చక్రవర్తి ఇంటో భోజనం చేస్తున్నాడు. పాఠాలు చదువుకుంటూ, పగలు పిల్లకి సాయంగావుంటూ, రాత్రి పిల్లణ్ణి కనిపెట్టుకొని వుంటున్నాడు. ఎప్పు డైనా వారానికొకసారిమాత్రం తల్లిని చూడడానికి మాలపల్లివెళ్ళి వొచ్చేస్తున్నాడు. పైఖర్చుకని నెలకి నాలుగురూపాయ లిస్తున్నాడు చక్రవర్తి.

సాధారణంగా స్టూడియోలో వున్నప్పుడు చక్రవర్తి దీర్ఘాలోచనలో మునిగివుంటాడు. చూపులు, కనిపించని ఏ సౌందర్యాన్నో వెతుక్కుంటూవుంటాయి. ఆ సమయంలో ఎవరూ స్టూడియోలో కాలుపెట్ట టానికి సాహసించరు. ఆ యింటో బాజీకెంత స్వాతంత్ర్యమున్నా స్టూడియోదరిమేనా రావటానికిగాని, ఒ చాయల అల్లరి చేయటానికిగాని జంకుతాడు. అప్పు డప్పుడు మాత్రం వెనకాల స్టూడియో గుమ్మానికి వేళ్ళాడుతున్న గుడ్డతెర వొత్తిగించి తొంగిచూస్తాడు బాజీ. అప్పుడు చేతిలోవున్న కుంచె స్టాండుమీద వుంచి, ముక్కుమీద వేలుపెట్టుకుని 'తప్పు' అంటాడు చక్రవర్తి. తుర్రుమని పావురాయిలా పరాయనం చిత్తగిస్తాడు బాజీ. క్రమక్రమంగా స్టూడి యోలో వున్నప్పుడు, బాజీ తొంగిచూస్తున్నా డేమోనని ఎదురు చూడటం మలవాటయి పోయింది చక్రవర్తికి. బాజీ తొంగిచూచే వరకూ, అతని ఆలోచన ముందుకి సాగినా వెనక చూపుతోనే నడవడం ప్రారంభించింది. పగలెంత శ్రమించినా, గతచరిత్ర ఎంత కలత పెట్టినా, రాత్రి నిద్రపోయేముందు, స్టూడియో మూసి, దోమతెరలో పడుకున్న బాజీ కళ్ళు ఒక్కసారి ముద్దుపెట్టుకుంటే, అలిసిపోయిన అతని హృదయానికి ఆరోగ్యస్నానమైనట్టుండేది.

గోవిందు రాగానే బాజీ నెత్తుకునే పిల్లని తీసేశాడు చక్రవర్తి. ఇంటి పని చెయ్యటానికని వాణ్ణి వుద్దేశించకపోయినా, దయాధర్మభిక్షకింద వాడికి సాదరుకింద నెలకి నాలుగు రూపాయలిచ్చి, అప్పనంగా చదువు సంధ్యలు చెప్పించి మువ్పొద్దులా తిండిపెట్టి మేపడమంటే అతనికి మనస్కరించ

లేదు. ఎప్పుడు చూచినా చదువుకుంటూ వుండే వాడు గోవిందు. చిమచిమలాడేది చక్రవర్తికి లోపల. వాడు చదువుకుంటూ వున్నప్పుడల్లా, బజారు పనులూ, బీరువుమీద దుమ్ము ఎక్కువగా వున్న సంగతీ, కిటికీల గుడ్డతెరలు దింపవలసిన అవసరమూ, బలీయంగా కనిపిస్తూ వుండేవి చక్రవర్తికి. పుస్తకంలో ఆనవాలు పెట్టుకుని లేచివచ్చే లోపుగానే కేకలేసేవాడు.

కోపాన్ని చూపించడానికి వీలులేని వాళ్ళకి దానిని చిరాకుకింద మార్చుకోవలసిన అవసర మొచ్చి పడుతుంది. చదువూ గిదువూ కట్టిపెట్టమని చెపితే సరిపోను, కాని, వాణ్ణి ఇక్కడ వుంచిందే అందుకామెను. పోనీ ఎందుకొచ్చిన బెడద, నిర్మొహమాటంగా వాణ్ణి వెళ్ళగొడదామా అంటే పరువూ ప్రతిష్ఠా పోతాయి. మొన్న వొచ్చిన పెద్దమనిషీ దేశభక్తులలిస్టులో తన పేరుండటం, ఇవన్నీ జ్ఞాపకానికొచ్చాయి. అందుచేత అతని మనస్సు అతనికి తెలీకుండానే, చిరాకు పడవలసిన కారణాలకీ, కసురుకోవలసిన ఘట్టాలకీ వెతుక్కుంటోంది.

గోవిందుకీ బాజీకీ ఆటలాడుకునే వయస్సయిన మూలాన్నో, మూడోవాడి ప్రసక్తిలేకనో, ఒకళ్ళ అవసరం వొకళ్ళకి బాగా అర్థమయివుంటుంది. ఆసరాకి దగ్గరగా మానేదీ దొరకక ఒకదాని నొకటి పెనవేసుకునే పూలతీగల్లాగే ఆ రెండు లేతహృదయాలూ మెలివేసుకున్నాయి. క్రమేణా వొకరిని విడిచి వొకరు ఉండలేనంత మమకారం, వాళ్ళిద్దరి మధ్యా గాఢంగా అల్లుకుంది. పూవవయస్సులో ఆత్మీయతకి బీజమంటూ పడడం తరువాయి, ఇట్టే నాటుకుని మొలకెత్తి మారాకు వేస్తుంది. చక్రవర్తి ఇదంతా గమనిస్తూనేవున్నాడు. గోవిందు కడజాతివాడనే మీమాంస చక్రవర్తి కెప్పుడూ అంతర్గతంగా వుండనేవుంది. దానికితోడు బంగారుకణికలా అన్నట్టు మిసమిసలు చిమ్మే బాజీవేళ్ళు మబ్బులో మెరుపుల్లా గోవిందు నల్లనిబుజాలమీదా, అంతకంటే నల్లని ఆ జుంజారు వెంట్రుకలలోనూ, జిలిబిలిగా అగుపించినప్పుడల్లా, అతనిలో ఇంకా చావకుండా మిగిలివున్న జమీందారీ నెత్తురు గిలగిలకొట్టుకోవడం ప్రారంభించింది. వినే సంగీతంలో అపస్వర మొచ్చిందని తెలియకపోయినా సున్నితమైన చెవులకి కటువుగా వినిపించక మానదు. అలాగే, ఈ కలయికలోవున్న వైపరీత్యం హేతువాదానికి నిలబడకపోయినా, అతని మనస్సుకిమాత్రం అది అసందర్భంగా, అసంగతంగా వెగటు పుట్టించింది. ఇది తుచ్ఛమైన స్వాభిమానమనీ, దాన్ని పరిహరించుకోవాలనీ, గట్టిప్రయత్నమే చేశాడు. కాని, సంకుచితమైన దురాలోచనలు లోలోపల కుట్రచేస్తూనే వున్నాయి.

ఒకనాడు గోవిందు హాలులో కిటికీదగ్గర చదువుకుంటున్నాడు. బయట ఆ దారినే సినిమాపోస్టర్ల బండొకటి వెడుతోంది. బాజాలు వినిపిస్తున్నాయి. చూడటానికి దగ్గరతోవ యేదాఅని ఆలోచించాడు బాజీ. కిటికీకి దగ్గరగానే కూచున్నాడు గోవిందు. మరో సాధనం దొరకలేదు. ఆలోచనా తదనుగుణమైన చర్యా, రెండూ వొక్కసారే, చెట్టాపట్టాలు వేసుకుని సాగుతాయి పసితనంలో. వీలు చూచుకుని, గోవిందు బుజాలమీదకెక్కి, అక్కణ్ణించి సుళువుగా కిటికీ వూచలందుకున్నాడు బాజీ. కాని, బాజాలు చూస్తున్న సంబరంలో, కాలెక్కడ ఆనిందీ గమనించలేదు. పైగా చప్పట్లు కొడుతున్నాడు. కొంచెముంటే గభీమని క్రిందపడి కాళ్ళు విరుచుకునేవాడే. అప్పుడే ఏదో పనుండి హాలులోకివస్తూ, చక్రవర్తి హఠాత్తుగా చూచిపట్టుకుని దింపాడు. క్షణమాగి చురచురమని చూశాడు గోవిందువంకా, పుస్తకాల వంకా......కిక్కురుమనకుండా పుస్తకమూశాడు గోవిందు.

ఆక్కడికీ ఎప్పుడైనా చక్రవర్తి కళ్ళబడితే, పుస్తకం రహస్యంగా మూస్తూనే వున్నాడు వాడు. కాగా, ఈ మధ్య పుస్తకాలు తెరవాలిసిన అవసరమూ అంతగా కనిపించటం లేదు గోవిందుకి. చదువుకొంటూవుంటే, ఆదనీయిదనీ, ఎడతెరిపి లేకుండా పని తగుల్తోంది. ఇకపోతే ఖర్మంచాలక ఎప్పుడైనా

బుక్కు తెరిచాడో, బాజీ ఏ ముగ్గు బుట్టవొలక బొయ్యటమో, ఏ రంగు పులుముకోవటమో, ఏ బియ్యము విరజిమ్మటంవరకో వెళ్ళి అధమపక్షం ఏ తలుపు సందున్నైనా వేళ్ళుంచి కెవ్వుమంటాడు, తప్పదు. అంతవరకూ వొచ్చిందో, ఒక తట్ట వరస చివాట్లు తలవాచేటట్లు తగుల్తాయి.

చక్రవర్తి బాజీనెప్పుడూ ఒక సముద్రపు వొడ్డుకిగాని, ఒక వూరేగింపుకిగాని, ఒక వుత్సవానికిగాని తీసికువెళ్ళినపాపానపోలేదు. స్టూడియోలో కుర్రాడు స్టూడియోలోనే మణిగిపోతాడు. వంట మనిషి మెస్‌లోనే మగ్గిపోతాడు. అందుచేత, బాజీకి హాలులోవున్న వస్తువుల్తోనే పరిచయం. స్టుడియో పైవున్న పువ్వులగుడ్డతెర ఎప్పుడూ పక్కున నవ్వుతూ వుంటుంది. గోడలకున్న పటాలు మాట్లాడటానికి గొంతు సవరించుకుంటున్నట్టు, సముద్రపుగాలి కొన్నిటయినా కాస్త కదిలేవి. ఎటొచ్చీ, తను పలకరిస్తే పలికీ, నవ్విస్తే నవ్వీ, జడిపిస్తే జడుసుకునీ, కొడితే ఏడిచీ, ఏడుపు నటించీ, కొద్దోగొప్పో సజీవంగా వున్నట్టు కనిపించే పదార్థం ఆ హాలులో గోవిందు వొక్కడే. అతనికీ తనకీ మధ్య ఈ పుస్తకాలూ, ఈ సిరాబుడ్లూ పరుచుకుని కూచోవటం బాజీకి కంటకింపుగావుంది. అందుచేత వాటిమీద పట్టించాడు. అన్నిటికన్న ఈ దండయాత్రతో గోవిందు చదువూ సంధ్యా ఒక్కదెబ్బతో పురుగు నాకిపోయింది.

ఇప్పుడు చదువు సాగటంలేదని గోవిందు కేమీ బెంగలేదు. కానీ మేష్టరు వూరుకోలేదు. ఓనాడు చెప్పిచూశాడు; మర్నాడు కసురుకున్నాడు; మూడో నాడు చెయిజేసుకున్నాడు; కొన్నాళ్ళవరకూ పాఠాలు బాగా చదువుకొచ్చేవాడని తెలుసు; అందుచేత, ఇప్పుడు బద్ధకం బలిసిందని టీచరికి నిర్ధారణయిపోయింది.

పోనుపోను, ఇక్కడ ఇంటోనూ, అక్కడ బళ్ళోనూ, పలచపలచగా దెబ్బలు తినటానికి అలవాటు పడ్డాడు గోవిందు. ఈ యాతన భరించలేక ఒకొక్కనాడు అక్కడ పాఠాలూ, ఇక్కడ పనీ రెండూ ఎగేశేవాడు.

ఒకనాడు గోవిందు బాజీ నెత్తుకుని ఎందుకో వెక్కివెక్కిఏడుస్తున్నాడు పైకి వినపడకుండా. 'నాన్నగారు కొత్తేరా?' అని పరామర్శించాడు బాజీ. చంక దిగి, 'బిచకొత్తులివ్వనా?' అని బెల్లించేసరికి గోవిందుకి ఏడవబుద్ధికాలేదు. ఆ తియ్యనిపలుకులికి తన జీవితంలో గూడుకట్టుకున్న ఎంతచేదునయినా ఒక్క క్షణంలో విరిచేశక్తి వున్నట్టనిపించింది వాడికి. పకాలున నవ్వేశాడు.

మర్నాడు, తల్లిని చూడటానికని చింతల తోపులోంచి మాలగూడెం వెళుతున్నాడు గోవిందు. చెట్లఆకులనీడలూ, మధ్యమధ్య వెన్నెలజాడలూ కలిసి మిలమిల లాడుతున్నాయి. వాటిని చెరిపేస్తూ చెయ్యంత లాగ అతని నీడ ముందుకుసాగుతోంది. ఆకుల సందు నించి చిన్నచిన్నపిట్టలు దాగుడుమూచ్చిలాడుతున్నాయి. అవేమి చదువుకున్నాయి? ఏమిజీతం తెస్తున్నాయి? అంత కోలాహలంగా వున్నాయే! బ్రతుకుతెరువు అంత సులభంగావుంటే! ఎవడితో చెప్పుకోగలడు తన బాధ? దుఃఖానికి సానుభూతి సగం విరుగుడు. తల్లికి అర్థంకాదు. మొన్న, 'బడిపంతులు కొట్టాడ'ని బిక్కమొహంవేసుకుని చెప్పాడు. 'పాఠాలు చదవక పోతే ఎట్టారా నాయనా?' అంది, మేస్టారు కొట్టిన మాట వొదిలేసి.

చక్రవర్తి కొడుతున్న సంగతి ఇంకా చెప్పనే లేదు తల్లికి. చెబితే, అక్కడ మానెయ్యమంటుం దేమోనని భయం. మానెయ్యాలనేవుంది, కాని బాజీని వొదిలిపెట్టివుండగలడా? ఆ చిన్నిపెదిమలమీది జిలేబి చుట్టలూ, ఆ చంపలమీది గులాబీరేకులూ, అన్నీ వొక్కసారి పగ్గాలకిందమారి వాడి మనస్సుని వెనక్కి బలంగా లాగాయి. ఏమీ తోచలేదు.

ఆ వేళ పాఠాలు బొత్తిగా చదవలేదు గోవిందు. చదవటానికి తీరికాలేదు. బడిపంతులు బెత్తంతో చితకగొట్టాడు. ఇంటికివెళ్ళి అమ్మని కావిలించుకుని బావురుమని ఏడిచాడు. తల్లి బెంబేలు పడిపోయింది. వొంటినితేలిన దద్దుర్లు చూచి హడిలి పోయింది. బడి మానెయ్యమంది. చదివి, వుద్యో

గమో, సద్యోగమోచేసి తనని వుద్ధరిస్తాడేమో నను కుంది ఆ పేదరాలు. గోవిందుకి తెలుసు. ఆశలన్నీ నిరాశ చేస్తున్నానే అని అతడికీ బెంగగానే వుంది. ఆలోచించాడు. అక్కడ కొట్టినా ఇక్కడ తిట్టినా అసలు చెప్పటం మానేశాడు.

ఆనాడు మధ్యాహ్నం మూడుగంటలయింది. చక్రవర్తి స్టూడియోలో కూచున్నాడు. ఆలోచనా స్రవంతికి ఏదో ఆనకట్ట పడింది. వెయ్యదలుచుకున్న చిత్ర మతని స్ఫూహ కందక తప్పించుకుంటోంది. మెదడు ఖాళీగా వున్నట్టనిపించింది. ఏమాలని తర్కించి చూసుకున్నాడు. బాజీ రెండుమూడురోజుల నించీ స్టూడియోవంక రావటం తగ్గించాడు. ఈవేళ అసలు తొంగిచూడనేలేదు. హాలులోకివెళ్లి వరకా యించి చూచాడు. కర్టెన్‌లోనించి ఒక సన్నని సూర్య కిరణం గచ్చునేలమీదపడి చిన్నగుండ్రని బంగారపు బిళ్లలా అవుపిస్తోంది. దానిని ఎలాగయినా ఏరి జేబులో వేసుకుందామని తంటాలు పడుతున్నాడు బాజీ. పక్కనే మంచుని గోవిందు పకపకమని నవ్వు తున్నాడు. చక్రవర్తి స్టూడియోలోకి వెళ్లిపోయి క్షణమాగి మళ్లీ వచ్చిచూచాడు పరీక్షగా. గోవిందు వీపుమీద స్వారీచేస్తున్నాడు బాజీ. తువాలు మెడకింద వించి తీసి కళ్లెంకింద పట్టుకుని చల్‌చల్ మంటు న్నాడు. 'అదేమిట్రా, చవటా'అని ఒక్క అరుపు అరిచాడు చక్రవర్తి. బాజీ పక్కున నవ్వాడు. గోవిందు వులిక్కిపడ్డాడు. ఆట కంతరాయం వచ్చి ఇద్దరూ ఇబ్బందిగా మొహంపెట్టారు. స్టూడియోలో కూచుని ఆలోచించుకున్నాడు చక్రవర్తి. తను అలా ఎందుకు కసురుకున్నాడో అతనికే అర్థంకాలేదు.

వియన్నాలో నానాదేశ చిత్రకళా ప్రదర్శన మొకటి జరగబోతోంది. దానికొక చిత్రం పంపిం చాలి. భారతదేశంలో సుప్రసిద్ధులైన వివిధచిత్ర కారుల్ని కలుసుకోవలసిన అవసరముంది. లాహోరూ, బొంబాయీ మరి ఇతరచోట్లకీ వెడుతూవస్తూ వున్నాడు చక్రవర్తి. ఇంటిదగ్గర నిలకడగా వుండటం లేదు. బాజీని పలకరించటానికైనా తీరిక చిక్కడం లేదు. క్రమేణా బాజీకి చక్రవర్తితో ప్రమేయమూ తగ్గిపోయింది.

ఒకనాడు, ఛటర్జీ దగ్గరకి వెడదామని చక్రవర్తి ప్రయాణమయ్యాడు. బెడ్డింగు సర్దుతూ 'బాజీ'అని పిలిచాడు. గోవిందు బాజీ నెత్తుకుని దగ్గరికొచ్చాడు. బాజీ మామూలుగా చేతులు చాప లేదు. చక్రవర్తిని గమనించనైనా గమనించలేదు. మనస్సు చివుక్కుమంది. వీళ్లిద్దరూ కలిసి తనమీద ఏదో కుట్ర చేస్తున్నారా? గోవిందువంక అమాయగా చూచాడు చక్రవర్తి. స్టూడియోలో కూచుని విచా రంగా ఆలోచించుకున్నాడు. బాజీ తనకి దూరమై పోతున్నాడా? గుండెలో రాయిపడింది.

ప్రయాణం హఠాత్తుగా విరమించుకున్నాడు చక్రవర్తి. ఇహ ఎక్కడికీ వెళ్లదలుచుకోలేదు. కుంచెలూ, రంగులూ, కేన్వాసుగుడ్డలూ ఒకమూల పడేసి చిత్రలేఖనంకూడా కట్టిపెట్టేడు చాలావరకు. ఎప్పుడైనా గుబులుపుట్టి బాజీ నిదురపోతున్నప్పుడు మాత్రం ఒక్కసారి స్టూడియోలోకి వెళ్లి వచ్చే స్తున్నాడు. ఇక బాజీ ఆటపాటలలో తనుగూడా కలగజేసుకుందామని గట్టిప్రయత్నాలు చేశాడు చక్రవర్తి.

గోవిందు దూరంగా నిలబడివున్నాడు. బాజీ మొహం చిట్లించుకుని విసుగ్గా నుంచున్నాడు. తను రావటం వాళ్లిద్దరికీ ఏదో అడ్డంకిగా వున్నట్టు గమ నించాడు చక్రవర్తి. బాజీని చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు. ఎత్తుకున్న మనిషి ఎవరో కొత్తమనిషి అన్నట్టు అస్తిమితంగా చూచాడు బాజీ. చూచి చంకనించి దిగజారుతున్నాడు. 'బంగారుకొండ కదూ', అంటూ ఇంకా దగ్గరికి తీసుకున్నాడు చక్రవర్తి. గునుస్తూ చేతులతో తోసిపారేసి తుర్రు మన్నాడు బాజీ. చక్రవర్తికి బాకుతో పొడిచి నట్టయింది. కళ్లు చెమ్మగిల్లాయి. విడిచిపెట్టి తలవంచుకుని దవడ గీరుకొంటూ దీనంగా వెళ్లి పోయాడు స్టూడియోలోకి. బాజీ కిలకిలనవ్వుతూ గోవిందుకేసి పరిగెత్తుకుపోయాడు. ఈ అవమానం

ఈ నిరాకరణ, భరించలేకపోయాడు చక్రవర్తి. అతని జీవితంలో కొత్తగావచ్చి ప్రవహిస్తూన్న అమృత వాహినులన్నీ వొక్కసారి ఇంకిపోయినట్టయింది. అతని చిత్రకళా, చిత్రకళాప్రదర్శనశాలలూ; పూల మాలలూ; కరతాళధ్వనులూ అన్నీ వెలవెలపోయాయి.

ఎన్నిసాధనాలైనా ఆలోచించాడు బాజీని తన వేపుకి తిప్పుకోవాలని; బిస్కట్లూ, చాకలెట్లూ తెచ్చి పెట్టించాడు; కొత్తకొత్త ఆటవస్తువులు చేతో పుచ్చుకుని బాజీని ఆకర్షించటానికి ప్రయత్నించాడు. లాభం లేకపోయింది. గోవిందుతోనే వాడి ప్రపంచం పరిమితమైపోయింది. వాళ్ళిద్దరూ గిరిగీసుకుని కూచున్నారు; తనని బైటకు నెట్టారు ఇంచుమించు. చక్రవర్తి మనస్సు ఆరాటపడుతోంది.

ఆ రాత్రి గోవిందుని యింటికి వెళ్ళిపొమ్మన్నాడు చక్రవర్తి. వంటమనిషి భోజనాలయిన తరువాత వెళ్ళిపోవటం రివాజు......తానొక్కడే బాజీని పడుకోబెట్టుకుని పలకరించవచ్చును అనుకున్నాడు; వాణ్ణి ఎలాగయినా మంచిచేసుకోవాలన్న తపన ఎక్కువయింది. ఇష్టంలేకపోయినా, తప్పనిసరిగా గోవిందు వెళ్ళిపోయాడు. రాత్రి రెండుజాములైపోయింది. కలత నిద్రగావుంది. ఆలోచన పరిపరివిధాల పోయింది. దూరాన్ని సముద్రం హోరుమని ఏడుస్తోంది. ఈదర గాలి కిటికీ తలుపుల్తో మాటిమాటికీ జగడమాడుతోంది. ఉలిక్కిపడి లేచాడు బాజీ. పక్కని గోవిందు లేడు. కెవ్వున ఏడుపు మొదలుపెట్టాడు. లేచి బాజీ నెత్తుకున్నాడు చక్రవర్తి. చేతుల్లో నిలవటం లేదు. పెంకు లెగిరి పోయేటట్టు ఏడుస్తున్నాడు. బిస్కట్లిచ్చాడు; ఏడుపు మానలేదు. పాలు పట్టించాడు; త్రాగలేదు. ఆట వస్తువులన్నీ మూల మూలల వున్నవి చేర్చి ముందు పెట్టాడు; ఏడుపు ఎక్కువయ్యింది. ఉయ్యాలలో పండుకోబెట్టి వూయించాడు; మరీ గుక్కపెట్టి ఏడుస్తున్నాడు; ఖంగారు పుట్టింది. ఇంట్లో ఎవ్వరూ లేరు; అందుచేత ఆదుర్దా ఎక్కువయింది. బాజీని ఓదార్చే సాధన మేమిటో తెలియటం లేదు. లోపల ఏమైనా బాధగా వుందేమో. డాక్టరు దగ్గరికి తీసికెడితే? కాని త్రోవలో, ఏడుస్తూ వుండగా, అందులోనూ, ఆ నిశరాత్రివేళ ఎలా? ఇంత చలిగాలిలో కుర్రాణ్ణి ఎందుకు తీసుకొచ్చావయ్యా అంటే డాక్టరు? తీసి కెళ్ళకపోతే, ఏమని చెబుతాడు, డాక్టరుతో? పిల్లవాడేడీ అంటే? పోనీ డాక్టర్నే తీసుకొస్తే సరి అనుకున్నాడు కొసకి. కాని ఎవరు పిలుచుకొస్తారు? బాజీని ఒంటరిగా ఇంట్లో వొదిలి వెళ్ళటమెలా? ఏమీ తోచలేదు. మెదడు పని చెయ్యటం మానుకుంది.

ఏమనుకున్నాడో, బాజీ నెత్తుకుని స్టూడియోలోకివెళ్ళి స్విచ్ వేశాడు చక్రవర్తి. గోడకి తగిలించి వున్న వొక పెద్దపటం చూపించి తెర యెత్తాడు. అది ఉమాదేవి ఛాయా చిత్రం. ఎప్పుడోగాని ఆ తెర ఎత్తడు. నిదరబోయిన తన గతకాలపు ప్రణయ జీవితమంతా వొక్కసారి కలుకుమన్నది చక్రవర్తి హృదయంలో. బాజీ రెప్ప వాల్చకుండా ఆ చిత్రం వంక వొక్క క్షణం చూచాడు. ఆవలింత లొచ్చాయి. భుజాలమీద అలాగే సోలి నిద్రపోయాడు. తెలతెల వారుతూండగా లేచి దోమతెర వొత్తిగించి చూచాడు చక్రవర్తి. రాత్రి కన్నీటి చారలు ఆ గులాబీ బుగ్గల మీద అలాగే వుండిపోయాయి. వాడిన కలువ పువ్వులా వుంది వొడలంతా. తల నిమిరి ఆ చిట్టిచేతులు తన మెడచుట్టూ వేసుకున్నాడు.

తన బాజీకి, తన కన్నబిడ్డకే తానక్కరలేదు! ఈ నిన్నని కడుపు కోతకి అతని రక్తంలో వున్న ప్రతి బిందువూ గిలగిల కొట్టుకుంది. హృదయ కోశాన్ని ఎవరో పెకలిస్తున్నట్టు బాధపడ్డాడు చక్రవర్తి. భౌతికంగా తన చేతులలో ఇమిడినా... తన హృదయం విప్పిన రెక్కలకింద ఇముడక తప్పించుకుంటున్న ఈ ముగ్ధ సౌందర్యాన్ని మళ్ళా తనది అని ధైర్యంగా చెప్పుకోగలడా ఏ నాటికైనా? తను చేసిన అపరాధమేమిటో ఎంత తరిచి చూచుకున్నా అతని కర్థం కాలేదు. తన వునికి బొమ్మల ప్రపంచ మయిత...వాడికి మనుష్యలోకం కావలసి వచ్చిందా?

హృదయానికి దగ్గరగా ఇంకా దగ్గరగా అదుముకున్నాడు బాజీని. గుండెలో మంట చల్లారలేదు. అతని కళాభిరుచులూ, కీర్తికాంక్షలూ, జీవితాశయాలూ...అన్నీ తమ తమ పనులు మానుకుని... ఒక్కసారిగా గుమికూడి...బాజీ ప్రేమభిక్షకోసమని చేతులు చాపాయి. అసలు ఈ యాతనని అర్థం చేసుకోగలిగితే బాజీ తనకి దూరమయ్యేవాడు కాడేమో. బొట బొట కారిన కన్నీటి బొట్లు బాజీ నొసట చిందులు త్రొక్కుతున్న ఉంగరాల వెంట్రుకల మీద పడి రాగిసలాడాయి. కిటికీలోనించి చిక్కని నీరెండ బాజీ చెంపలమీదపడి వెక్కిరించింది.

రోజులు గడిచాయి. ఒకనాడు గోవిందు తల్లిని చూచేందుకని వెళ్ళాడు గూడెం. రెండు రోజులుండి రమ్మన్నాడు చక్రవర్తి. వాడు చాలా పొద్దెక్కి లేచాడు. మాలగూడెంనించి స్కూలుకి వెళ్ళేసరికి, మరీ పొద్దెక్కింది. నిన్నటి పాఠాలేమీ రాలేదు. ఆ లెక్కల అంకెలూ, హిస్టరీలో తారీఖులూ అన్నీ అలుముకుపోయి, వాడి మెదట్లో మసక చీకట్లో మంచుతెరలూ కమ్ముకున్నట్లుంది. పైగా బడికి ఆలస్యంగా వెళ్ళటం ఒకటి. వెడదామా వొద్దా అని గుంజాటనలో పడ్డాడు. మరీ ఆలస్యమయిపోయింది. ఎటొచ్చీ, ఇప్పుడు వెళ్ళినా; అసలీ వేళ ఎగవేసినా, రెండూ వొకటే. దేహశుద్ధి తప్పదు. ఇకపోతే, ఇప్పుడు చక్రవర్తి ఇంటికిగాని వెళ్ళాడా, స్కూలు ఎగవేసినట్లు తెలిసిపోతుంది; వీపు చిట్లుతుంది. గడ్డిమేటిపక్కని దూదూబిళ్ళ ఆడుకుంటున్నారిద్దరు పిల్లలు. పిల్లిపిసరకాయలు కోసుకుందామా అన్నాడు వాళ్ళతో. సరేనంటే సరే నసుకున్నారు. చక్రవర్తి ఏ వూరైనా వెళ్ళిపోయి, స్కూళ్ళన్నీ వొక్కసారి మూసేస్తే నిర్విచారంగా వుండొచ్చు ననిపించింది వాడికి. దొరికిందే సందని ఆటల్లో మునిగిపోయాడు. కాలం గడచిపోతున్న జాడేలేదు. మధ్యాహ్నం అన్నం తినలేదు. నకనకలాడుతోంది లోపల. పొద్దుగూకింది. మళ్లీ తెల్లవారితేనే గాని బాజీ కనపడడు. ఆ పాపడిమీద బెంగపారింది. ఏదీకానివేళ ఇప్పుడుగాని చక్రవర్తి కళ్ళపడితే చర్మ మొలుస్తాడు. రెండురోజులుపోయిగాని రావద్దన్నాడు తనని. ఆలోచించాడు.ఒక వుపాయం తట్టింది. వెనకాల ప్రహరీ గోడమీదనించీ లోపలికిదూకి బాజీని పలకరించి వొచ్చేస్తే సరి. వెళ్ళాడు. ఆ మసక చీకట్లో పిట్టగోడ ఎక్కి 'బాజీ' అని పిలిచాడు. లోపల నిశ్శబ్దం. కిందకి దూకి, మునివేళ్ళమీద నడుస్తూ, హాలులోకి వెళ్ళాడు. ఎలక్ట్రిక్ దీపం వెలుతురులోనించీ బాజీ కిలకిలలాడుతూ వొళ్ళోకొచ్చి,ఎగబడి సముద్రపు కెరటంలాగ చంకకి దూకాడు. లోపలనించీ చక్రవర్తి హఠాత్తుగా దూసుకొచ్చి చెళ్ళున లెంపకాయ కొట్టాడు. బాజీ పిల్లిలా ముడుచుకుపోయాడు. బెదురుతో గబగబా స్టూడియోలోకి పరుగుపరుగున వెళ్ళి నక్కాడు. గోవిందుకి తల గిర్రున తిరిగింది; భయోద్రేకంచేతగావును తెలివి తప్పలేదు; కళ్ళు బయర్లుగమ్మినా లేచి గిరుక్కున వీధిలోకి పారిపోయాడు. బాజీకి భయంవేసింది. ఇన్నాళ్ళూ చక్రవర్తితో చనువుగా వుండలేకపోయినా, ఆయనంటే భయపడవలసిన ఘట్టం ఇంతవరకూ రాలేదు. స్టూడియోలోకొచ్చి బాజీని చేతుల్లోకి తీసుకున్నాడు చక్రవర్తి. పులిపంజాలో దద్దరిల్లే జింకపిల్లలా వొణికిపోయాడు బాజీ. అపరిమితమైన దుడుకుగా వుంది వాడి లేతగుండెలో. సముదాయించలేకపోయాడు చక్రవర్తి. చాలా తొందరపడ్డాననుకున్నాడు. అప్పుడు జ్ఞప్తికి వచ్చింది......అంతవరకూ తను గోవిందునెప్పుడూ బాజీ సమక్షంలో కొట్టిందిలేదు.

రాత్రివేళ, గోవిందు తిన్నగా గూడెంలో తల్లి ఇంటికి వెడుతున్నాడు. మర్రితొర్రలోంచి ఒక గుడ్లగూబ వికారంగాకూస్తూ లేచిపోయింది. పక్కని కంచెలోనించి ఒక జెర్రిపోతు జర్రున పాకిపోయింది ముందునించి. గోవిందు జడుసుకున్నాడు. చరచరా నడిచాడు. ఇంటికివెళ్ళి మొహమ్మీదకి దుప్పటి లాక్కుని ములకమంచంమీద పడుకున్నాడు. గుండెలో దడల్లు ఇంకా వదలలేదు. తల్లి వొచ్చి మీద చెయివేసి

మూచింది. వొళ్ళు కాలిపోతోంది. జ్వరం మాంచి తీవ్రంగా వుంది.

గోవిందుకి జ్వరం తగ్గిందీ లేనిదీ చక్రవర్తికి తెలియలేదు.

పదిరోజులు పోయింతరువాత రమ్మనమని కబురుపెట్టాడు. గోవిందుతల్లి పంపనంది. చక్రవర్తి కేమీ పాలుపోలేదు. ఒకళ్ళని ప్రాథేయపడటం అతని చాతకాదు.

చక్రవర్తికి మరో బెడద వచ్చిపడింది. బాజీ నానాటికీ మందకొడిగా వుంటున్నాడు. అదేమో, ఆటపాటలు క్రమేణా మానేశాడు. వొంటరితనం ఫీల్ అవుతున్నట్టు స్పష్టమయింది చక్రవర్తికి. రాత్రిళ్లు బొత్తిగా పట్టుకోలేకపోతున్నాడువాణ్ణి. పగ లెప్పుడైనా ఆడుకుంటున్నప్పుడు తను కనపడ్డాడా, తక్షణం ఆటవస్తువులన్నీ వొదిలేసి బెదిరిన లేడిపిల్లలా పారిపోతాడు. ఎక్కడో నక్కినక్కి భయం భయంగా చూస్తాడు. గోవిందుని కొట్టిన రాక్షసుడు తను! తానంటే అసహ్యమూ, భయమూ, ఆ పసివాని హృదయంలో కమ్ముకునిపోతున్నాయని కొన్నాళ్ళకి గుర్తించగలిగాడు చక్రవర్తి.

ఎత్తుకోటానికి మళ్లీ ఒక పిల్లని కుదిర్చాడు చక్రవర్తి. దానిదగ్గరా మాలిమికాలేదు బాజీకి. చక్రవర్తి కర్థమయింది. వాడికి గోవిందు కావాలి.

ఆఖరికి కర్తవ్య మాలోచించి వొక నిశ్చయానికి వొచ్చాడు చక్రవర్తి. బాజీకి సరియైన సంరక్షణా పోషణాలేక చిక్కి శల్యమైపోతున్నాడు.

చివరికి ఒకనాడు అమ్మమ్మగారింటికి తీసికెళ్లాడు బాజీని. చూడగానే బాజీ కెక్కడలేని చైతన్యమూ వొచ్చింది. పోయినప్రాణం లేచివొచ్చినట్టనిపించింది వాడికి. అమ్మమ్మ ముసలిసండయిపోయింది. బాజీని చేతుల్లోకి తీసుకుని ముద్దాడింది. బిడ్డ నిష్కారణంగా చిక్కిపోయాడని ఎంతో నొచ్చుకుంది. బాజీ మేనమామకి ఇద్దరు పసిపిల్లలున్నారు. పాలలో నీళ్ళుకలిసినట్టు, ఆ వాతావరణంలో మేళభంగా ఐక్యమయిపోయాడు బాజీ.

మోడువారిన చక్రవర్తి హృదయంలో మళ్లీ వసంతోదయమయింది.

బాజీ నెందుకు తీసుకొచ్చేసిందీ అక్కడెవరితోనూ చెప్పలేదు చక్రవర్తి. లోపల అవమాన భారంతో క్రుంగిపోతూ, 'బాజీ నాదగ్గర అంతగా అలవాటుపడలేదు ఎందుచేతనో' అని మాత్రమే చెప్పగలిగాడు.

తనదగ్గర వుంచెయ్యమని అమ్మమ్మ పట్టుపట్టింది. సరేనన్నాడు చక్రవర్తి.

ఇహ నక్కడ తానుండటం చాలా అనవసరమనిపించింది చక్రవర్తికి. ఎక్కడైతేనేమి, బాజీ క్షేమంగా వుండటమే తనకు కావలిసింది. బాజీ సుఖంగా కాలం గడుపుతున్నందు కానందమూ, ఆ సౌఖ్యంలో ఒక్క అణువైనా తానీయలేనందుకు బాధా, లోపల మెలివేసుకుని పీడిస్తున్నాయి. అమూల్యమైన వస్తువుని పోగొట్టుకున్న అభాగ్యుడిలా హతాశుడైపోయాడు చక్రవర్తి. తెలతెలవారుతూండగా సూట్ కేసు సర్దుకుంటూ అనుకున్నాడు, 'ఇది వొక శిక్ష? ఈ యెడబాటు తప్పదు.'

గుమ్మంటగ్గర నుంచుని చూస్తున్న బాజీ, క్షణమూరుకుని. 'నాన్నా దా,' అని తెలిసో, తెలియకో కవ్వించి వూరుకున్నాడు. ఆ శాతరంగాలతో వుర్రూతలూగింది చక్రవర్తి హృదయం. కొన్నాళ్లా ఆ పల్లెటి దిక్కున ఉండిపోదామా అనుకున్నాడు. ఏమో ఎప్పటికైనా బాజీకి తనమీద మమత్వం కలక్కపోతుందా? గోవిందుమీద తను చేయిజేసుకొన్న దృశ్యం వాడి మనఃఫలకం మీదనుంచి చెరిపేయాలెనంటే కొన్నాళ్లు పట్టవచ్చు. అది అంత సాధ్యమా?

వెళ్లిపోతే ఈ బ్రతుక్కి మళ్లీ వెలుగున్నదా? ఈ అమావాస్య చీకటి రాత్రికి శుభోదయ మయిందేమో. రమ్మని చేతులు చాచాడు చక్రవర్తి. బెదురుతూ రివ్వున ఇంటోకి పరిగెత్తుకు పోయాడు

బాజీ. ఒక్క క్షణంలో, తలెత్తిన ఆశలన్నీ నీటిబుడగలా అన్నట్టు మరుక్షణంలో టుప్పున పేలిపోయినై.

వెళ్ళిపోతుంటే, వూరి చివరవరకూ బిలబిలలాడుతూ ఇరుగు పొరుగూ అందరూ వొచ్చి వుంటామన్నారు. బాజీ అమ్మమ్మ చంకలోనించి దిగి చూస్తూ నిలబడ్డాడు బొటన వేలు చీక్కుంటూ. తన జీవితంలోకి ఎలా నడిచి వొచ్చాడో అలాగే ఒక నీడలా కనుమరుగై పోతున్న ఈ విచిత్ర వ్యక్తి ఎవరనుకున్నాడో ఏమో. చక్రవర్తి వెనక్కి తిరిగి చూడనైనా చూడలేదు.

పక్కని వరిచేనిలో గుడ్లుపెట్టిన భరతపక్షి అలికిడికిలేచి ఎగిరిపోతోంది. వూరి చివర మఠంలో నించి బైరాగి వొకడు గంజాయి తాగుతూ మధ్య మధ్య 'ఏమి జన్మంబేమి జీవనమూ' అని ఎలుగెత్తి పాడుతున్నాడు.

ఆ తరవాత తనకు మిగిలిన వొంటరి తనంలో కెన్వాస్‌మీద రచించిన మొట్టమొదటి చిత్రం ఛటర్జీకి పంపాడు చక్రవర్తి.

ప్యాకెట్టు విప్పాడు ఛటర్జీ.

చిత్రం పేరు 'కొండంత మనిషి.'

చిత్రితమయిన హిమాలయ శిఖరానికి అట్టడుగున.....కరిగిన మంచు పెళ్లలతో కొట్టుకు పోతున్న తన గుడిశవంక చూస్తూ...ఎంతో కాదు... వలుసంత మనిషి...ఒక వృద్ధురాలు...తన పాపని చింపిరి గుడ్డలతో మూపున కట్టుకొని...బరువుగా కొండ మెట్లెక్కుతోంది.

ఛటర్జీ ముగ్ధుడై పోయాడు.



వాఙ్మయ సమాలోచనము

శ్రీ కాళహూరి హనుమంతరావు

"వాగర్థా వివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ."

అని కాళిదాసు పార్వతీ పరమేశ్వరుల ఎడలా వాఙ్మయం లోనూ తనకుగల భక్తిని కావ్యాదిలో ప్రకటించాడు. ఈ శ్లోకంలో ద్వివచన నిర్దేశం చేతనే పదమూ అర్థమూ వేరనీ, పదార్థమంతా కలిసి ఒకేవిషయంకాదనీ తెలుస్తున్నది. 'సిద్ధే శబ్దార్థ సంబంధే' అనగా 'సిద్ధే శబ్దే అర్థే సంబంధే చేతి'— శబ్దమూ అర్థమూ శబ్దార్థ సంబంధమూ నిత్యములనీ, ఇక్కడ అర్థం నిత్యమనగా అది ప్రవాహ నిత్యత, నీరు ప్రవహించి పోతున్నా ప్రవాహం ఎడతెగకసారుతూ ఉంటే అది నిత్యమే అనడంవంటిది అని మహాభాష్యకర్త అన్నాడు. భాషాచరిత్రలను పరిశీలించి చూస్తే పదమునకూ దాని అర్థమునకూగల సంబంధం కొంత చలన శీల మైనదని తోస్తుంది. ప్రాతమాటలు పోతున్నాయి, క్రొత్త మాటలు వస్తున్నాయి.

'యా న్యుజ్జహార మాహేంద్రాద్
వ్యాసో వ్యాకరణార్ణవాత్
పదరత్నాని కిం తాని
సంతి పాణిని గోష్పదే?'

(వ్యాసుడు మహేంద్ర వ్యాకరణార్ణవం నుంచి ఉదాహరించిన పదరత్నములు పాణిని గోష్పదంలో ఎక్కడున్నాయి?) అని మహాభారతవ్యాఖ్యాత దేవ బోధుడు పాణినీయాన్ని ఆక్షేపించాడు. [1]వాల్మీకి రామాయణంలోని ఎన్నోమాటలు ఇప్పుడు నష్టమై పోయాయి. కొన్నిమాటలకు చాలావరకూనూ కొన్నింటికి కొంతవరకూనూ అర్థచ్ఛాయలు మారిపోయాయి. ఉదాహరణకి మన్యు, అమర్ష, కోప, క్రోధ శబ్దాలను వాల్మీకి కోపంలో వివిధదశలను సూచిస్తూ ఉపయోగించాడు. ఒకమాట ఉపయోగించవలసిన చోట ఇంకోమాట ఉపయోగించలేదు. ఇప్పుడు మాటలను సమానార్థకాలుగా మనం ఉపయోగిస్తున్నాం. వేదకాలంనాటికీ, రామాయణ మహాభారతాల నాటికీ, నేటికీ సంస్కృతభాషలో క్రియల స్వరూపాలలోనూ ప్రయోగాలలోనూ చాలా మార్పు వచ్చింది. ఈ విధంగా భాష పరిణామశీలమై ప్రవాహగమనం కలిగి వట్టిది.

'సతి తాత్పర్యే సర్వే సర్వార్థ వాచకాః' అని శబ్దానికి అర్థాన్ని బోధించేశక్తిగురించి మహాభాష్య కర్త నిష్కర్ష. తాత్పర్యమంటే వక్తయొక్క ఇచ్ఛ. వక్త శ్రోతతో యాదృశవాక్యార్థబోధేచ్ఛతో వాక్యోచ్చారణ చేస్తాడో ఆ ఇచ్ఛే తాత్పర్యం. వివక్షితాత్పర్యం, శ్రోతకి గ్రహణశక్తి ఉంటే ప్రతిమాటా ప్రతి అర్థాన్ని బోధించగలదని వైయాకరణుల మతం. భగీరథ రథఖాతావచ్ఛిన్న జలప్రవాహము నందు శక్తమైన గంగాపదం తీరమునందుకూడా శక్తమవు తున్నది. గంగాదిపదములకు ప్రవాహాదులయందున్న శక్తి ప్రసిద్ధమైనది, తీరాదులయందున్న శక్తి అప్రసిద్ధమైనది. మందబుద్ధులకుమాత్రమే పదములకుగల ప్రసిద్ధమైన అర్థబోధకశక్తి. విజ్ఞానవంతులు అప్రసిద్ధశక్తినికూడా ఆ సందర్భాన్నిబట్టి తెలుసుకొంటారు. అయితే పటశబ్దం ఘటార్థాన్ని బోధిస్తుందా అంటే, తాత్పర్యంలేదుకనుక బోధించడం లేదు, తాత్పర్యంఉంటే బోధిస్తుందిఅని మహాభాష్య కర్త అభిప్రాయం.

---

1. Linguistic study of Ramayana —Satyavrat.

2. [illegible]

'గోడ' అన్నమాటకి 'పిల్లి' అన్న అర్థం ఉంటుందా? సాధారణంగా ఉండదు. కాని 'గోడలకు చెవులుంటాయి'అనీ, 'వాడితో చెప్పి లాభంలేదు, వాడొక గోడ'అనీ మనం అంటున్నాము. 'గోడ'అన్న మాట ప్రథమవాక్యంలో గోడచాటున పొంచిఉన్న మనిషిని చెబుతోంది, రెండోవాక్యంలో మనోవికారం లేని మూర్ఖుణ్ని చెబుతోంది. 'గోడ' అన్నమాట వక్త తాత్పర్యాన్ని శ్రోతవిజ్ఞానాన్నిబట్టి ఇట్లా వివిధార్థాలను బోధించగలుగుతున్నప్పుడు, ఆవశ్యకతఉండి సరిగా ప్రయుక్తమైతే ఏపదమైనా ఏఅర్థాన్నైనా బోధించవచ్చును. 'ఋతువు మారింది'అని ఒక రైతు ఇంకొక రైతుతోఅంటే 'వ్యవసాయంలో ఇంక మనం తర్వాతి పనులు ప్రారంభించాలి' అని వాని ఉద్దేశం. ఒక యువకుడు ఇంకొక యువకునితో అంటే 'ఇకమీద విరహం దుస్సహం' అని అభిప్రాయం కావచ్చును. ఈ విధంగా శబ్దానికి అర్థాన్ని బోధించే శక్తి వక్తృశ్రోతల విజ్ఞానాన్నిబట్టి అనంతమైనదని మన ప్రాచీన వైయాకరణుల మతం. ప్రాచీన వైయాకరణులు ప్రతిపాదించిన ఈ సమష్టి శబ్దశక్తిలోనుంచి తర్వాత తర్వాత తార్కికులూ సాహిత్యశాస్త్రజ్ఞులూ లక్షణాశక్తిని వ్యంజనాశక్తిని వింగడించుకొన్నారు.

మానవుడు తన అభిప్రాయాలను వ్యక్తం చేసుకొనే అత్యుత్తమసాధకంగా భాషను ఏర్పరచుకొన్నాడు. కాని భాష ఒక్కటే అతని అభిప్రాయాలను చెప్పే సాధకంకాదు. సంజ్ఞలద్వారా కూడా తెలియజేస్తాడు. శబ్దవ్యవహారంలేని మూగవాడు కూడా స్వకీయాభిప్రాయాలను సంజ్ఞలవలన ఏలాగో ఒకలాగ వ్యక్తపరచగలుగుతున్నాడు. సంజ్ఞలకన్నా భాష భావప్రకటనకి అత్యంతసమర్థమైనది కనుక వివేకవంతుడైన మానవుడు భాషావ్యవహారాన్ని ఏర్పరచుకొన్నాడు. సంజ్ఞచేసి 'రా' అని పిలవగలం గాని, 'రేపు ఉదయం ఏనిమిదిగంటల ఇరవై అయిదు నిమిషాలకు వీలయితే రా' అని విస్పష్టంగా సులభంగా తెలియజేయలేము. కాని సంజ్ఞలద్వారా భావప్రకటన మనిషికి పుట్టుకతోవచ్చిన లక్షణం. కనుక 'రా', 'పో', 'ఉండు' 'లే' 'ఏమిటి?' మొదలైన మాటలు పలుకుతున్నప్పుడు తత్తత్సమకాలంలో తత్తదర్థసూచక సంజ్ఞలను కూడా మనిషి అప్రయత్నంగా చేస్తూ ఉంటాడు. అట్లా చెయ్యడం వాడికి సహజం.

మనం మామూలుగా మాట్లాడేటప్పుడూ, సభలలో ఉపన్యసించేటప్పుడూ హస్తవిక్షేపాదులనెన్నో చేస్తూ ఉంటాము. మనం మాట్లాడుతున్న మాటలకు మనం ఉద్దేశించిన అర్థాన్ని చెప్పడానికి తగినంత శక్తిలేకపోవడంవలన శబ్దశక్తికి దోహదం చెయ్యడానికి మనం అంగవిన్యాసాలు చెయ్యడంలేదు. మనం వ్యక్తీకరిస్తున్న అభిప్రాయం మనలో కలిగిస్తున్న ఉద్వేగంచేత మన కరచరణాలు వాటంతటవే విక్షిప్తములవుతున్నాయి. మాట్లాడే ప్రతివాడూ ఈ కరవిక్షేపాదులను చెయ్యడు. కొందరు ఎక్కువగా చేతులూపుతారు, కొందరు తక్కువగా ఊపుతారు. కొందరు దాదాపు నిశ్చలంగా మాట్లాడతారు. జోరుగా చేతులు ఊపినవాడు గొప్పవక్తఅనీ, అలా ఊపనివారిభాష బలహీనమనీ, తలకాయ బాగా ఆడించిపాడినవాడు గొప్ప గాయకుడనీ, తల ఊపని గాయకుడిపాట చప్పపాట అనీ మనం అనం. సంగీతపారవశ్యంచేత గాయకుడి తల ఊగుతోంది. తల ఊపడం గానమాధుర్యాన్ని ఎక్కువచెయ్యడంలేదు. భావప్రకటనోద్వేగం వక్తచేత కరవిక్షేపాదులు చేయిస్తున్నది. చేతులు ఊపడం భాషాశక్తిని పెంచదు. అభిప్రాయప్రకటనకు సమర్థమైనది భాష. ఈషత్ సమర్థమైనవి హస్తవిక్షేపాది సంజ్ఞలు. ఈషత్ సమర్థమైన సంజ్ఞలు సమర్థమైన భాషాశక్తిని పెంచలేవు.

నాటకంలో నటుని నటనవలన సామాజికునకు కలిగే అనుభూతి ఎక్కువవుతున్నదికదా అని మనకు సందేహం కలగవచ్చును. కాని, నాటకంలో మనం చూసేది రచయితభావాన్ని నటుడు ఎంత బాగా నటిస్తున్నాడనే. నటుడు ఎంతగొప్పగా నటించినా అదంతా అర్థంలో ఉన్నదేతప్ప లేనిది నటింపజాలడుకదా! ఆ అర్థంలో ఆ అనుభూతి ఉండని

తెలుసుకొని దానిని నటనలో ప్రదర్శించడం నటుని ప్రత్యేకత. షేక్స్పియరూ కాళిదాసూ ఏనాడో నాటకాలు వ్రాశారు. ఆయా నాటకాలలో ఫలానాఫలానా సన్నివేశాలలో నటులని ఫలానాఫలానావిధంగా హస్తవిక్షేపాదులువేసి నటించమని సూచన లేవీలేవు. కాని ఈనాడు నటులు ఆయాభావాలను నటిస్తున్నారు. ఎక్కడెక్కడ ఏఏ అనుభూతిఉంది, దానిని ఎట్లా నటించాలి అన్నది నాటకరచనలోనే గర్భితమై ఉంది. మంచిసాహిత్యాన్ని ఎట్లా కొందరుమాత్రమే తెలుసుకోగలుగుతున్నారో, అట్లానే నటులు మాత్రమే ఆయాసన్నివేశాలలో అలాఅలా నటించాలని గుర్తుపట్టి ప్రదర్శించగలుగుతున్నారు. నాటకం చదివినప్పటి కన్నా ఆ ప్రదర్శనం చూసినప్పుడు మనకు ఎక్కువ అనుభూతి కలగడానికి కారణం ప్రదర్శనలో సాహిత్యం, నటన అన్న రెండు కళలు మనపై పనిచెయ్యడం. ఒక గొప్ప నాటకాన్ని ఒక అసమర్థుడైన నటుడు సరిగా నటించలేకపోతే, మంచి నాటకాన్ని నటుడు పాడుచేశాడంటాము. ఒక చచ్చు నాటకాన్ని ఎంత గొప్పనటుడైనా మంచి నాటకమని రసజ్ఞుడైన సామాజికుణ్ణి భ్రమింపజెయ్యలేడు. నాటకం మంచిది కాని నటన బాగులేదు, నటన బాగుంది, కాని నాటకం చచ్చుది అన్న సామాజికుల అభిప్రాయా లనుబట్టి నాటకార్థం, నటన వేరువేరని మనకి తెలుస్తుంది. కాని నాటకమూ నటనా రెండు బాగున్నప్పుడు ఆ రెండు కళల సమ్మేళనంచేత సామాజికుని అనుభూతి ద్విగుణీకృతమవుతుంది.

'నన్ను ముద్దుగొనియె' అని పాట పాడుతూ నర్తకి నృత్యంచేస్తే, ఆ నర్తకి హస్తచాలనములలోనూ ముఖభంగిమలలోనూ శృంగార లజ్జాది భావములు ఎంత స్పష్టరమణీయంగా ప్రదర్శితములవుతున్నా యని చూస్తాం. 'నన్ను ముద్దుగొనియె' అన్న వాక్యార్థం మారదు. ఆ వాక్యార్థాన్ని అట్లా అభినయించడం ఆ నర్తకి ప్రత్యేకత. సాహిత్యంవలెనే సంగీతం, నటన, నృత్యం ప్రత్యేక కళలు. కనుక సాహిత్యంవలె అవి మనలో వాటి వాటి ప్రత్యేకాను భూతులను కలిగిస్తాయి. 'నన్ను ముద్దుగొనియె' అన్న పాటనృత్యం సాహిత్యసంగీతనృత్యకళల సమాహారప్రభావంచేత కేవలవాక్యపఠనంకన్నా మనలో చాలా హెచ్చు అనుభూతిని కలిగిస్తుంది.

నాదానికి మనిషిలో అనుభూతిని కలిగించే శక్తి ఉంది. సంగీతమంతా ఇదే. విషాదసంగీతం వినగానే మనలో విషాదానుభూతి కలుగుతోంది. కాని నాదము చేత అనుభూతి కలిగించే ప్రవృత్తి సంగీత కళా విషయం. సాహిత్యవిషయంకాదు. అక్షరాదుల రావం చేత అనుభూతిని కలిగించడానికి కవిత్వంలో అవకాశం అత్యల్పం. యుద్ధకాలంలో ఢమ ఢమఢమఢమ అన్న డప్పుల చప్పుడు వీరుల నుద్రేకపరుస్తుంది. కాని కవిత్వంలో యుద్ధవర్ణన ఢమఢమఢమఢమ అంటూ చెయ్యలేముకదా! యుద్ధార్థ సందర్భ పదములలో ఢకారప్రాచుర్యములేదు. 'కట కట, పటపట, కొక్కొ, ఘూక' ఇత్యాది ధ్వన్యనుకరణ శబ్దాలు భాషలో కొద్దిమాత్రమే ఉన్నాయి. భాషాభి వృద్ధి రావప్రాతిపదికమీద జరగలేదు. శృంగారశోక వర్ణనలకు అక్కరకువచ్చు పదములలో సరళాక్షర ప్రాచుర్యమూ, వీరాదివర్ణనలకు ఉపయుక్తములగు పదములలో పరుషాక్షరప్రాచుర్యమూ లేవు. శోకార్థకములైన 'అక్కట, కటకట, అక్కటికము' ఇత్యాది శబ్దాలలో కఠినాక్షరాలు ఎక్కువగా ఉంటున్నాయి.

'చంచచ్చంద్రకరస్పర్శ హర్షోన్మీలిత తారకా
అహో! రాగవతీసంధ్యా జహాతిస్వయమంబరమ్.'

(రామా, కిష్కిం, 30, 45.)

(చంచచ్చంద్రకరస్పర్శచే హర్షోన్మీలిత తారకయై రాగవతిఅయిన సంధ్య అహో! స్వయముగనే అంబరమును విడుచుచున్నది.) ఈ శ్లోకంలో ఎన్నో కఠినాక్షరాలున్నా శృంగారరసస్ఫురణకు కించిన్మాత్రమైనా ప్రతిరోధం కలగడంలేదు. రసస్ఫురణకు విభావాదిసామగ్రి ప్రధానమనీ అది ఉన్నప్పుడు తక్కిన అక్షరాలకన్నా కొన్నికొన్ని అక్షరాలు ఆయారసములకు ఎక్కువ సహకారులనీ ఆలంకారికులంటారు. కాని

ఈ తేడాలు ఎక్కువగా రావడం ఎలాగ? కవిత్వం రచించే కవి తన భావప్రకటనకి తగిన పదవిన్యాసాన్ని ఆలోచిస్తాడుతప్ప, తాను ఉపయోగించబోయే శబ్దాలలో కఠినాక్షరాలు ఎక్కువగా రాబోతాయా లేక మృదులాక్షరాలాఅని అంచనావేస్తూ కూర్చోడు. ఆ విధంగా ఎదురుచూస్తే అతని రచన కృత్రిమ మవుతుంది. నాదంద్వారా అనుభూతి కలిగించగల శబ్దాలను కూర్చుకొనే ప్రయత్నం కవికి కుదరదు. ఎక్కడైనా కాకతాళీయంగా కుదరవచ్చును. (ఉదా. 'అటుజనిగాంచె...') కాని సాహిత్యంలో పఠితదృష్టి ప్రముఖంగా అర్థంపైనే లగ్నమై ఉంటుందితప్ప శబ్దంపై కాదు. అందుచేతనే పదైకాంశం అశ్లీలార్థాన్ని బోధించకూడదన్న ఆలంకారికుల అభిప్రాయంకూడా యుక్తంకాదు. 'కోమలము' అన్నపదంలో 'కో' అన్న ఒక్కఅక్షరం తప్ప తక్కిన అక్షర సముదాయం అశ్లీలార్థబోధకంగా ఉంది. కాని ఈ మాటని అందరూ ప్రయోగిస్తున్నారు. పఠితలు 'కో'ను విడిచి తక్కిన పదాంశంలోని అశ్లీలార్థాన్ని గ్రహించడంలేదు. ఎందుకంటే పఠితలదృష్టి 'కోమలము' అన్న శబ్దార్థంమీద పరిపూర్ణంగా లగ్నమై ఉంటోంది. ఐతే, 'కోమలము' అన్నది జనులు సాధారణంగా వాడేమాటకనుకా, తత్పదైకాంశమైన 'మలము' అన్నమాట ఏమంత మరీ అశ్లీలార్థకంకాదు కనుకా 'కోమలము' అన్నపదం ఉపాదేయమవుతోంది అని శంకించవచ్చును. కాని వాక్యంలో మంచి అర్థం ఉన్నప్పుడు ఆ పదాలలో ఎక్కడో ఒక పదైకాంశంలో అశ్లీలార్థమున్నా సహృదయుడైన పఠిత దానిని పట్టించుకొనడు. పదైకాంశాశ్లీలార్థాన్నే పఠిత గమనించనప్పుడు ఆ పదములుచేసే చప్పుడుని ఏంగమనిస్తాడు? సంగీతంలోనైనా టంగ్‌మనగానే విషాదం, టుంగ్‌మనగానే ఇంకొక అనుభూతి శ్రోతకు కలగవు. సంగీతంవలన విషాదాద్యనుభూతులను కలిగించడానికి కొంత స్వరప్రస్తారం అవశ్యకం. సాహిత్యంలో నాదానికి ఇంత అవకాశం ఎక్కడుంది? సాహిత్యంలో శబ్దం ఉచ్చరించబడిన ఉత్తరక్షణంలో రసజ్ఞుడైన పఠిత మనస్సు దాని అర్థంపై లగ్నమైపోతుంది. కనుక సాహిత్యంలో అర్థమే శబ్దాన్ని నిరసించేస్తుంది. అంటే సాహిత్యంలో శబ్దానికి ఏమీ ప్రాముఖ్యంలేదనికాదు. సమానార్థకాలైన అనేకశబ్దాలలోనుంచి రచయిత ఏదో ఒక శబ్దాన్ని ఎన్నుకొని ప్రయోగిస్తున్నాడు. స్వవివక్షితార్థప్రసారానికి మిక్కిలి తగుననీ, ఛందోఓచురోధంచేతా, శ్రావ్యతకోసమూ కవి ప్రత్యేక శబ్దాన్ని ఎంచుకొంటున్నాడు.

ద్రవ్యాదులు ఏడూ పదార్థాభిధేయములని చెప్పి తార్కికులు మనస్సు ద్రవ్యమని చెప్పారు. అనుభూతి మనోవిషయం. కనుక భాష మన సమస్తానుభూతులనూ చెప్పగలుగుతుందని సాధారణంగా తార్కికులు చెప్పారు. ఒక గొప్ప దృశ్యం చూసి మనిషి ఆశ్చర్యం పొంది దానిని వర్ణించవచ్చును; లేదా ఆ దృశ్యం వర్ణనాతీతంగా ఉందనో, ఫలానా అనుభూతిని మాటలలో చెప్పలేకపోతున్నాననో అనవచ్చును. 'వర్ణనాతీతంగా ఉంది', 'మాటలలో చెప్పలేకపోతున్నాను' అన్నమాటలలోనే అతని అనుభూతి తెలుస్తున్నది.

'గగనం గగనాకారం సాగరః సాగరోపమః
రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ.'

అన్న వాక్యాలలోకూడా ఆయావిషయాల గొప్పతనం తెలుస్తున్నది.

ఇట్లా భాషకి "సమస్తానుభూతులనూ అభిహితం చెయ్యగల శక్తిఉన్నా ప్రతివ్యక్తి ఆ శక్తిని స్వాయత్తం చేసుకోలేడు. శబ్దార్థబోధకు వక్త తాత్పర్యం అవశ్యకమైనట్లే భాషద్వారా తన అనుభూతిని ప్రకటించే వ్యక్తికి అనుభూతిని పొందగలిగే మనశ్శక్తి, దానిని వ్యక్తీకరించడానికి చాలినంత భాషాజ్ఞానం అవశ్యకం. హామ్లెట్ ప్రవృత్తిని చూసి సాధారణ వ్యక్తి 'ఈయన పినతండ్రిని చంపాలా వద్దా అని మథనపడుతున్నాడు' అని మాత్రం చెప్పగలిగి ఉండవచ్చును. ఆ ప్రవృత్తికి కారణమైన మనస్సంఘర్షణనే షేక్స్పియర్ మహాకవి విశదీకరించగలిగాడు. 'ఆ దృశ్యం వర్ణనాతీతంగా ఉంది' అని ఒక మామూలు మనిషి అన్నదానిని కవి వర్ణించ

గలుగుతాడు. కాని కవికూడా తనుభూతిని భాష ద్వారా ప్రకటించడంలో పూర్తిగా శక్తుడుకాలేక పోవచ్చును. స్వశక్తిసామర్థ్యాలనుబట్టి కొంత కొంత మాత్రమే శక్తుడు కావచ్చును. 'గగనం గగనాకారం' అన్న కవి గగనం గురించి వివరించలేదు.

భాషను సృష్టించినదీ, పెంచుతున్నదీ, తరగజేస్తున్నదీ, మారుస్తున్నదీ అంతా మానవుడే. క్రిందటి సంవత్సరం ఒక వస్తువులేదు. అప్పుడు దానికి సంబంధించిన మాటలులేవు. నేడా వస్తువు క్రొత్తగా వచ్చింది. దానికి సంబంధించిన ఎన్నోమాటలను మనిషి కల్పించాడు. ఇట్లా లోకంలో మనిషి భాషను ప్రవర్తింపజేయడం కనిపిస్తూ ఉండగా భాషశక్తి అపరిమితమైనదని దానిలో కొంత కొంత మాత్రమే మనిషి స్వాయత్తం చేసుకోగలడనీ ఎలా అనుకోడం అని మనం శంకించవచ్చును.

కాని భాష అనాదిగా వస్తున్నది; ఎందరెందరో విజ్ఞానసంతులూ మహామేధావులూ భాషను శక్తిమంతం చేశారు. వారందరి శక్తుల సమష్టి భాషా శక్తిలో అంతర్లీనమై ఉంది. దానిలో కొంతకొంత మాత్రమే మనిషి స్వాయత్తం చేసుకోగలడు. అనేక సంవత్సరాలుగా సాహిత్యవ్యాసంగం చేస్తున్నా నిఘంటువులోఉన్న కొన్నిమాటలకుమాత్రమే మనకి అర్థాలు తెలుసును. ఆ మాటలలో కొన్నిమాత్రమే ప్రయోగవేళలతో మన ఉపస్థితికి వస్తాయి. కనుక భాషాశక్తి అపరిమితమైనదనీ, మనిషిశక్తి పరిమితమైనదనీ మనం విశ్వయించవచ్చును.

తాత్పర్యాన్నిబట్టి ప్రతిమాటా ప్రతిఅర్థాన్ని చెప్పగలదుఅన్న మహాభాష్యకర్త అభిప్రాయాన్ని అంగీకరించినట్లే భాష మన సమస్తానుభూతులనూ చెప్పగలదులని మనం అంగీకరించవచ్చును. కాని వాస్తవంగా ప్రతిమాటనీ ప్రతిఅర్థం చెప్పడానికి పరిమితమైన తాత్పర్యంకల మనం ఎలా ఉపయోగించలేక పోతున్నామో, అలాగే మనకి అందుబాటులోఉన్న భాష ద్వారా పరిమితమైన వ్యక్తీకరణశక్తిగల మనం మన అనుభూతులనన్నీ వివరంగా చెప్పలేకపోతున్నాం.

భాషద్వారా సర్వానుభూతులూ చెప్పవచ్చును— అయితే దానిలో కొంతకొంత మాత్రమే మనుష్యుల స్వాధీనంలోకి వస్తుందిఅన్నదానికీ; భాష ఎంత గొప్పదైనా మనిషి అనుభూతు లంతకన్నా గొప్పవి—భాష మానవుని సర్వానుభూతులనూ చెప్పలేదు అన్నదానికీ ఫలితంలో తేడాలేదు. దృక్పథంలో మాత్రమే తేడా. కాని మొదటి అభిప్రాయం శాస్త్రీయమై విద్వత్సమ్మతమైనది. రెండవ అభిప్రాయం లోకులు సాధారణంగా అనుకునేది.

---

3. శ్రీ కేతవరపు రామకోటిశాస్త్రిగారి 'కవిత్వమున అర్థస్ఫురణ' (భారతి, సెప్టెంబరు 1970) వ్యాసమంతా ఈ అభిప్రాయ ప్రాతిపదికమీదనే సాగింది. శాస్త్రిగారి వ్యాసంలో 'కవిత్వంలో అస్పష్టత' అన్న నా వ్యాసం (భారతి, ఆగష్టు 1970)లోని అనేక విషయాలను విమర్శించి వ్యతిరేకించారు. వారు చేసిన ముఖ్యమైన ఆక్షేపాలకు పై వ్యాసంలో సమాధానాలున్నాయి. తక్కిన వాటికి ఇక్కడ సమాధానాలు వ్రాస్తున్నాను.

కవిత్వం కవిత్వంగా గుర్తింపబడాలంటే దానిలో ఛందస్సు ఉండాలనీ, వచన పద్యాలలోకూడా చరణాకృతి ఉండనీ, అలా ఉండకపోతే అది కవిత్వం కాదనీ శాస్త్రిగారన్నారు. ఛందోబద్ధ పద్య స్వరూపానుకరణతో వచన కవితా రచయితలు వాక్యాలను ముక్కలుచేసి ఒక దానిక్రింద ఒకటిగా వ్రాస్తున్నారు. కాని అలా వ్రాస్తేనే అది కవిత్వమనిపించుకొంటుందనడం తగదు.

'కొసరు కొంచెమైనా వెయ్యని
పిసినారి కోమటి దేవుడు...' (తిలక్)

అని వ్రాస్తేనే కవిత్వం ఉందనీ, దానినే 'కొసరు కొంచెమైనా వెయ్యని పిసినారి కోమటిదేవుడు...' అని వ్రాయగానే ఆ కవిత్వం కాస్తా ఎగిరిపోతుందని అంటామా? (ఇంగ్లీషు) గీతాంజలి వచనంలో పేరాలలో రచితమై ఉంది. కాదంబరికూడా ఇంతే,

కవిత్వాన్నీ, కథలనీ, నాటకాలనీ వేరుచేసేది [illegible] కారణం కాదు. ఈ అంశం నేను 'సాహితీ జగతి' అన్న పుస్తకంలో సమగ్రంగా చర్చించాను—పుటలు 56—67, 114—121.

శాస్త్రిగారు రమణీయార్థం ఒక్క కవిత్వం లోనే ఉంటుందనీ, కథలలోనూ నవలలోనూ మనం వ్రాస్తున్న జాబులలోవలె వట్టి అర్థములే ఉంటా యనీ వ్రాశారు. ఇది వింత ఆలోచన. కాని వారే మళ్ళి 'వేయిపడగలలో రమణీయార్థముగూడ ఏమి తక్కువగా లేదు.' అని వ్రాశారు. తక్కిన నవల లన్నిటిలో వట్టిఅర్థములే ఉండడానికి అవి చేసుకొన్నపాపం, ఒక్కవేయిపడగలలోమాత్రం రమణీయార్థం ఉండడానికి అది చేసుకొన్న పుణ్యం ఏమిటో తెలియదు.

శాస్త్రిగారు తమ వ్యాసంలో నా విమర్శ తీరును చాలా ఆక్షేపించారు. 'మనం ముఖ్యంగా ఊహిస్తాం. మనం ఊహించుకొంటున్నాం......' ఈ మొదలైన వాక్యాలు వ్రాయకూడదనీ, ఆ ఊహలు విడబరచి వ్రాయాలనీ విమర్శనపద్ధతిని వారు ఉపదే శించారు. నా వ్యాసంలో ఉదాహరించిన చాలా పద్యా లలో అస్పష్టత ఎక్కడ ఏతీరున ఎంతవరకూ ఉందో నిరూపించాను. పత్రికలు గ్రహించగలిగే కొద్దిచోట్లలో అనవసరమనితోచి వివరణ చెయ్యలేదు. అందరికీ తెలిసిన విషయాలను సాగదీసి, అటునుంచి ఇటూ ఇటునుంచి అటూ త్రిప్పిత్రిప్పి, [illegible] పిష్టపేషణం చెయ్యడం విమర్శించే పద్ధతికాదుకదా!

శాస్త్రిగారు తమ వ్యాసం 'కవిత్వములో అర్థము అప్రధానముకాదు. అస్పష్టత ఆదరణీయ మునూకాదు' అన్న వాక్యద్వయంతో హఠాత్తుగా సినిమా ప్రారంభించినట్లు ప్రారంభించారు. దేని నాధారంచేసుకొని ఈ అభిప్రాయాల నిట్లా వ్యాసా రంభంలోనే ఉపన్యసిస్తున్నారు? ఈ అభిప్రాయాలు నేడు సర్వజనసమ్మతములూ సర్వజనజ్ఞాతములూనా? లేక శాస్త్రిగారి అభిప్రాయాలను పాఠకులకు ఉపదే శిస్తున్నారా? ఈ వాక్యాలకు సందర్భమూ అనుషక్తీ ఎక్కడివి? చాలామంది సాహిత్యవేత్తలు కవిత్వంలో అర్థం అప్రధానమనీ, అస్పష్టత ఉండకతప్పదనీ అభిప్రాయపడుతున్నారు. నా వ్యాసంలో ఈ అంశాలను గురించి నాకు చేతనైనంతవరకు చర్చించిచర్చించి కవి త్వంలో అర్థమే ప్రధానమనీ, అస్పష్టత ఉండకూడ దనీ ప్రతిపాదించాను. ఈ అభిప్రాయాలనుగురించి పత్రికలలో విప్రతిపత్తి ఇంకా ఉండనేఉంది. అట్టి స్థితిలో శాస్త్రిగారి రెండు అభిప్రాయాలూ జగ ద్విదిత సాధారణ సత్యములో, లేక స్వోపజ్ఞములో అన్నట్లు వ్యాసం ప్రారంభిస్తూనే నిరాధారంగా ప్రతిపాదించి వేశారు. 'విమర్శన బాధ్యతను నెత్తిన వేసుకొన్న యతడిట్లు ఊరక ఊహించవచ్చునా?

ప్రతిఫల తృష్ణ

శ్రీమతి ఆర్. వసుంధరాదేవి

సమయం పదిగంటలైంది. చైత్రమాసపు సూర్యుడు ఆటకాయితనంగా కొంచెం జోరు చూపిస్తున్నాడు. బయట వరండాలో పడుతున్న ఎండ చురుకుదనం వాకిట్లోంచి ముందు హాల్లోకి వచ్చి నన్ను చెమటతో స్నానం చేయిస్తోంది. విసవిసలాడుతూ విసుక్కుంటూ కూర్చున్నాను.

వాకిట్లో నీడపడ్డట్లయి తలెత్తి చూస్తే ఆ అమ్మాయి కన్పించింది. ఫురానా బిచ్చగాళ్ల ట్రేడ్ మార్కు అయిన నవ్వు మొహంనిండా అలుముకొని ఉన్నది. ఫురానా బిచ్చగాళ్లంటే నాకు సరిపడదు. మనల్ని మోసంచేసి అల్లించి బెల్లించి ధనంపాదించాలని చూస్తారు వాళ్లు. మోసపోవడమంటే నాకు మహామంట.

'ఇంత లోపలికి ఎందుకొచ్చావ్? బయటవుండి అడగరాదూ?' గద్దించాను.

'కోప్పడవద్దండి...ఏదో మేమూ బ్రాహ్మలం' అన్నది.

'మేము కాదు. ఇహపో' అన్నాను. నా తెలివికి నాకే నవ్వొచ్చింది.

'కోప్పడకుండా నా మాట కాస్త వినండమ్మగారు...' వినయంగా మంచి చేసుకోవడానికి ప్రయత్నిస్తూ అదే నవ్వుతో మాట్లాడుతోంది.

'అతి వినయం ధూర్త లక్షణం' అనుకున్నాను.

'ఊరికే కాలం వృథా చేసుకోకుండా ఇంకో చోటుకువెళ్లు. ఇక్కడేం లాభం లేదు' అన్నాను ధూర్తంగా, ఖచ్చితంగా. ఈ అమ్మాయి మోసంలో పడకూడదని ఘట్టిగా నిశ్చయించుకున్నాను. ఇదివరలో యిలాంటివాళ్ల కథలు వినడంవలన నమ్మకం కలిగింది నాకు. గుడ్డలో, డబ్బులో, బియ్యమో ముడుపు చెల్లించి వాళ్లనుపంపి తిరిగ్గా కూర్చుని 'ఛీ, దొంగమొహాలు. అన్నీ అబద్ధాలే చెప్పారు, ఇలాంటి వాళ్లకు ఏమైనా యివ్వడం తప్పు?' అని వాళ్లని నన్నూకూడా తిట్టుకున్నాను. మోసపోవడమంటే నాకు మహాచిరాకు. అందుకే యీ సారి ఖచ్చితంగా వ్యవహరిస్తున్నాను...కాని 'నా కోపానికి ఆ అమ్మాయి ట్రేడ్‌మార్కు నవ్వు ఏ మాత్రం చెక్కుచెదరలేదు.

ఆ అమ్మాయి వయస్సు ఇరవైకి పైనా పాతిక్కిలోపూ ఉంటుంది. సన్నగా పొట్టిగా ఉన్నది. మంచి పోషణ ఉంటే మంచి రంగే ఉండొచ్చు. కాని ఇప్పుడు ఆ రంగుమీద ఒక నల్లకప్పువేసిపోయింది. అనేకమైన వాకిళ్లలో ఎండలో నిల్చొని అడుక్కోవడాన్ని కావచ్చును. ఎండలో నిల్చొని, నల్ల కప్పువేసుకుపోతూ చెమటలు కార్చుకుంటూ అనువయంగా నవ్వుతూ అడగడమే సబబని ఆ అమ్మాయికి తోచి ఉండొచ్చును. నీడలోనికి జరిగి ఉండొచ్చుమగాని అలాగే ఎండలో నిలబడి మాట్లాడుతోంది. నేనూ జరగమనలేదు.

'నేను నిజంగా అడుక్కునేదాన్ని కాదమ్మ. హరికథలు చెప్పేవాళ్లం. ఏదో ఇప్పుడు ఆర్నెల్లబట్టి గొంతు రాసుకుపోయి కథలు చెప్పలేక అవస్థలికి తిరుగుతూ...అయిదు నిమిషాలు కథ చెప్పేసరికి గొంతు బొంగురుగా అసహ్యంగా అయిపోతుంది. అందుకని చెల్లెలి చదువుకోసం అడగవలసివచ్చింది...' ఫురానాబిచ్చగాళ్లు నిజంగా అడుక్కునేవాళ్లు కారు.

ఏదో ఒక ఉపద్రవంవచ్చి మీదబడటాన సహాయం కోసం వచ్చిఉంటారు. అంతా పాతకథే.

'ఇదివరలో రెండేళ్లప్పుడు యీ వూళ్లో కూడా చెప్పాను...'

ఆ అమ్మాయి చెప్పేవీ చెప్పబోయేవీ అన్నీ అబద్ధాలేనని ముందే నిశ్చయించేసుకున్నాను.

'అసహ్యంగా యిట్లా అడుక్కోకపోతే కూలి పనిచేసుకున్నా పొట్టగడుస్తుందే...అసలు నీవు కథ యీ వూళ్లో ఎప్పుడు చెప్పావ్? ఎక్కడ చెప్పావ్? నీ పేరేమిటి? ఊరేమిటి? ఎవరు చెప్పించారు కథ? రెండేళ్లప్పుడు మేం యిక్కడే ఉన్నాం. మాకెందుకు తెలియలేదూ?...' అనేకమైన సందేహాలు వెలిబుచ్చాను. అన్నిటికీ ఏవో కుంటిసమాధానాలు చెప్పింది. నా సందేహం ఆ అమ్మాయి పసిగట్టే ఉంటుంది. సందేహించబడటమే వాళ్లకు సహజం అయ్యుండాలి.

'మీరు చెప్పినట్లు అడుక్కోవడం అసయ్యమే గాని మరీ కూలిపని అలవాటులేదమ్మ. కథలు చెప్పే వాళ్లం. జైమినీభారతంలో మకరధ్వజాడికథా, అశ్వమేధయాగమూ అట్లాటివన్నీ చెప్తాం' అన్నది.

ఆ మాట తీరూ యాసా అన్నీ గమనించిన కొద్దీ ఆ పిల్ల హరికథలు చెప్పేపిల్లకాదని తోచింది నాకు. మకరధ్వజాడికథ చెప్పమన్నాను. టూకీగా చెప్పింది. కాని ఆ చెప్పేవిధానంలో 'ఈ అమ్మాయి కింతకంటే తెలియదు' అన్నట్లు తెలుస్తోంది. ఈ అమ్మాయి నన్ను బోల్తా కొట్టించాలనుకుంటోంది. నాకు ఆ అమ్మాయిని బోల్తాకొట్టించాలని మహాసరదాగావుంది.

'నీవు కథ చెప్పడం ఎక్కడ నేర్చుకున్నావూ?' అన్నాను.

'కూచిపూడిలో...చలపతిగారని ఆయనపేరు. గొప్పవారు, మీరు వినేవుంటారు. గొప్పకథకులు' అన్నది. ఆ అమ్మాయి ముఖంలోని నవ్వులో ఏమార్పూ లేదు. అదే నవ్వు. 'నన్ను నమ్మం. నాకేమన్నా యివ్వు' అన్నట్లుగాఉంది. 'మేము ఇక్కడే ఊటుకూరులో ఉంటున్నాం. ఒక రెడ్డిగారికి పొలంలో మేడ వున్నది. పెద్దమేడ. అందులో ఒక గది యిచ్చారు మమ్మల్ని వుండమని...మాదేం వుందమ్మ. నీచపు బతుకులు...అసలు మాది రేపల్లెలెండి. ఆస్తి అంతా అమ్ముకునిపోగొట్టుకుని యిక్కడికి వచ్చేసినం. గొప్పదేశమని, బతకొచ్చని' అన్నది.

ఈ అమ్మాయి మాట్లాడినకొద్దీ దురాగ్రహమూ, నీచత్వమూ, అబద్ధాలూ మరింతగా బయట కొస్తున్నాయి. అయితే వీళ్లు రెడ్డిగారి పొలంలోని మేడలోఉండే బాపతన్నమాట. అయితే నీచపు బతుకు అన్నది నిజమే అయ్యుండాలి. ఇలా అబద్ధాలు చెప్పుకుంటూ తిరిగి పైగా ఇంకొంచెం సంపాదించాలనుకుంటోందన్నమాట. ఈ పిల్లసంగతి తేల్చుకోవాలన్న పట్టుదల జాస్తిఅయింది. వాళ్లది రేపల్లె అనగానే నాకు ఉత్సాహం కలిగింది. మా పుట్టిల్లు రేపల్లె. 'చిక్కావులే' అనుకున్నాను.

'రేపల్లెలో నీ కెవరైనా తెలుసా?' అనడిగాను.

సందిగ్ధంగా మొహం పెట్టింది. 'నాకు అంతగా తెలియదనుకోండి. మా నాన్నగారికయితే...' అంటూ నసిగింది.

నేను అట్లాగే నిశ్చలంగా ఆ పిల్ల అబద్ధాన్ని చూస్తూ ఉన్నాను.

ఆ అమ్మాయి కొంచెం తికమకపడి 'ఆ తెలుసునండి. అక్కడ ఎక్కువగా కమ్మవారుంటారు. నరసింహారావు నాయుడుగారని పెద్దభూస్వామి. వారు మాకు బాగా తెలుసు' అన్నది.

పెద్దగా నవ్వాను. పడీ పడీ నవ్వాను. 'అక్కడ కమ్మవారు చౌదరి అని పెట్టుకుంటారుగాని నాయుడు అని పెట్టుకోరు' అన్నాను విజయోత్సాహంతో.

'ఉన్నారండీ. నిజంగా ఉన్నారే' అన్నది చెరగని నవ్వుతో.

'నీవు మాట్లాడుతుంటే తెలంగాణా యాస వినపడుతున్నది. మీది రేపల్లెకాదు' అన్నాను.

'ఇక్కడికి రాకముందు తెలంగాణాలో రెండేళ్లు కథలుచెప్తూ తిరిగిన మాట నిజమేగాని ఆయాస నాకు లేదే' అన్నది. అడగ్గానే రేపల్లెనుండీ తెలంగాణాకు మార్చింది రంగస్థలం. నిస్సహాయంగా నా వేపు చూసింది—వేటగాడు తరుముతున్న లేడి లాగా. 'నిజానికి కథలు చెప్పేది మా నాన్నగారే నండి. నేను ఏదో అక్కడా యిక్కడా ఓటూరి చెప్తాను. మా నాన్నగారే నాకు నేర్పించినరు. ఆయన చలపతిగారి దగ్గర నేర్చుకున్నారు...చలపతిగారు పది మందికీ తెలిసినవారు. ఇరవైఏళ్ల వయస్సులో చచ్చిపోయేముందుగూడా బెజవాడలో ఆయన కథ చెప్పినప్పుడు జనం ఇసుకవేస్తే రాలకుండా వచ్చేవారు. పళ్లెంలోవేసే చిల్లర డబ్బులే నూటపదహార్లు పైగా ఉండేవి...వారి కథ గురించి అల్పపు మనుషులం, మాకేం తెలుస్తుంది. మీ బోటి పండితులు గ్రహించుతారు...మా నాన్నగారుకూడా మంచిపేరు సంపాదించినరు. అనేక దేశాలు తిరిగినరు. ఇప్పుడిన్లా ఉన్నాం గాని అప్పుడు ఆయనకు ఎంత గౌరవం! ఎన్ని బహుమానాలు! ఎన్ని మెళ్లిషులు!' అన్నది.

'ఏమిటీ' అన్నాను అర్థంకాక.

'మెళ్లిషులంటామండి. మెచ్చుకున్నవారిస్తారు. కోటుకి తగిలించుకుంటారు' అంటూ చేతో అభినయంగా చూపింది. 'మెడల్సా?' అన్నాను, సిగ్గుగా నవ్వింది. 'అవునండి. పెద్దబంగారు జంధెమూ, బంగారూకడియాలూ అన్నీ ఉండేవి' అన్నది.

...బంగారుజంధ్యమూ, బంగారుకడియాలూ... కథచెప్పేదాను ఎగిరెగిరిచెప్తుంటే గొలుసూ చెవుల పోగులూ చేతికడియమూ ఎగిరెగిరిపడుతూ నల్లని శరీరంమీద మెరిసిపోతుంటే...అకస్మాత్తుగా నా మెదడులో మెరుపు మెరిసింది.

'పదిహేనేళ్ల క్రితం మీరు...వూరికి వచ్చారా?' అన్నాను.

ఆ అమ్మాయి మొహం సంతోషంతో విప్పారింది. ఇందాకటి క్వెశ్చన్‌మార్కున్నవ్వ మాయమై

పోయింది. 'అవునండీ, అవును. నేను, నా చెల్లెలూ, మా అమ్మాకూడా ఒచ్చాం. అన్నిచోట్లకీ పోయేవాళ్లం. బాగా జరుగుతున్న రోజులు. నాకు పదేళ్లుంటాయప్పుడు' అన్నది ఆనందంగా.

అయిదురోజులు బ్రహ్మయ్యగారికథ చెప్పాడు దాసు. మా ఊరివాళ్లకు దైవచింతన జాస్తి. వెంకటేశ్వరునికీ, శివుడికీ, పోతరాజుకీ, అంకమ్మకీ, అందరికీ పెద్దఎత్తున తిరునాళ్ళూ, బ్రహ్మోత్సవాలూ చేయిస్తారు. చుట్టుప్రక్కల్లో ఏ ఊరికి ఏదాసు ఒచ్చినా ఆయన్ని సగౌరవంగా ఆహ్వానించి కథ చెప్పిస్తారు. కథ చెప్పినన్నాళ్ళూ ఆ కథకుడు కథానాయకుడౌతాడు. అతని గొప్పతనం అందరిచేతా ఏకగ్రీవంగా ఒప్పుకోబడుతుంది. పూటకొక్క యింటి చొప్పున దాసుకూ అనుచరులకూ పోటాపోటీలతో ఆతిథ్యం ఇస్తారు. ప్రతిఇంట్లోనూ పూలదండవేసి సత్కారం చేస్తారు. 'వాళ్ళు పోళీలు చేసిపెట్టారా? మనం జిలేబిచేద్దాం'. 'వాళ్ళు సన్నజాజిమల్లెలదండ వేశారా? మనం మూడురూపాయలకు పూలహారం కట్టించివేద్దాం', 'మనం గులాబ్‌జాంచేసి...వెధవపూలదండ లెందుకూ, నక్కీదండ వేద్దాం'. 'వాళ్ళింట్లో దాసుకి పంచే ఉత్తరీయం పెట్టారుట, రాత్రికి మనం ఉంగరం చదివిద్దాం'. దాసు మంచిలౌకికుడు. నలభైఅయిదేళ్ల వయస్సులో, నల్లనిదృఢమైన శరీరంతో, ఎర్రనిపట్టుపంచే ఒంటినిండా బంగారునగలతో, ఎగిరెగిరి గంతులేస్తూ కథచెప్తూ, మధ్య మధ్యన పేలగా బంగారుగొలుసుగల వాచీలో టైం చూసుకుంటూ, ఆనాడు తనకు సత్కారం చేసినవాళ్ల ఘనతను సున్నితంగా వివరిస్తూ, మధ్యమధ్యన చందాలపళ్లెం పంపుతూ.....ఆ అయిదురోజులూ మా ఊరివారికి వేరేధ్యాసలేకుండా చేశాడు. దాసు ఎట్లా సత్కరిద్దామా అన్న పోటీలు పెరిగిపోయాయి. దాసు విశ్వబ్రాహ్మణుడు. బ్రహ్మయ్యగారు విశ్వబ్రాహ్మణులనే విషయం మరవటానికి వీల్లేకుండా కథ చెప్పాడు. విశ్వబ్రాహ్మణసంఘంవారు పదిరూపాయలనోట్లను దండగ్రుచ్చి ఆ సభలో దాసు మెళ్లో వేసి ధన్యులయ్యారు. వాళ్లిచ్చిన చందాలే నాలుగు వందలపైకి పోయాయి.

బ్రహ్మయ్యగారు సమాధిఅయ్యేరోజున నేను వెళ్లాను. మూడురోడ్ల కూడలిలో వేదికమీద దాసు. మూడురోడ్లమీదా ఫర్లాంగుదూరంవరకూ క్రిక్కిరిసి కూర్చున్న జనం. మామూలుగా కాలేజికి వెళ్లేప్పుడు చెప్పులులేకుండా ఆ రోడ్డుమీద కాలుపెట్టాలంటే అసహ్యం నాకు. ఆ రోజున బ్రహ్మయ్యగారికి మనసులో ఓ నమస్కారంచేసుకుని ఆ ఉమ్ములమట్టిలో కూర్చున్నాను. 'బ్రహ్మయ్యగారు సమాధి అయిపోయాక చందాలు తీసుకోము. సమయం దగ్గరకొచ్చేస్తోంది. ఇవ్వాలనుకున్నవారంతా వెంటనే పళ్లెంలో వేసి తరించండి. ప్రజల సౌకర్యంకోసం మూడు వైపులకీ మా మనుష్యులను ముగ్గురిని మూడు పళ్లెలతో పంపుతున్నాం. ఇంకో అరగంటటైం... పదిహేను నిముషాలు.....అయిదు నిముషాలే..... ముహూర్తం సమీపిస్తోంది...బ్రహ్మయ్యగారు లేచారు. సమాధివద్దకు బయల్దేరుతున్నారు...అవకాశం మించిపోతోంది? బంగారువాచీలో టైం చూసుకుంటూ చిరునవ్వుతో దాసు హెచ్చరిస్తుంటే అనాలోచితంగా చేతిలోఉన్న రూపాయిని చందాలపళ్లెంలో వేశాను. అవకాశం మించిపోతుందన్న ఆత్రంలో కొంగుముళ్లు ఆత్రంగా విప్పేవారు బొడ్లో తడుముకునేవారు, 'యిదిగో, యిక్కడ, యిక్కడ' అంటూ కేకలువేసి, ఆత్రంగా ముందుకువంగి చందాలువేసే వారితో గల్లంతయిపోయింది. కొంతసేపూ...అంతకుముందూ ఆ తరువాతా ఎందరో దాసులువచ్చి ఎన్నోకథలు చెప్పారు. కాని అతని బంగారు జంధ్యాలూ, ఎత్తు భారీతనమూ వాళ్లకు లేవు. అతని లౌక్యం వాళ్లకులేదు.

'మావి నీచపు బ్రతుకులు. మా సంపాదన ఎంత ఒచ్చినా మాయమై పోతది. ఎట్లా పోతదోనని ఆశ్చర్యంగా ఉంటుంది. ఒక్కోసారి రోజుకి యాభై వంద, రెండొందలూ...అల్పపు బ్రతుకులు గనుక ఆవిరై పోతుందనుకుంటాను' తను చెప్పగా అందరూ ఒప్పుకున్న ఆ నిజాన్ని దానం చేసేవాడు పుచ్చుకునే

వాడిలో చూసే అల్పత్వాన్ని—నన్నూ జాలిపడమన్నట్లు చూసింది......అప్పుడు పట్టుపావడాలో బంగారు గొలుసూ గాజులతో దర్జాగా ఉండి పాటలు పాడిన పిల్ల దాసుగారి కూతురి...

'మీ నాయన నీకు పెళ్లెందుకు చెయ్యలేదు?'

అందరూ అడిగే ప్రశ్నకాదేమో. ప్రేమ్ మార్కు నవ్వు చెదిరిపోయింది. మొహంమీది నల్ల కళ్ళు మరింత నల్లబడింది. చెమట చుక్కలు చుక్కలుగా మొహం నిండా పరుచుకుంది. నీరసంగా కొంగుతో చెమట తుడుచుకుంది.

'ఆడదాని బ్రతుకెంతమ్మా. పెద్దమనిషయ్యాక పదేళ్ళు ఆడది. ఈ మాత్రపు భాగ్యానికి పెళ్ళి ఆ బాదరబందీ ఎందుకు చెప్పండి?'

'నేను నిన్ను సంతోషపెట్టానా?' అంటూ పెంపుడుకుక్క యజమానిని ప్రశ్నార్థకంగా చూసి నట్లు చూసింది. ఆ చూపుకు తట్టుకోలేక పోయాను. దాసుమీద, సంఘంమీద, పరిస్థితుల మీద, నామీద అన్నింటిమీదా కోపం వచ్చింది. చేత గాని వాళ్ళకొచ్చే కోపం.

'పదేళ్ళం. పాతికేళ్ళు. ముప్ఫైఏళ్ళు... మనిషి బ్రతుక్కి ఒక పరిమితి ఉంది. అందుకని బ్రతకటం మానేస్తామా?...అల్పత్వం, నీచత్వం అంటూ వేషం వెయ్యకు. మీ అమ్మా నాన్నా ఎందుకు నీకు పెళ్ళి చెయ్యలేదు? నీవు వెళ్ళిపోతే వాళ్ళ సంసారం గడవదనా?'

ఆ అమ్మాయి ముఖం మరింత వాడిపోయింది.

'అవునమ్మా. వాళ్ళు జబ్బులతో, ముసలితనంతో చేత కాని వాళ్ళయిపోయారు. చెల్లెలు చదువుకుంటుంది. నాకు పెద్దసంబంధాలు ఎక్కడ తెస్తారు?'

ప్రతిమనిషి జీవితమూ ఒక కథ. కర్మ సూత్రాలకు కట్టుబడి నడిచేకథ. పైకి కనిపించే బాధ్యతారహితమైన పరాన్నభుక్కు నిర్జీవను వెన కాల ఎన్ని అగాధాలు! ఆ అమ్మాయి జాలితనంతో ఏడవకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కొంటున్నందుకు మనసులోనే అభినందించాను. ఆ అమ్మాయిని గురించి జాలిపడటానికి నే నెవర్ని! అబద్ధమో నిజమో కథలు చెప్పి బ్రతకాలని ఆ అమ్మాయి నిశ్చయించుకుంటే దాన్ని కాదనటానికి, ఆ అమ్మాయిని హింసించ టానికి నాకేం హక్కున్నది?

పాతచీర బియ్యం యిచ్చాను.

అవి తీసుకుని వెళ్ళలేదు. 'అమ్మా. తమరు ఒక్క అప్పడధికమూ పెడమనలేదు...తమరిదే వూరు? ఏం పేరు? ఏం పని? ఏం కులస్థులు?...' ఇంకో కథ ప్రారంభించింది.

నాకు నవ్వొచ్చింది. 'ఇహ వెళ్ళు' అన్నాను.

'సంభావన ఏదైనా...' అన్నది.

'ఇంకో కథ ఇంకోచోట చెప్పి సంపాదించుకో. నీ నోటినిండా కథలు ఉన్నాయి. నీకేం పరవాలేదులే' అన్నాను.

ఆ పిల్ల నెత్తిమీద ఒక మొట్టికాయ వెయ్యా లనిపించింది. వెయ్యకుండా నవ్వాను. ఆ అమ్మాయీ నవ్వింది. ప్రేమ్‌మార్కు నవ్వుకాదు...నవ్వుతూ వెళ్ళి పోయింది ...

ఆధునిక తెలుగు కథానిక - దాని అందచందాలు

శ్రీ విహారి: శ్రీ శాలివాహన

కథ ఉపదేశంకాదు. కథ వేదాంతమూకాదు. కథ సాంకేతికవిజ్ఞానంకాదు.

కాని, కథద్వారా ఉపదేశాన్ని అందించవచ్చు. కథద్వారా వేదాంతాన్ని ప్రబోధించవచ్చు. కథద్వారా సాంకేతికవిజ్ఞానాన్ని పరిచయం చేయవచ్చు. వీటిలో ఏది సాధింపబడాలన్నా కథ మంచిదై వుండాలి.

అయితే మంచికథ ఎలాంటిది?

Poe నిర్వచనం ప్రకారం మంచికథ అంటే ఇది. "It is a piece of fiction dealing with a single incident—material or spiritual that can be read at a sitting. It is original, it must sparkle, excite or impress and it must have unity of effect or impression. It should move in an even line from its exposition to its close."

ఫ్రెంచివారు ఇంతకంటే సూక్ష్మమైన లక్షణం చెప్పేరు. 'The ones which can be told on a 'short breath' are the best stories' అని. ఒకేఒక సంఘటన లేక సంభవం; ఒకేఒక మనస్తత్వచిత్రణ, లేక మానవతాలక్షణాన్ని ఆధారం చేసుకుని—సంక్షిప్తత; వస్త్వైక్యం కలిగి పాఠకుని మనసు నాకట్టుకుని అతణ్ణి ఉత్తేజితుణ్ణి జేసేది మంచికథ.

ఇలాంటి మంచికథలు తెలుగులో—ఈ రోజుల్లో రావటంలేదనే అభిప్రాయం కానీయండి, అభియోగం కానీయండి—సామాన్యపాఠకుని మొదలు పుస్తకసమీక్షకులతోపాటు సాహిత్యవిమర్శకులవరకూ—అందరూ వెలిబుచ్చుతూనే వున్నారు. ఇది యథార్థమేనా? యథార్థమే అయితే ఈనాటి తెలుగు కథకుల్లో అందరూ అంటున్నట్లు 'స్తబ్దత' ఏర్పడిందా? కథాసాహిత్యానికి సంబంధించిన వాస్తవపరిస్థితి ఏమిటి? పరిశీలిద్దాం.

పాశ్చాత్యసాహిత్యప్రభావ ఫలితంగా ఈ శతాబ్దపు మొదట్లో తెలుగు సాహిత్యంలో తీవ్రమైన పరిణామాలు సంభవించేయి. ఈ పరిణామాన్ని స్థూలంగా మనం 'సాహిత్యంలో ఆధునికత'గా గుర్తించవచ్చు. కారణమేమంటే—1910 వ సంవత్సరం ప్రాంతంలో వెలువడిన ఆంగ్లసాహిత్యం—ప్రత్యేకించి ఎజ్రాపౌండ్, జాయిస్, వర్జీనియా ఉల్ఫ్, టి. యస్. ఎలియెట్ మొదలగువారి కొత్తకొత్త ప్రయోగాలు సాహితీవేత్తల్లో ఆలోచనల్ని రేకెత్తించి, ప్రపంచ సాహిత్యాన్ని ప్రభావితం చేసేయి.

Mr. Benett and Mrs. Brown అనే గ్రంథంలో వర్జీనియా ఉల్ఫ్ '1910 ప్రాంతంలో మానవ ప్రకృతి మారిపోయింది' అంది. 'ఇంచుమించు అదే కాలంలో మానవ ప్రకృతి మారకున్నా మానవ ప్రకృతిని గురించిన కొన్ని అభిప్రాయాలు మారేయి' అంటాడు వాల్ట్ అలెన్ The 'English Novel' అనే గ్రంథంలో.

దీనికి కారణం 1910 లో ఫ్రాయిడ్ చేసిన అపూర్వ ప్రయోగ ఫలితం, క్రొంగ్రొత్త మానసిక సిద్ధాంతం—'సైకో ఎనాలిసిస్'ను ప్రపంచానికందించాడు. మనిషిలోని సుప్తచేతన అతని బాహ్య ప్రవర్తనని నిర్దేశిస్తుందనే సూత్రం ప్రచారంలోకి

వచ్చింది. లోకంలో విలయ తాండవం చేస్తున్న 'చెడు' అంతా సమాజగతమైనదికాదు, వ్యక్తిగతమైనదే అనే ఆలోచన కలిగింది. మనిషి బాహ్యప్రవర్తన, అతని స్థితిగతులు, అతని కష్టసుఖాలు—వీటన్నిటేని గురించిన విచారణకంటే వీటి వెనుకదాగిన మానసిక క్లేశం, వీటి Manifestation కి కారణభూతమైన మనస్థితి—ఈ విషయాలను గురించిన ఆలోచన పెరిగింది. అంటే, మనిషిని చూడటంకాక, మనిషిలోనికి చూడటమన్న మాట. ఇది అంతర్దృష్టి. 'ఈ అంతర్దృష్టి ఆధునికతయొక్క ముఖ్యలక్షణం.'

సాహిత్యంలో—ప్రత్యేకించి కాల్పనిక సాహిత్యంలో—ఫ్రాయిడ్ సిద్ధాంతం కొత్త ప్రయోగాలకు అవకాశం కల్పించింది. రచనయొక్క పరిధిని విస్తృతం చేసింది. కాల్పనిక సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్ని పరిపుష్టంచేసి రచయితల్లోకూడా అంతర్దృష్టిని కలిగించింది.

ఈ మార్పుల్లో మరో మలుపు—ఫ్రెంచి తత్త్వవేత్త బెర్గ్సన్ ప్రతిపాదించిన కాలగమన సిద్ధాంతం. భూత భవిష్యత్ వర్తమానాలనే కాల విభజన అర్థరహితమనేది ఈ సిద్ధాంతంలోని మూల విషయం. కాలం అనేది జీవనది వంటిదంటాడు బెర్గ్సన్. అందుకే T. S. Eliot అంటాడు, 'Time past and time future are perhaps present in time present' అని. ఈ సిద్ధాంతాన్ని నమ్మే రచయితలు కథని కాలానుగుణంగా విభజించటానికి వ్యతిరేకులు. దీని ఫలితంగా ఆవిర్భవించిన 'చైతన్య స్రవంతి' (Stream of Conciousness) పద్ధతి—పాత్రయొక్క అంతరంగ పరిస్థితిని 'ఫొటోగ్రాఫ్' చేస్తుంది.

ఫ్రాయిడ్ ప్రతిపాదించిన 'సైకో ఎనాలిసిస్'; బెర్గ్సన్ ప్రతిపాదించిన కాలగమనసిద్ధాంతం, వీటితోపాటు ప్రాదుర్భవించిన ప్రతీకవాదం—'సింబాలిజమ్'—ఇవన్నీ సాహిత్యంలో ఆధునికతని ప్రోది చేసేయి. అయితే, అసలు ఆధునికతఅంటే ఇవేవీ కొవ్వునూరచయిత — సమకాలికతమై [illegible] ప్రశ్నాజ్ఞ శేయు స్కామియ్యేచేప్పే రచనే ఆధునికరచనఅనే అభిప్రాయమూ ఒకటుంది.

ఏ దృష్టితో పరిశీలించినా 1910 తర్వాత వెలువడిన తెలుగుకథల్లో ఈ ఆధునికత చోటుచేసుకుంది, కాని—దాని పరిమాణం తక్కువ. అంటే ఇదొక వెల్లువలా కథాసాహిత్యాన్ని తాకలేదు. దీనికి కారణంవుంది.

ఆధునిక యుగంయొక్క బాహ్యలక్షణాల్లో ఒకటి—పౌరజీవితాన్ని కల్లోలితంచేసే యుద్ధసన్నాహాలు విరమింపబడటం; రెండవ ప్రపంచయుద్ధం ముగిసినతర్వాత ఈ పరిస్థితి నెలకొంది. నేరాలు వుండవచ్చు, ప్రచ్ఛన్నయుద్ధాలు అంతంకాకపోవచ్చు; కాని పౌరజీవిత పరిధిలో వ్యక్తి స్వేచ్ఛాజీవిగా మసలటానికి, కళాసాహిత్యవిజ్ఞానాల్ని అభివృద్ధి చేసికోవటానికి మునుపటికంటే అవకాశాలు పెరిగేయి. దీనివలన సహనం, సహజీవనకాంక్ష కలిగేయి. జ్ఞానసముపార్జనాసక్తి పెల్లుబికింది. సత్యాన్వేషణ, హేతువాదదృష్టి అలవడినాయి. వీటన్నిటి ప్రభావం సాహిత్యంమీద కనపడింది.

ఈ కారణాన 1945 తర్వాత వెలువడిన తెలుగు కథల్లోని ఆధునికతని గురించి మాత్రమే విచారించటానికి పూనుకుంటున్నాము.

ఉత్తమకథాలక్షణాలు వస్తువు, శిల్పం, శైలి—ఈ మూడింటినీ ఆశ్రయించుకుని వుంటాయనేది నిర్వివాదాంశం. కనుక, వీటిపరంగానే ఆధునిక తెలుగు కథానికనీ, దాని అందచందాల్ని పరిశీలిద్దాం.

కథ చెప్పటానికి కథగా పనికొచ్చే విషయం కావాలి. అది ఇతివృత్తం లేక కథావస్తువు. రచయిత ఎన్నుకొనే ఇతివృత్తం కథానిర్మాణానికి అనుకూలించేదిగా వుండాలి. 'By theme we refer to the presence in the story of an area of an abstract matter, of meaning, that comes in for treatment, illumination in the story as a whole.'

అయితే — కథా — నిర్మాణానికి [illegible]

వున్న వస్తువు వాస్తవికంగా వుండాలా, అక్కర్లేదా? ఉండాలనేది ఒక వాదం. ఈ వాస్తవికతా వాదం—Naturalism—గత శతాబ్దపు చివరిభాగంలో—Romanticism పై కలిగిన విరక్తి ఫలితంగా సాహిత్యంలో—చోటు చేసుకున్నది. మనిషిని అతని చుట్టూవుండే పరిసరాలూ పరిస్థితులూ ప్రభావితం చేస్తాయనీ, అవే అతన్ని పూర్తిగా మార్చివేస్తాయనీ ప్రతిపాదిస్తుంది Naturalism. ఈ సిద్ధాంతాన్ని తమలో జీర్ణించుకుని ఎందరో రచయితలు ఎన్నెన్నో కథలు వ్రాసేరు, ఇంకా వ్రాస్తున్నారు. కాని, కథలో పోషించబడవలసిన వాస్తవికతకీ, ఈ వాస్తవికతా వాద సిద్ధాంతానికీ తేడా వుంది. కథలో కావలసింది కళాత్మకమైన వాస్తవికత. 'వక్త వ్యాసాన్ని చదువుతున్నాడు.' అన్నదాంట్లో వాస్తవికతలేదు; 'వక్త వ్యాసాన్ని చదువుతూ కాలు ఆడిస్తున్నాడు' అన్నదాంట్లో వాస్తవికత వుంది.

ఒక సంఘటనని లేక వొక సంభవాన్ని చూసింది చూసినట్లు వ్రాయటం Reportage. 'రాజుగారు మరణించారు, రాణీగారూ మరణించారు' అన్నామనుకోండి. దీనిలో ఇతివృత్తం లేదు. ఇది Reportage. అలాకాక, 'రాజుగారు మరణించారు, ఆ తర్వాత రాణీగారూ మరణించారు—భర్తృ వియోగ దుఃఖంచేత' అన్నామనుకోండి. ఇక్కడ ఇతివృత్తం వుంది.

ఆధునిక కథా రచనలో పాత్ర సృష్టికి శ్రద్ధ పెరిగింది, పాత్రయొక్క వ్యక్తిత్వ నిరూపణకు ప్రాముఖ్యమూ పెరిగింది. దీనితోపాటు తాను నివసిస్తున్న సమాజ స్వరూపాన్నీ, సమాజంలోని కొన్ని విచిత్రమైన పరిస్థితుల్నీ, కొందరి విలక్షణమైన మనస్తత్వాల్నీ, వ్యక్తిత్వాల్నీ—కథల్లో ప్రస్ఫుటీకరించటానికి రచయిత ప్రయత్నిస్తున్నాడు. 'Penetration into character, richness of back ground, psychological depth or effect of any kind or some impulsive element of moral or intellectual weight' వి 'Specific gravity' అంటాడు H. S. Canby అనే అమెరికన్ రచయిత. ఇతివృత్తంలో ఈ 'Specific gravity' వుంటే కథ ఉత్తమ కథగా రూపొందించబడవచ్చు.

మరోతరహా ఇతివృత్తాలు కథల్లో చోటు చేసుకున్నాయి. ఒకానొక మానవాతీతశక్తి వున్నట్లా లేనట్లా?—అనే విచికిత్సకి సంబంధించినవి ఇవి. మనిషి చేతలకు, ప్రయత్నాలకు, సాధనలకు అవల మరో సకలాతీత శక్తి వుంది. ఈ చేతలకు, ప్రయత్నాలకు, సాధనలకు ఫలితాన్ని నిర్ణయించి నడిపించేది ఆ శక్తే అనే నమ్మకం కథల్లో ఎక్కువగానే ప్రచారం చేయబడుతోంది. దీన్ని సమర్థిస్తూ అంటాడు T. S. Eliot 'The wholc of modern literature is corrupted by what I call Secularism, that is simphy unaware of, simply cannot understand the meaning of. the primacy of supernatural over the natural life.'

ఆధునిక తెలుగు కథాసాహిత్యంలో పైన పేర్కొన్న అన్నిభావాల ఛాయలూ గోచరిస్తున్నాయి. వీటి సమీక్షకు వస్తువిభజన అవసరం.

మొట్టమొదటిరకం కథలు 'ఆకలి—పేదరికం'కు సంబంధించినవి. మనిషికి స్వతస్సిద్ధంగా వున్న ముఖ్యమైన Instinct ఆకలి. ఎన్ని ఆర్థిక రాజకీయ సంస్కరణలు అమలులోకివచ్చినా; ప్రభుత్వం పరిపాలన సాగించినా—బహుశః మనిషి వున్నంతవరకూ ఈ 'ఆకలి' సమస్యకి అంతంలేదేమో ననిపిస్తుంది. తెలుగు కథల్లో ఈ వస్తువు ఆధారంగా రచింపబడిన అత్యుత్తమకథ 'పిరకుంకుమ' (మునిపల్లె రాజు). ఇందులో రాయలసీమలో 'కఱువు' చేసిన విలయతాండవాన్ని రచయిత కళ్ళకు కట్టేట్టు చిత్రించేరు. అలాగే శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం 'ఆఖరిఅంకం' అని చాలా చక్కనికథ వ్రాసేరు. మధ్యతరగతి అభాగ్యురాలు—పేదరికం—పిల్లలుంటారు. వాళ్ళ ఆకలిబాధని మాన్పటానికి విషంకలిపినఅన్నం పెడుతుంది. శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి ఒక

పేదయువకుడు ఇంటింటికీ తిరిగి నీళ్ళబిందెలు చేరవేసే ఇతివృత్తంతో 'పాములాంటి బ్రతుకు' అని ఓ కథ వ్రాసేరు. మధ్యతరగతి గుమాస్తా—అప్పుల్లో మునిగి తేలుతున్న వ్యక్తి — అప్పులవాళ్ళందరికీ ఎప్పుడూ 'రేపటిదాకా ఆగు' నీ బాకీ పూర్తిగా చెల్లించివేస్తానని చెప్తూ రోజులు నెట్టుకొస్తూ వుంటాడు. కానీ ఓరోజున—అతనే రేపటిదాకా ఆగడు. శ్రీ జొన్నలగడ్డ రామచంద్రరావు కథ 'రేపటిదాకా ఆగు'లో ఇతివృత్తం ఇది.

మతసహనాన్ని పాటించాలి, కులతత్వాలు నిర్మూలించాలి, జాతివిద్వేషాల్ని అంతంచేయాలి—అని ప్రపంచమంతా భావిస్తోంది: ప్రయత్నిస్తోంది. కాని నాగరికత పెరుగుతున్న ఈ రోజుల్లోకూడా, జాతి వైషమ్యం సమసిపోలేదు; మతవిద్వేషం చల్లారలేదు, కులవిభేధం రూపుమాసిపోలేదు. ఈ దురదృష్టకర పరిస్థితిని ప్రతిబింబిస్తూ వెలువడుతూనేవున్నాయి కథలు. ఉదాహరణకు శ్రీ సి. రామచంద్రరావుగారి 'నల్లతోలు'; శ్రీ కలువకొలను సదానందగారి 'మాలా—మనిషీ'; శ్రీ జి. భామగారి 'ఆకాశచిత్రాలు'; శ్రీ కమలాకాంత్ రాసిన 'మంటలు' చెప్పుకోవచ్చు.

గ్రామసీమలు దేశసౌభాగ్యానికి వెన్నెముకవంటివనే నినాదం మనం వింటూనేవున్నాం. గ్రామపునర్నిర్మాణధ్యేయంతో పంచాయతీరాజ్యం వచ్చింది. మూడేళ్ళకో ఆరేళ్ళకో ఎన్నికల తిరునాళ్ళ జరుగుతోంది. కాని, రోజురోజుకూ, మనిషికీ మనిషికీ మధ్య వర్గవిద్వేషాలు, కక్షలు, వైషమ్యాలు పెచ్చుమీరిపోతున్నాయి. ఈ విషయం వస్తువుగా తెలుగు కథలు చాలా రచించబడినాయి. క్రీ. శే. బుచ్చిబాబు రచించిన 'పాతవంతెన—కొత్తనీరు' మేము వ్రాసిన 'సాగరసంగీతల', శ్రీ యస్. సర్వేశ్వర రెడ్డి వ్రాసిన 'వాగులేరు నవ్వింది' మొదలైన కథల్లో గ్రామరాజకీయాల పరికాష్ఠ, పర్యవసానాలు చిత్రితమైనాయి.

మహనీయులంతా ఎన్నెన్నో త్యాగాలుచేసి స్వాతంత్ర్యం సంపాదించి మనకిస్తే, మనం అవినీతిని బాగా సంపాదించుకున్నాం. సమాజంలో ఏమూల చూసినా అవినీతి. దీన్ని ఆధారంచేసుకుని శ్రీ రా. వి. శాస్త్రిగారు '(Series)' గా కథాసంకలనాలు ప్రచురించేరు—'ఆరు సారా కథలు, ఆరు సారో కథలు' మొదలైనవి. ఓ గుమాస్తావుంటాడు. అతడు పనిచేసే ఆఫీసు చాలా ఖరీదైనది. అతని సీటు మరీ ఖరీదైనది. 'బరువుం'చితే తప్ప కాగితాన్ని తన దరిదాపులక్కూడా రానీకుండా నెట్టి పారేసే సీటది. సదరు గుమాస్తా కుర్రాడు, కాలేజీనుంచీ ఆ యేడే బయటపడ్డాడేమో ఆశయాలూ గట్రాపెట్టుకున్న తెలివి తక్కువవాడు. అతన్ని ఆ సీట్లో కాగితాలు బతకనివ్వవు; ఆ సీట్లో కాగితాలకోసం వాచ్చే పార్టీలూ బతకనివ్వవు. అతను పాపం— నిస్సహాయంగా 'బతకనివ్వండి' అని గగ్గోలెడతాడు. శ్రీ ఆదివిష్ణు కథ ఇది. ఆఫీసరు పదవిలోవుండి కూడా పైవాళ్ళ అధికారానికి లొంగిపోయి, ఆత్మవంచన చేసుకుంటూ, అడ్డదారులు తొక్కవలసిన స్థితి ఏర్పడుతుంది—'ముళ్ళకిరీటం' కథలో హీరోకి. శ్రీ హవిస్ వ్రాసేడు. ఉన్నట్టుండి దేశంలో ఎక్కడో, ఎలాగో, ఏదో ఆందోళన, అలజడి ప్రారంభమౌతాయి. అవి పెరిగి కార్చిచ్చుగా మారి దారుణమైన పరిణామాలకు దారితీస్తాయి. ఇదొక అరాచకత్వం, అవ్యవస్థ. వీటివలన అన్నెం పున్నెం ఎరుగని అమాయకులు బలికావటం మనం చూస్తూనే వున్నాం. క్షణికమైన ఉద్రేకానికి లొంగి; అర్థరహితమైన ఆవేశంతో రెచ్చిపోయి ఒక విందు ప్రాణిని తగలబెట్టటం కథావస్తువుగా తీసుకుని బీనాదేవి 'కుంకుమ ఖరీదు పదివేలు' అని అత్యుత్తమ కథని రచించారు. తెలుగువాడు కాలరెత్తుకుని 'ఇదిగో గొప్ప తెలుగు కథ' అని జాతికి చూపదగిన కథ ఇది.

మనసు కోతిలాంటిదంటారు. దానితత్వం క్షణానికోవిధంగా మారిపోతుంది. మనిషికీ మనిషికీ మళ్ళీ వైవిధ్యం. సున్నితమైన ఒకానొక మానసిక లక్షణాన్ని తీసుకుని పాఠకుని మనసులో పదికాలాలపాటు

విరిచే కథలు ఎక్కువగానే రచింపబడుతున్నాయి. కీ. శే. బాలగంగాధరతిలక్ 'దొంగ' అని మంచి కథ రాసేరు. తాను దొంగతనానికి వో యింట్లో ప్రవేశించి—ఆ యింటి యజమాని భార్య గొలుసుని పేకాటకోసం బలవంతాన తెంచుకుపోబోతూవుంటే చూసి ఆవేశంగా లోపలికిపోయి వాణ్ణి చివాట్లు పెడ్తాడు. అలాగే శ్రీ అరిగే రామారావు రాసిన 'సచ్చినోడు' కథ సునిశితమైన స్త్రీమనస్తత్వాన్ని తెలుపుతుంది. శ్రీ అవసరాల రామకృష్ణరావుగారు 'చివరకు మిగలనిది' అని వో కథ వ్రాసేరు. అందులో వో బిచ్చగత్తె తాను అడుక్కుని సంపాదించిన డబ్బంతా, చీకి మాసిపోయిన బొంతలో పెట్టి కుట్టి, దానిమీదనే పడుకుని ప్రాణాలు విడుస్తుంది. 'మనిషి బొమ్మ' అని శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం కథవుంది. దాన్లో అప్పుడే ఉద్యోగంలో చేరిన కుర్రవాడు—చుట్టూ బాదరబందీకలవాడు, తన బాధ్యతల్ని గుర్తించినవాడు—కథానాయకుడు. అతన్ని ఆఫీసులో తోటి గుమాస్తాలంతా హేళనచేస్తూ 'టీజ్' చేస్తూవుంటారు—అతను తమలా భేషజంగా వుండనందుకు. తేనిగొప్పలకుపోవటం ఇష్టంలేని అతను వాళ్ళందరిమధ్యా బ్రతకటానికి ఎన్నో అగచాట్లుపడతాడు. అతని ఆవేదన చాలా గొప్పగా వర్ణింపబడినది ఆ కథలో. మంచి కథ. అలాగే ఒక డాక్టరు మనస్తత్వాన్ని ఆధారం చేసుకుని ఉత్తమంగా రచింపబడిన కథ 'విద్యుల్లత విరిసింది'—బీనాదేవి. శ్రీ భమిడిపాటి రామగోపాలం — 'పూర్ క్రీచర్స్', శ్రీ సింగరాజు రామచంద్రమూర్తి 'అంతర్యం', శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య—'ముసురు', శ్రీమతి వత్రిరామసీత—'కోరిక', శ్రీమతి నెల్లూరు జయప్రద—'జిజ్ఞాస' మొదలైన కథలు ఈ కోవకి చెందినవి. పిల్లల మనస్తత్వాన్ని ప్రధాన వస్తువుగా స్వీకరించి వ్రాయబడిన కథల్లో ఉత్తమమైనవి వున్నాయి. 'పసిప్రాయము లు' (శాలివాహన), 'మనసు—మమత' (శ్రీమతి టి. విజయలక్ష్మి), 'పట్టు పరికిణి' (ఉమ), 'అమ్మ' (శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మ) మొదలైనవి.

ఆంగ్లంలోని సింక్లెయర్ లూయిస్; జేమ్స్ థర్బర్; ఇ. బి. వైట్ మొదలైన రచయితల వరవడిలో; తెలుగులో తన అనన్యసామాన్యమైన ప్రతిభా వ్యుత్పత్తులతో, ఒక విలక్షణమైన శైలిలో 'సెటైర్స్' వ్రాసి గొప్పసంచలనం తెచ్చిన రచయిత శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ. ఇతను ఎన్నో 'ట్రిక్స్' చేసి పాఠకుల్ని తన కథలతో ఆనందింపజేసేడు. ఈ కథల్లో బయల్పరచబడిన సమాజస్థితిగతులు; వ్యక్తి ప్రవర్తన తెలుగుకథల ఔన్నత్యాన్ని చాటి చెప్తాయి. అలాగే శ్రీ సోమంచియజ్ఞన్నశాస్త్రిగారి కథలు—ప్రత్యేకించి వారి 'ఫైళ్ల పరిభ్రమణం' (Red-Tapism మీది సెటైర్); శ్రీ వాకాటి పాండురంగారావ్‌గారి కథలు—ప్రత్యేకించి వారి 'రెండు రెక్కలవాడు' 'నిచ్చెన'; 'సెటైర్స్'లో ఉత్కృష్టమైనవి.

హాస్యకథలు రచించి లబ్ధప్రతిష్ఠులైన కథకుల్లో పైన తెల్పిన ముగ్గురూ వున్నారు. వీరుకాక, శ్రీ తంబు 'పెళ్ళొద్దు బాబోయ్', 'తిరిగొచ్చినకథ' మొదలైన కథలు వ్రాసి జనాన్ని నవ్వించేడు. శ్రీ పెండ్యాల నాగాంజనేయులు 'కాముడు' కథని తలచుకుంటే (వోసారి చదివినవారికి) చాలు నవ్వొస్తుంది. శ్రీమతి భానుమతీరామకృష్ణ హాస్యాన్ని మరోవైపు మళ్లించి—(అత్తగార్లమీదికి) — తన కథల కోక ప్రయోజనాన్ని సిద్ధింపజేసుకున్న కథకురాలు.

మరోరకం కథల్లో వస్తువు అమూర్తమైనది. అంటే Abstract. ఈ Abstract stories లో సమాజంలోని నైతికవిలువలకు కుటుంబ జీవితాల వెలుగునీడలకు సంబంధంవుండదు. 'ఎవరికి ఎవరూ ఏమౌతారో' అనేవిధంగా ఎవరికీ పరిచితంకాని కల్పనకి ప్రాముఖ్యం వుంటుంది. ఇలాంటి కథల్లో చెప్పుకోదగినవి శ్రీ గొల్లపూడి మారుతీరావు వ్రాసిన 'రోమన్ హాలిడే'; 'త్రిపుర' వ్రాసిన 'వంతెనలు' కథలు.

—ఇక పోతే శిల్పం :

ఆ మేడ అందంగావుంది అనగలం. ఆ అందం ఎక్కడెక్కడ గోచరిస్తోందో తెలియజేయగలం. అంతే గానీ ఆ అందానికి నిర్వచనమివ్వలేము. అలాగే, కథా శిల్పాన్ని నిర్వచించటం సాధ్యంఅయ్యేపనికాదు.

ఇతివృత్తాన్ని ఆధారంచేసుకుని, దానిచుట్టూ సంఘటనల్ని కూర్చుకుంటూ కథని అల్లుకువచ్చే పద్ధతి శిల్పం. అంటే స్థూలంగా కథనమన్నమాట.

కథనం పాఠకునిలో ఉత్సుకతని కలిగించాలి. కళాత్మకమైన వాస్తవికతని సంతరించుకోవాలి. నడకలో వాకింత ఉద్వేగం వుండాలి. కథోచితమైన వాతావరణం, పరిసరాలు, పరిస్థితులు సృష్టింపబడి—వాటికి అనుగుణంగా పాత్రలు ప్రవర్తిస్తూ, పాఠకుని తమలో తాదాత్మ్యత చెందించి అతనికి రసానుభూతిని కలిగించాలి. కథనంయొక్క ప్రయోజనం యిదే. దీని ఆవశ్యకతని గురించి బుచ్చిబాబు ఇలా అంటాడు, 'కథకి ఒక వాతావరణం—గాలి, వెలుగు, నీడలు—కల్పించడానికి యత్నిస్తాను. అందులో వ్యక్తులు ఇద్దరైనా, ఒక్కరైనా వారి వెనుక ఒక సమాజం, సంప్రదాయం, నాగరికత వున్నాయన్న ధ్వని, ఒక వాదం, హోరు – కథ వెనుక శ్రుతిలా శైలిద్వారా మ్రోగుతూ వుండాలి.'

శిల్పపరంగా ఆలోచిస్తే, కథలో అనవసరమైనదీ, అధికమైనదీ అయిన ఏ విషయానికీ తావుండకూడదు. అందుకే చెకోవ్ అంటాడు, 'A Story should contain nothing that is superflous. Everything that has no relation to it must be ruthlessly thrown away'అని

ఈ సూత్రాన్ని దృష్టిలో వుంచుకుని పరిశీలిస్తే కొన్ని కొన్ని కథల్లో అతిచిన్న వాక్యాల్లో గొప్ప శిల్పం నిర్వహింపబడటం కనిపిస్తుంది. శ్రీపద్మరాజు ఒక చోట వ్రాసారు. 'మిట్టమధ్యాహ్నపు ఎండలో క్రైస్తవేతిమోషన్ మూర్ఛపోయింది' అని. ఇక్కడ 'మూర్ఛపోవటంతో' శిల్పం వుంది; అందం వుంది. ఆ పదం మనకు—క్రైస్తవేతిమోషన్ పరిసరాల్లోని 'Still atmosphere' ని గుర్తు చేస్తోంది; తద్వారా మిట్టమధ్యాహ్నపుఎండయొక్క తీవ్రతని ధ్వనింపజేస్తోంది.

కథనాన్నిగురించి విపులంగా వివరిస్తే ఒక సత్యంబోధపడుతుంది. పూర్వపు కథలన్నిటిలోనూ ఈ కథనం ఒకేవిధంగావుండేది—నాలుగు అధ్యాయాలుగా. ఈ నాలుగు అధ్యాయాల్లోనూ మొదటిది Setting—ఉపోద్ఘాతం; రెండవది Introduction of Characters —పాత్రల పరిచయం; మూడవది what they do—వారి ప్రవర్తన, నడవడి; నాల్గవది the out come–ఫలశ్రుతి లేక నీతి. ఇంతే. ఇదే మూసలో నడిచేది ఏ ఇతివృత్తం తీసుకున్నా; ఇప్పుడలాకాదు. భిన్నమైన పద్ధతులు, విభిన్నమైన మార్గాలు అనుసరింపబడుతున్నాయి.

తెలుగు కథల్లో ఎక్కువభాగం 'డాక్యుమెంటరీ' టెక్నిక్'లో వ్రాయబడినవే. ఈ Narrative పద్ధతివి వ్రాయబడిన కథలో సంఘటనల ప్రాధాన్యం వెనుకపడి కథ తేలికైపోవచ్చు. ఉదాహరణకి ఏ అతను వున్నాడు. అతను నిరుద్యోగి. ఉద్యోగ ప్రయత్నాలు కలిసిరావటంలేదు. బాధపడుతున్నాడు. అతనికి జీవితం మీద విరక్తిపుడుతోంది. ఈ విషయాన్ని ఇలా Narrate చేసూపోతే, పాఠకునికి విసుగెత్తుతుంది; అతను అనుభవిస్తున్నబాధ, ఆవేదనా పాఠకుడికి పట్టవు. అతని దయనీయ పరిస్థితియొక్క తీవ్రత పాఠకుణ్ని కదిలించలేదు. రచయిత ఎంతో 'ఫీలై' రాస్తాడు, కాని పాఠకుడిలోనికి ఆ 'ఫీలింగ్' ప్రవహించదు. ఇలాకాక, అతని అవస్థని ఏవి కారణాలవలన, ఏఏవిఫలప్రయత్నాలవలన—అతనికి జీవితం మీద విరక్తిపుడుతోందో రెండుమూడు సంఘటనల ద్వారా వివరిస్తే—ఆ కథ పాఠకుల మనస్సుకు హత్తుకుపోతుంది. చాలామంది క్రొత్తరచయితల కథల్లో ఈ Documentary Technique యొక్క వైఫల్యాన్ని పైన చెప్పిన్నరీతిలో మనం గమనిస్తున్నాం.

వైరీలమ్మపి Extracts తీసుకుని ...

అలాంటి మరో విధానం. ఈ విధానంలో వెలువడిన **అతిమంచికథ** శ్రీమతి శర్వాణి 'జాట్‌హౌస్'.

ఉత్తరాలద్వారా కథనం సాగించటం ఇంకో పద్ధతి. కథని ఉత్తమపురుషలో వ్రాసుకురావటం మనకు తెలుసు. ఈ రీతి కథనంలో ఏదో కష్టంవుంది. ఈ విధానం రచయిత భావావేశానికి అడ్డుకట్ట కడుతుంది. కారణం ఏమిటంటే ఇలా వ్రాసే కథలో— సృష్టింపబడుతున్న పాత్ర స్వయంగా తాననుభవించిన లేక ఆ పాత్ర విన్న సంఘటనలకు, సంభవాలకు లేదా విషయాలకుతప్ప రచయిత వ్యాఖ్యానాలకు, అభిప్రాయాలకూ తావుండదు. ఇది ఒకవిధంగా ఆలోచిస్తే అభిలషణీయమే అయినా రచయిత సృష్టిస్తున్న పాత్ర స్వరూపస్వభావ అవగాహనకు పూర్తి అవకాశం కలుగకపోవచ్చు. అందువలన ఇలాంటి కథల్లో ఉత్తమ శిల్పం నిర్వహింపబడిన కథలు బహుకొద్ది. ఆ కొద్దిలోనూ 'అరవింద' రచించిన 'చీకటి వెలుగులు'; శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య వ్రాసిన 'అంగారతల్పం' చెప్పుకోదగినవి.

Stream of Consciousness — పద్ధతికి Practical Example గా చూపటానికి కీ. శే. బుచ్చిబాబు 'చైతన్యస్రవంతి' అనే కథను వ్రాసేరు. మానసికవిశ్లేషణమే ప్రధానలక్ష్యంగా పెట్టుకుని 'చైతన్య స్రవంతి' విధానానికి దగ్గరగా కొన్నికథలు రచింపబడినాయి. వీటిలో కీ. శే. గోపీచంద్—'పతివ్రత అంతరంగికం'; శ్రీ చలం—'ఓ పువ్వు పూసింది'; శ్రీ ఇస్మాయిల్ — 'సముద్రం'; శ్రీ స్మైల్— 'ఖాళీసీసాలు'; శ్రీ సుమన్—'నిప్పురవ్వలు' మొదలైనవి ఉదాహరించదగినవి.

కథల్లో అనిర్వచనీయత వుండాలా, అక్కర్లేదా? అనేది శిల్పసంబంధమైన మరో ప్రశ్న. కథ కానీయండి, నవల కానీయండి, కవిత్వం కానీయండి— పాఠకునిలో ఆలోచనను రేకెత్తించి, ఆ ఆలోచన ద్వారా ఒకానొక అపూర్వానుభూతిని అతనికి అందజేయాలి. ఆ అనుభూతే జీవితపు విలువల వెలుగు రేఖల్ని ప్రసరింపజేస్తుంది. ఈ లక్ష్యసాధనకు రచయిత విధిగా తన రచనలో అనిర్వచనీయతని నింపాలా అంటే సమాధానం చెప్పటం కష్టమే. అయినా, ఏ కళాత్మక సృష్టిలోనైనా ఈ అనిర్వచనీయత తగినంతగా ఉండాలనే భావాన్ని అందరూ ఆమోదిస్తారు.

'నిన్న సాయంత్రం అమ్మ ఉతికి ఆరేసిన చీర కప్పుకుంటే ఎలావుందో వెన్నెల అలా వుంది' అని చెప్పారు శ్రీ రా. వి. శాస్త్రి ఒక కథలో. అద్భుతమైన భావప్రకటన. ఆ వాక్యం నిండుగా మన మనసుని తట్టి; దేహాన్ని పులకలెత్తిస్తున్న అనుభూతి వుంది. వెన్నెల అనుభవం కలుగుతోంది. 'మంచు తడిసిన మల్లెపూవులా వుండాలి' మనసు— అంటారు శ్రీ దేవులపల్లి. మంచుతడిసిన మల్లెపూవుని ఊహించండి. 'జనం గాలికి ఊగే పూలతోటలా కన్పిస్తున్నారు. చెదిరిపోయిన పాదరసంలా సౌందర్యం కదులుతోన్నట్టుంది.' అని శ్రీపతి వర్ణన. 'చెదిరిపోయిన పాదరసంలో' శిల్పంవుంది, అనిర్వచనీయత వుంది.

ఈ అనిర్వచనీయత—Obscurity — అన్నది అధికంగా Symbolism మీద ఆధారపడి వుంటుంది.

'Symbolism merely suggests that a relationship between seen and unseen, between abstract and concrete—is present; leaving it to our imagination to interpret the exact nature of the relationship. Incidents have the same effect of subtly and suggestively directing our attention to something beyond themselves—to a facet of total abstract meaning the story symbolically presents.'

ఉదాహరణకు శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారి కథ 'అంగారతల్పంలో' అబ్సెషన్ ప్రసక్తి వుంది. కథానాయకునిలో స్థావరమేర్పరచుకొని, అతనిని పట్టిపీడిస్తున్న 'కేన్సర్' వ్యాధిక ప్రతీక ఈ అబ్సెషన్. కథలో మొదటినుంచీ చివరివరకూ ఈ అబ్సెషన్

గుర్తుచేయబడుతూవుంటుంది. ఈ ప్రతీకద్వారా కథకి 'Effect' సాధింపబడింది. అలాగే శ్రీపతికథ 'పరాయివి నేలుపు'లో వో మామిడిచెట్టుని వంశవృక్షానికి ప్రతీకగా నిలపటం జరిగింది. ఆ మామిడిచెట్టు కథానాయికి ఆశాభావానికికూడా ప్రతీక. దాని ఆకులు ఒక్కొటొక్కటే రాలిపోతుంటే, ఈమె హృదయం తల్లడిల్లిపోతూవుంటుంది. శ్రీమతి టి. విజయలక్ష్మి కథ 'మనసు—మమత' లో తల్లీ బిడ్డల సంబంధానికి అనేకప్రతీకలు రూపొందింపబడినాయి. వర్ణనల్లో సైతం చాలా కథల్లో వాచకప్రతీకలు వాడబడుతున్నాయి. 'ఆ యిల్లు మసకవెన్నెల్లో ముడుచుకున్న తాబేలులావుంది' అనేది 'దొంగ'కథలో కే. శే. బాలగంగాధరతిలక్ వర్ణన. శ్రీవాకాటి 'ఆర్. చక్రారావు' కథలో ఇలా వ్రాస్తారు. 'అన్నయ్యా తమ్ముడూ కలుసుకున్నారు. గుమాస్తా ఇంజనీరూ మాట్లాడుకున్నారు. సీతా, లలితా కలుసుకున్నారు. బొంబాయి వాయిలూ, కంచిపట్టూ పలకరించుకున్నాయి'. ఈ వాక్యాల్లో ధ్వనివుంది. బొంబాయివాయిలూ, కంచిపట్టూ ఆ స్త్రీల ఆర్థికస్థితిని ప్రతిబింబిస్తున్న సంకేతాలు, వాటిద్వారా వారి మధ్యగల అంతరాన్ని మన కందిస్తున్నాడు రచయిత. ఇక్కడ అనిర్వచనీయతావుంది, ఉత్తమకథాశిల్పనిర్వహణావుంది.

కాని, ఈ అనిర్వచనీయత ఈమధ్య కొన్ని కథల్లో మితిమీరి కథని అయోమయం చేసేస్తోంది. కథలోని భావాశ్రయమైన అనిర్వచనీయతః లేక వివిధప్రతీకల ప్రయోజనం — సామాన్యపాఠకుడికి అర్థంకానిదై వుండవచ్చు; సగటు తెలివితేటలుగల పఠితకు తెలిసీతెలియనట్లు మిగిలిపోయివుండవచ్చు; కాని—మేధావివర్గానికి సైతం అంతుపట్టనట్లుండటం అభిలషణీయంకాదు. ఇలాంటి కథల్ని ఈమధ్య కొందరు కథకులు, రచయిత్రులు వ్రాస్తున్నారు.

పోతే, వచనకవితా ఉద్యమప్రభావం తెలుగు కథాసాహిత్యంలో కూడా విద్యమానమౌతోంది. ఈ మార్గంలో కథారచన సాగించి సఫలీకృతుడైన రచయిత శ్రీ శీలా వీర్రాజు—'కొడిగట్టిన సూర్యుడు'అనే కథా సంకలనం వెలువరించారు.

కథనం ఏ విధానంలో సాగినా, కథాశిల్ప పరంగా పరిశీలిస్తే ఈ క్రింది వాక్యాలు సత్యమని తేలుతుంది.

'The development of action in the story should be logical-step by step. Once the climax is reached the ending or fulfilment should come quickly. It should satisfy and it should seem the right and only ending for that particular story.'

ఇక శైలిగురించి విచారిద్దాం.

'Words can do more than they convey policy They can also convey and create a mood, an attitude, an atmosphere or an awakening.' అంటాడు జాన్. ఎఫ్. కెన్నెడీ,

మాటల ప్రభావం అలాంటిది. మాటల కూర్పుయొక్క ప్రభావం అంతటిది.

'శైలిని క్రొత్త ఉడుపులతో పోల్చవచ్చు' అంటాడు కే. శే. బుచ్చిబాబు. ఏ రచయిత అభిరుచినిబట్టి ఆ రచయిత ఒక్కో శైలిని తన కథల్లో కనబరుస్తాడు. అలాగే ఒక్కొక్క పాఠకుడికి ఒక్కొక్క శైలి నచ్చుతుంది.

కథా రచనలో శైలిని గురించి చెప్పుకునేటప్పుడు తొలిసారి స్మరించవలసింది కే. శే. మల్లాది రామకృష్ణశాస్త్రిగారిని. వారిశైలి విలక్షణమైనది. వారిశైలి అనన్యసామాన్యమైనది. మరో మహాపండితుడుకూడా అనుసరించి, లేదా అనుకరించి— కృతకృత్యుడుకాలేని శైలి వారిది.

తమదైన ఒక ప్రత్యేకతని సంతరించుకుని— మరికొందరు తమశైలీమార్గాన్ననుసరించేటట్లు తమ ప్రతిభని వ్యక్తపరచిన కథకులు శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు. వీరి శైలిని అనుకరించి, అనుసరించి ఈనాడు కథారచన సాగిస్తున్న ప్రసిద్ధ కథకులు మనకు తెలుసు. ఈ తరం క్రొత్త రచయితల మీద వీరి ప్రభావం చాలా వుంది.

ప్రక్కనే నడుస్తున్న మిత్రుడి భుజంమీద

చేయివేసి సూటిగా కబుర్లు చెప్తున్నట్లు వుండే శైలి—శ్రీ చలంగారిది. సరళమైన వచన రచనకి వొరవడిదిద్ది—తన శైలి సొంపును మరికొందరికి **అందించిన కథకులు వీరు.**

ఎదురుగావున్న విద్యార్థికి విషయ వివరణ చేస్తున్న ఉపాధ్యాయుని పలుకుల్లా వుంటాయి, శ్రీ మధురాంతకం రాజారాంగారి కథల్లో వాక్యాలు. ఒక ప్రత్యేక 'ముద్ర'ని ప్రస్ఫుటీకరించే శైలి వీరిది.

అయితే, ఎవరు ఏ శైలిలో వ్రాసినా, కథ పాఠకుణ్ణి తనతోపాటు ముందుకు లాక్కుపోయేదిగా వుండాలి.

'రామారావ్ ఆఫీసునుంచివచ్చి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ కుర్చీలో కూర్చుని శ్రీమతి తెచ్చియిచ్చిన కాఫీకప్పుని అందుకుని అదోలా ఆమె వైపు చూసేడు'—అదోలానే వుంటుంది చదివే పాఠకుడికి. ఇటువంటి శైలి చదువరిని ముందుకు సాగనివ్వదు.

మరో కథ ప్రారంభం చూడండి. 'సెకండరీ గ్రేడు మాష్టారు సుబ్బారావుకి పాపం తీరుబడిలేదు. అతనికి కాలం ఇరుగ్గా వుంది. అతని వెడల్పాటి ఆశయాలు సరదాగా అటూ ఇటూ తిరగడానికి వీల్లేకుండా వుంది. అతను తన బలాన్నీ, యౌవనాన్నీచూసి మురిసిపోతూవుంటాడు. అలా గర్వపడనివాడు వట్టి ఆధ్యాత్మికవాది. ఆధ్యాత్మికవాదులంటే అతనికి నమ్మకం లేదు' (సి. శే. తిలక్—'సుందరీ—సుబ్బారావు' కథ). ఈ వాక్యాల్లో ఏవీ ఇంద్రజాలంలేదు. కాని, అవి పాఠకుని సోపానమార్గాన్ని సుగమంచేస్తాయి. ఇది మంచిశైలి.

అలాగే, ఈ క్రింది కథాభాగాన్ని పరికించండి. 'రిట్రెంచ్‌మెంట్ రాహువు గుటుక్కుమని 'సూర్యుణ్ణి' మింగేస్తే సాదామనిషిగా మిగిలిపోయేడు నిరంజనం. సాదామనిషిగా మిగిలిన నిరంజనం తర్వాత నిరుద్యోగి. నిరుద్యోగి నిరంజనంకి కసీ కోపంవూ ఎక్కువే. ఓల్డ్ ఎస్. ఎ—నిరంజనం ఒకింటివాడు కాకపూర్వం టూత్ పేస్ట్‌లే వాడేవాడు; గుమాస్తా నిరంజనం సంజీవ్ గూడవండ్లపొడిని వాడేవాడు. నిరుద్యోగి నిరంజనం కచ్చికని ఉపయోగిస్తున్నాడిప్పుడు.' ('సలలితముగ నారికేళ సలిలముభంగిన్' కథ). దీన్లో ఒక్కొక్క వాక్యంతోపాటు కథకూడా సాగుతోంది. కథతోపాటు పాత్రస్వరూపం, స్వభావం, పరిస్థితులూ పరిసరాలూ ఆకళింపవుతున్నాయి.

మంచిశైలికి మరొక్క ఉదాహరణ—'సుబ్రమణ్యం ఛార్జి తీసుకున్నాక నర్సులు పువ్వులెరగరు. సుబ్బమ్మ డబ్బెరగదు. తోటివాళ్ళు సారా ఎరగరు. పేషంట్లు కష్టాలెరగరు. సుబ్రమణ్యం సుఖం ఎరగడు.' (బీనాదేవి—'విద్యుల్లత విరిసింది.')

స్థాలీపులాక న్యాయంగా ఆధునిక తెలుగు కథానికయొక్క అందచందాలివి. ఇందులో ఉదాహరింపబడిన కథలుగాక మరెన్నో కథలు ఉత్తమమైనవి వెలువడినై. అలాగే ఎందరో రచయితలు తమ తమ ప్రతిభావ్యుత్పత్తులతో ఆధునిక తెలుగు కథా సాహిత్యానికి అందచందాలు దిద్దేరు. విషయ విస్తరభీతిచే అలాంటి అన్ని కథల్నీ అందరు కథకుల్నీ పేర్కొనలేక పోతున్నాము.

ఈ పరిశీలన వలన—తెలుగు కథాసాహిత్యం పాఠకులు, సమీక్షకులు, విమర్శకులు భావిస్తున్నట్లు నిరాశాజనకంగా లేదని తేలుతుంది. ఆధునిక సాహిత్యరీతులు తెలుగు కథల్లోనూ చోటు చేసుకుంటున్నాయి. తెలుగు కథకులు సమాజాన్ని, సమాజపరమైన మంచి చెడుల్నీ; సంఘపు పోకడల్నీ తమ కథల్లో స్పృశిస్తూనే వున్నారు. జీవితంనుంచి ప్రేరణని అందుకుంటూనే వున్నారు. అంతేకాక, మనిషి ఆంతరంగిక జగత్తునికూడా స్పృశించి—దాన్ని విశ్లేషించి, వీక్షించి—తమ కథల్లో వివరిస్తూనే వున్నారు. తెలుగు కథకులు అన్ని విధాలా సమాజశ్రేయోదాయకమైన రచనలు చేస్తూనే వున్నారు. వీటన్నిటినీ వెలుగులోకితెచ్చి సాహితీసేవని చేస్తూనే వున్నాయి ఉత్తమాశయాలుగల పత్రికలు.

అయితే దురదృష్టవశాత్తూ—తెలుగు కథా సాహిత్యానికి సంబంధించినంతవరకూ జరగవలసిన సరళ విమర్శ జరగటం లేదు; వెలువడవలసినన్ని విమర్శనాత్మక వ్యాసాలు వెలువడటం లేదు. అడపా దడపా వెలువడుతున్న సమీక్షలు, వ్యాసాలు తెలుగు కథాసాహిత్యం ప్రసరిస్తున్న కాంతి కిరణాల్ని చూడక మొహం ప్రక్కకు త్రిప్పుకుంటున్నాయి. ఈ దుస్థితి తొలగిపోవాలంటే—Hauthorne చెప్పిన సలహా అనుసరణీయమనిపిస్తోంది. 'If writers come up to criticize their own works as fairly as another man's and perform the task with perfect sincerity and unreserve, their opinions of their own productions would be more valuable and instructive than the works themselves.' ఈ పద్ధతిని ఇప్పటికే ప్రతిష్ఠలై కథాసాహిత్యంలో ఓ స్థానం సంపాదించుకున్న కథకులన్నా అనుసరిస్తే బాగుంటుంది.

(ఎప్పుడో 'సృజన'లో 'ఆధునికత' అన్న వ్యాసం చదివేము. దాని రచయిత పేరు గుర్తులేదు. ఆ రచన ప్రభావం ఇందులోని సిద్ధాంతపరమైన విషయాల్లో అక్కడక్కడా గోచరించవచ్చు. ఆ వ్యాస కర్తకి కృతజ్ఞులం.)



శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవుల విజయ యాత్రలు

శ్రీ నోరి నరసింహశాస్త్రి

(గత సంచిక తరువాయి)

13

1932 సం. లో శ్రీ వెంకటశాస్త్రిగారు బందరు వెళ్ళినప్పుడు అక్కడి శిష్యప్రశిష్యులు వారికి షష్టిపూర్త్యుత్సవము చేయుదుమని ప్రస్తావించిరి. శ్రీ శాస్త్రిగారు కొన్ని యభ్యంతరాలు చెప్పగా శిష్యులు 'అది వైదిక విషయము. మేము లౌకికముగా జరిపింతు'మని ఒప్పించిరి. శ్రీ శాస్త్రిగారు తెలిపిన యభ్యంతరములు శాంతికములాకరాదులు శ్రద్ధగా పఠించి చెప్పినవి కావు. గర్భములో పడిన దాదిగా 60 ఏండ్లు నిండగా మానవుని అతని అప్పులను ఉగ్రరథుడు ఆవేశించునట. అందుచే శాంతి చేయవలెనట. శ్రీ శాస్త్రిగారి జాతకచర్య చదువగా వారిపై ఉగ్రరథుడు కొంత ప్రభావము చూపినట్లే తోచును. ఆ ప్రాంతములలో శ్రీ శాస్త్రిగారికి ముమ్మారు జబ్బు చేసినది. ఒకసారి మొండివ్యాధిరాగా సూర్యస్తోత్రము చెప్పిరి. భార్యచేత పిలునామా వ్రాయించిరి. కుమాళ్లకు జబ్బులు వచ్చినవి. రెండవ పిల్ల వివాహము నిశ్చయింపగా, ముహూర్తమునకు ఆరు రోజులముందు వరునికి మోటారు ప్రమాదము కలిగి ఆసుపత్రిలో చేర్చబడెను. శ్రీపాద గురువులతో తగాదా వచ్చినది. ఏమైననేమి? ప్రత్యేక శాంతి చేయకుండగనే వారి నిత్య తపస్సు సూర్యస్తోత్రాదులవల్లనే ఉగ్రరథుని దంష్ట్రలలోనుండి బయటపడ గలిగినారు. వారి శిష్యులు శాంతిగాకాక లౌకికముగా షష్టిపూర్త్యుత్సవముగానే అన్నట్లు మహావైభవముగా 1933 సం. సెప్టెంబరు 30, అక్టోబరు 1 తేదీలలో బందరులో జరిపిరి. శ్రీ శాస్త్రిగారు కళత్రము, పుత్రికాపుత్రులు, అల్లుళ్ళు, కోడండ్రు, జననీజనకులు, స్వబంధువులతో వివాహమునకువలె తరలి బందరు వెళ్లిరి.

30—9—33 శనివార మందయమున దుర్ముహూర్తము వెళ్ళగానే శాస్త్రిగారిని కళత్రసహితముగా నూతనాంబరాభరణాదులలో నలంకరించి మోటారుపై నూరేగించిరి. రామస్వామ్యాలయములో జరిగిన సభకు పండితులు కవులు శిష్యులు ప్రశిష్యులు మిత్రులు అభిమానులు విచ్చేసిరి. అనేక శత సంఖ్యాకులగు వేదవిప్రులు మహాశీర్వచనము కావించిరి.

ఆహ్వానసంఘము పక్షమున రావుబహదూరు శ్రీ వెడింబి హనుమంతరావుపంతులుగారు సన్మానపత్రము చదివి కానుకలు సమర్పించిరి. శాస్త్రిగారి అల్లుడు 11 సం.ల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి ఆశీర్వచనపనస ఘనజటలతో చెప్పెను.

సాయంకాలసభకు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు అధ్యక్షత వహించి, 'శ్రీకృష్ణదేవరాయలకాలము తర్వాత మూడు మూలల దాగియున్న తెలుగు కవితను ప్రచారమునకు గొనివచ్చి శ్రీ శాస్త్రులుగారు నవీనాంధ్ర సారస్వతమునకు సృష్టికర్తయై'రని ప్రశంసించిరి. సందేశములు కానుకలు ప్రవాహముగా వచ్చినవి.

మరునాడు ఆదివారము ఉదయసభకు శ్రీ ప్రభల లక్ష్మీనరసింహముపంతులుగారు అధ్యక్షులు. కానుకలు కురిసినవి.

సాయంకాల సభలో శ్రీ శాస్త్రిగారి ఉపన్యాసముండుటచే జనము తండోపతండములుగా వచ్చిరి. అభినందనపద్యములు భక్తితో నెందరో చదివిరి. ఎందరో ఉపన్యసించిరి. ఆరుగంటలకు శ్రీ హరి నాగభూషణంగారి పాటకచేరీ జరిగినది. శ్రీ అక్కధాటి రామమూర్తి మృదంగవాదన మొనర్చిరి. శ్రీ పాద కృష్ణమూర్తిశాస్త్రిగారి సందేశము. 'ఇది చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారికి చేసిన బహూకృతికాదు ఆంధ్రలోకమున కంతటికి చేసినదిగా విద్వల్లోక మంగీకరించెదుమని మా యభిప్రాయము.'

కృతిసమర్పణములు చేసినవారు ప్రశంసా పద్యములు చదివినవారు అసంఖ్యాకులు. అవకాశము చిక్కనివారు తమ కావ్యకుసుమములను ఆహ్వానసంఘమువారి కర్పించిరి. పైవానిలో కొన్నిమాత్ర ముదాహరిస్తున్నాము.

శ్రీ వెంకటశాస్త్రిగారి శిష్యాగ్రేసరులు శ్రీయుతులు పింగళి లక్ష్మీకాంతము, కాటూరి వెంకటేశ్వరరావులు తమ సౌందరనంద కావ్యమును వారికి కృతిసమర్పణము చేయుచు అందులో నిట్లనిరి.

'జగదాశ్చర్యకరావధాన కవితా
సంపత్తికిన్ మ్రొక్కి, మీ
యుగళస్నేహము ప్రస్తుతించి,
భవదీయోదారభావప్రసా
దగుణోత్ఫుల్లకృతిప్రసూన
విగళన్మారందధారాసురావగ నోలాడి
జపించి తెచ్చితిమి దేవా,
మీకు నీ దక్షిణన్.'

శ్రీ సర్వా శేషయ్య గురువులకు సుదర్శనోపాఖ్యానమను ఐదాశ్వాసముల కావ్యము కృతి యిచ్చిరి.

శ్రీ వడ్డాది సుబ్బారాయకవిగారు, 'రచియించెన్ బహునాటకప్రముఖ సద్గ్రంథంబు లాంధ్రంబునం దుచితప్రక్రియ బెక్కురాజసభలన్ బొందెన్ సుసత్కారముల్' అని ప్రశంసించిరి.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి 'మోహనంబుగ జగన్మోహనంబుగ బద్యపఠనంబు నిచ్చట బాదుకొల్పె' అనుచు, 'తిరుపతి వెంకటకవులు ప్రౌఢపండితప్రభుసభలలోనే కాదు, బాలపామరచోరాదుల గోష్ఠులలోగూడ కవితా చమత్కారములను గల్పించి సత్కారములను బడయుగలరు. వెంకటశాస్త్రిగారికి లజ్జాయి పదములు పాడ వేడుక. కొల్లాయి గుడ్డలు వాడ వేడుక. వారికి భాషాడంబరము గిట్టదు. సమయస్ఫూర్తి, హాస్యయుక్తి ప్రయుక్తిచమత్కారము ఆజానజమగు నలవాటు' అని అగ్గించిరి. శ్రీ తిరుపతిశాస్త్రి కుమారుడు శ్రీ వెంకటావధాని,

'కుకవి మత్తవిదారణ కుంభదళన
వికమ పటిష్ఠమ్ము సుంత విశ్రమించు
వృద్ధకవిసింహ మియ్యది వేళయయ్యె' అనిరి.

శ్రీ వేటూరి శివరామశాస్త్రి,

'జయ జయ షష్టి పూర్తి
పరిషత్పరమేశ్వర వేంకటేశ్వరా,
జయ జయ పూర్వ సవ్య
కవి సంఘ కృతాదర వేంకటేశ్వరా......
'మోయగ రాని వేదనకు
మూడు శతాబ్దులనుండి మూగయై
పోయిన యాంధ్ర భారతిని
బుట్టినతోన వసంత మాసపున్
గోయిలజేసి యెల్లెడల
గ్రుమ్మరజేసిన మేటి...' అనెను.

శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి ఇట్లనిరి.

'వీరి స్వభాష చేసిన కారణమున
గౌరవమును గద్వాలాత్మకూరు ముఖ్య
రాజ సభలందు లాతి పురంబులందు
బడసితి వధాన కవితా విభవము వలన'

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ,

'ఇంపులమారి ధూర్త కవులన్
గికురింతలు సేయు నేర్పు

సెల్లింపులు మీకె దక్కవవితే.....అనిరి.

శ్రీ జాషువా,

'గంటలు కొట్టి మీ మధుర
కావ్యము లాంధ్రుల మేలుకొల్పి యిం
టింటను నాటుకొన్నవి కవీశ్వర,
కోతకు వచ్చియున్న దీ
పంటను గోసికొమ్ము......' అనిరి.

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి యిట్లనిరి.

'గురువుల గొల్చి పొందితిని
గొందరు గందురు, దానికేమి, మా
తిరుపతి వేంకటేశ కవిధీరుల
పాద సరోజ యుగ్మ సం
స్మరణము చేతనే మధుర
మంజుల కావ్యము లల్లనేర్చి యెం
దరో కవులైరి యెందుగలదా
మరి యిట్టి మహత్త్వ మొజ్జలన్!

మరియు శ్రీయుతులు జంధ్యాల పాపయ్య శాస్త్రి, వేమూరి సీతారామశాస్త్రి, సామవేదం జానకి రామశర్మ, మల్లంపల్లి భైరవ మూర్తి, వడ్డాది సీతారామాంజనేయులు, కొండపల్లి గోపాలరావు, హరి శివమలింగశాస్త్రి, పండితారాధ్యుల నాగభూషణం, నందివాడ వెంకటరత్నం, మంచాళ్ల సీతారామయ్య, ధారా అప్పయ్యశాస్త్రి, స్నేహలతాకవితాబృందము కొల్లాపురము, పువ్వాడ శేషగిరిరావు, చోడవరపు జానకిరామయ్య. పిశుపాటి వెంకటరమణయ్య, అభినవ సరస్వతి సంపాదకులు జానపాటి పట్టాభిరామశాస్త్రి, ప్రభృతులెందరో ఎన్నో పద్యములతో కానుక లర్పించిరి. అన్నింటికంటె శ్రీ వెంకటశాస్త్రి హృదయమునకు అత్తుకొన్నది శ్రీ నందివాడ వెంకటరత్న మర్పించిన పద్యాల కొవ్వు. ఈ కవి వద్దకులన్నుడు, వికారరూపుడు, అంధ్యప్రాయుడున్నూ. ఆయన వద్యమైనను.

'అన్నకోమలులని పెట్టి నన్ గన్నతండ్రి
తల్లి చూచినట్లు నా గురుడు చూచినాడు

మద్గురూత్తము గొల్చిన మద్విహగము
వంటివాడైన జ్ఞానియై వన్నెకెక్కు.'

శ్రీ వెంకటశాస్త్రి ప్రత్యభినందనలోనుండి ఒక్క పద్యము.

'బందరు పట్టణంబు నను బెంచె
బహూకృతిచేసి మున్నె యా
ముందొకసారి ఎక్కుడుగ
బూజితులన్ బొనరించె నిద్దరన్
విందొనరించె నా కిపుడు వేవురు
గల్గు సభాస్థలిన్ మహా
నందము గల్గె నీ పురి కనంత
ముఖ మ్మలరారు గావుతన్!'

కృష్ణాపత్రిక సంపాదకీయములోనుండి కొన్ని వాక్యములు:

'తిరుపతి వెంకటేశ్వరులు పొందని గౌరవము లేదు. వీరి కవిత్వము ప్రాచీన కవిత్వమునకు భరత వాక్యము, నవీన కవిత్వమునకు నాంది. ఈ కవుల కవిత్వము ఆధునిక కవిత్వమునకును ప్రాచీన కవిత్వమునకును సేతువు వంటిది. ప్రాచీన కవిత్వమందలి దీప్తి, నవీన కవిత్వమునందలి ప్రసాదము సౌలభ్యము పొడసూపును. వీరి రచనలు చిరకాలము వర్ధిల్లు నమటకు సందియము లేదు!'

శ్రీముఖ ఆశ్వయుజ సంచికలో 'భారతి' ఇట్లభినందించినది. ఇందులో పంతులుగారి శైలి ప్రత్యక్షమగుచున్నది.

'ధన్యమైనది, ఆంధ్రదేశము ధన్యమైనది. జీర్ణప్రాయముగా నుండిన ఆంధ్రకవితా సామ్రాజ్యము నుద్ధరించి దేశమునందు పలుగెలకుల విజయపతాకలను ప్రతిష్ఠించి ఆంధ్రకవితకు శకపురుషులన మించిన నిక్కపు కవిసార్వభౌమునకు సంకల్పించిన షష్టిపూర్తి మహోత్సవాభ్యర్హణము సర్వలక్షణసంపన్నముగా మహావైభవముతో నిర్వహించి సకలాంధ్ర ప్రపంచము కృతకృత్యమైనది. విశ్వభారతి సంతసించినది. శాశ్వతస్మృతిచిహ్నముమ్ము, రచన లస్మిటిని

సంపుటములుగ అచ్చొత్తించుటకు, ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో బహుమతి పదకము నెలకొల్పుటకు శిష్య ప్రశిష్యులు సంకల్పించినారు. ఆంధ్రభారతికి ఈడు లేని సేవచేసి శాస్త్రిగారు ధన్యులైనారు. అట్టి మహామహునకు ఉచితభక్తిగ పూజగావించి తెలుగు మాగాణము ధన్యమైనది.'

14

ఇంత గొప్పగా షష్ట్యబ్దిపూర్త్యుత్సవము జరిగిన శ్రీ వెంకటశాస్త్రిగారికి ఇంతకంటె గొప్పగా సమ్మానము జరుగుట ఊహాకందని విషయము. కాని యదియు సంభవించినది.

అప్పటి మదరాసు ప్రభుత్వము 1950 లో శ్రీ వెంకటశాస్త్రిని ప్రథమాంధ్రాస్థానకవిగా ఎన్ను కొని బెజవాడలో ఆస్థానకవి పట్టప్రదానముతో సలంకరించినది. శ్రీ శాస్త్రిగారప్పుడు అస్వస్థులుగా నుండుటచే వారికి పట్టప్రదాన మొనర్చుటకు వారి యప్పటి నివాసమైన బెజవాడకే, మదరాసు ప్రభుత్వమే ముఖ్యమంత్రి రాజాగారు, మంత్రీశ్వరులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ఇత్యాదులైన ముఖ్యాధికారవర్గముతో, తరలివచ్చినది. అక్కడికి అప్పుడాంధ్రదేశము అష్టదిక్కులనుండి విచ్చేసిన కవి పండితులకు లెక్కలేదు. ఆంధ్రదేశములోగాని, మరియొక్క ప్రాంతములోగాని, దేశములోగాని, ఏపరిషత్సభ కాని, కవిసమ్మానముగాని, అంత గొప్పగా జరిగియుండుట ఊహించుటకుగూడ మాబోంట్లకు సాధ్యము కానంత మహావైభవముగా జరిగినది. అధ్యక్షులైన శ్రీ రామలింగారెడ్డిగారు 'ఇప్పుడు నేను కళ్లు మూసికొని రాయి విసరినచో ఒక పండితునకో కవికో తలకు తగులు'నని చమత్కరించిన మాటలలో నతిశయోక్తి లేదని ఆ సభ చూచిన మాబోంట్లకు అనుభవసిద్ధము. మదరాసు ప్రభుత్వము సంస్కృతాస్థానకవిగా వరించిన మహామహోపాధ్యాయ ద్రావిడ శాస్త్రిగారుకూడ ఆ సభకు స్వయముగా దయచేసి, సంస్కృత శ్లోకములతో శాస్త్రిగారిని అభినందించుట విశేషములలో నెల్ల విశేషము.

ముఖ్యమంత్రి రాజాగారు, 'నేను ఆంధ్రలిపిరాక అరవలిపిలో ఈ ఉపన్యాసము వ్రాసుకొని చదువుచున్న తెలుగువాడ'నని చెప్పుచు, శాస్త్రిగారి వైదుష్యమును కవిత్వమహత్వమును ప్రశంసించిరి. ఎన్ని సాహిత్య సంస్థలు ఎందరు కవులు సమ్మానపత్రములు ప్రశంసా పద్యములు సమర్పించిరో లెక్కింప సాధ్యముకాదు. అటువంటి కవి విద్వన్మహాసభ 'న భూతో న భవిష్యతి!'

ఈ విజయసభ జరిగిన కొద్దినెలలకే మహా శివరాత్రి పర్వదినమున శ్రీ వెంకటశాస్త్రిగారు పరమపదించుటయే వారి అంతిమవిజయయాత్రగా భావింపదగును. 'కవనార్కుం బుదయించితిని. ఈ భవ మద్వాన దరింతు'నను శ్రీ శాస్త్రిగారి యాశయము సిద్ధించినది. అది 5—2—50 బుధవారము.

విరోధి సం. ఫాల్గుణ మాస భారతిలో (సంపు. 27 సంచి. 3) శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి 'కనుమరుగైన కళాప్రపూర్ణకవి' అను వ్యాసములో 'నా ముచ్చటలన్నియు మొన్నటి శివరాత్రితో ముగిసిపోయినవి. ఆ దయామయుని నిర్యాణము నా హృదయమునకు పెద్దయఘాతమైనది'అని విలపించుచు 'శ్రీ శాస్త్రులవారి ప్రతిభాసంపత్తి, కవితా ప్రాశస్త్యము, ధారాధారాళత, ధారణాపటిమ, వాక్చమత్కారము మొదలగు గుణవిశేషములను దెలుపు ఘట్టము లనేక కొన్ని ప్రస్తావించినారు!

15

తిరుపతి వేంకటేశ్వరుల విజయయాత్రలలో గద్వాల ఆత్మకూరు వివాదములే ఘనమైనవి. అవి ఏనాడో జరిగినందున జనులస్మృతిలోనుండి కొంత మరుగుపడినవి. కాని శ్రీరామకృష్ణ కవులతో, శ్రీ కొప్పరపు కవులతో, శ్రీ బెల్లముకొండ రామ రాయకవితో, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారితో నడచిన వివాదములు పూర్తిగా విస్మృతములుకాలేదు. అందువలన శ్రీ తిరుపతి వేంకటేశ్వరులు—అందును ముఖ్యముగా శ్రీ వెంకటేశ్వరులు—గిల్లికయ్యము తెచ్చు కొనువారను అపప్రథ లోకములో కొంత వ్యాప్తిలో

మున్నందున వాని స్వరూపము సంక్షేపముగా కొంత ప్రస్తావింతుము.

శ్రీరామకృష్ణకవులు మేనత్త మేనమామ బిడ్డలు. ఆరామద్రావిడులు. శ్రీరామకవి పూర్తిపేరు శ్రీ ఓలేటి వెంకటరామశాస్త్రి. ఆయన కొంతకాలము శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి ఇంటనుండి శుశ్రూష చేసెను. తర్వాత రామకృష్ణకవులు ఇతర గురువుల యొద్ద శాస్త్రాధ్యయనము చేసిరి. చిన్నతనములోనే పిఠాపురాస్థానమున అవధానముచేసి ఆస్థానకవులైరి. తన గురుత్వమును గూడ ఒప్పుకొనవలెనని శ్రీ చెళ్ళపిళ్ళ. ఏదో కొంతకాలము చదివినందుకే ఒప్పుకొనవలెనాయని రామకవి పట్టుదల. పట్టుదలలు పెరిగినవి. రామకృష్ణభారతము మొదలగునవి రామకృష్ణకవులు వ్రాయగా తిరుపతికవులు 'గీరతము' ఇత్యాదులు వ్రాసిరి. కాకరపర్రు ఆరామద్రావిడులకు జీవగ్రర. అక్కడివారు, ఒకమారు శ్రీ వెంకటశాస్త్రి అక్కడికి వెళ్ళగా, ఎంతో బాధించిరి. దానిని గీరతము చప్పట్ల పర్వములో శ్రీ వెంకటశాస్త్రి తిరుపతితో నిట్లు మొరపెట్టుకొనెను.

'కౌముది పాఠమ్ము గావలె నాకిప్పు
డం చొక్క విద్యార్థి యడుగ వచ్చె
పోనిమ్ము రఘువంశమేని జెప్పు మటంచు
నిక నొక్క విద్యార్థి యీసడి చె
కాకరపర్తి యీ గ్రామం బెరుగుమంచు
వేరొక్క విద్యార్థి వెక్కిరించె
పెద్ద పేరుగ విందు మిద్దియేనా పస
యంచొక్క విద్యార్థి హుంకరించె......
అతని ధైర్యమ్ము నకు బోలునట్టి ధైర్య
మన్నతమునయందునే నేనెందు నరయ సఖుడ.

'అట్లు చుట్టుకొనిన యవ్వార లెల్లను
వరవ లేనుగూడ వరవ నగుట
వరవగోల యనెడి యార్యుల మాట య
త్తరిని మదికి దగిలె దరుణ మగుట
ఒకరు,

'భటరాజ కవనమ్ము పచరింతు పీవని
యొక్కొక్కపరి నన్ను నొక్క పలుకు
మీసాలు దీయించి వేసెదనని ఖరి
యొక్క మా ర్యాగహం బొందుచుండు'

మరియొక పెద్ద,

'కౌముది చెప్పనేరవట కాదగు
సంగతి చూచుకొమ్ము నీ
వేమియు గాగితమ్ము నయి
నిట్లని వ్రాయుదటంచు గోసము
ద్రాముషితాత్మ గౌరవ భరంబుగ
బల్కెను.........'

'గణపతిని బోలు విద్యార్థి గణము కొంత
ఆంజనేయుని బోలెడు నదియు గొంత
కుంభకర్ణుని బోలెడు కొంత గణము
చుట్టుముట్టె సేనాపతి చూడవచ్చుగ.'

పైదానినిబట్టి ఆనాడు శ్రీ శాస్త్రిగారిపై నెంత దౌర్జన్యకాండ జరిగినదో ఊహింపవచ్చును.

రామకృష్ణకవు లెంత దురుసుగా ప్రవర్తించిరో ఊహించుటకు, వారు కొప్పరపువారికి ఈ క్రింది విధముగా కాగితము పంపుటయే చాలును.

'తిరుపతి వేంకటేశ్వరులు
దేబెలు కూళలు నేరకుల్ కవి
త్వ రచనయే యెరుంగరు
వృథాయశమున్ గడియించినారు వా
రిరువురు శుద్ధశుంఠలు........'

రామకృష్ణకవులు విద్వాంసులు. బహుగ్రంథకర్తలునైనా వారు తిరుపతి కవులతో పెట్టుకొనిన వివాదమువలన మాత్రమే ముఖ్యముగా స్మరింపబడుచున్నారని సహృదయులు గమనింపగలరు. గీరతము ముగించిన ఈ క్రింది పద్యము వివాదములలోగూడ తిరుపతి కవుల హుందాతనమును ప్రకటించుచున్నది.

'కలికిన్ మంగళమస్తు,
దానికి సిరిన్ గల్పించుచుండు పే
రులకున్ మంగళమస్తు,
విస్తులవచోయుక్తిన్ గలన్ ద్రుంచు వా

ర్యులకున్ మంగళమస్తు,
వేదమత శాస్త్రోక్తార్యధర్మైక ప
ర్త్రులకున్ మంగళమస్తు,
గీరతవచోదుగ్ధాబ్ధికిన్ మంగళమ్.'

ఈ వివాదము జరుగుచుండగా శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి శ్రీరామకృష్ణకవులకు చేసిన 'సఖీర్వ్యాపార్థనము'నుబట్టి యథార్థమవగతమగును.

'గురువుల్ తిర్పతి వేంకటేశ్వరులు
మీకు న్మాకు నిక్కంబు, త
త్కారుణ్యాసారమె కారణ మ్మరయ
విద్యా బీజ మొక్కంత
యంకురమందన్ మనకెల్ల నిక్కము గ,
మాకున్ వారికిన్ శిష్యతా
గురుతల్ లేవను మీనుడుల్
వినిన నే క్రూరుండనుం గుండెదున్'

మఱియొక సందర్భముకూడ తిరుపతి కవులదే అంతిమ విజయమని ఋజువు చేయును. లోగడ ఉంత అల్లరి చేసిన కాకరపర్రు పౌరులే, 1932 వ సం. లో శ్రీ వేంకటశాస్త్రిగారిని పుత్రశిష్య సమేతముగా నాహ్వానించి అందరునేకముఖముగా ఎదురు వచ్చి మేళతాళములతో తోడితెచ్చి ఊరేగించి సభచేసి సన్మానించిరి.

16

శ్రీ కొప్పరపు సోదర కవులు ఆరువేల నియోగి బ్రాహ్మణులు. వారి యనర్గళమైన ఆశుధారాకవనము పండిత పామరులను చకితులను చేసినది. ముఖ్యముగా కథాకావ్యములు ఆశువుగా చెప్పుటలో గంట కెన్ని పద్యములు చెప్పేవారో లెక్కింప శక్యమయ్యేదికాదు. ఎన్నో గౌరవము లందుకొనిరి. వారికి సంస్కృతము రాదు. ఆంధ్రభాషాజ్ఞానముకూడ పరిమితమైనదని ప్రతీతి. వారు మొదట తిరుపతి కవులను దర్శించి గౌరవించిరి. తిరుపతికవులును వారి నాదరించి సంస్కృతాంధ్రములలో పాండిత్యము సంపాదించినచో ఎక్కువ పన్నె కెక్కుదురని సూచింపగా, వారంగీకరించిరి. కాని అప్పటి గుంటూరు పరిస్థితులు వారి సామరస్యమును సాగనీయలేదు.

రేపల్లెలో ప్రారంభమైన పద్ధతి నియోగము అప్పటికి నరసారావుపేట గుంటూరులకు ముమ్మరముగా ప్రాకి వైదిక నియోగులమధ్య కక్షగా పరిణమించినది. అప్పుడు గుంటూరు న్యాయవాదులలో నియోగు లెక్కువ. అన్ని రంగములలోను న్యాయవాదుల కెక్కువ ప్రాబల్యమున్న రోజులవి. తిరుపతి వెంకటేశ్వరులు చేయుచున్న శతావధాన సభలో కొప్పరపు సోదరులలో జ్యేష్ఠులగు శ్రీ సుబ్బారాయకవికి అవధానులతోపాటు వేదికమీద కుర్చీ వేయించవలెనని నియోగి పెద్దలు సూచించిరి. తిరుపతికవు లొప్పుకొనలేదు. అప్పుడు సభలో గుంటూరు వాస్తవ్యులైన ఎందరో ఉద్దండ విద్వాంసులు విద్వత్కవులు ఉన్నారు వారికెవ్వరికీ లేయని ప్రత్యేకాసనము వీరికేలయని తిరుపతి కవుల వాదన. కాని యది కొప్పరపువారి యభిమానులకు నచ్చలేదు, పిరామాటలన్నారు వాదావాట లన్నారుఅని 'రూమర్సు' ప్రాకినవి. వారి యభిమానులు కొప్పరపువారికి పురి యెక్కించిరి. అప్పటికే రగులుచుండిన నియోగివైదికద్వేషములు కొప్పరపు వారికి తిరుపతికవులకుమధ్య వివాదము రూపముగా మంటగా ప్రజ్వరిల్లి మహాజ్వాలగా సర్వతోముఖముగా వ్యాపించినవి.

శ్రీ కొప్పరపు సుబ్బారాయశర్మగారు తిరుపతి కవులకు పద్యమయమైన సవాలు ఉత్తరమును 20—8—1911 న పంపిరి.

'అష్టావధానంబు నాచరించెదరేని
యద్దానిమించి చేయంగలేమొ
శతఘంట కవనంబు సల్ప బూనెదరేని
యద్దానిమించి చేయంగలేమొ ....
...తెలుగుమీసంబు నిలుపంగ దిప్పుడింక'

దానికి 21—8—11 న శ్రీ తిరుపతిశాస్త్రి తక్కిన విషయములు వదలి 'మీ పరువును మాపు మాటనుఎత్తి ఏ సందర్భమునం దేవిషయమునం

దేరూపముగా మా యేమాటకు మీ పరువు మాపినదో వివరింపు'డని వచనములో ఉత్తరము వ్రాసిరి.

అందుపై 22—8—11 న శ్రీ సుబ్బారాయశర్మగారు పద్యములలో తిరుపతి కవులను వాద సభకు రమ్మని సవాలుచేయుచు లేఖ పంపిరి.

'గురుతరలీల రేపె సభ గూర్పగ
మంటిమిగాని భానువా
సరమున దక్క రారెవరు......
ఆశుకవిత్వ శతావధానముల్
విరచనసేయ రావలయు వెంటనె
మేమవి యాచరించి ధీ
వర సభ మీ ప్రతిజ్ఞ దెలుపంగల
మీసము దీయ జేతుము...'

దానికి జవాబుగా 23—8—11 న తిరుపతి కవులు మరల వచనములోనే సమాధానమిచ్చిరి. అందులోని కొన్ని భాగములు.

(1) 'మా మీసముల పద్యము మీ కర్థము కాలేదు పెద్దల నడుగుడు. (4) మీరే వివాదకుం దిగుటచే నంగీకరింపక తప్పినదికాదు. (9) ఆంధ్ర భాషైకదేశమగు గ్రామ్యభాషయందుగాని నిర్యతిగణ ప్రాస సౌశబ్ద్యరసాభాసకవిమార్గముననంగాని కాలు ద్రవ్వినచో మా గ్రహచారమందుకు నొడబడవలసిన దేనా? శాంతం పాపమ్! (12) ఈ వ్రాతవలన దెలుగునేని మీకు వదలితిమని యనుకొనరాదు.'

మీసపు పద్యపు ప్రతిజ్ఞ సంస్కృతాంధ్ర కవిత్వములు రెండును చెప్పగలవారికే అన్వయించును గాని, ఒక్కసంస్కృతములోగాని ఒక్కతెలుగులోగాని కవిత్వము చెప్పువారి సవాళ్లకు అన్వయింపదని తిరుపతి కవుల భావమని మన మీ సందర్భములో గ్రహింపవలెను. దీనితో ఒక్కతెలుగు కవిత్వమునకే సవాలుచేసిన కొప్పరపువారికి తమ పద్యమే అర్థము కాలేదని తిరుపతి కవులెంతో నేర్పుగా సూచించిరి.

పై యుత్తరములుగాని ముందు ఉదాహరింప బోవునవి కాని ఒకరి కొకరు పంపుకొన్నవి మాత్రమే కాదు. ఎప్పటికప్పుడు వాటి కాపీలు వేలకొలదిగా అచ్చొత్తించి గుంటూరు పట్టణ వీథులలోనను చుట్టుపట్టులను విరివిగా పంచిపెట్టబడినవని మనము గుర్తించుకొనవలెను. వెంటవెంటనే ఉత్తర ప్రత్యుత్తరములు సాగినవి.

25—8—11 న శ్రీ తిరుపతిశాస్త్రి 'జరూరు' అని ఉత్తరము పంపగా, శ్రీ శర్మగారు 27 న 11 గంటలకు జవాబు పంపిరి. దానిపై శ్రీ తిరుపతి ఆ నాడే జవాబిచ్చిరి. అందులో కొన్ని భాగాలు.

'1. సభముందు మీరే చేయవలెను; ముందు కాలు ద్రవ్వినవారు మీరుకాని మేముకాము. 4. మా విషయమై మీరును, మీ విషయమై మేమును అవధానపు టేర్పాటులు చేసికోవలసినదే కాని యయ్యవి సభ్యులేర్పరుప దగినవి కావు. 5. ఈ విషయముల కంగీకరించుచు మీరు సభకూర్పుడు, లేదా మేము సమకూర్చెదము......రేపు సూర్యోదయమునకు దప్పక జవాబు పంపవలెను.'

దానికి జవాబు రాకపోగా శ్రీ తిరుపతి, గుంటూరు, 28—8—11 ఉదయం 8 గంటలకు ఇట్లు వ్రాసిరి.

'ఈ దినమున సభ తప్పక జరుగునను మీ ప్రకటనను పురస్కరించుకొని యనేక గ్రామముల నుండివచ్చి నిరీక్షించుచున్నారు. వారిని వృథాశ్రమల నొనరించుట యుచితము కాదు కావున నవధాన సభా విషయ మేమయినదియు ప్రకటించి వారి సందియము దీర్పుడు. మా యుత్తరమునకు ప్రత్యుత్తరము రాకుండగనే మేము ప్రకటించుట యుక్తము కాదుగదా!'

కొప్పరపు వారు సభానియమముల కంగీకరింప లేదు. మొదట వారే నిర్ణయించిన 28—8—11 తేదీ సభ చల్లగా దాటవేసిరి. తర్వాత వారవధానములు చేసిరిగాని అప్పటికి అలవాటు పడలేదు. అదిగాక అవధాన సభ తిరుపతి కవులు కూర్చినచో పెట్టిగడ్డ.

పేచున్న లిప్పింతురో యనుజాకు కలిగి యుండవలె. ఈ పక్షమువారు ఆ పక్షమువారుచేరి వీరు బాగా చెప్పినారనగా వీరే బాగా చెప్పిరను గలభాసభకే వారు సిద్ధపడిరిగాని నియమబద్ధమైన సభకు సిద్ధముగా నున్నట్లు తోచదు.

శ్రీ తిరుపతి కవులు 30—8—11 వరకు వేచియుండి ఆనాడు సాయం. 6 గం.లకు గుంటూరు ఫస్టు కంపెనీ హాలులో సభ చేసిరి. ఆనాడే శ్రీ వెంకటశాస్త్రి కోర్టులో స్వర్ణకారుల తగాదాలో సాక్ష్యమిచ్చి అలసి సభకు వచ్చెను. సభకు శ్రీమాన్ వంగిపురము కృష్ణమాచార్యులు, బి. ఏ., యల్. టి., సంస్కృతాంధ్ర విద్వత్కవి సభకు అధ్యక్షత వహించెను. ముందు శ్రీ తిరుపతిశాస్త్రి సభవారికి తమకు కొప్పరపువారికి జరిగిన ఉత్తరప్రత్యుత్తరములు విని పించిరి. తర్వాత శ్రీ వెంకటకవి కవిత్వముమగూర్చి ఉపన్యసించిరి. ఆ సభను ఆపి కవుల తగాదాలు విర మింపజేయు నుద్దేశముతో గుంటూరు లాయర్లలో ప్రధానుడవదగిన శ్రీ గోవిందరాజుల శ్రీనివాసరావు పంతులుగారు సభకు వచ్చిరి. వారే ఉత్తరప్రత్యుత్త రములన్నియు విన్నతర్వాత కొప్పరపువారి ఉత్తరముల ముద్రణుదవమునకు పొచ్చుకొనిరి.

అంతలో శ్రీ వేలూరి శివరామశాస్త్రి రైలు దిగి సభకు వచ్చెను. శ్రీ వెంకటశాస్త్రి వద్దను చున్నను వినక శ్రీ కొప్పరపువారిపై సవాలుపత్రికను పద్యమయమైనదానిని వ్రాసి మరునా డుదయమే అచ్చు వేయించిపంపెను. అట్లే శ్రీ శాస్త్రిగారు వద్దను చున్నను వినక సవాలుపత్రికను పంపిన వారి శిష్యు లలో శ్రీ త్రిపురనేని రామస్వామిచౌదరిగారు నొకరు — శ్రీ తిరుపతి కవుల శిష్యుల సవాళ్లు సాగినవి.

కవుల తగాదా రణరంగముగా మారినది.

తిరుపతి కవులు గుంటూరిసీమ ప్రథమభాగము ప్రకటించిరి. దానిపై నెందరో అభినందనపు ఉత్తర ములు పంపిరి.

శ్రీ కొప్పరపు సుబ్బరాయశర్మగారు మాత్రము దానివలన తనకు గౌరవభంగమును ఆదాయభంగమును గలిగినదనియు, కోర్టుకు వెళ్లెదననియు శ్రీ తిరుపతి కవులకు రిజిష్టరునోటీసు ఇచ్చిరి. దానికి వారు జవాబిచ్చిరి.

నిజముగా గుంటూరు తగాదావలన ఇటు తిరుపతికవులకును అటు కొప్పరపు కవులకును అభి మానులు పెరిగి ఆదాయము ఎంతో వృద్ధియైనది గాని ఏమాత్రము తరుగలేదు.

ఉభయపక్షములలో మాటల తారతమ్యమునకు ఈ క్రింది యుదాహరణములు చాలును.

శ్రీ కొప్పరపువారిట్లు వ్రాసిరి:

'బుర్ర గొరిగించి సున్నపుబొట్లుపెట్టి
ఖరము నెక్కించి యూరేగగా నొనర్చి
మాలదాసులు ఛీ యని గేలిసేయ
తిరుపతిని వేంకటన్నను త్రిప్పినాము.'

కొప్పరపు కవులనుగూర్చి తిరుపతి కవుల మాటలు కొన్ని:

'ధార యొక్కటిమాత్రమే తనకు గలదు.
దాని కెన్నియుండిన మీద దజ్జాడప్పు
తండులమ్ములు మాత్రమేయుండి యెవడు
షడ్రసోపేతముగ భుక్తి సలుప నేర్చు.'

'శాఖలో గొంద రాకాశ సౌధ మొకటి
గట్టిపెట్టిరి కొప్రంపు గవుల కొరకు
ఎక్కలేము మ్రొక్కరోయన నెక్కితీర
వలయునని త్రోయుచున్నారు బలము కొలది'

కొప్పరపువారి ధారనుగూర్చి తిరుపతి కవులు.

'గడియకు మూడు వందలట
గంటకు డెబ్బది వందలంట త
ప్పుడు కవనమ్ము చెప్పుటకు
బూనిన వారిని బుట్టజేసి యె
ప్పుడు నరసాకు సత్కవనమున్
బవరించు మదీయ పత్రికమున్
బడబడ మ్రోగు లోపమరసా
వొవరించెదవమ్మ శాంకరీ!'

ఈ నియోగి వైదికుల కక్షలు తిరుపతి కవుల కెంతమాత్రము నిష్టము లేదు. వారు గుంటూరుసీమ ఉత్తరరంగ మిట్లారంభించిరి:

'వలదు నియోగి వైదిక విభాగము
కొంపలు ముంచు దాన,
పర్తిలుడు యధానుపూర్విగ
విధేయులు విద్యకు గండు......'

'వలదు నియోగి వైదిక విభాగము
వల్వ దసత్యగోష్ఠి......'

ఈ వివాద సందర్భములో శ్రీ వెంకటశాస్త్రి బందరులో తన యుపాధ్యాయ పదవికి 3 నెలలు సెలవుపెట్టి ధర్మపత్నితోసహా గుంటూరువచ్చి నివాస మొనర్చెను. వారెక్కువ భాగము శ్రీ శిష్ట్లా హనుమచ్ఛాస్త్రిగారింట్లో ఉండేవారు ఈ వ్యాసకర్త కప్పుడు 11 సం.లు అప్పటికి సంవత్సరము క్రిందటినుంచే పద్యాలు గిలుగుతుండేవాడు. మా యింటికి శిష్ట్లావారి యిల్లు రెండు ఫర్లాంగుల లోపగుటచే అప్పుడప్పు డక్కడికి వెళ్లి శ్రీ వెంకట శాస్త్రిగారు నిరంతరాయముగా జరుపుచుండే పండిత గోష్ఠి ఆలకించే అదృష్టము కలిగింది. అప్పుడప్పుడు శ్రీ శాస్త్రిగారి పత్నికూడా వరండాలో దర్శనమిచ్చేది. చొక్కాలు తొడిగి ఎరుగని శ్రీ శాస్త్రి గారు పొందిన కనకబిరుదములన్నీ వారి పత్ని కాసులపేరువలె హారముగా ధరించేది.

1665 లో ప్లేగున్నూ 1666 లో మహాగ్ని ప్రమాదమున్నూ లండను నగరాన్ని చాలా భాగము తుడిచి పెట్టినవి. ఆ మహాప్రమాదాల వల్లనే లండను నగరము అందముగా మరల నిర్మించే అవకాశము కలిగినదని చరిత్రకారులందురు. అట్లే ఎంతో బాధాకరమైన ఈ నియోగి వైదిక కక్షల వల్లను, కవుల తగాదాల వల్లనుగూడా కొన్ని లాభాలు రాక పోలేదు.

పద్ధతి నియోగమువలన నియోగులంతో అప్పటికి లుప్తప్రాయ మగుచున్న స్మార్తకర్మాచరణ మందు శ్రద్ధ విజృంభించినది. వారు స్పర్ధతో వైదికులకంటె వైదికాచార మవలంబించుటకు పూనుకొనిరి. వైదికులుకూడ తమ యాచారమే శాస్త్రీయమైనదను దృఢవిశ్వాసముతోనుండగా, శ్రీ మార్కండేయ శర్మగారి గ్రంథములవల్ల. వైదికుల దృష్టి కూడ ధర్మశాస్త్ర గ్రంథములవంకకు ఎక్కువగా తిరిగినది. ఉభయ శాఖలకు నూతనజీవము కలిగినది.

అట్లే ఈ కవుల కలహములు సామాన్య జనములోగూడ ఆంధ్రకవిత్వమందు ఉత్సాహము ఉవ్వెత్తుగా రేకెత్తించెను. 35 మంది విద్యార్థులున్న మూడవఫారము మా ఒక్క డివిజనులోనే 15 మంది పద్యము లల్లసాగిరి. దీనిని కొలబద్దగా గ్రహించి ఆ కాలములో గుంటూరు చుట్టుపట్ల ఎంత కవితోత్సాహము పొంగినదో ఊహించవచ్చును.

(సశేషం)

ఆంధ్రదేశ చరిత్ర-భూగోళ-సర్వస్వము ముఖద్వారము

శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం

ఆంధ్రదేశ చరిత్ర — భూగోళ— సర్వస్వము — ముఖద్వారముగూర్చి సెప్టెంబరు 1970 భారతి పత్రికలో శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు ప్రకటించిన దీర్ఘసమీక్షను చదివినాము. ఇందుకు వారికిని భారతి పత్రిక సంపాదకులకును ఆంధ్రరచయితల సంఘము వారు కృతజ్ఞతలు తెలుపుచున్నారు. సమీక్షల మీద సమీక్షలు వ్రాయుట అనవసరమైన ప్రయాస అయినను శ్రీ వెంకటరావుగారి విమర్శలోని కొన్నియంశములు ఉద్యమస్వరూపమునకే అపార్థములు కల్పించుటకు సమర్థములై యుండుటచే వానిని కొంత పరామర్శింపక తప్పుట లేదు ఈ సమీక్ష చదివినప్పుడు ఎక్కువ విచారమును కొంచెము నవ్వునుకూడ రాకపోలేదు. సమీక్షకులు కంటవత్తిడికొని పెక్కుపుటలుపట్టి అచ్చుతప్పులు ఏరి చూపెట్టినప్పుడు అట్టివి దొరకనందుకు విచారపడుటకన్న ప్రస్తుత మేమిచేయగలము! ప్రధాన గ్రంథములో వాటిని చేతనైనంతవరకు సవరించగలము. ఈ రూపమునైన ఆంధ్రదేశచరిత్ర— భూగోళసర్వస్వమను గ్రంథము లోకమునకు తెలియగలదను తృప్తిచే కొంతనవ్వును వచ్చుచున్నది. ఇట్టి కార్యము 'సామాన్యమైనపనికాదు; దుస్సాధ్యము; దుర్ఘటము' మున్నగు విశేషణములతో వీరు వర్ణించినారు. అటువంటి అసాధ్యకార్యము పూనుకొన్నందులకైనను ఆంధ్రరచయితలసంఘమువారు ప్రశంస లక్ష్యము కాకున్నను సానుభూతికైనను పాత్రులు కావలసినవారుగదా. కాచినచెట్టుకే రాళ్ళదెబ్బలను లోకోక్తి ఉండనేయున్నది.

శ్రీ వెంకటరావుగారు ముఖద్వారమునందు చూపిన లోపములను మూడు విభాగములుగా చేసుకొని అర్థము గ్రహించుటకు ప్రయత్నించినాము. వీటికి వారు ముద్దుమురిపెములతో పెట్టుకొన్న విశేషణపరంపర—అప్రామాణికము, అసంబద్ధము, అసంగతము, అస్తవ్యస్తము, అనర్థకము, విడ్డూరము, అలంకారశాస్త్రములో అసంగతమే విన్నాముకాని దానిని అపారముగా వృద్ధిపొందించుటకు దారులు కలవని మా మిత్రులు నిరూపించినారు. దాని నట్లుంచుదము. వీరు చూపిన దోషములు.

1. పునరుక్తులు.

2. ఆకరములు — ఆరోపములు సరిగా లేకుండుట.

3. విస్మృతములైనవి.

4. సమీక్షకులు తొందరపాటుచే దోషములుగా భావించినవి.

1. అందు మొదటిది : కొన్ని ఆరోపములు ఇంటిపేరుతోను తిరిగి అవియే సుగృహీతనాముని పేరుతోను కనిపించుట నిజమే. వ్యక్తుల పేర్లను గృహనామముతో ఆరంభించవలెనా లేక వ్యవహారనామముతో ఆరంభించవలెనా యని మొదట ఆలోచనలో పడితిమి. సంగ్రాహకులు తమకు తోచినట్లు వ్రాసి పంపిరి. వీటినన్నిటిని ఏకముఖము చేయుటలో తబ్బిబ్బులు అయినవి. ప్రధాన గ్రంథములో ఇట్టివి సవరింపబడును. తెలుగువారి సంప్రదాయమును బట్టి ఇంటి పేరుముందు తరువాత వ్యవ-

పోర నామము—ఈ పద్ధతినే బాగుండునని మాకు విశ్వాసమగుచున్నది. కాశీనాథుని నాగేశ్వరరావు, కట్టమంచి రామలింగారెడ్డి, గిడుగు వెంకటరామమూర్తి, రఘుపతి వెంకటరత్నంనాయుడు ఈ క్రమమే యుక్తమనిపించుచున్నది. సాధ్యమైనంత వరకును దీనినే పాటింపగలము. ఒక ప్రసిద్ధ వ్యక్తి పేరు ఏ కారణమునన్నైన విస్మృతమైనచో దానిని బొత్తిగా విడుచుటకన్న పై రీతికి కొంచెము భిన్నముగా నైనను గ్రంథస్థము చేయుట న్యాయము.

2. ఆరోపములు— ఆకరములు సరిగా లేకుండుట. శ్రీ వెంకటరావుగారు పట్టుకొన్న పిల్లదొంగలు నిజముగా దొంగలే. వారీ గ్రంథములోనికి ఎట్లు చొరబడిరో చెప్పుట వారి ఉనికిని సమర్థించుటకు కాదు. ఉద్యమములోని ఇక్కట్లను శ్రీవారికి నివేదించుటకు.

(అ) ఆరోపములు యువపండితులచే సేకరింపబడినవి. పాండిత్యములో డిగ్రీ భేదములు అనివార్యములు.

(ఆ) ప్రతి యారోపమును మూల గ్రంథముతో సరిచూడవలెననియే యత్నించితిమి. కాని దురదృష్టవశమున పెక్కు గ్రంథములు మూల్యమునకైనను లభ్యము కాలేదు. మున్ముందు సవరించుకొనవచ్చునను ఉద్దేశముతో కొన్ని యట్లే విడువబడినవి.

ఈ సందర్భమున ఒకమాట. అముద్రిత గ్రంథములు అపారముగ ఉన్నవనియు, వానిని కోశనిర్మాతలు చూడలేదనియు శ్రమ తప్పించుకొనుటకై ముద్రిత గ్రంథములు మాత్రమే చూచినారనియు సమీక్షకులు వ్రాసిరి. మాకు తెలిసినంత వరకును ప్రధాన గ్రంథములు ముద్రితములైనవి; అవుచున్నవి. శ్రీ వెంకటరావుగారు కోరినట్లు మేము 'తాళపత్ర సంపుట ప్రకర కాంతారముల'లో దూరినచో ఎన్నటికిని బయటికిరానేలేము. ఈ యుద్యమము అప్పటనే సంకనుగ్గునుగును. ముద్రిత గ్రంథములే లభింపక కార్యకర్తలు దురవస్థల నొందుచుండగా అముద్రిత గ్రంథములు శోధింపలేదేమని సవాలు చేయుట దప్పిగొన్నవానిని నేయి ఏల త్రాగవు అన్నట్లున్నది.

(ఇ) ఉదాహరణకు—గ్రామనామముల విషయములో మేము ప్రభుత్వమునకు చేసిన విజ్ఞప్తి అనావశ్యకమని వీరు భావించిరి. "ఇప్పటికి 46 ఏండ్ల క్రిందట మదరాసు ప్రభుత్వమువారు అట్టి గ్రంథమును ప్రకటించి యున్నారు"—అని వ్రాసె పుచ్చిరి. మనదేశములో 10 సంవత్సరముల వెనుక ప్రకటించిన గ్రంథమే అలభ్యమగుచుండ, 46 సంవత్సరముల క్రిందట ప్రకటించిన గ్రంథము లభించునని వీరు తలచుచున్నారా! అదియునుగాక ఈ 46 సంవత్సరములలోను గ్రామసీమలయందు మార్పు రానేలేదా? సర్వస్వ నిర్మాతలు కుంభకర్ణులో రిప్‌వాన్ వింకిలు వంటివారో అని వీరు నిరూపింప దలచినట్లు తోచును.

అది యెట్లైనను మా బాధ ఏమియన్నచో 1961 సంవత్సరపు జనాభా పరిగణన సందర్భముగా ప్రకటింపబడిన ఆంధ్రదేశములోని జిల్లాల గ్రామ పట్టికలు మావద్ద ఉండనే యున్నవి. అవి ఆంగ్లభాషలో ముద్రితములై యున్నవి. వీటి వర్ణక్రమమును గూర్చి ఎక్కువ చెప్పనక్కరలేదు. అది హ్రస్వమో దీర్ఘమో, దంత్యమో మూర్ధన్యమో, శవర్గమో సకారమో తెలియని అయోమయ స్థితిలో ఉండుటచే తెలుగులో ఆ పేర్లు వ్రాసికొనుట యందు వికృతరూపము లేర్పడుచున్నవి. తెలుగులో ఇట్టి గ్రామపట్టికలు ఉన్నచో ఇప్పింపుడని పెక్కు ప్రభుత్వ కార్యాలయములను అభ్యర్థించినను ప్రయోజనము లేకపోయెను. తెలుగు పట్టికలు లేవనియే కొందరు చెప్పిరి. కావుననే తెలుగులో కాని హ్రస్వదీర్ఘాది సంజ్ఞలతో ఆంగ్లమునందుకాని గ్రామపట్టికలు ప్రకటించి పరిశోధకులకు తోడ్పడవలెనని మేము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమునకు విజ్ఞప్తి చేసితిమి. ఇది యెట్లు అపరాధమో మాకు బోధపడకున్నది. వెంకటరావుగారివంటి పెద్దలుకాని ఇతర మహాశయులుకాని తమవద్ద తెలుగులో గ్రామపట్టి

గారు ఉన్నచో ఈ యుద్యమముపై అనుగ్రహముచే ప్రోత్సాహము ఇప్పింపగోరుచున్నాము.

(ఈ) మాయొక్క ఆవేదన మరియొకటి కలదు. శ్రీవారు 22 పుటలో ఇట్లు సెలవిచ్చియున్నారు. "శాసనాలులేని చరిత్ర యుండదని చారిత్రకుల అభిప్రాయం. ఈ చారిత్రక సర్వస్వంలో శాసనాల ప్రస్తావన అనేది పూజ్యంగా ఉండడము దురూహ్యము." అధోజ్ఞాపికలో ఇప్పటి తెలుగు శాసనముల సంఖ్య 10 వేలని ప్రకటించియున్నారు. ఇది విని మా గుండె చెరువైనది. శ్రీ వెంకటరావుగారు కావ్య వాఙ్మయంలో అగస్త్యులని ఇది వరలో వినుగుదుము. వీరు శాసన వాఙ్మయమునందును కుంభసంభవులని ఇప్పుడు తెలుసుకొని జోహారు లర్పించుచున్నాము.

కాని ఇక్కడను మా బాధ పునరుక్తమే అయినది. కొన్నిశాసనసంపుటములు మాకు లభించినవి. కొన్నిప్రభుత్వ గ్రంథాలయములలోను లభింపలేదు. మూల్యమునకును లభింపలేదు, అవి లభించు గ్రంథాలయములకు వెళ్లి వ్రాసుకొనిరావచ్చునుగదాయని వివరైనను అందురు. ఇది చేయుచునేయున్నాము. కాని తన శస్త్రములు తనకులేని యోధుడును మూల గ్రంథములువద్దలేని పరిశోధకుడును ఇక్కట్లకు లోనుగాకతప్పదు. సర్వస్వనిర్మాతలుకూడ ఇట్టి ఇరకాటమున చిక్కుకొనియు యథాశక్తిగా కృషి చేయుచున్నారు.

వెంకటరావుగారు వ్రాయ సాహసించినట్లు ఈ సర్వస్వములో శాసనప్రసక్తి పూజ్యముకాదు. వేయికొక్క పోయినను వందలకొలది వ్యక్తినామములు, స్థలనామములు శాసనములనుండి గ్రహించబడియే ఉన్నవి. ప్రతిశాసనమునకు పేరుండునా? అట్టి యారోపములు ఫలానానెంబరుశాసనము, ఫలానాసంపుటము నుండి ఉద్ధరింపబడినవని మేము నిర్దేశించియే ఉన్నాము. మామటకు ఓపికమాత్రము ఉండవలెను.

మెకంజీ సంపుటములనుగూర్చి: శ్రీ వెంకటరావుగారి పర్యవేక్షణక్రింద ఎత్తివ్రాయబడి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారివద్ద నిక్షేపింపబడియున్న మెకంజీ సంపుటములను పరామర్శించుకొనుటకు మాకు ఇటీవలనే అనుమతి లభించినది. యథాసాధ్యముగ వీటిని ఉపయోగించగలము. వీనిలో సారభూతమైన విషయములను మన ప్రముఖ చారిత్రకులు తమ రచనలలో చేర్చియే ఉన్నారు.

3. విస్మృతములైనవి:- స్మరింపదగిన కొందరు వ్యక్తులపేర్లు మేము విస్మరించుట జరిగినది. అది ప్రమాదవశమున జరిగినది, బుద్ధిపూర్వకముకాదు. అట్టి మహనీయులపేర్లు కొన్ని శ్రీ వెంకటరావుగారు మాకు గుర్తుకుతెచ్చినారు. వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ సందర్భమున ఒక యంశమును పాఠకులకు మనవి చేయదలచినాము. ఇది ఆరోపముల పునరుక్తికి సంబంధించినది. కొన్నిసందర్భములలో మేము బుద్ధిపూర్వకముగనే ఆరోపముల పునరుక్తిని అవలంబించినాము. ఒకేపేరుగల ఇద్దరు ముగ్గురు వ్యక్తులు తటస్థించినప్పుడు ఆకరములైన గ్రంథములు చెంత నున్నచో అవి ఏకవ్యక్తికి సంబంధించినవో వారు భిన్నవ్యక్తులో నిర్ణయించుటకు వీలుపడియుండును. ఆకర గ్రంథములు అన్నియు ఉపలభ్యములు కాకపోవుటచే తప్పునిర్ణయము చేయుటకన్న ఆ పేర్లను పునరుక్తిగా పేర్కొనుటయె క్షేమమార్గమని అట్లు చేసితిమి. ఒక్కొక్కప్పుడు దోషమును గుణమగుట కావ్యశాస్త్రవేత్తలైన శ్రీ వెంకటరావుగారికి తెలియని విషయముకాదు. పూర్వకాలపు సజ్జనులను అక్రమముగా తొలగించుటకన్న వారిని అవ్యాప్తిగనైన స్మరించుట కనీసధర్మము.

4. దోషభావములు:—(అ) శ్రీ వెంకటరావుగారు కొన్నిఅపోహలకు లోనయి తప్పుదారిపట్టి పాఠకులను తప్పుదారి పట్టించినారు. చారిత్రక సర్వస్వ

ములో కవులకు ప్రసక్తి ఏమని వీరు శంకించి ఏమేమో ఊహాలనెడి పాలెగూళ్లను పన్నుకొని వాటిలో తామే చిక్కుకున్నారు. ఈ గ్రంథోద్దేశము ప్రణేతలనుగూర్చి మేము అంగ్లపీఠికలో మనవిచేసిన యంశములు వీరు గుర్తించినచో ఇట్టి భ్రమకు లోనయియుండరు. ఆంధ్రదేశచరిత్ర—భూగోళ సర్వస్వము కేవల చరిత్ర గ్రంథముమకాదు. ఇది ఆంధ్ర దేశ భూగోళపు పాఠ్యపుస్తకము అసలేకాదు. ఆంధ్ర జాతియొక్క ప్రాచీనమును ఆధునికమును అయిన సర్వతోముఖ వైభవమును నామరూపములద్వారా ప్రపంచించుటయె దీని పరమార్థము. ఆంధ్రజాతి సర్వతోముఖాభివృద్ధికి ప్రతీకలుగా రాజులు, రాణులు, సేనాపతులు, మంత్రులు, వేదాంతులు, విద్వాంసులు, కవులు, శిల్పులు, కళాకారులు మున్నగు పెక్కురంగముల నేతలను గైకొనదలచితిమని ముఖద్వారము మొదటి పుటలోనే ఉద్ఘోషించియుంటిమి. నవీన చరిత్ర రచనా సిద్ధాంతములనుబట్టి ప్రజల చరిత్రయే దేశచరిత్రయని విజ్ఞులు చెప్పుచున్నారు. ఈ గ్రంథములో 'సాహిత్యవేత్తలకు, కవులకు స్థానమే లేదు' (పుట 25) అని అనుశాసనముచేయుటకు శ్రీ నిడుదవోలు వెంకటరావుగారికి అధికార మొవ రిచ్చినారు? ఇట్టి నిరంకుశమైన అనుశాసనమును మేము పాటించుటెట్లు? చరిత్ర చతురానన చిలుకూరి వీరభద్రరావుపంతులుగారు వ్రాసిన ఆంధ్రుల చరిత్రలో మన మహాకవులను వెలివేసిరా? శ్రీ గులామ్ యాజ్దానీగారి సంపాదకత్వమున వెడలిన దక్కను పూర్వచరిత్రలోను, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు రచించిన రెడ్డిరాజ్యచరిత్రఅను గ్రంథములోను రాజకీయచరిత్రతోపాటు ఆయాయుగముల సర్వతోముఖీనమైన సాంస్కృతికాభివృద్ధి విపులముగా చర్చింపబడియున్నదే.

(ఆ) సమర్థనీయముగాని ఒక నిరంకుశ విషమ ప్రమాణము నాధారముగా చేసుకొని ఊహాపోహలను విమర్శించుట ఉత్తమ సమీక్షక పద్ధతికాదు. ఇక్కడ శ్రీ వెంకటరావుగారు తమ భావనాబలమును ఆధారముగా గైకొని కొన్ని లను మాత్రములను ప్రతిపాదించి తృప్తి ననుభవించారు. వాని సారాంశ మిది. 'ఈ సర్వస్వ నిర్మాతలకు తగినన్ని ఆరోపములు లభింపలేదు. విషయ దారిద్ర్యము వారిని ఎదుర్కొన్నది. దానిని కప్పిపుచ్చుటకై అవాంతరముగను బలవంతముగను కవులను అడ్డువేసుకున్నారు.' ఇట్టి విమర్శనలను ఏమనవలెను; వారిపై జాలిపడుటకన్న!

ఏమనుకొన్నను ఆంధ్ర మహాకవులు ఈ సర్వస్వములో అగంతుకులుగా వచ్చిపడలేదు. ఏ ప్రమాణమునుబట్టి చూచినను వారికిందు స్థానమున్నది. ఉద్దేశము సర్వస్వ నిర్మాతల యధీనముకాని విమర్శకు లదికాదు. సాహిత్యము వేదాంతమువంటి విషయములు వేర్వేరుగా పుష్టి నొందియున్నవి గాన కవులు వేదాంతులు—వీరినిగూర్చి ఈ సర్వస్వములో సంగ్రహముగనే వ్రాయవలెనని మేము నిర్ణయించితిమి.

'సంస్కృత కవుల, పండితుల ప్రసక్తి ఈ గ్రంథములో నెందుకు గలిగినదో దురూహ్యము (పుట—25)'.

ఇదియంత చిదంబర రహస్యము కాదు: ఆంధ్రులైనవారు సంస్కృత కవులైనను, తెలుగు కవులైనను, ఉర్దూ కవులైనను ఈ సర్వస్వములోనికి ఎక్కదగినవారే. విద్యానాథుడు, వారణాసి ధర్మసూరి మున్నగువారు సంస్కృత రచయిత లగుటచే వారిని వెలివేయుమా? నాదెళ్ల పురుషోత్తమ కవిగారు హిందీ భాషలో నాటకములు రచించిరి. వారు ఆంధ్రులుకాక పోవుదురా?

(ఇ) పులిమీద పుట్టవలె భూగోళ సర్వస్వ వ్యవస్థాపకులమీద మరియొక నేరము వచ్చిపడినది. అథర్వణ కారికావళి, అహోబల పండితీయము మున్నగు గ్రంథముల యారోపములు కూర్చబడలేదు. అట్లు చేసినచో అదియొక తుదిలేని ప్రయత్నమగును. అథర్వణుడు, అహోబల పండితుడు—వీరి పేర్లు ఉన్నప్పుడు ఈ గ్రంథములను గతార్థములగు

మున్నవి. అథర్వణాచారి గూర్చి వ్రాయు వ్యాసకర్త అథర్వణాచారి కావలినిగూర్చి వ్రాయకున్నచో మరియేమి వ్రాయును? చెప్పవలసిన విలాసము అను గ్రంథమింతు పేర్కొనబడలేదని శ్రీ వెంకటరావుగారు ఆగ్రహించినారు. కాని పుట 341 చూచినచో ముదుకుదుర్తి నృసింహ కవియు, పుట 168 లో చెన్నపట్ణమును కావించును. ఇచ్చట ఒక్క మనవి చేయవలసియున్నది. మేము చూపిన ఆధారములు మా వ్యాఖ్య సూచన కొరకే కాని అవి సమగ్రములు కావు. కానక్కరలేదు. మేము పేర్కొనిన ఆకరములనుబట్టి మాత్రమే వ్యాసముండదు. పదరు వ్యక్తిని స్థలమును గ్రంథముతో వీక్షించుటకు మాత్రమే అవి పరిమితములు. ఆయారోపములను గూర్చి ఎన్నియో ఇతర ఆధారములనుచూచి విషయములను సేకరించి వ్యాస రచయితలు సమగ్రకథనమును వ్రాయుదురు. ఇట్టి ప్రార్థన మేము రచయితలకు చేయుచునే యున్నాము.

(ఈ) ఈసర్వస్వమునందు దోషములేకాని గుణములు నామమాత్రమునకైన ఉండవు అను విశ్వాతాభిప్రాయమునకు సమీక్షకులు వచ్చియుండుటచే గ్రంథమునందు ఉన్నవికూడ లేనట్లే వారికి భాసించినది. ఇక్కొక్కప్పుడు పంచదారయు చేదుగనే తోచును. ఉదాహరణకు పుట 23 లో వీరు ఇట్లు గర్జించిరి —'ఆంధ్రదేశీయేతిహాస పరిశోధక మండలిని పేర్కొనక పోవడము సరికదా—ఆ మండలివారు ప్రకటించిన 35 సంపుటాలను చూపింపక పోవడం అత్యాశ్చర్యకరంగాఉన్నది' అని–దీనికి మా సమాధానము. 'ముఖద్వారము 26 పుటలో 27 వ ఆరోపము 'ఆంధ్ర దేతిహాస పరిశోధక మండలి' చేర్చబడియున్నది. పిదప 24 వ పుటలో "Journal of the Andhra Historical Research Society" నమోదై యున్నది. ఇంతకన్న ఏమి చేయవలెను. ఈ జర్నలు యొక్క 35 సంపుటములు పేర్కొనవలెనా? మేము పుస్తకముల క్యాటలాగు ప్రకటించుటకు పూనుకొనలేదు. ఈ పుటలోనే కళింగ సంచికకూడా కనబడుచున్నది.

శ్రీ వెంకటరావుగారి దృష్టికి మరొక అన్యాయము కనబడినది. చూడుడు పుట 23. 'చారిత్రక సర్వస్వమని పేరున్న ఈ గ్రంథంలో ఆంధ్రదేశాన్ని ఆదినుండి నేటి వరకు పాలించిన రాజుల చరిత్ర — సంగ్రహముగానైనా లేకపోవడం మరీ అన్యాయం'. సమీక్షకులు కొంచెము ఓపికతో ఆంగ్లపీఠికను చదివియున్నచో 5 వ పుటయందు ఈ వాక్యములు తగులును.

'While kings and others will be taken up individually it is proposed to have dynastic accounts also to provide a comprehensive survey. As the Encyclopaedia proceeds on the basis of proper nouns, common items like taxes, coins, weights and measures, administrative organisation, trade and commerce etc., will have to find a place in these comprehensive surveys. All major dynasties that left their stamp on Andhra—the Sathavahanas, Ikshvakus, Pallavas, Salankayanas, Vishnukundins, Ananda Gotra Kings, Eastern Chalukyas, the Velanati chiefs, the Telugu Chodas, Kakitiyas, Reddy and Velama Kings, the Vizianagar Emperors, Sultans of Golkonda, the Nayakas of Tanjore and Madhura, the Asafjahis the British period, Independence and after, the numerous smaller dynasties of the middle ages, the Bahmani ru ers in so far as their relations with the Telugu country are concerned-all this vast panorama will march before the reader."

ఇంత కంఠోక్తిగా చెప్పియుండగా ఇది యేదియు సమీక్షకుల కంటబడకుండుట మా భాగ్య మనుకొనవలెనా, వారి హ్రస్వదృష్టి యనుకొనవలెనా? శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారి ప్రాచీనాంధ్ర

భూగోళము ఈ సర్వస్వనిర్మాతలకు తెలియవట్లు శ్రీ వెంకటరావుగారు ఒకచో వ్రాసిరి. ప్రాచీనాంధ్ర భూగోళము విషయమున ఈశ్వరదత్తుగారి కృషిని మేము పీఠిక 2 పుటలోనే స్మరించియున్నాము. ఇంతటితో ఆగక పుట 23 లో, శ్రీవారిట్లు నుడివిరి. 'దీనివలన వింతలనర్థము వచ్చినదో చూడండి. తెలుగుదేశము నాడులుగా విభజింపబడియుండేది. ఆ నాడుల వివరాలు సంగ్రహంగానైనా పీఠికలో లేవు'. పీఠికలో నాడుల చరిత్ర యెందుకు వ్రాయవలెనో యెట్లు వ్రాయవలెనో మాకు తెలియదు. కాని కొన్నినాడులైనను ముఖద్వారంలో చేరియేయున్నవి. ఏరువనాడు (పుట 30), కమ్మనాడు (పుట 66), కొసలనాడు (పుట 81), పాకనాడు (పుట 268), ప్రోలునాడు (పుట 304) ఇట్లే వచ్చుచుండును. ఏమైనను పొరపాటున విస్మృతములైనచో ప్రధాన గ్రంథమందు చేర్చుటకు అవకాశముండనేయున్నది.

కొన్ని గ్రంథములు కొందరు సుప్రసిద్ధ పురుషులు ఈ సర్వస్వంలో చేరని ఎత్తిచూపుచు 37 పుటలో సమీక్షకు లిట్లు ఆగ్రహము వ్యక్తముచేసిరి. 'ప్రస్తుతకాలంలో ఆంధ్రదేశ చరిత్రకులలో అగ్రగణ్యులైన డాక్టరు మారేమండ రామారావుగారిపేరు పీఠికలో లేకపోవడం శోచనీయం. ఇటువంటివెన్నో?' కాని ముఖద్వారము ఆంగ్ల పీఠికలో, పుట XI లో Advisory Board for History including Literature అను శీర్షిక క్రింద డాక్టరు మారేమండ రామారావుగారి శుభనామము చేరియేయున్నది. ఇంతియేకాక ఈ మహోద్యమమునుగూర్చి విద్వాంసుల సంప్రతింపులు ఆశీస్సులను పొందుటకై ఆంధ్రరచయితల సంఘమువారు 10-2-1968 నాడు హైదరాబాదులో సమావేశము ఏర్పరచియుండిరి. మా మిత్రులు డాక్టరు రామారావుగారు శ్రమయనక — గుంటూరునుండివచ్చి ఆ విద్వత్సభలో పాల్గొని మాకు ఉచితమైన సలహాలు ఇచ్చియుండిరి.

శ్రీ నిడుదవోలువారు సర్వస్వనిర్మాతల అజ్ఞతతో పోరాడిపోరాడి అలసిపోయియుందురు. పుట 36 లో అధోజ్ఞాపికలో ఇట్లు మందలించిరి. 'దాక్షారామమును ద్రాక్షారామమనరాదు' అని ప్రతాపరుద్రీయ వ్యాఖ్యను ప్రమాణముగా పేర్కొన్నారు. కావచ్చును. వీరు శివభక్తులగుటచే దీనిని దక్షప్రజాపతి యజ్ఞస్థలముగా విశ్వసించియున్నారు. కాని ప్రతాపరుద్రయశోభూషణకారుడైన విద్యానాథ మహాకవి దీనిని 'ద్రాక్షారామము' అన్న రీతిని గ్రంథస్థము చేసినాడు. చూడుడు ఈ శ్లోకము

'యస్మై ర్దేశ ప్రస్థితి రేష యాతి
మహతీం ఖ్యాతిం త్రిలింగాఖ్యయా
యేషాం కాకతిరాజకీర్తివిభవైః
కైలాసశైలాః కృతాః
తే దేవాః ప్రసరత్ప్రసాదమధుర
శ్రీశైల కాళేశ్వర
ద్రాక్షారామ నివాసినః ప్రతిదినం
తచ్ఛ్రేయసే జాగ్రతు'

ఈ శ్లోకమునందు 'కాళేశ్వర/ద్రాక్షారామ' యనినగాని ఛందస్సు సరిపడదు. దాక్షారామ యనినచో తప్పును. విద్యానాథ మహాకవికి శబ్దసాధుత్వము తెలియదని వీరందురా? ఆకాలమునను ఈకాలమునను గూడ దాక్షారామ, ద్రాక్షారామ అని రెండు రూపములును వాడుకలో నుండినట్లే కనబడును. సమీక్షకులు 'రాజమండ్రి' అని వ్రాయుటను ఆధిక్షేపించిరి (పుట 37). వీరు గ్రాంథిక వాదులమని నిరూపించుకొనుట కొఱకు కాబోలు. నన్నయభట్టుగారినాటి రాజమహేంద్రవరము అనవలెనని ఈనాడు లోకమును శాసింపగలమా? అదికాకయు కొన్ని శతాబ్దములనుండి వ్యవహారమునందున్న శబ్దరూపము కాదనుటయెట్లు? రాజమండ్రి యనునది ఆంగ్లేయులకాలమున ఏర్పడిన యపభ్రంశ రూపమని తలచుటయు పొరపాటే. మహమ్మదీయయుగములోనే — ఈ మార్పువచ్చి — వారి

గ్రంథములలో నున్నది. అదియే జన వ్యవహారమున కెక్కినది. కాకినాడను కోకనాడగా ఒక సంగ్రాహకుడు వ్రాసి తెచ్చినాడు. ఇది వికారముగనే ఉన్నది.

ఇంతటితో మా ఆవేదన గీతమును విరమింతుము. విషయ దారిద్ర్యముచే సాహిత్యవిభాగమును చారిత్రక సర్వస్వములో చొప్పించినారని శ్రీ వెంకట రావుగారు ఆరోపించి తృప్తిని బడసిరి. వాస్తవమునకు మేము పశ్చిమ బుద్ధిగా ప్రవేశపెట్టిన ఒక మార్పు కలదు. దానిని వివరింతును. మహాభారతమునందు కర్ణుడు ఒక వీరవ్రతమును పెట్టుకొనెను. కర్ణుడు ఒక బాణమును రెండుమార్లు సంధించడని యాతని వాక్యము. ఈ సర్వస్వ నిర్మాతలకట్టి యాగ్రహమేమియులేదు. తప్పులైనవి ఎన్నిసార్లు వలసిన అన్ని మార్లును దిద్దుకొనుచునే యుందురు. లేనిచో గ్రంథ ప్రాశస్త్యము చెడును. మేము మొదట తలపెట్టక తరువాత చేసినమార్పు ఎట్టిదనగా గ్రామములను పట్టికలు చేయునప్పుడు 5000 అంతకుమించిన ఎక్కువ జనాభాగల గ్రామములను మాత్రమే భూగోళ సర్వస్వమునందు చేర్పవలెనని తలచితిమి. అట్టి పట్టికలనుతీసి పరిశీలింపగా తెలంగాణమునందును రాయలసీమజిల్లాలలోను ఐదువేల జనాభాగల గ్రామములు మిక్కిలి తక్కువ సంఖ్యలో లెక్కకు వచ్చినవి. సర్కారుజిల్లాలలో మాత్రమే కొంచెము ఎక్కువ సంఖ్యలో కనబడినవి. ఐదువేల జనాభా ప్రమాణమైనచో ఆంధ్రదేశములోని వెనుకబడిన ప్రాంతములకు అన్యాయము జరుగునని తెలుసుకొని మూడువేల జనాభాగల గ్రామములను సేకరించుటకు పూనుకొంటిమి. దీనివలన పరిస్థితి కొంతమెఱుగు అని పించెను. ఇంకొక యుదాహరణ కలదు. ఈ సర్వస్వము నామములనుబట్టి కూర్పబడుచుండుటచే సమాహారముగా వ్రాయవలసిన కొన్నియంశములు చేరలేదు. సమన్వయదృష్టి ఏర్పడదనుభావము కలిగినది. 10—2—1968 నాడు సమావేశమైన సలహా సంఘపు పెద్దలు రాజవంశముల, సమన్వయచరిత్రలు కూడ ఉండుట బాగుండునని చెప్పగా అట్లే చేయుట కంగీకరించితిమి.

ఆరంభమునందు మేమును వహాలికమైన ఆకరములనుండియే పేర్ల పట్టికలను సమకూర్చుటకై పూనుకొంటిమి. వహాలికాధారములు లభించుట దుర్లభమయ్యెను. కాలతురంగము మరుగులు గ్రక్కుచుపరుగెత్తుచుండెను. మన ప్రభుత్వములు పంతప్రవృత్తి కలవి. మార్చి 25 వ తారీఖునాటికి గ్రంథమును మంజూరుచేసి వారము తిరుగకుండగనే ఏప్రిలు ఒకటవతారీఖునుండియు యూటిలైజేషన్ సర్టిఫికెట్లకొరకు తరుముకొనివత్తురు. వహాలికాధారములనే పట్టుకొనియున్నచో.


'బృహస్పతిశ్చ వక్తా
ఇంద్రశ్చ అధ్యేతా
దివ్యంవర్షం శబ్దపారాయణం
నాంతం జగామ'

అను వింతపరిస్థితి యేర్పడును. అప్పుడు జ్ఞానవృద్ధులైన కొందరు పెద్దలు మాకొక తరణోపాయమును సూచించి పుణ్యము కట్టుకొనిరి. వహాలికాధారములు, వాని నుపయోగించుకొని వెడలిన ప్రామాణిక గ్రంథములు చేకొనవచ్చునని పరిష్కరించిరి. లోకము కార్యసిద్ధిని ఆకాంక్షించును. అదియు శిరోధార్యమే.

సందర్భము వచ్చుటచే చారిత్రక—భూగోళ సర్వస్వ నిర్మాణమునందు కార్యకర్తలెదుర్కొనుచున్న ఒక సమస్యను పేర్కొని విరమింతును. మేము ఎన్నుకొన్న గ్రామములన్నింటిని సందర్శించి విషయసేకరణ చేయుటకై ఎన్యూమరేటర్లను పంపియుంటిమి. వారిలో చాలామంది సంతృప్తికరములగు వక్కాణములను తెచ్చియిచ్చిరి. అవిభక్తమైన గుంటూరుజిల్లా విషయమై మేము చేసిన ప్రయత్నములన్నియు విఫలమైనవి. ఇది యిప్పుడు గుంటూరు, ఒంగోలు అను రెండు జిల్లాలుగా ఏర్పడినది. గుంటూరు, ఒంగోలు

జిల్లాల గ్రామములనుగూర్చి వారెట్టి వ్యాఖ్యానములును రాలేదు. ఆ జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్తు అధ్యక్షులు మున్నగు పెద్దలెందరికో విజ్ఞప్తులు చేసితిమి. రెండు ప్రముఖజిల్లాల వృత్తాంతము వెనుకబడిపోయినది. ఏమి చేయవలెనో తెలియక ఆవేదన పడుచున్నాము. అంతరంగిక పరిస్థితులు తెలియని కొందరు ఈలోపమునకై సర్వస్వ నిర్మాతలను విమర్శింతురు. విమర్శలెట్లున్నను తక్కువ పురోభివృద్ధి సాధించిన రెండు జిల్లాలను విడిచిపెట్టుట యెట్లు?

మిక్కిలి శ్రమకోర్చి ముఖద్వార గ్రంథమును ఆమూలాగ్రముగా శోధించి ఎన్నియో విషయములను మా దృష్టికి తెచ్చిన మిత్రులు, సాహిత్య ప్రేమికులు శ్రీ విడుదవోలు వెంకటరావుగారికి కృతజ్ఞతావందనము లర్పించుచున్నాము.



గ్రంథ విమర్శలు

సాహితీ జగతి

[రచయిత : కాళూరి హనుమంతరావు, ప్రచురణకర్త : కె. వి. శేషుబాయి, O.U.B/F7 University Campus, హైదరాబాదు — 7. పేజీలు : 229. వెల : ఐదు రూపాయలు.]

ఈ పుస్తకం, ప్రాచీన గ్రంథాల్లోనుంచి విషయ సంగ్రహణచేసి, పరీక్షలకువెళ్లే విద్యార్థులకు వ్యాపారదృష్టితో రాసిన గైడుపుస్తకం కాకపోవటం సంతోషించదగ్గ విషయం.

ఇందులో సాహితీ జగతి, సాహిత్య ప్రయోజనము, కవిత్వము—ఇతివృత్తము, మహాభారతములో కొన్ని సందేహములు, భాసనాటక చక్రము, భాష—వ్యాకరణం, ఆంధ్రకవితా సరస్వతికి బరువునగలు, తిరుపతి వెంకటేశ్వరుల మహాభారత నాటకములు, కృష్ణశాస్త్రిగారి వ్యక్తిత్వము—సాహిత్యము, వేలూరి శివరామశాస్త్రి స్మృతి అని మొత్తం పది వ్యాసాలున్నాయి. 229 పేజీల పుస్తకంలో మొదటి వ్యాసమే 103 పేజీలుంది. తరువాత రెండు వ్యాసాలకీ దీనికీ విషయ సామ్యం ఉంది. ఈ మూడూకలిపి 133 పేజీలు అవుతుంది. అంటే వీటినే ప్రత్యేక పుస్తకంగా వేసినా బాగానే ఉండేది. విషయ గౌరవాన్ని బట్టి ఈ సమీక్షలో కొన్ని వ్యాసాలే పరామృష్టాలు అవుతై. ఈ వ్యాసాలన్నీ పూర్వం భారతి, ఆంధ్రప్రభ, కృష్ణాపత్రికవంటి పత్రికల్లో అచ్చయినవే.

హనుమంతరావుగారు సంస్కృతం, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో మంచిపండితులు. ఈ సంస్కృత పాండిత్యం శ్లోకాలప్పచెప్పే పాండిత్యంకాదు. సాహిత్య సిద్ధాంతాలు, కావ్యాలు సవిమర్శకంగా పరిశీలించ గలిగిన Creativity ఉన్న పాండిత్యం వీరిది. 'భయముకాని, పక్షపాతముకాని లేకుండ కావ్యాదులను పఠించునప్పుడు కల్గు భావములను అవి గుణప్రదర్శకము లైనను, దోషసూచకములైనను విశదముగా వెల్లడించుట సద్విమర్శకుని లక్షణము. ఆ లక్షణము శ్రీ హనుమంతరావుగారి వ్యాసములందు సర్వతోముఖముగా గోచరించును.' అని వీరిని గురించి దివాకర్ల వేంకటావధానిగారు తొలిపలుకులో చెప్పింది అక్షరాలా సత్యం.

సాధారణంగా సంస్కృత సాహిత్య సిద్ధాంతాల్ని గురించి రాసేటప్పుడు పులుముడుపద్ధతిలో రాయటం మన సాంప్రదాయిక పండితుల కలవాటు. కాని హనుమంతరావుగారికి ఎంత జటిల విషయమైనా స్పష్టంగాచెప్పే నేర్పుంది. అందుకు వారు—అక్కడక్కడ ప్రాచీనప్రయోగాలు వాడినా—ఎక్కువగా ఆధునికభాషనే తమ వాహకంగా వాడుకున్నారు. 'ద్రాఘిష్ఠ సమాసరచన' 'దధ్యపఘాతుకములు' వంటి ప్రయోగాలు అరుదుగా ఉన్నై.

సాహిత్యంలో వీరి దృష్టి పూర్తిగా ప్రాచీనమనటానికి వీల్లేదు. నాటకాలకన్నా సినిమాల్లో అనుభూతి గాఢతరమవుతుందన్నంతవరకూ ఆధునిక దృక్పథం వీరిలో ఉండటం మెచ్చుకోదగింది.

'సాహితీజగతి'అనే వ్యాసంలో వీరు మొదట ధ్వనివాదాన్ని ఖండించారు. వ్యంగ్యం లేకపోయినా వేమన కవిత్వం ఉత్తమమైనదేనని, వ్యంగ్యం ఉన్నంత మాత్రాన అసుందరమైన వాగ్వ్యవహారానికి కావ్యత్వం సిద్ధించదని ఉపపత్తులతో నిరూపించారు. ఎంత వ్యంగ్యంఉన్నా జారిణిని హెచ్చరించే చెలికత్తె మాటల్లో కవిత్వం చూడటం కనీసం ఈ తరంవారికి చేతకాదు. కేవలం ధ్వనించటంకన్నా ధ్వనించే విషయం ప్రధానమైనది. వ్యంగ్యం అభివ్యక్తికి ఉపకరణమేనని, అదైనా ఒకానొక ఉపకరణమేనని హనుమంతరావుగారు వేసవి

నిర్ధారణ హేతుబద్ధంగా ఆలోచించగలిగినవాళ్ళంతా ఒప్పుకుంటారు.

తరవాత వీరు రససిద్ధాంతాన్ని పరామర్శించారు. ఇక్కడకూడా ఆయన నిర్భయంగా—రస నిష్పత్తికి మహాకావ్యమే అక్కర్లేదనీ, ముక్తకాల్లో కూడా రసనిష్పత్తికి వీలుందని, విరుద్ధరస సమావేశం నిషిద్ధంకాదని, ప్రతిభావంతుడైన కవి అట్లా చేసి మెప్పించవచ్చుననీ, ఆ మాటకొస్తే అసలు రసం లేకపోయినా ఉత్తమకవిత్వం కావచ్చుననీ, హనుమంతరావుగారు వాదించారు. రససిద్ధాంతంలోఉన్న లోపాలను ఇంత సోపపత్తికంగా నిరూపించిన విమర్శకులు అరుదు. కేవలం భావమే రసాన్ని కలిగించగలదన్న రసగంగాధరకారుని మతాన్ని వీరు సమర్థించారు.

రససిద్ధాంతంలో ఉన్న ఇంకో వైరుధ్యాన్ని బయటపెట్టారు. రసానందం బ్రహ్మానంద సహోదరమని, శోకాది రసాస్వాదనలోకూడా ఆనందముందని చెప్పే సిద్ధాంతాన్ని అనుభవ విరుద్ధమని వీరు ఖండించారు. వాల్మీకికవే పక్షినిమిత్తం శోకార్తుడ నయ్యానని స్వయంగా చెప్తుంటే — కాదు, అది అలౌకికానందమనటం ఏం న్యాయమని హనుమంతరావుగా రడుగుతున్నారు. ఒక్కొరసం తదనుకూలమైనభావాన్నే సామాజికుడిలో కలిగిస్తుందని హనుమంతరావుగారు చెప్పింది యుక్తియుక్తంగా ఉంది.

కావ్యంలో వాస్తవికతనుగురించి హనుమంతరావుగారు చేసిన వాదాన్ని సమర్థించలేం. 'కలకత్తా నగరంలో ఒకనాటి సాయంకాల ప్రశాంతవేళ సముద్ర తీరంలో కూర్చొని' అనటం దోషం కాదంటారు, ఈ గ్రంథకర్త. శ్రీశ్రీ గేయంలో 'శివసముద్రమూ, నయాగరావలె' అనటానికి దీనికీ సంబంధంలేదు. శ్రీశ్రీ ఈ రెండు జలపాతాల్నీచూసి ఉండక పోవచ్చు. కాని భారతదేశంలో ఉన్న ఒక పెద్ద జలపాతాన్ని, ప్రపంచంలో అన్నిటికన్నా పెద్దదైన ఇంకో జలపాతాన్ని కవి సంకేతాలుగా ఉపయోగించుకున్నాడు. రెండూ చూసిన ఈ సమీక్షకుడికి రెండిట్లోనూ వేగం కనిపించింది. శివసముద్రం ఎత్తయిన నది. నయాగరా వెడల్పైనది. ఉన్నతమైన ఆశయాన్ని, అధికమైన జనసమూహాన్ని కవి ఈ విధంగా సంకేతించి ఉండవచ్చు. శివసముద్రమూ, నయాగరాలు కవి ఉపయోగించుకున్న కవి సమయాలు. వీటిల్లో వాస్తవికత ప్రసక్తిరాదు. కలకత్తా సముద్రతీరాన ఉందనటం factual mistake. అది ఏవిధంగానూ సమర్థనీయంకాదు.

అప్రయుక్తము, అరీతి, అశ్లీలము మొదలైన కావ్యదోషాలను పరామర్శచేస్తూ వాటిని దేశకాలాదులనుబట్టి అన్వయించుకోవాలన్నారు. వారు చెప్పినట్టు 'కవిత్వానికి కొలతలు ఏర్పరచి ఈభాష, ఈమాటలు, ఇటువంటి శైలి, శృంగారాది నిర్దిష్ట మనోవికారాలు—ఇవే ఉపయోగించా'లని ఎవరూ శాసించలేరు. కాని ఇదే సందర్భంలో శ్రీశ్రీ పద్యాలను ఉదహరించి కొన్ని 'దోషా'లను చూపించారు. భిక్షు వర్షీయసి అన్న ఖండికలో 'ఎముకలుకుక్క కొరుక్కుంటు ఏమీ అనలేదు కుక్క, ఒక ఈగను పడవేసుక తొందరగా తొందరగా తొలిగె తొండ' అనే పాదాలు అనవసరమని, ప్రధాన విషయానికి దోహదకారులు కావని అభిప్రాయ పడుతున్నారు. కాని ఆయన వ్యాఖ్యలోనే అందుకు సమాధానముంది. 'తమ తమ పనులలో మునిగి ఉన్నారు' అని కవి ఇక్కడ చెప్పదలచింది. పై పాదాల్లో అది సరిగ్గానే వ్యక్తమయింది. 'స్వార్థపరత్వం' లేకుండానే తమ కళ్ళముందు జరిగే వాటినికూడా పట్టించుకోకుండా తమతమ పనులలో మునిగిపోయేవారికి కుక్క, తొండ సంకేతాలు.

అట్లాగే ఇంకోచోట 'కొన్నిచోట్ల కవి భావాన్ని చక్కగా నిరూపిస్తూకూడా తత్కాలంలో ప్రజలకు నచ్చే అభిప్రాయప్రకటనకోసం తాపత్రయపడి కవిత్వాన్ని మ్లానం చేసుకుంటూఉంటాడు'అని శ్రీశ్రీ దేశచరిత్రలుఅనే గేయాన్ని ఉదాహరిస్తారు. 'ఏదేశచరిత్ర చూచినా'అనే పాదంనుంచి 'దరిద్రులను కాల్చుకుతినడం'వరకు 12 పాదాలున్నై. అందులో పన్నెండోపాదంలోనే 'వర్తమాన రాజకీయాభిప్రాయ ప్రకటనాచాపల్యం' ఉందని హనుమంతరావుగారి అభి

ప్రాయం. కాని నరజాతి చరిత సమస్తం, పరపీడన పరాయణత్వం (3, 4) అన్న పాటల్లో ఆ 'చాపల్యం' లేదా?

గతితార్కికభౌతికవాద పద్ధతిలో చరిత్రకు కవితామయమైన వ్యాఖ్యానం చెయ్యటమే శ్రీశ్రీ ఆ గేయం మొత్తంలో పెట్టుకున్న లక్ష్యం. మొదట్నుంచి చివరిదాకా ఆ లక్ష్యం తెలుస్తూనే ఉంది. 'The history of all hitherto existing society is the history of class struggles' (ఇంత వరకు నడచిన చరిత్రలంతా వర్గపోరాటాల చరిత్రే) అన్న Manifesto లో మొదటివాక్యం ఈ గేయానికి ప్రేరకం. ఇది గమనించకపోవటంవల్ల ఇటీవల కొందరు విమర్శకులు పొరపాటు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. సరిగ్గా ఈ గేయాన్ని గురించే ఇంతకుముందు ఒక విమర్శకుడు చేసిన వ్యాఖ్యానాన్ని గురించి (చూ. సంవేదన 2, 3) కొంతకాలం కిందట పత్రికల్లో చర్చ జరిగింది. శ్రీశ్రీని సాంప్రదాయక పద్ధతిలో విమర్శించే వారందరూ ప్రాయికంగా పడుతున్న పొరపాటు ఇది. దానికి కారణం సాంప్రదాయిక విమర్శకులకు తగినంత రాజకీయ పరిజ్ఞానం లేకపోవటమే. మహాప్రస్థానం అనే ఖండికలో 'ఎర్ర బావుటా నిగ నిగలు' అనటంవల్ల భావాపకర్షణ జరుగుతున్నదని నిర్ధారించేముందు అసలా ఎర్రబావుటా నిగనిగల్ని గురించి చెప్పటమే ఆఖండికలో కవి ప్రధానంగా చెప్పదల్చుకున్న భావమని గుర్తించక్కర్లేదా?

'కవిత్వాన్ని కేవల సాంఘిక దృష్టితో విమర్శించటం పొరపాటనీ, సాహిత్యం శాశ్వతమైనదీ, స్థిరమైనదీ, సార్వజనికమైనదనీ, సర్వమతాలకు, సకల శాస్త్రాలకు అతీతమైన'దని హనుమంతరావు గారు సాహిత్యప్రయోజనము అన్న వ్యాసంలో ప్రకటించిన ప్రధానమైన అభిప్రాయాలు. ఈ అభిప్రాయాలు చాలాకాలంనుంచి ప్రచారంలో ఉన్నవే. సంఘంతో సంబంధంలేని సాహిత్యం ఎక్కడా లేదు. ప్రాచీన సాహిత్యంలో చాలాభాగం సంఘప్రయోజనాన్ని ఆశించి రాసినవే. స్థిరమైనదీ, శాశ్వతమైనదీ ఏదో ఉందనుకోటం (సాహిత్యం ఇందుకు అపవాదం కాదు) చాలా 'రొమాంటిక్'గా ఉండొచ్చు. సంఘ ప్రయోజనం అల్పమైనదనీ, దానికి అతీతమైన మహా ప్రయోజనం ఏదో ఉందనుకోటంకూడా ఇట్లాంటి 'రొమాంటిక్' భావనే. కాని ఇది హేతుబద్ధంకాదు.

'కవిత్వము - ఇతివృత్తము' అనే వ్యాసంలో సాహిత్యంలో ఇతివృత్త స్థానాన్ని గురించి వర్ణించారు. కాని నాయికా నాయకులున్నదే ఇతివృత్తమని హనుమంతరావుగా రభిప్రాయ పడుతున్నట్టున్నది. కుందుర్తి రాసిన 'తెలంగాణ' కావ్యంలోగాని, ఆరుద్ర రాసిన 'త్వమేవాఽహమ్' కావ్యంలోగాని నాయకు డెవరు? 'సంఘర్షణ అనేది మానవ జీవితంలో ఉన్నది సంఘంలో మానవుని అంతస్సునిబట్టి కాదు' అనివారి వ్యాసాన్ని విమర్శించినవారికి హనుమంతరావుగా రిచ్చిన సమాధానం సూటిగా లేదు. సామాన్యుడి జీవితంలోనూ సంఘర్షణ ఉంటుందని అంగీకరించటానికి హనుమంతరావుగారి అభ్యంతరమేమిటో అర్థంగాదు.

'భాష—వ్యాకరణం' అనే వ్యాసం మొదట 1969 జూన్ భారతిలో అచ్చయింది. వాటిలో కొన్ని అభిప్రాయాలను ఈ సమీక్షకుడు వేరేచోట (చూ. 'వ్యావహారిక భాష—వ్యవస్థ' ప్రగతి, 14 నవంబరు 1969) విమర్శించాడు. సమీక్షకుడి వ్యాసానికి సమాధాన ప్రాయాలైన కొన్ని వాక్యాలను అదనంగా చేర్చి ఈ పుస్తకంలో వేశారు. 'భాష సంకేతిత

వినడం మానవుని హేతువాదాన్ని, బుద్ధిని హీన పరచడ మవుతుంది,' అని వీరనటం అశాస్త్రీయం. భాషకూ, అది వ్యక్తంచేసే అర్థాలకూ సారూప్య సంబంధం (Iconicity) లేదని భాషా శాస్త్రజ్ఞు లందరూ అంగీకరించిన విషయం. అట్లా ఉందని చెప్పటానికేవిధమైన ఆధారమూ చూపించలేదు హనుమంతరావుగారు.

'మాట్లాడినట్లే వ్రాయడమైతే జాగర్త అనీ, జాగత్త అనీ, జాత్త అనీ ఇలా ఆ పదం అనేకరూపాలుదాల్చి క్షీణిస్తుం'దంటారు గ్రంథకర్త. ఇట్లా క్షీణిస్తే ప్రపంచంలో భాషలు ఎప్పుడో అంతరించిపోయి ఉండేవి. కాని అట్లా జరగలేదు. భాష వ్రాతతో నిమిత్తంలేకుండానే మారుతుంది. ఆ మార్పు వర్ణలోపానికే పరిమితం కాదు. ప్రాచీనాంధ్రంలో 'వచ్చెను' అనే భూతకాల క్రియారూపం 'అతడు, ఆమె, అది, అవి' అనే సర్వనామార్థాలను బోధించగలదు. ఆధునికభాషలో వీటికి వేరువేరురూపాలు వాడతారు. అధికమైన భేదాలుకూడా భాషలో వస్తుంటై. క్షీణించట మొక్కటే మార్పు అనుకోటం అశాస్త్రీయం. వృద్ధి క్షయాలు ప్రపంచంలోనే ఒకదాన్నొకటి balance చేస్తుంటయ్యని ఆధునికశాస్త్రజ్ఞు లంటారు.

'భాషను తెలిసిన రచయితలు దాని పారిశుద్ధ్యాన్ని పరిరక్షించటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. సామాన్యజనులు ఉచ్చారణ సౌలభ్యాన్నిమాత్రం చూసుకొని భాషస్థాయిని క్రిందికి లాగుతూఉంటారు' అని రాశారు. భాషలో పరిశుద్ధి అంటే ఏమిటి? ప్రాచీన భాష మాట్లాడ్తున్నామా? అట్లాంటివాళ్లెప్పుడూ ఉండరు. శిష్టశిష్టేతరభేదంలేకుండా అందరిభాష మారుతుంది. ఏక్కిరింత—వెక్కిరింత, ఎక్కిళ్లు—వెక్కిళ్లు, ఎన్ను—వెన్ను అనే జంటల్లో మొదటి మాటల్ని సామాన్యులు వాడతారు. రెండోవరసమాటల్ని 'శిష్టులు' రాస్తున్నారు. కాని సామాన్యుల వాడుకే ఇక్కడ 'పరిశుద్ధ' మైనది. ఉచ్చారణ సౌలభ్యం భాషలో మార్పుల్ని సమగ్రంగా వివరించలేదు. సామాన్య జనులు భాషస్థాయిని దిగజారుస్తారనుకోటం శాస్త్ర సమ్మతంకాదు. అసలు భాషస్థాయి అంటే ఏమిటి? ఆర్థికంగా సమాజంలో ఉన్న కొన్ని అసమానతల మూలంగా వచ్చిన పదం స్థాయి. దానికిమించి భాషలో స్థాయి అంటే ఏమిటో ఈ సమీక్షకుడి ఊహకు అందటంలేదు. భాషా లక్షణాల్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవటం వల్లనే భాషా పరిశుద్ధ వాదులు బయల్దేరుతుంటారు. పాశ్చాత్య దేశాల్లో చారిత్రకాంశమైనది మనకు ప్రస్తుతం కావటం విచారించ దగిన విషయం.

'వ్యాకరణం భాషను శాసించలేదు...కాని చక్కబరుస్తుంది' 'భాష చీకుగా చిట్టడవివలె పెరిగి ముళ్లతోనూ, పాములతోనూ నిండి దుర్గమమైపోకుండా పార్కువలె తీర్చి దిద్ది సుగమం చేస్తుంది వ్యాకరణం' 'వ్యాకరణం సదా భాషను సంస్కరించటానికి ప్రయత్నిస్తూ ఉంటుంది.' 'భాషాశ్వానికి వ్యాకరణం కళ్లెం వంటిది' 'వ్యాకరణ నియతిలేని భాష పెరుగుదల కేన్సరు పెరుగుదల వంటిది' వంటి వాక్యాలు ఈ వ్యాసంలో అక్కడక్కడా ఉన్నై. వీటిని హేతువాదులైన భాషాశాస్త్రజ్ఞు లంగీకరించరు. భాషా స్వరూప స్వభావ నిరూపణమే వ్యాకరణం చెయ్యగలిగిన, చెయ్యాల్సిన పని అని భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. వ్యాకరణం కత్తెరా కాదు, కళ్లెమూ కాదు. భాషలో ముళ్లూ ఉండవు, పాములూ ఉండవు. వ్యాకరణ నియతిలేనిభాష ఉండదు. వ్యాకరణం అంటే లిఖితమే కానక్కరలేదు. స్వభాషావ్యవహర్తలందరి మనస్సుల్లోనూ వ్యాకరణం అలిఖితంగా ఉంటుంది. భాషావ్యవహారాన్ని ఈ అలిఖిత వ్యాకరణమే నడిపిస్తుంది. అమూర్తమైన అలిఖిత వ్యాకరణానికి స్పష్టమైన రూపాన్నియ్యటమే లిఖిత వ్యాకరణాల ప్రయోజనం. (ఈ సందర్భంలో చూ. చేకూరి రామారావు 'భాషాశాస్త్రంలో పరివర్తన సిద్ధాంతం' in N. C. S. వెంకటాచార్యులు & అమరేశం రాజేశ్వర శర్మ (eds.) 'శారదా మంజీరము'. సికింద్రాబాదు

1970). అది ప్రాచీన భాషకూ రాయవచ్చు; ఆధునిక భాషకూ రాయవచ్చు. శిష్టభాషకూ రాయవచ్చు. అశిష్టభాషకూ రాయవచ్చు. వ్యాకరణానికి వర్గదృష్టి లేదు. వ్యవహర్త లందరూ ఒకటే. ఈ అభిప్రాయాల నింతకు పూర్వంకూడా ఈ సమీక్షకు డక్కడక్కడ కొన్ని వ్యాసాల్లో ప్రకటించాడు. వీటికి సమాధానమా అన్నట్టు ఈ పుస్తకానికి రాసిన మలిపలుకుల్లో N. C. S. వేంకటాచార్యులుగారు—

'ప్రతిమనిషిలోను వ్యాకరణము అలిఖితంగా ఉందనీ; లిఖితవ్యాకరణానికేమీ ప్రయోజనంలేదనిచెప్పే భాషావేత్తలు ఈ కాలానికిఅలంకారంగా ఉన్నారు'అనిఅలంకారయుతంగా అవహేళన చెయ్యటానికి ప్రయత్నించారు. శాస్త్రవిషయాలు అవహేళనద్వారా నిరూపితంకావు. కావల్సింది హేతువాదం. వ్యాకరణం లిఖిత భాషకే ఉంటుందనీ, భాషలో కనిపించే వివిధరూపాల్ని రచనలో ఎంచుకోటానికి ఉపయోగించే సాధనం వ్యాకరణమనీ అనుకోవటంవల్ల ఈ చిక్కు వస్తున్నది. ఇట్లాంటి పుస్తకాలు ఒక్కోకాలంలో ఉండవచ్చు. వాటిని guides అనో, style sheets అనో అనాల్సి ఉంటుంది. వాటినికూడా వ్యాకరణాలని వ్యవహరించటం ఇంకో మంచిమాట దొరక్కనే. ఈ సందర్భంలో ప్రకృతికీ, గతితర్కసూత్రాలకీ ఉన్న సంబంధాన్ని చెప్తూ ఎంగెల్సు రాసిన వాక్యం ఒకటి గుర్తొస్తున్నది. ఆ వాక్యం ఇది: 'And finally, to me there could be no question of building, the laws of dialectics into nature, but of discovering them from it and evoling them in it.' (Frederick Engeles 'Anti-Duhring' Mascow, 1969.) దీంట్లో dialectics బదులు grammar అనీ, nature బదులు language అనీ చేర్చుకుంటే భాషకు వ్యాకరణానికి ఉన్న సంబంధం సరిగ్గా వ్యక్తమవుతుంది.

'ఆంధ్ర కవితా సరస్వతికి బరువు నగలు' అనే వ్యాసంలో యతిప్రాసలు తెలుగు కవిత్వానికి బరువు లని, మహాకవులే ఈ బంధాల్నుంచి తప్పించుకోలేక పోయారని నిరూపించటానికి ప్రయత్నించారు. ప్రాస సంస్కృతంలో లేదు. యతిలో అక్షరమైత్రి తెలుగు కవులు కల్పించుకున్నదే. ఇవి భావాభివ్యక్తికి అడ్డు తగిలేమాటా నిజమే. అయితే గణాలుమాత్రం బంధాలు కావా? యతిప్రాసలు దగ్గరే ఎందుకాగాలి? ఈ ప్రశ్నలకీ వ్యాసంలో సమాధానాలు దొరకవు. ఈ హేతువాదాన్నింకాస్త సాగిస్తే, యతిప్రాసలేకాక గణాలుకూడా భావ వ్యక్తీకరణ కడ్డుతగిలినచోట్లు చూపించటం కష్టంకాదు. అయితే హనుమంతరావు గారంతదూరం పోదల్చుకోలేదు. కాని ఆధునిక కవులు వీటినెప్పుడో దాటారు.

కొంతవరకు ఆధునిక దృష్టి ఉన్న సాంప్రదాయికులైన విమర్శకులు హనుమంతరావుగారు. పరిమితమైనా, వీరిలో హేతువాదదృష్టి ఉంది. ఈ పుస్తకంలో వ్యాసాలన్నీ పాఠకుల్లో ఆలోచనలు రేకెత్తించేవే. స్పష్టత వీరిశైలిలో చెప్పుకోదగిన గుణం. పైనపేర్కొన్న అభిప్రాయాలు పుస్తకంలో లోపాల్ని చూపించటాని కుద్దేశించినవికావు. కొంతవరకైనా, హేతుబద్ధంగా ఆలోచించగల విమర్శకులు కాబట్టి వారిని పునరాలోచింప చేయించటమే ఈ విమర్శలో ఆశించిన ప్రయోజనం. సాహిత్యాభిమానులందరూ అవశ్యం చదవాల్సిన మంచిపుస్తకమిది.

ఉపయుక్త గ్రంథసూచికలో ముద్రణాది వివరాలు ఇస్తే ఇంకా ఉపయోగకరంగా ఉండేది.

'చే రా'

రా జ రా జు

(నాటకం. రచన: కీ. శే. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి; ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో— మచిలీపట్నం— మద్రాసు — సికింద్రాబాదు: 232 పేజీలు; వెల. రూ. 2.)

వ్యావహారికభాషకు విలక్షణచైతన్యం చేకూర్చిన ఉత్తమ రచయితలలో కీ. శే. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ప్రథమశ్రేణిలో గణింపదగినవారు. చిన్న కథల రచయితగా ఆయన తెలుగు కథానికల కెంతో పుష్టిని సమకూర్చారు. సంప్రదాయబలాన్ని ఆధునిక

భావముల వ్యాప్తికి ఆటంకం కాకుండా సంస్కారాన్ని అభిలషించి రచన చేసిన మహారచయిత శ్రీపాద వారు. కవిగా, నవలాకారునిగా, నాటక రచయితగా, వ్యాసకర్తగా, పత్రికా సంపాదకునిగా ఆయన ప్రతిభ బహుముఖంగా వికసించినప్పటికీ చిన్నకథల రచయితగా ఆయన ప్రతిభను ఆంధ్రదేశం వేనోళ్ల కొనియాడుతున్నది. కాని ఆయన రచనలలో మేలైనది వారు వ్రాసిన యీ 'రాజరాజు' నాటకం. దీన్ని రచయితే స్వయంగా 'వాగనుశాసనుని ధర్మజ్యోతితో ధగధగలాడుతో కవిసమ్రాట్టు మెప్పూ, సాహిత్యసమ్రాట్టు ఆదరమూ సంపాదించుకున్న నా 'రాజరాజు' నాటకం నిజంగా నా రచనల కన్నిటికీ తలమానికం' అని చెప్పుకొన్నారు. రాజరాజునాటకం పద్యనాటకం కాదు. ఆంధ్రదేశం యావత్తూ పద్యనాటకాలనూ, పద్యకావ్యాలనూ ప్రోత్సహిస్తున్నకాలంలో శ్రీపాదవారు కాలానికి ఎదురీది రసవత్తరమైన రాజరాజునాటకాన్ని కేవలమూ వచనంలోనే రచించారు. 'ప్రబుద్ధాంధ్ర' పత్రికను పద్యములను నిషేధించి కేవలమూ వచన రచనలతోనే నడిపారు. శ్రీపాదవారు పట్టుదలమనిషి. 'గద్యం కవీనాం నికషం వదన్తి' అనే సూక్తిని బాగా అర్థంచేసికొని ఉత్తమకవిత్వాన్ని రాజరాజునాటకం ద్వారా అందించారు. పట్టుదలగలమనిషి కావటం చేతనే భారతజాతి యావత్తూ జాతిపిత గాంధీజీకి దాసోహమంటూ హిందీని జాతీయభాషగా గౌరవిస్తున్న కాలంలో 'హిందీవల్ల తెలుగుకు జరుగుతున్న అపచారం' గుర్తించిన దూరదృష్టిగలవాడాయన. శ్రీపాద వారి కెంత స్వభాషాభిమానమున్నదో అంతగా పరదేశీయులన్నా, పరదేశభాషలు, వేషమన్నా తగని మక్కువ ఉన్నది. నిత్యమూ 'కోటు' ధరించి విదేశీయుల వేషాన్ని త్యజించనవసరంలేదని, పట్టుదలతోనే సూచించారు. 'నిగళబంధనం' వంటి మరికొన్ని రూపకాలను ఆయన రచించినప్పటికీ ఆయన రచనలలో 'రాజరాజు' నాటకమే తలమానికం.

సంభాషణలలోను, సన్నివేశకల్పనలోనూ, పాత్రచిత్రణలోను, ముఖ్యంగా మనస్తత్వచిత్రణలోనూ శ్రీపాదవారి రాజరాజునాటకం ఎన్నోపద్యనాటకాలకన్నా మేలైనది. నాటకీయతను పుష్కలంగా కలిగిన నాటకం యిది. మంచినటులు ప్రదర్శించటంచేతనే కొన్ని మంచినాటకాలౌతూ ఉంటాయి. కాని 'రాజరాజు' నాటకం ఎటువంటి నటులు ప్రదర్శించినా తన నాటకీయతను కోల్పోవని ఉత్తమ నాటకం. ఐతేనేం యిది ఎక్కువగా ప్రదర్శనలకు నోచుకోలేదు. తెలుగు నాటక రంగాన్ని సంగీతం పరిపాలిస్తూనే ఉండటంచేత, దానికి అలవాటు పడిన ప్రేక్షకులు పద్యనాటకాలను ఆదరించినంతగా వచన నాటకాలను ఆదరించటం లేదనే చెప్పాలి. కీ. శే. ధర్మవరం వారి 'విషాద సారంగధర' వంటి నాటకాలలో సుదీర్ఘమైన స్వగతాలున్నప్పటికీ, ప్రదర్శనకు చిక్కు కలిగించే అంశాలున్నప్పటికీ అవి ప్రదర్శనలో విజయవంతమైనాయంటే వాటిలో ఉన్న పద్యాలే అందుకు కారణం. అనార్కలి, రోషనార మొదలైన నాటకాలు 'పద్మశ్రీ స్థానం' వంటి అగ్రశ్రేణి నటులవలన అసంఖ్యాక ప్రదర్శనలకు నోచుకోగా, తిరుపతి వేంకటేశ్వరుల నాటకాలు పద్యాలతోనే దిగ్విజయ యాత్రలు చేయగా, పానుగంటివారి నాటకాలు పాదుక మొదలైనవి —భక్తిభావంతో ప్రేక్షకులను సమ్మోహితం చేయగా శ్రీపాదవారి 'రాజరాజు' ఆంధ్ర ప్రేక్షకులను అలరించలేదంటే, ఆ లోపం నాటక రచయితదికాదు—ప్రేక్షకులదే. రాజరాజు ప్రదర్శనకు పెద్దదవుతుందనుకుంటే కన్యాశుల్కంలాగే కొంత భాగాన్ని తగ్గించి ప్రదర్శించవచ్చు. మరి 'ఎమెచ్యూర్' నాటక సమాజాలైనా రాజరాజు నాటకాన్ని ప్రదర్శించటానికి పూనుకోకపోవటం శోచనీయం. ముందడుగు వేయవలసిన మన నాటకరంగం యింకా పద్యనాటకాలపైనా, పాటల నాటకాలపైనా మోజు చూపించినంతకాలం, ప్రేక్షకులను ఆలోచింపచేసి, రంజింప చేయటం సాధ్యంకాదేమో?

మహాభారత మహేతిహాసాన్ని ఆలంబనంగా పట్టుకొని ఉన్న నాటకం 'రాజరాజు'. నన్నయభట్టారకులు మహాభారతాన్ని అసంపూర్తిగా విడిచివేయ

టానికిగల కారణాల నన్వేషించటంలో రాజరాజ నరేంద్రుని జీవిత సంఘటన మొకటి, నన్నయను కఱచివైచి, అస్వస్థుణ్ణిచేసి ఉండవచ్చునని ఊహించి చక్కని కల్పనచేసి కృతకృత్యులయ్యారు. సారంగధరుని కథ చారిత్రకంగా యథార్థం కాదనేది యీనాడు నిర్వివాదాంశమైనది. సారంగధరునికీ రాజరాజనరేంద్రునికీ సంబంధం లేకపోవచ్చు. కాని కాల్పనికంగా వారిరువురిమధ్య తండ్రీ కొడుకుల సంబంధంతోనే ఎన్నో కథలు గాథలు అల్లుకొని ఉన్నాయి. రాజమహేంద్రవర ప్రజలింకా సారంగధర గాథ తమవీటనే జరిగినట్లు విశ్వాసంతో చెప్పుకుంటూనే ఉన్నారు. నన్నయభట్టు పాత్రను కీలకమైనదిగా స్వీకరించటంలో శ్రీపాదవారు పండితపామరులందరి మెప్పునూ పొందారు. జీవమున్న పాత్రలుగా రాజరాజు, చిత్రాంగి, సారంగధరుడు, యింకా చిన్నచిన్న పాత్రలనుకూడ మహాశిల్పివలె మలచారు. ఈ కథలోని ప్రధానపాత్రలసంగతి అటుంచి రాజరాజును విషయలంపటుణ్ణిచేసి, చిత్రాంగిని చేపట్టటానికి కారకుడైన మహారుద్రయ్యపాత్ర చిత్రణలోను, చిత్రాంగి చెలికత్తె, ప్రాణసఖి అయిన 'చిలక'పాత్ర చిత్రణలోను; యింకా రాజాంతఃపురపు దాసీలైన పొట్టి, అన్నపూర్ణ, రుక్కా మొదలైన పాత్రలను చిత్రించటంలోని శ్రీపాదవారి కళాకౌశలం నిరుపమానం. ముఖ్యంగా నాటకానికి కీలకమైన మహారుద్రయ్యను చారిత్రక వ్యక్తి అనిపించేటంతగా సజీవంగా చిత్రించారు. ధర్మాభిరతుడైన రాజరాజుమంత్రి చిట్టిపెలన్నను, చారిత్రకంగా రాజరాజుకు సోదరుడైన విజయాదిత్యుడు అన్నగారిపైన కత్తిగట్టటంలోని అంతర్యాన్ని, యీ నాటకంలో సారంగధరునికి జరిగిన అన్యాయమేనని, విజయాదిత్యుడుకూడ ధర్మాభిరతుడని నిరూపించటానికి చక్కని ప్రయత్నం చేశారు.

చాలమంది రచయితలు చేసినట్లు చిత్రాంగిని దుష్టురాలిగాగాక, ఆమెకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవాలని తహతహలాడే స్త్రీమూర్తిగా చిత్రించి [illegible] సమకూర్చారు. రాజరాజును తిరస్కరించటానికి వ్రతకల్పనమనే మిషను అందరూ కల్పించినప్పటికీ, 'షాణ్మాసిక స్థండిల సావిత్రీ గౌరీ వ్రతం'అనే వ్రతాన్ని, దాని నియమాలను వీరు మిక్కిలి చమత్కారంగా వర్ణించారు. చిత్రాంగి రాజరాజును దూషించి, ఆత్మహత్యచేసికొనే ఘట్టాన్ని రసవంతంగా నడిపించారు.

నాటకానికి శీర్షికగా ఎన్నుకొన్న 'రాజరాజు' వైభవాన్నీ, పతనాన్నీ ప్రతివిన్నాణాంశాన్నీ జాగరూకతతో పరిశీలించివ్రాసి, రాజాంతఃపురాలలో రాజులతో సన్నిహితపరిచయముండిన మహాకవులకువలె రమణీయంగా వర్ణించారు. రాజకీవిని కోల్పోని రాజరాజు విషయలాలసత్వాన్ని, తన వంశజులచరిత్ర మహాభారత రచన పూర్తికాని అతడి దురదృష్టాన్ని ఎంతో నేర్పుతో మలచారు.

నన్నయభట్టారకుని పాత్రచిత్రణ అపూర్వం. తన మహాభారతరచనను, చిత్రాంగి వివాహకారణంగానే నిలిపివేసి రాజరాజుతో 'యిలాగ వైదిక ధర్మం కాలరాసేసిన తమ పేరుమీదుగా ఆ పంచమ వేదం ఇంకా ఆంధ్రీకరించడం చాలా అనుచితమైనపని' అనిచెప్పి, ధర్మచ్యుతి కలిగినందుకు వగచి, అన్యమనస్కుడై తనువు చాలించిన మహాకవి పాత్రసృష్టి యీ మహారచయితకే చేతనైనది.

సారంగధరుని విషయంలో శ్రీపాదవారు నిగూఢంగా ఆలోచించి మానవమాత్రునిగా అతడిలో ప్రణయవాంఛ దాగిఉన్నదనీ, అతడుకూడ చిత్రాంగిని ఒక మనఃస్థితిలో కోరుకొని ఉండవచ్చుననీ భావించి, అటువంటి స్వగతాన్ని కల్పించారు. మళ్ళీ ధర్మమూర్తుడు కాకుండ ఉన్నట్లుగూడ అతడిని సరియైన మనిషిగా నిలబెట్టారు. ఈ నాటకం అంకితం పుచ్చుకొన్న శ్రీ విక్రమదేవవర్మగారికిది నచ్చకపోయినా, తమ పట్టుదల సడలించుకోక 'నే నీ నాటకం వ్రాయడానికి పుంచుకున్న ముఖ్యకారణాలలో, సారంగధరుని యీ చిత్తవైక్లబ్యమూ, దీన్ని నిగ్రహించుకుని అతను నిలవతొక్కుకో గలగడమూ చూపించడం మొదటిది' అని తమ ఉపోద్ఘాతంలో తెలియజేసా

...లాంటి వాడికిగూడా వాక్కొక్కప్పుడు మనస్సు చెదిరిపోకుండా వుండదు...చలనమే లేకపోవడం శిలా ప్రతిమకే నంటారు.

చిత్రాంగి నగరుకు కావలివాడైన మల్లన్న దగ్గరనుండి ప్రతి చిన్నపాత్రను జీవంతో సృజించటం, సంభాషణలలో రసము చిప్పిలునట్లుగా చేయటం యీ నాటకములో సర్వత్రా కనిపిస్తుంది.

ఇరవైయేడు రంగాలతో 232 పేజీల సుదీర్ఘమైన నాటకం యిది. పాత్రల సంఖ్య యెక్కువ కావటమూ, ప్రదర్శనకు ఎక్కువకాలం పట్టటమూ అనేవి ప్రదర్శనకు చిక్కులు కావచ్చు. కాని కన్యాశుల్క నాటకానికీ యీ చిక్కులున్నవి. చదువుకోవటానికి పూర్తిగానూ, ప్రదర్శన కనువుగా కొంతభాగాన్ని తగ్గించుకొని, రసజ్ఞులు యీ నాటకాన్ని ఆస్వాదించవచ్చు.

ఆధునిక సాహిత్యంలో అనర్ఘరత్నముగా యీ నాటకాన్ని గుర్తించి మళ్లీ ప్రచురించిన 'ఏమెస్కో' వారెంతైనా అభినందనీయులు. శ్రీపాదవారు చిన్నకథల రచనలో మేటిశిల్పిగా సుప్రసిద్ధులు గదా! వారి కథలన్నీ యీనాడు సరిగా చదువరులకు లభించటం లేదు. అల్లాగే వారి నవలలు వ్యాసాలుకూడ లభించటంలేదు. 'ఏమెస్కో'వారు శ్రీపాదవారి చిన్న కథలను, నవలలనైనా యీ 'సీరీస్'లో అందిస్తే యింకా ఎంతో సారస్వత సేవచేసిన వారవుతారు.

ఆ రా ధ న

[నవల—రచన: యద్దనపూడి సులోచనారాణి; ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో; మచిలీపట్నం; సికింద్రాబాద్; మద్రాసు: 191 పేజీలు; వెల రూ. 2]

ఇటీవలి కాలంలో కథలు, నవలలు చదివే పాఠకుల సంఖ్య అపరిమితంగా పెరిగింది. కథా రచయితలు, నవలా రచయితలు తామరతంపరగా పుట్టుకొని వస్తున్నారు. పూర్వం ఎప్పుడూ లేనంతగా రచయిత్రులు ఇటీవల కథలు, నవలలు వ్రాస్తున్నారు. సామాజిక స్వరూపాన్ని అర్థం చేసుకోవటంలో వెనుకబడినా సాంసారిక జీవితేతి వృత్తాన్ని ఆలంబనంగా చేసికొని ఎన్నోకథలు, నవలలు వ్రాస్తున్నారు. కవిత్వరంగంలోనూ, నాటకము, విమర్శవంటి తదితర రంగాలలోను రచయిత్రుల చురుకుదనం కనిపించటం లేదు. కథారచనలోను, నవలా రచనలోగూడ సంఖ్యాబలం కనిపిస్తున్నదేగాని ఉత్తమ రచనల్ని యెంచబోతే రచయిత్రులు వ్రాసినవి తగినన్ని కానరావు. యద్దనపూడి సులోచనారాణిగారు అసంఖ్యాకమైన పాఠకుల అభిమాన రచయిత్రి కాగలిగారంటే అది వారి రచనలోని ఉన్నతమైన అంశాలవలనకాదు; పాఠకులు కోరుతున్న పఠనయోగ్యత వారి రచనల్లో ఉండటమే. ఉత్తమ కళాఖండాలుగా యెంచదగిన సినిమాలేవిధంగా జనాదరాన్ని నోచుకోక, ప్రేక్షకులు కోరుతున్న దృశ్యాలే ఉన్న సినిమాలు ఎక్కువ ఆదరాన్ని పొందుతున్నాయో, అలాగే నేడు వార, పక్ష, మాస పత్రికలు చదివే పాఠకులుకోరే 'సీరియల్స్' వ్రాయగలిగినవారే పేరు పొందుతున్నారు.

వాస్తవికతకంటే ఊహామాత్రమైన జీవిత దృశ్యాలనే పాఠకులూ, ప్రేక్షకులూకూడ కోరుతున్నారు. ఇటువంటి పాఠకుల 'ఆర్తి'ని తీర్చగలిగిన వారే పేరున్న రచయితలు కాగలుగుతున్నారు. ఐతే యీ వాతావరణంలో ఉత్తమ నవలలు రావని నిరాశ చేసికోనక్కరలేదు. జీవితాన్ని నిశితంగా పరిశీలించకుండానే, శరపరంపరగా నవలలు వ్రాయాలంటే పాఠకుల సంతృప్తికోసం, వారి అభిరుచుల స్థాయికి దిగిపోయి, ఆయాపత్రికల ఆకలి తీరటంకోసం రచనలు చేయవలసివస్తుంది. ఎమెస్కోవారి పుణ్యమాఅని వారివే నెలకు నాలుగు రచనలు (ఎక్కువగా నవలలే) వెలువడుతున్నకాలంలో, వారిచ్చిన గడువులోగా నవల ముగించవలసిన అగత్యంకూడకలిగి రచన దుర్బలమైపోయే ప్రమాదం ఉన్నది. పులిమీదపుట్ర అన్నట్లు రచయితలకో కొత్తగా ఒక స్వార్థంకూడ తలయెత్తుతున్నది. తాము వ్రాసే రచన అటు నవలగా ప్రజాదరాన్ని పొందేదిగానూ, తర్వాత వెండితెరకెక్కి 'సినిమా'

రచయిత'గా పేరొందటానికి ముందే సంకల్పించి రచన చేయటం. మంచినవల సినిమా తియ్యటానికి పనికి రావచ్చు. కాని సినిమాకు పనికివచ్చేదిగా, ఉత్తమ నవలగాకూడ ఉండాలని ఆశించి వ్రాయటం, రెండు పడవలమీద నడవటమే—తద్వారా రెండిటికీ చెడ టమే మిగులుతుంది.

సులోచనారాణిగారు రచించిన 'ఆరాధన'అనే నవల 'అన్నపూర్ణ'అనే మూగపిల్లకథ. 'అనంత్'అనే యువకునికి భార్య చనిపోగా, తన ఇద్దరు పిల్లల్ని పెంచటమనేది ఒక సమస్య ఔతుంది. అతడి తల్లి రాజేశ్వరమ్మ ఉన్నప్పటికీ ఆమె కొడుకు జీవితం మోడువారిపోవటం చూడలేక అతడికి మళ్ళీ పెళ్లి ప్రయత్నం తలపెడుతుంది. తన భార్య రాధను మరచిపోలేని 'అనంత్' రెండవపెళ్లికి ఒప్పుకోడు. కాని తల్లి పట్టుపట్టి 'పిల్లలకోసం యీ పని చేస్తున్నాను'అని నచ్చచెప్పి, తన మనశ్శాంతికోసం గూడ పెళ్లిచేసికోమంటుంది. తమ కుటుంబంలో ఒదిగిపోగల్గిన మంచిపిల్ల 'అన్నపూర్ణ'అనిచెప్పి, ఆమె మూగదని 'నిశ్శబ్దంగా, మౌనంగా నీ జీవితంలో అంతర్వాహినిలా కలిసిపోగలపిల్ల' అనికూడ చెప్తుంది. అనంత్ అంగీకరించి అన్నపూర్ణను పెళ్లి చేసుకొంటాడు; కాని తన మొదటిభార్య రాధను మరచిపోలేక, అనంత్ అన్నపూర్ణను చాలకాలంపాటు దూరంగానే ఉంచుతాడు. జితేంద్రియుడిలాగ ప్రవర్తిస్తాడు. అంతేగాక విద్యారంగా ఒకసారి కోర్కెలకు లొంగిపోయి ఆమెను భార్యగాపొంది మళ్లీ 'వాకు...చాలా...బాధగా ఉంది. భరించలేనంత నరకంగా ఉంది'అని 'గుండెపట్టుకుని' వెళ్లిపోతాడు.

అనంత్ తన పిల్లలను రెండవభార్య సరిగా చూడటంలేదని కొన్నాళ్ళు మనస్సు కష్టపెట్టుకున్నా క్రమంగా అన్నపూర్ణ మంచిమనస్సును తెలుసుకో గలుగుతాడు. ఆమెకు సన్నిహితంగా వచ్చినట్లే వచ్చి మళ్లీ దూరంగాపోవటమనే 'దాగుడుమూతల' వలననే యీ నవల పొగడీసినట్లుగా వికృతంగా పెరిగింది. కొన్నాళ్లకు అనంత్‌తల్లి 'సరోజ'అనే మంరొక చక్కని తెలివైనఅమ్మాయిని చూచి 'అనంత్'కి భార్య ఉండగానే మళ్లీ పెళ్లిచేయాలనుకొంటుంది. ఆ అమ్మాయి అనంత్ స్నేహితునికి అక్కకూతురు; తన కొడుకు మూగభార్యతో సంసారంచేయటం చూడలేక ఆమె తన స్వార్థంకోసం అన్నపూర్ణను అన్యాయంచెయ్యాలని అనుకొంటుంది. అప్పుడా మూగ పిల్ల హృదయంలోని ఆందోళనను సమర్థవంతంగా చిత్రించారు రచయిత్రి. ఎంతో మానసికవ్యథతర్వాత అన్నపూర్ణ మౌనంగానే తన భర్త మళ్లీ పెళ్లిచేసు కోవటాన్ని అంగీకరిస్తుంది. ఆ పరిస్థితులలోగూడ ఆమె తన అత్తగారిని, భర్తను ద్వేషించదు. దిగ్భ్రమచెంది ఇదేమిటని ప్రశ్నించిన తన పినతండ్రికి 'వాళ్ళు మంచివాళ్లే బాబాయ్. కాని స్వార్థపరులైన మంచివాళ్లు'అని పలకమీదవ్రాసి చూపిస్తుంది. కాని 'అనంత్' తన అన్నపూర్ణ ఉండగా మళ్లీ పెళ్లికి అంగీకరించక, తల్లిని వ్యతిరేకించటంతో కథ సుఖాంతమవుతుంది. తన కుమార్తె జబ్బుపడినప్పుడు సేవచేయటానికి తన బాబాయిగారి ఊరునుండివచ్చిన అన్నపూర్ణను ఆదరంతో తనకు సన్నిహితురాలిని చేసుకుంటాడు.

ఈ నవల చదవటం ముగించినపిమ్మట ఒక్క మంచినవల చదివిన అనుభూతి ఏమీ కలగదు. అన్నపూర్ణవంటి అభాగినిపట్ల జాలి కలుగుతుందా అంటే, ఒక మూగపిల్ల ఒక ఇంటికోడలై పిల్లల్ని, భర్తను, అత్తగారిని అర్థం చేసుకోవట మనేది ఏ కుటుంబంలోనూ జరుగుతుందని అని పించదు. ఇటువంటి 'అపూర్వత్యాగాలూ' అర్థం చేసుకున్నట్లుగానే కనిపిస్తూ మళ్లీ మళ్లీ విడిపోవ టమూ సినిమాలలో కనిపించే విచిత్రాలు.

ఈ నవలలోని అనంత్ కుటుంబం ఈ సంఘంలో బ్రతుకుతున్నట్లుగాని, మూగపిల్లతో సంసారంచేస్తున్న వ్యక్తి ఎదుర్కొనే చిక్కులు గాని ఏవీ రచయిత్రి బాగా చెప్పలేకపోయారు— ఏవో ఒకటిరెండు చిన్న సంఘటనల్ని యిరికించినా నిజానికి ఈ కుటుంబానికి బయటి ప్రపంచానికి

తగిన సంబంధం ఉన్నట్లు కనిపించదు. సంభాషణల లోనూ జీవం కనిపించదు. ఈ నవలలో బాగున్న దల్లా మూగపిల్ల అన్నపూర్ణ పొందిన మనోవ్యథను వర్ణించటమే. 'Unheard melodies are sweeter' అనేమాట నిజమని నిరూపిస్తుంది ఈపాత్ర. ఇటు వంటి అరుదుగా కనిపించే, లేక కోటికొక్కరికివచ్చే జీవిత సమస్యల్ని కాకుండా, నిత్యమూ రచయితా పాఠకులూ ఉభయులూ చూడగలిగే, చూస్తున్న జీవిత దృశ్యాలతో సాంఘిక నవలలువ్రాస్తే ఆ రచనకు మరింత ప్రయోజనం ఉంటుందేమో! 'కాలక్షేపం' ఒక్కటే నవల చదవటంవలన ప్రయోజన మనుకొనే వారితో పేచీలేదు. వాళ్లలాగూ ఈ నవలను మెచ్చుకుంటారు. కాని నవల జీవితమంత గంభీరంగా, జీవితమంత నిండుగా వాస్తవంగా, రచయిత చెప్పే విషయమేదో తాము తెలిసికొనేదిగా ఉండాలను కొనేవారికీ నవల ఏమాత్రమూ నచ్చదు.

—రామమోహనరాయ్.

తెనాలిరామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యము

(ప్రచురణ — ఎం. శేషాచలం అండ్ కంపెనీ (38+286-పుటలు) ప్రతులకు— ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్—సికిందరాబాదు. మూల్యము సాదాప్రతి. 4—రు. లైబ్రరీప్రతి 6—రు.)

శేషాచలం కంపెనీవారు నవలలు, నాటకములు, కథలు, కొన్నికావ్యములు ప్రచురించి పాఠకుల మన్ననలకు పాత్రులైనారు. కొంతకాలమునుండి 'ఎమెస్కో' పద్ధతిని శతాధికగ్రంథముల ప్రచురించుచున్నారు; ఈ మధ్య — 'సంప్రదాయ సాహితి'యను శీర్షికతో తెనుగులోని పంచకావ్యములను, భారత—భాగవత—రామాయణములను ముద్రించి స్వల్పమూల్యముతో పాఠకలోకమును సంతుష్టిపరచవలయునని సాహిత్య యజ్ఞ దీక్షాకంకణబద్ధులైనారు, వీరి కృషి అభినందనీయము; ఇది సాహిత్యలోకమునకు ఒక క్రొత్త మలుపు.

కొంతకాలముగా సాహిత్యఅకాడెమీవారు తెనుగులోని ప్రసిద్ధగ్రంథములను చక్కనివ్యాఖ్యలతోపాటు ఒక్కరూపాయికే (తరువాత ఈ ధర పెంచబడినది.) అందించునట్లు చేసిరి. ఆ విధముగా కొన్నిరచనలు వచ్చినవి.

ఎమెస్కోవారిది ఒక క్రొత్త పద్ధతి. ఇప్పటివరకు తెనుగులోని ప్రబంధములు, కావ్యములు బహువిధములైన వ్యాఖ్యలతో ముద్రణమై వానిపైన వాద— ప్రతివాదములు, విమర్శలు బయలుదేరినవనుట సాహితీ సుగతులు ఎఱుగనివిషయముకాదు. ఇన్నిముద్రణము లందినప్పుడు సాధుపాఠములు, సుపరిష్కరణము జరిగి యుండుట సహజము. అట్లే జరిగినది. ఇప్పుడు ముద్రించు ఈ ప్రబంధములకు పాఠాంతరములను వెదకవలసిన యవసరము కన్పడదు.

తెనాలిరామకృష్ణుని కృతులలోనేగాక తెనుగు సారస్వతమునందు ధీటుగా నిలబడగలిగిన మహోత్తమ గ్రంథములలో నొకటి పాండురంగ మాహాత్మ్యము. రాయలయుగమున కిదియొక అలంకారము. రామకృష్ణుడు దీనిని 'మహాంధ్రకవితావిద్యాబలప్రౌఢి'తో, 'సరసార్థబోధఘటనాసైపుణ్యము'తో రచించెను. ఎమెస్కోవారి ప్రస్తుత గ్రంథమునకు 'శ్రీ విశ్వనాథ' వారు 'ప్రకాశిక'తో ప్రకాశింపజేసినారు. సుప్రసిద్ధ పరిష్కర్తలు, అనుభవజ్ఞులునైన 'రావూరి దొరసామి శర్మ'గారు పరిష్కర్తృత్వభారము వహించినారు. పరిష్కరణకు వీరు ఆంధ్ర పబ్లిషింగు—వావిళ్ల— ఎకాడెమీ ప్రతులనేగాక ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారములోని ప్రతులనుగూడా సంప్రదించినారు. వీరు— '........అతిప్రచారములోనున్న పాఠములనే సంగ్రహించి శుద్ధప్రతి సిద్ధము చేయబడినది- 'అని తెల్పిరి. ఈ వాక్యము యథార్థము. వీరు సంప్రదించిన ప్రతుల లోపల ఎకాడెమీ ప్రతియొకటి గదా! దానిని పరిష్కరించినది రాళ్లపల్లివారు. అనిదంపూర్వములైన పాఠములను అందువారు చూపిరి. అంతకన్న మంచిపాఠములు ప్రస్తుతము దుర్లభములు అనుకొనవచ్చును. ఈ గ్రంథమున అందుండి కొన్ని పాఠములు (సాధు

పాఠములే) గ్రహింపబడక పోవుటకు కారణ మనూహ్యము. మచ్చునకొకటి—'అశ్రితాభ్రములభ్రమూర్తి గూఁకలువెట్టు—' (2—208) అని సీస పాదము. ఇది లిఖితప్రతులపాఠమే. అయినను ఛందోభంగము. ఇది సరిగాలేదని రాళ్ళపల్లివారు 'అశ్రితాభ్రములు భ్రమూర్తిఁ గూఁకలువెట్టు—' అను సవరణను చూపిరి. కాని పరిష్కర్తలు 'అభ్రమూర్తి'నే గ్రహించిరి.

(2) 'వాగురీ సన్నపాసము' (5—309) అని పాఠము గ్రహింపఁబడినది. ఇచట 'వాగుర' అనుటబాగేమో! ఈ దిద్దుబాటు ఛందోదోషము కాదు. 'వాగురామృగబంధిని' అని వైజయన్తి.

అక్కడక్కడ నిట్టివి కొన్ని పాఠభేదములు కన్పించును. అయినను పరిష్కర్తల శ్రద్ధ ప్రశంసనీయ మనవచ్చును. పాండురంగ మాహాత్మ్యము లోని గొప్పదనమును—రామకృష్ణుని ధ్వన్యాత్మక రచనను అతని కవితకు వైశిష్ట్యము కలుగుటకుగల కారణములను విశ్వనాథవారుగాని పరిష్కర్తలుగాని విశదముగా తెల్పలేదు. అందుకు కారణము 'సామాన్య పఠకులకు మాత్రమే' అను ప్రకాశకుల ఉద్దేశ్యము ప్రతిబంధకము గావచ్చునేమో! సామాన్యపాఠకునకు ఈ గ్రంథము సంతోషమును కల్గించును.

శ్రీ కృష్ణ దేవ రాయ ల ఆముక్తమాల్యద

(ప్రచురణ—ఎం. శేషాచలం అండ్ కంపెనీ (40+197) ప్రతులకు — ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్–సికిందరాబాద్–మూల్యము–3–00 *(సాదాప్రతి); (లైబ్రరీప్రతి) 4. 95.)*

విజయనగర సామ్రాజ్యము నేలిన చక్రవర్తులలో కృష్ణరాయ లగ్రగణ్యుడు. ఈయన సాహితీ సమరాంగణ సార్వభౌముడు. ఇతని కృతులలో లభించినవి రెండు. అందుఒకటి ఆముక్తమాల్యద. కొంతకాలము క్రితము సాహిత్యలోకమున జరిగిన వాదప్రతివాదములలో ఆముక్తమాల్యదాకర్తృత్వ మొకటి. దీనికర్త కృష్ణరాయలేయని కొందరు — కాదు— పెద్దనగారు అని కొందరు. ఉభయులున్నూ తమ తమ ఉపపత్తులను చూపిరి. పెద్దనగారి సాయముతో రాయలవారు రచించినట్లు పెద్దల యభిప్రాయము. ఈమధ్య 'భారతి'లో నోరి నరసింహ శాస్త్రిగారు ఆముక్తమాల్యదాకర్తృత్వమును గూర్చి మరల వ్రాసిరి. కర్తృత్వమునుగూర్చి ఇంతగా చర్చించుట కొన్నివిధముల మంచిదేయైనను, నన్నయగారు వైదికా? నియోగియా? యన్నట్లుగూడా నుండును.

మనకు కావలసినది కవిత్వము. అందలి బాగోగులు. రాయల ఆముక్తమాల్యద జటిలమైన శైలితోగూడినది. నారికేళపాకమని కొందరి భావన. అయినను రసవత్కవిత. ఈ గ్రంథము చాలా ముద్రణములు పొందినది. వావిళ్లవారి వ్యాఖ్య కొంతవరకు సంక్షేపమనవచ్చును. శ్రీ॥ శే॥ వేదంవారు సంజీవినీ వ్యాఖ్యను వెలువరచిన తర్వాత ఆముక్తమాల్యదలో అర్థముగాని భాగము తక్కువైనది. వారు తాళీదళ సంపుట ప్రకర కాంతారముల నన్వేషించి' సాధుపాఠ నిర్ణయము గావించిరి.

ఆముక్తమాల్యదకు విష్ణుచిత్తీయమని నామాంతరము గలదు. కొన్ని ప్రతులలో ఇది ఆరాశ్వాసములుగను మరి కొన్నిటియందు ఏడాశ్వాసములుగను కలదు. ప్రస్తుత ప్రతిఏడు ఆశ్వాసములుగా నున్నది. విశ్వనాథ సత్యనారాయణగారు తమ ప్రకాశికలో ఆముక్తమాల్యదయొక్క గొప్పదనమును, రాయలరచనావిదగ్ధతను సువ్యక్తము చేసినారు. పరిష్కర్తలైన రావూరు దొరసామిశర్మగారు ఇందులోని వ్యాకరణఛందోలంకారవైశిష్ట్యములనేగాక సాధు అసాధురూప నిర్ణయచర్చనుగూడ చేసినారు. తెనుగు సాహిత్యములో ఆముక్తమాల్యద అనేకవిధములుగా పవిత్రమును, ప్రశస్తమునునైన రచన. ఇందు గోదాదేవిని శ్రీరంగనాథుఁడు వివాహమాడుట ముఖ్యకథ. ద్రావిడమునందు గోదను 'చూడిక్కుడుత్త నాంచార్' లేదా, ఆండాళ్ అనియు నందురు. ఈ ప్రబంధమునందు చిన్నచిన్న కథలు కొన్నివచ్చును. ఇవియన్నియు ప్రబంధ కథా కథనమునకు ఉపపోషకములు. మాలదాసరికథ—బ్రహ్మరక్షస్సు వృత్తాంతము, ఖాండిక్యకేశిధ్వజోపాఖ్యానము అనునవి ఈ సద్వతివి. తెనుగుకవులు దక్షిణానిలమును వర్ణింతురు. రాయలు రంగనాథుని ఆలయము ననుసరించి ఉత్తర దిక్కునుండి వాయువు వచ్చునట్లుగా వర్ణించెను. అందుకు ఒక ప్రబలమైన కారణముగలదు. దాని

వలెన రంగనాథుని వక్షోభాగమునగల పుష్పమాలికా పరిమళమును—'వణ్యారంపు పుణ్యంపు కంపులను' వ్యాపించుచున్నవి. ('పాలయుంగాడ్పు...' 1. 73, అనుపద్యము).

విశ్వనాథవారు తమ ప్రకాశికలో ఇందులోని కొన్ని పద్యములకు వివరణ మొసరించిన బాగుగా నుండెడిది. ఆకర్షణీయమైన చిత్రములతో అందముగా ముద్రింపబడిన ఈ గ్రంథము పాఠకులకు సంపూర్తిని చేకూర్పగలదు.

రామరాజభూషణుని వసుచరిత్రము

(ప్రచురణ : ఎం. శేషాచలం అండ్ కంపెనీ (పుటలు. 40+252) ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్—సికిందరాబాదు. మూల్యము-సాధారణప్రతి; 3; లైబ్రరీప్రతి. 4.75.)

కవితాభూషణుడైన రామరాజభూషణునిచే రచియింపబడిన గ్రంథములలో వసుచరిత్రమొకటి; ఇతడు 'బహుసంస్కృతాంధ్రకృతులన్ వల్మారు' తన పోషకుని మెప్పించినట్టివాడు; సంస్కృతకృతులు మనకు లభింపలేదు. కావ్యాలంకార సంగ్రహము—వసుచరిత్రము — హరిశ్చంద్రనలోపాఖ్యానములను మూడు కృతులు ఈ కవివి మనకు లభించినవి. ఈ మూడు కృతులును తెనుగు సారస్వతమునందు ప్రతిపథములుగానున్నవి. వీనియందలి ప్రతిభ నానొన్నతో దర్శనీయము.

రామరాజభూషణుడు— భట్టుమూర్తి భిన్నులని కొందరు. కథాశేషులైన వఝులవారు, ఉభయులు భిన్నులని సోపపత్తికముగా నిర్ణయించిన విషయము ప్రామాణికాగ్రగణ్యుల తలలూపించినది.

సంప్రదాయసాహితిలో ఎమెస్కోవారు ప్రచురించుచున్న ప్రబంధమండలికి—లేదా కావ్యపరంపరకు పీఠికలు వ్రాయదలచిన విశ్వనాథవారుగాని, పరిష్కరణముచేయు దొరసామిశర్మగారుగాని ఈ విధమైన చర్చకు తమ వ్రాతలలో స్థాన మొసంగకపోవుట విచారకరము.

రాయలయుగమునందలి ఆంధ్రవాఙ్మయములో వెలసిన మహాకావ్యము వసుచరిత్రము. ప్రౌఢత్వమునందు ఈ గ్రంథ మొకవైపు; ఆముక్తమాల్యద వేరొకవైపు సమానముగా నిలువగలవు. వసుచరిత్ర ఒక అద్దాలమేడవంటిది. రామరాజభూషణుని గురువు పెద్దనగారు అని వాడుక. అందుకే అన్నివిధములుగా వసుచరిత్రమును, గురువుగారి గ్రంథమును మించు ప్రయత్నముతో చేసినాడు. ఇది ఆరాశ్వాసముల ప్రబంధము; శ్లేషతోగూడిన మహార్థస్ఫోరకమైన రచన. గిరికను వసురాజు వివాహమాడుట ఇందలి ప్రధానవృత్తము. కథలో బలములేదు. కాని కవి దానిని ఒక దివ్యప్రబంధముగా సంతరించగలిగినారు. 'సంగీతసాహిత్యనామక విద్యా యుగళంబు' ఈ రచనలో నెలకొనినవి.

ఈ గ్రంథమునకు అనతికాలములోనే భాషాంతరీకరణలు, అనుకరణలు బయలుదేరినవి. ఈ అనుకరణములే 'పిల్లవసుచరిత్రము'లైనవి. బృహద్వ్యాఖ్యలు సిద్ధమైనవి. తెనుగు సాహిత్యముతో ఏకొద్దిపరిచయము కలిగించుకొనదలచిన వ్యక్తియైనను వసుచరిత్రము పఠించక వదలలేడు. 'వసుచరిత్ర విమర్శనము'నందు వఝులవారు, దీని శిఖరాయమాణ స్థితిని స్థాపించిరి. కోవెల సుప్రసన్నాచార్యులవారు రామరాజభూషణునిపై పరిశోధనచేసి 'డాక్టరు' పట్టమును పొందిరి.

ఈనాడు వసుచరిత్రమున పాఠభేదములు, సాధుపాఠనిర్ణయములుకొఱకు శ్రమించుట వృథాశ్రమ యనవచ్చును. ఎన్నియో ముద్రణములుపొంది ప్రసిద్ధిగాంచిన ఈ గ్రంథమును మరల ఎమెస్కోవారు ప్రచురించినారు. విశ్వనాథవారి ప్రకాశిక, శర్మగారి పరిష్కరణము బాగుగా నున్నవి.

(4—80) లో—'ఝూషితము' — అనుటకు 'ఝూషితము' అనియు—(5—40 లో) 'కరుణాభివృష్టి' అనుటకు 'కరుణాభివృద్ధి'యనియు తెల్పిన బాగుగానుండెడిది. గ్రంథముచివర 'వసుచరిత్రదీపిక' గలదు. అది పాఠకుని ఆకర్షించును.

ఎమెస్కోవారు ఈ ప్రబంధములనే ప్రచురించుటకన్న—తెలుగు సాహిత్యములో 'అనార్ఘ్యరత్నములై', అముద్రితములై 'తెరచాటున దాగియున్న, ఎన్నియో కృతులున్నవి — వానిలో కొన్నింటికైన ప్రకాశమాన మొసర్చినచో పిని

కృషి భూషితముగానుండెడిది. అన్ని ప్రబంధములకు ఒకటే సంపాదకత్వము, పరిష్కర్తృత్వ బాధ్యత వహించునట్లు జేయుటకన్న ఆయా గ్రంథములయందు ప్రత్యేకమైన యభినివేశము కలవారి కొసంగినచో ఇంకను బాగుగానుండెడిది. 'వీనులవిందై, అమృతపు సోనలపొందై, అమందమమచలదళినినాదముక్రందై ఆనందబ్రహ్మముగా'గల వసుచరిత్రము సాహిత్యలోకమున కానందబ్రహ్మము.

—శ్రీ రంగాచార్య.

మనస్

(కవితా సంకలనం)

[రచయిత: అరిపిరాల విశ్వం. ప్రతులకు: ఆంధ్ర సారస్వతపరిషత్తు, తిలక్‌రోడ్, హైదరాబాదు. మూల్యం. నాలుగు రూపాయలు పే. 64 లు)

'మిస్టిక్' అనే పదం గ్రీక్ 'మిస్టీరీస్' నుంచి ఉద్భవించింది. బాహ్యస్పర్శలేకుండా అంతర్ముఖుడై అతీంద్రియసత్తాను అన్వేషించు సాధకుణ్ణి మిస్టిక్ అంటారు. ఓన్‌యింగ్ మర్మవాదాన్ని (mysticism) ఇలా నిర్వచించాడు,

Mysticism has its origin in the raw material of all religion and philosophy. The dim cousciouness of the Beyond which is part of the nature of all human beings, the obstinate questionings of sense and outward things. Mysticism arises when we try to bring the higher consciousness into relation with the other contents of the mind.

మార్మికవాదులభాష నిగూఢం మర్మవాదానికి భారతదేశం నిలయమనుకుంటే బెంగాల్ దానికి కేంద్రస్థానం. పదవశతాబ్దపు బౌద్ధచర్యాపాదాలలో ప్రారంభమై రవీంద్రునివరకూ మర్మకవితాధార అవిచ్ఛిన్నంగా ప్రవహించింది. మార్మికులు వారి అనుభూతిని అతి గోప్యంగా కవిత్వంలో వ్యక్తపరిచారు గనుక దాన్ని సంధ్యభాష అని పిలిచాడు మహామహోపాధ్యాయ పండిట్ హరప్రసాదశాస్త్రి.

తరువాత పండితులు సంధభాష (intentional language) అన్నారు. మధ్యయుగంలో వెలసిన భక్తిసంప్రదాయపు కవుల భాషకూడ నిగూఢార్థంగా (enigmatic)వుందని డా॥ శశిభూషణ్ దాస్‌గుప్తా. తెలుగుదేశంలో ప్రత్యేకంగా మర్మకవిత్వంలేదని చెప్పవచ్చు. కాలజ్ఞానతత్వాలలోను, శుద్ధ నిర్గుణ తత్వ కందార్థాలలోను, వేమన పద్యాలలోను మార్మికత గోచరిస్తుంది. యోగులు కాలక్షేపం కోసం వ్రాసుకున్న తత్వాలూ, దరువులూను.

'రేపటిస్వర్గం' దర్శించిన విశ్వం 'మనస్'లో మరింత పరిణతి చెందినట్లుగా సొగసులు సంతరించుకున్నట్లు అగుపిస్తున్నారు. మనస్సు ఆరవ ఇంద్రియం. జ్ఞాపకాదులకు కారణభూతమైనది మనస్సు. హృదయంలోనే దానిస్థానం. బుద్ధి అహంకారం చిత్తాదులు మనస్సును సూచిస్తాయి. విముక్తికీ బంధనకూ కారణం మనస్సు. మనస్సుద్వారా చైతన్యం ఇంద్రియాలవేపు ప్రవహిస్తున్నది. అంతమాత్రాన అది కేవలం అంతరింద్రియ మనుకో నక్కరలేదు, ఇంద్రియజ్ఞానాన్ని స్వీకరిస్తుంది. ఇంద్రియాలతో సంభాషిస్తుంది. సహకరిస్తుంది. కాని ఇంద్రియాలకు అందదు. కనుక ఇంద్రియాలు వేటాడి మనస్సును బంధించాలి. ఆ బంధనలోనే అనంతమైన స్వేచ్ఛ ఈ కావ్యానికి 'మనస్' అని పేరు పెట్టటంలో ఔచిత్యంవుంది. విశ్వంలో చిన్ననాడే వారిఊరు భక్తిభావాన్ని పొదుకొల్పింది. ఊరు ఎటువంటిదో చూడండి:

మా వూరు దేవునితోట. మంచివెన్నెల మంచు ఉయ్యాల. మా వూరు దేవునితోట. అంచెలంచెల దీపికి ఉయ్యాల. అంతేకాదు.

శివుడు విడిసిన చోటు. భవుడు అడుగిడు చోటు. అందుకే వారిఊరు ఒకస్వర్గం. ఏరు వారి గురువు. గురువు బరువూ అలసటా బాధా బంధాలని విడిచి మనుషులై లోకంలో మసలమన్నాడట. 'మావూరు' చక్కని ఇండిక. అద్భుతంగా నడిపించారు. కాలజ్ఞాన తత్వాల్లో

ఏ వూరయ్యా మీ దేవూరు
పరబ్రహ్మ నిర్మాణమె మా వూరు॥
కంది మల్లయపల్లె మా వూరు
కాలకర్మాలు ఎడబాపు మా వూరు॥

అంటూ సాగిపోతుంది. దానికీ దీనికీ పోలికలులేవు. గుర్తుకొస్తుంది అంతే.

'కాంతివర్షం'లో జన్మజన్మాలయాత్రను అద్వైతానుభూతిని స్ఫురింప చేశారు. గుండె అంచున వసంతం పూయనంతవరకూ విప్పిన కనురెప్పల కాటుక మబ్బులు పడియున్నంతవరకూ, బ్రతుకు చెప్పటం విప్పటంచేతకాని నిశ్శబ్ద నిరీక్షణ అవుతుంది. ఈ నిరీక్షణ 'మనస్'లో పతాకస్థాయికి చేరుకుంది. చెట్టుచేమలుతప్ప చేలగట్లులుతప్ప, కొండకోనలుతప్ప చుట్టాలంటూలేరని గాలిచక్కటి తప్ప జాలిగా చెక్కులెవరూ నిమురరని వాపోయారు. కుండపోతగామారిన బ్రతుకుని అందరికీ ఏలికలయిన భగవంతుని పాదాలమ్రోల క్రుమ్మరిస్తున్నారు. కాని ఇంకా శోకం అస్పష్టంగా వుంది. ఈ ఖండిక

ఊరు స్యందన
ఏరు స్పందన
పేరు నందన

అంటూ ప్రారంభమవుతుంది. రవీంద్రుని గార్డెనర్ లోని పదిహేడవ గీతంకూడా,

ఊరు ఖంజన
ఏరు అంజన
నా పేరు అందరికీ తెలుసు
ఆమెపేరు రంజన.

అంటూ ప్రారంభమవుతుంది. అయితే అనుకరణ దోషం అంటగట్టకూడదు. స్యందన అన్నప్పుడు దేహమూ స్పందన హృదయానికీ, నందన హృదయాధినాథుడైన నందనందనుడికీ సంకేతా లనవచ్చు. పరమాత్మ స్యందనాలు సృష్టిస్తాడని బృహదారణ్యకోపనిషత్తు. భగవద్భావన లేకుండా ఏకాంతపు గుహల్లో, భయాలచీకటిలోవున్నా నిష్ప్రయోజనమేనని వట్టివేసటతప్ప ఏమీ మిగలదని 'నీలాంటి ఒకదివి'లో స్పష్టం చేస్తున్నారు. భగవంతుని ప్రేమ అంటాలని, ఆయన రూపం కంటపడాలనుకుంటే వెలుగువెన్నెలనిచ్చి కళ్ళల్లో కడలేని సృష్టి సౌందర్యాన్ని కురిపిస్తారు. అడ్డుగా నిలిచిన అహంకారం వద్దంటూ శైశవం యిమ్మని శివునికోసం జపిస్తూ వుంటున్నారు. 'గుండెలోని ఎండమావులుదాటి దూరాలు పారాలుదాటి తీరాలులేనిచోటికి వచ్చేశారు. ఇప్పుడు ఆశలేదు. అంతంలేదు. బాధలేదు. పారవశ్యంలేదు. నిర్లిప్తత. యుగాంత జలధి కాలాన్ని గంధంగా పూసుకుని వెన్నెల్ని విసనకర్రగా విసురుకుంటున్నాడు. పరమేశ్వరుడు ప్రకృతిలో సాక్షాత్కరిస్తున్నాడు.

కన్నుల్లో కారుణ్యపువెన్నెల విరిసినవాడు
భ్రుకుటిలో కోర్కెల హరివిల్లు విరిచినవాడు
కదిలే తారుణ్యం నెత్తిపైన కలికితురాయి వాడు
జీవితాన్ని ఉంగరించి స్నేహాన్ని చిలికినవాడు
మనకి కావల్సినవాడు మనం కావాల్సినవాడు
వీడే మనవిభుడు ఎప్పటికీ మనప్రభుడు

అన్నప్పుడు తిలక్ గుర్తుకొస్తున్నాడు 'ఇంద్రధనుస్సు తెగిపోయి' అన్న ఖండిక ఉత్తమంగా వుంది.

ఎవరిదో జ్ఞాపకం
అంటుకొని
ఆకాశం ఎఱ్ఱపడింది
నీటిపైన తోటపైన
పూలపైన పుప్పొడిపైన
తేనెపైన తేటిపైన
ఒకటే ఎర్రదనం

జ్ఞానోదయానికి సూచన. కలల్నీ వెన్నెలనీ కలిపి తాగి క్షణాల అంచులపైన ఊపిరి నీడలు విసురుతూ వచ్చే యుగాంత జలధిని ప్రకృతిలో దర్శిస్తున్నారు.

మల్లె మొగ్గ నును సిగ్గులోంచి
చల్లని పిల్లగాలి ఊదే
వెదురుపిల్లనగ్రోవి వెనకనించి
జారిపడే జలతారువెన్నెల సెలయేటిఒడ్డునించీ
కరిగిపడే పొగమంచు అంచునుంచి
మబ్బు పొదలమాటునుంచి
మెరుపుతీగె కొసనుంచి'

పరమేశ్వరభావాన్ని సందర్శించి తన్మయీభావస్థితిని పొందుతున్నారు.

పుట్టపర్తి నారాయణాచార్యులవారి 'శివతాండవం'తరువాత అంతచక్కగా హృద్యంగా వ్రాశారు 'తాండవహేల'. సృష్టికిముందూ, జగల్లయం తరువాత అంటే ఈ రెంటి సంధికాలంలో జరుగుతుంది తాండవహేల. సృష్టికి, సృష్టిప్రేరణను తెలిపే లయాత్మకమైన కదలికయే తాండవం.

ప్రతినంతెలిసిదు తాండవమాడ రుద్రుండు
గతి తప్పకను సర్వబ్రహ్మాండములు నిలువ
లయత ప్రైనా—భువికి లయమప్పుడే సోకు

నటరాజ తాండవ మహాంచింత కనుటకై సృష్టి సర్వమూ సాగిలపడ్డదట! చివరకు

ద్యులోకము లోక్కయిల్లై శంకరుడు గృహమేధిగా
సర్వసృష్టియు తనదు విల్లడపాగె నమృతాంబోధిగా.

పరమేశ్వరుని కృపాకటాక్షం లేకుండా సౌందర్య సృష్టి జరుగదు. ఎంతటి పాండిత్యాన్ని సంపాదించినా ఎంతగా పోరాడినా పెనగులాడినా ఉదాత్త కళను సృష్టించలేరు. అనుభవమే సాక్షి. శరీరగతమైన ఆత్మ కర్మయోగజ్ఞానయోగాలద్వారా భక్తియోగం లోకి పయనించి అక్కడ వికసించి పరిపూర్ణత్వంతో తాదాత్మ్యం చెందుతుంది. అప్పుడు కవిత్వంలో ఆత్మార్పణం, భిన్నత్వంలో ఏకత్వం సిద్ధిస్తాయి. అవ్యక్తమైన పరమేశ్వరుడు భక్తుడైన కవిద్వారా వ్యక్తమవుతున్నాడు. కవిభావన అనుభూతి వైయక్తికం. పరతత్వచింతనా ఆత్మజిజ్ఞాస గ్రంథపఠనం వలన కలగదు. సహజసిద్ధి అనాలి.

నాయమాత్మా ప్రవచనేన లభ్యో
నమేధాయ న బహునా శ్రుతేన.

అంటోంది కఠోపనిషత్తు.

నాస్తికవాదం మూఢనమ్మకంతోను, సంకుచితమైన విశ్వాసంతోను, గుడ్డిభ్రాంతితోను కూడు కొన్నదికాదు. వాటిని పూర్తిగా వ్యతిరేకిస్తుంది.

అతీంద్రియసత్తాను మాండూక్యోపనిషత్తు ఈ విధంగా చెబుతోంది:

అదృష్టం — చతురింద్రియాలతో చూచేది కాదు.

అవ్యవహార్యం — ప్రాపంచికవస్తుసంబంధికాదు.
అగ్రాహ్యం — మనస్సు గ్రహించలేనిది.
అలక్షణం — అనిర్వచనీయం.
అచింత్యం — ఊహించలేనిది.
అవ్యపదేశ్యం — వర్ణనాతీతం.

ఏకాత్మప్రత్యయసారం, ప్రపంచోపశమం, శాంతం, శివం, అద్వైతం, సత్యయుసత్యం.

అట్టి పరమేశ్వరునిగూర్చి వ్రాసిన కవిత్వాన్ని యిట్టిదని నిర్వచించలేం. స్వీయానుభూతి కవిత్వానికి ప్రాణం. అసలు కవిత్వానికే అనుభూతిని మించిన నిర్వచనం లేదని నమ్మేవాళ్లలో విశ్వం ఒకరని శశాంక అన్నారు. విశ్వం దేవుడున్నాడని నమ్మే నాస్తికున్ను, శశాంక కావ్యాన్ని దర్శన చేస్తూ చివరి మాట యిలా అన్నారు. 'మహాశక్తి సమన్వితుడైన పరమేశ్వరుని అన్వేషించే మార్గం బహుగుహ్యం. గోపనీయము. భక్తులైన వారికి మాత్రమే మౌనవ్యాఖ్యచే అది సువిదిత మౌతుందని పెద్దలంటారు. అటువంటి మార్గమేదో ఇందులో విశ్వం ప్రవక్తలాగా నిలబడి మనకి ప్రబోధిస్తున్నాడని పెద్ద పెద్ద మాటల్లో చెప్పలేను. కాని ఒక విజ్ఞుడు చెప్పినట్లు 'Poets write not to tell others but to discover and understand for themselves'. అనిమాత్రం చెప్పగలను.'

కవిత్వాన్ని కుంటుపడనీయకుండా, కాళ్ళు చాపేయకుండా ప్రతిభావంతంగా నడిపించగలిగారు. హృదయానుభూతి కలిగిస్తుంది. మధురాలోచన రేకెత్తిస్తుంది. వచన కవితా ప్రక్రియను స్వీకరించినా, ఛందస్సులోనూ ధారాళంగా వ్రాయగల శక్తి వుంది. విశ్వం లేఖినినుండి మరొక ఉత్తమ కావ్యం వెలువడాలని కోరుకుందాం.

—శివకుమార్.

జనార్దనాష్టకం

(రచన: కందుకూరి రుద్రకవి. ప్రచురణ: శ్రీ వి. ఎ. కె. రంగారావు, ఆనందమోహన కావ్యమాల; మూల్యము: పన్నెండు రూపాయలు. ఊహా ఎంటర్ ప్రైజెస్; 1, పైక్రాఫ్ట్స గార్డెన్సు, మద్రాసు—6.)

నెల్లూరుజిల్లా కందుకూరుతాలూకా కందుకూరులో వేంచేసియున్న శ్రీ జనార్దనస్వామివారి శృంగారలీలావిశేషాలను కీర్తించుచు వ్రాసిన ఎనిమిది పద్యముల గ్రంథమిది. పద్యసంఖ్యను పేర్కొన్నప్పుడిది కొంత ఆశ్చర్యమునే కలిగించును. సౌంఖ్యము లైన కావ్యప్రక్రియలో సహ్యసము పెద్దది. ఉమా సహస్రమువంటివి సంస్కృతాంధ్రములు రెండింటి లోను చాల తక్కువ. పద్మశతి ప్రసిద్ధమైయున్నది.

త్రిశతికూడ ప్రసిద్ధముగనేయున్నది. శ్రీ లలితా త్రిశతి కలదు. తెలుగులో వరలక్ష్మీ త్రిశతి కలదు. శతకము యొక్క ప్రశస్తి జగద్విదితమేకదా! తారావళియని కలదు. ఇరువదియేడు పద్యముల మొత్తమది. ఎనిమిది పద్యములది అష్టకము. పంచరత్నముల ప్రసిద్ధిని చెప్పనవసరములేదు. ఈ విధముగా ఎన్నిపద్యము లతోనైనను వ్రాసి ఆ సంఖ్యావాచకముతో దాని నా ప్రక్రియగా చెప్పవచ్చును. పద్యసంఖ్యానియమము మీద ఆధారపడి ప్రక్రియాభేదమును చెప్పరాదు. కాని చెప్పబడినవి కన్పించుచున్నవి. కవిత్వమున ఇట్టి సంఖ్యానియతి ప్రవేశించుటకు సాంఖ్యవేదాంతము ప్రభావము కారణము కావచ్చును. గుణత్రయము, పంచభూతములు, పంచతన్మాత్రలు, కర్మజ్ఞానేంద్రియ దశకము, మనస్సు—అని ఈరీతిగా ఇరువది నాలుగు తత్త్వములు గణింపబడి తదతిరిక్తముగా నున్న పంచవింశక తత్త్వమును పరమేశ్వరతత్త్వముగా చెప్పుదురు. మరొకచో షడ్వింశక తత్త్వమును చెప్పుదురు. మరియు ఉపాసనా విద్యయున్నది. అందును సంఖ్యావాచక ప్రమేయము చాలయున్నది. మంత్రములకు సాధారణముగా అక్షర నియమముకలదు. పంచాక్షరి, అష్టాక్షరి, పంచదశి, షోడశి, అష్టోత్తర శత నామావళి, సహస్రనామస్తోత్రము. ఈ విధమైన మంత్రశాస్త్ర ప్రభావమును కారణము కావచ్చును. మన ప్రాచీన సాహిత్యవిద్య మన వేదాంత శాస్త్రమును, మంత్రశాస్త్రమును మరియు ఈ మొదలైన వివిధ శాస్త్ర విషయములను పెనవేసికొని యుండెడిది. సాంఖ్యమునకంటె మంత్రశాస్త్రమే మనకవుల నెక్కువగా ఆకర్షించినది. మనకవులందరును బహుదేవతోపాసనచేసి ఆయా దేవతల దయకు పాత్రులై కవిత్వము చెప్పినవారుగనే కనిపించుచున్నారు. దేవతోపాసన అనగానే మంత్రము—మంత్రమనగానే అక్షరనియమ లక్షణ లక్షితము. ఆయా మంత్రములను జపించి జపించి ఆయా దేవతలను ప్రసన్నులుగా చేసికొని కవితావ్యాసంగము చేయువారి కెప్పుడును తమ అనుభవములోనున్న ఆ మంత్రశక్తి స్ఫురణముండియే తీరును. ఆ విధముగా ఆ అక్షర సంఖ్యయందొక విశేషము వారికి తట్టుటలో ఆశ్చర్యము లేదు. ఆ విశేష మీ సంఖ్యతో ముడిబడి యుండుటను మనస్సుకు పట్టించుకొన్న కవులు ఆయా విశేష ప్రయోజనముల నాశించి ఆయా సంఖ్యా నియతిని పాటించి పద్యములు వ్రాయుట మొదలు పెట్టినారు. పంచాక్షరీ అష్టాక్షరీ మంత్ర జపములయొక్క విరివివల్లనే పంచ రత్నములు, అష్టకములు రచింపబడుట కనిపించు చున్నది. మంత్రశాస్త్రము దృష్టియే లేనిచో ఈ విధమైన సాంఖ్యపద్యరచన విశేషాదరమునకు పాత్రమగుటకు మరియొక హేతువు కనిపించుట లేదు.

రుద్రకవి జనార్దనాష్టకమును రచించినాడు: ఇవి ఎనిమిది పద్యములు. దనుజమర్దన కందుకూరి జనార్దనా! ఇది మకుటము. పాదమున కిరువదియారు మాత్రలు. పరమేశ్వరుడు షడ్వింశక తత్త్వముకదా! అట్టి జనార్దన తత్త్వమును ఆశ్రయించి చెప్పుచున్నానని కవి అది సహృదయులకు సూచించుట కావచ్చును—ఇందు భక్తుడు ప్రకృతి. పురుషుడు పురుషుడు. ఈ విధముగా భాగవత భగవంతులమధ్య స్త్రీ పురుష భావము ప్రవేశించి శృంగారమును చిమ్మును. పాఠకులకు భగవత్ భాగవతుల స్వరూప స్వభావ జ్ఞానము లేనప్పుడు ఇట్టికృతులు బూతులుగా అనిపించు ప్రమాదముకూడ కలదు. దేవా నీవు నన్ను చూడవు. ఎవరెవరినో చూచెదవు. నాకది సహింపరానిదిగా నున్నది. నీవు నన్ను వదలిపోవద్దు. నీవూ నేనూ ఒకటే—ఈ మొదలైన భావమును భాగవతుని ఆర్తిని చుట్టుకొని ఇట్టి రచనలుసాగును. స్త్రీ పురుష సమాగమాకాంక్షను స్ఫురింపజేయుటకల భావవిన్యాస మది. పురుషుని స్త్రీ కోరును. స్త్రీని పురుషుడును కోరును. స్త్రీ పురుషుని కోరుటలోనున్న సొగసు పురుషుడు స్త్రీని కోరుటలోలేదు. భగవంతుడెప్పుడును మన సమక్షము లోనే ఉన్నాడు. కాని భక్తుడాయనను గురించి ఆర్తిని చెందవలయును. భగవంతుడు తన సౌందర్యమునంతను తన భక్తుని ఆర్తహృదయములో దాచినాడు. భక్తుడు భగవంతునిగూర్చి వేదనపడుటలోగల అందమును దర్శించిన కవులు దానిని మానవీకరించి స్త్రీ పురుష విషయికముగా తమ కృతులలో ప్రదర్శించిరి. వేషము మార్చినను అసలు వేదన అదియే. ఈ రహస్యము నెరిగి కావ్యముల నాస్వాదించుటకే సహృదయులు.

జనార్దనుడు వచ్చినాడు. ఆ వచ్చిన తీవిని భక్తహృదయము స్వానుభవములనుబట్టి వర్ణించుచున్నది. మఱియునది ప్రస్తుత్యమును గైకొన్నది. అటుమొన్న రాలేదు. మొన్నకూడ పిలచితిని. నీవసలు నా మాటను వినిపించుకొననేలేదు. నిన్న నీవు సాగమలు చేసికొని నా ముందుగానే పోవుచుకూడ నన్ను చూడవు. చూడకపోయిన ఏమగును? కానిలే—నీయిష్టమది. స్వామీ ఇప్పుడు తిరిగివచ్చితివా? చాలచక్కగా ఉన్నావు. ఈ నీ పెదవుల కెవ్వరంటించినారు స్వామీ! ఆ కెంపులు? ఏ ఎలజవ్వని నీ కలయికను మెచ్చుకొన్నది స్వామీ! ఈ నీ చెక్కిలి నొక్కిన దెవ్వరు స్వామీ! దాని గోళ్లు గోళ్లుకావు. అవి కత్తులు. దేవా! నిన్నరాత్రి నీవు మరొకతెతో కూడియుండుటను ఒకరిద్వారా వింటిని. వినుట యేమి కర్మము! నిన్నవీథిలో వేసం చూడనుగూడ చూచితిని. ఇందుకేమందువు ప్రభూ! అది వరేగాని ఈ తెల్లవార్లును నీ వెక్కడెక్కడ తిరిగితివోయి! దాచుకొన్నచో ఇట్టివి దాగవు ప్రభూ! నీ సంగతి నాకంతయు తెలియును. ఊరకనీవు ఒట్లు పెట్టుకొని మాట్లాడి లాభము లేదు. రాత్రి నిద్రపోని పోకలము నీ కన్నులే చెప్పుచున్నవి. నీ నయగారములింక చాలును. నా మీద నీ వేమియు చేయివేయనక్కర లేదు. గడుసుదనము చెల్లదు. నన్నుండ బాయిక కూడియుండుట ఎప్పుడో మానుకొంటివి. స్వామీ కోపమెందుకు? మీ కిష్టమైన ఆ చోటికే పొండి. ఇక మీరేమియు చెప్పవద్దు. నీ మాటలు విని నేనిక సహించలేను. నీవు గడిదొంగవు స్వామీ! దేవా! మన మేకశయ్యాగతులమైనప్పుడు నీ నెరజాణతనమంతయు అనుభవైకవేద్యముగా తెలిసినవి. ఏది మారొక్కసారి!! ప్రభూ! నే నలిగి ఏమి? నీ వెప్పుడైనవచ్చి నా యలుక తీర్చితివా?—ప్రేమగా పిలిచి ఇవిగో సొమ్ములు నీ కోసరము తెచ్చితినని ఎప్పుడైన అనినావా? వలచి వలపించి కూర్మి హెచ్చగా నీవు వచ్చినప్పుడు మెచ్చుకున్నావు—అట్టి కలయికను నీవెప్పుడు ప్రసాదించినావు గనుక? ప్రభువా! నేత్రములంటి చూడగా జాజి పూవులు పూచి పట్లయ్యెను. ఆకాశము వైపు చూచుచుంటిని. క్షణములో మేఘములు క్రమ్మెను. స్వామీ నా కన్నులలో వెన్నెలలు కాయుచున్నవి. నాకు కనిపించుచున్నవి—అష్టకములలోని భావవిన్యాసము లక్షణ మిది స్థూలముగా సూచింపబడినది.

అష్టకము లిందు పది యున్నవి. ఇట్లుండరాదు. అష్టక మెనిమిది కొకటి తక్కువయుకాదు ఒకటి ఎక్కువయునుకాదు. అగుచో అష్టకమన్న పేరెందుకు? రుద్రకవి పేరులో రుద్రశబ్దమున్నది గనుక, రుద్రులు పదకొండుమందిగనుక రుద్రకవి పదకొండు అష్టకాలు వ్రాసియుండవలసిన దనుటయు అనకూడని మాటయే. పదకొండు అష్టకాలు అంటే ఎనుబదియెనిమిది అయ్యెడు ప్రమాదమున్నది. రుద్రకవి పదునారవ శతాబ్దమువాడుగనుక పదునారష్టకములు వ్రాసియున్నచో బాగుండదా? అష్టదిగ్గజములలో ఒకడుకాదుగనుక ఎనిమిది వ్రాసియే యుండడు. అని ఈ రీతిగా ఊహించుట చేయరాదు. అష్టక మనగా అది ఎనిమిదికంటె ఎక్కువగాదు తక్కువయుకాదు. సంపాదకులు ఎనిమిదింటినే వేసియుండవలసినది. రెండింటిని తీసివేయవలయును. అవి లభించినవి పఠించిపోకుండ ఉండవలయునన్నచో అథోజ్ఞాపికలో ఇయ్యవచ్చును. అష్టకముతోపాటు ఆ రెండింటిని పైన కూర్చుండబెట్టరాదు. వాటికి బొమ్మలు వేయించరాదు. జనార్దనాష్టకమనగా ఏయేపద్యములగునో నిర్ణయించు బాధ్యతను స్వీకరించక లభించినవానిని విడుచుటకు బుద్ధిపుట్టక ఇట్లు చేసినామనుటయు ఉచితరమణీయముకాదు. శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారును, నెల్లూరుమండలసర్వస్వము వారును ప్రకటించని 'చెల్లబో' 'కొదువలన్నియు' అను నీ మొదలుగాగల రెండష్టకములను ఈ సంపాదకులును పైకిలాగి అష్టకమున కష్టకముతనమును లేకుండ చేసియుండకుండ జాగ్రత్తపడవలసినది. వాటినే తొలగించవలయునని ఏమియునులేదు. సహేతుకముగా విచారించి ఏ రెండింటినైనను తొలగించవచ్చును.

ఈ గ్రంథమునకు సంపాదకులు ఫలానాలని లేదు. పీఠిక వ్రాసినది శ్రీ ఆరుద్ర. ఆయన సంపాదకుడు కావచ్చును—కాకపోనువచ్చును. శ్రీ ఆరుద్ర వ్రాసిన పీఠిక ఒకవేళ మల్లాది రామకృష్ణశాస్త్రి

గారు వ్రాసినను ఇంతకంటె విశిష్టముగా వ్రాయ గలుగుదురా అనుటకూడదు కాని, వ్రాసి యుండెడి వారా అని యనవచ్చును. ఆరుద్ర పీఠిక అంతచక్కగా నున్నది. కందుకూరుయొక్క పుట్టు పూర్వోత్తరముల చరిత్రమును అవసరానికి తగినట్లు సమకూర్చినారు. రుద్రకవిని గురించిన విశేషాలుకూడ చక్కగా పొందుపరచినారు. శ్రీ మహావిష్ణువుయొక్క అర్చావతార విశేష లక్షణాలనుకూడ క్రోడీకరించి రుద్రకవి ఇష్టదైవమునకు పూర్వ చరిత్ర నంతటిని సంగ్రహించినారు. అష్టక కావ్య స్వరూప స్వభావాలను కూలంకషంగాచర్చించి వ్రాసినారు. శ్రీ ఆరుద్ర మంగళాష్టకాలను గురించియు, శృంగారాష్టకములను గురించియుకూడ చర్చించినారు. రుద్రకవి తరువాత అష్టకాలను రచించిన వారిని ప్రాచ్య పుస్తక భాండాగారమునుండి వెలికిలాగి చూపించినారు. మరియు ఆయా అష్టకములన్నింటిని అనుబంధముగా ఈ గ్రంథముననే ముద్రింపించినారు. ఇది చాల శ్రేష్ఠమైన పని. మరియు శ్రీ ఆరుద్రగారు చేసిన మరొక చిత్రమైన పని విడిగానేకాక తమ తను గ్రంథములలో నడుమ అష్టకాలను రచించిన కవులను కూడ ఒక పదిహేనుమందిని గూర్చి వివరించుట. ఇంతవరకు మంచిగానే యున్నదిగాని అనుబంధంగా ఇచ్చిన ఆయా అష్టకాల రచయితలనుగూర్చి ఏమియు వచింపక పోవుట అంత బాగుగాలేదు. ఆయా రచయితలను గూర్చి తెలియదనియైనను చెప్పియుండవలయును.

శ్రీ ఆరుద్ర ఈ పీఠికను తమ గురువులు శ్రీమల్లాది రామకృష్ణశాస్త్రిగారియందు మిక్కిలి భక్తిగలిగి శ్రద్ధగా వివిధవిషయాలను స్పృశించుచు వ్రాసిరి. పీఠికతోను, అనుబంధముతోను ఈ జనార్దనాష్టకమును శ్రీ ఆరుద్ర కొద్దిపాటి ఉద్గ్రంథసదృశ్యముగా రూపుకట్టించినారు. పీఠిక వ్రాసినందుకే ఆరుద్ర గ్రంథప్రశంసకు పాత్రుడైనచో ఈ పుస్తకమును ప్రచురించిన ఆనందమోహన కావ్యమాల అధిపతులింకెంత ప్రశంసకు పాత్రులని చెప్పవలయును. ఇంత చక్కగా తెలుగుపుస్తకము అచ్చువేయబడుట కడయే మొదలేమో?

జనార్దనాష్టకముగా ప్రకటింపబడిన పది పద్యములకును పది శ్రీ బాపు గీచిన వర్ణచిత్రాలు ఈ పుస్తకముయొక్క విలువను ద్విగుణీతము చేయుచున్నవి. కందుకూరులోని శ్రీ జనార్దనస్వామివారి ఆలయప్రాంగణము, ఆలయమును నిర్మించినవారి విగ్రహాలు. గుండిలోని మల్లారెడ్డి దంపతుల విగ్రహాలు, ఆలయములోని ప్రాచీనస్తంభాలు — వీటి ఛాయాచిత్రాలు శ్రీ బాలాకుమార్ రాజ్ మహల్ తీసినవి పరమరమణీయంగా ఉన్నవి. కాగితము మంచివిలువైనది. పద్యములు మామూలుకాగితములమీదనేకాక వర్ణచిత్రాలను కప్పుటద్వారా ప్రతిబింబించుచున్న ఉలిపిరి కాగితములమీద ముద్రింపబడి చూడముచ్చటగా నున్నవి.

— క్షేమేంద్ర.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by
S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street,
Madras-1, Editor : S. Sambhu Prasad.